
53574

# అన్నమయ్య సంకీర్తనలు బాలసాహిత్యం



గోఖమారి రవిచంద్రబాబు

# అన్నమయ్య సంకీర్తనలు బాలసాహిత్యం

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునకు
పి హెచ్. డి. పట్టం కోసం సమర్పించిన
సిద్ధాంత వ్యాసం

పరిశోధన

శాఖమూరి రవిచంద్రబాబు

పర్యవేక్షణ

ఆచార్య జాస్తి సూర్యనారాయణ

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము
పి. జి. సెంటర్
కర్నూలు.
డిసెంబరు, 1992

అన్నమయ్య సంకీర్తనలు - బాలసాహిత్యం
రచన: శాఖమూరి రవిచంద్రబాబు

మొదటి ముద్రణ: మార్చి, 1996

ఈ సిద్ధాంత వ్యాసం తిరుమల తిరుపతి దేవస్థానముల వారి ఆర్థిక సహాయంతో ప్రచురించబడినది.

ప్రతులు: 1,000

SRI VEN
CENT
Acc No 53574
Date

మూల్యం: రూ. 55-00

ముద్రితము:
రాజు ప్రింటర్స్
తిరుపతి
ఫోన్: 20541

'సహస్రావధాని' తిరుపతి
డా॥ మేడసాని మోహన్
అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ 22-1-86
తిరుమల తిరుపతి దేవస్థానములు

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారు తొలి తెలుగు వాగ్గేయకారుడు. ఆబాలగోపాలాన్నీ ఆనందింపజేసే రీతిలో పద కవితలు చెప్పి ఆంధ్ర వాఙ్మయాన్ని సుసంపన్నం చేశాడు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి ప్రధాన నాయకుడుగా తన వాఙ్మయాన్ని ఆవిష్కరించాడు. ప్రత్యేకించి అన్నమయ్య కీర్తనలలో బాలసాహిత్యానికి చెందిన పదాలపై దృష్టి సారించి శ్రీ రవిచంద్రబాబు చేసిన ఈ పరిశోధన ప్రశంసావహంగా ఉంది.

సునిశితమైన వివేచనాబలంతో సాగిపోయే పరిశోధన ఎన్నో నిగూఢమైన విజ్ఞాన విషయాలను విశదీకరిస్తుంది. సునిశితమైన వివేచనకు అంతర్మ్హీనమైన మహత్తర జిజ్ఞాసాపూర్వకమైన సంస్కార బలం ఆధారం. పరిశోధనకుండవలసిన ఈ ప్రధాన లక్షణం రవిచంద్రబాబుకు ఉంది. బాలసాహిత్యం యొక్క పూర్వాపరాలు, ఇతర భాషల్లో బాలసాహిత్యం గూర్చిన అంశాలు ఔచిత్యస్ఫోరకంగా తర్పించాడు. అన్నమాచార్యుల సంకీర్తనలలో సాహిత్యానికి సంబంధించిన సంకీర్తనలంటే అధికంగా బాలకృష్ణ సంకీర్తనలే ఉంటాయి.

ఆ సంకీర్తనలపై ఈ పరిశోధకుని విశ్లేషణ హృద్యంగా సాగింది. ఈ పరిశోధకుని వల్ల కలిగిన పరమ ప్రయోజనం ఏమిటంటే— అన్నమయ్య రచించిన బాలకృష్ణ సంకీర్తనలన్నీ ఒకచోట పఠించి, ఆనందించే అవకాశం కలగడం. జయంతి, జాతకర్మ, అవతార పరమార్థం, లీలావిశేషాలు—ఇత్యాదిగా ఈ కీర్తనలను పరిశోధకుడు వింగడించుకోవడం, వాటికి అర్థస్ఫోరకంగా వివరణలు చేయడం సహృదయ రంజకంగా సాగింది. బాల, ఈశ్వర, అవతార—ఇత్యాది శబ్దార్థ వివేచనం కూడా చక్కగా నమరింది.

రవిచంద్రబాబు సిద్ధాంత వ్యాసం చదవడం రసజ్ఞత గల ఏ పరిశోధకునకైనా అక్షయానంద సంధాయకమైన అధ్యయనం— అని నాకనిపించింది.

శుభం భూయాత్

—మేడసాని మోహన్

# స్పష్టీకరణ పత్రం

"అన్నమయ్య సంకీర్తనలు-బాలసాహిత్యం"

అనే ఈ సిద్ధాంత వ్యాసాన్ని, స్వయంగా నేనే రూపొందించాను. ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఎప్పుడూ, ఏ విశ్వవిద్యాలయానికి గాని, మరే ఇతర సంస్థలకు గాని ఏ ఇతర పట్టం కోసం, డిప్లమా లేదా బిరుదు కోసం సమర్పించలేదని స్పష్ట పరుస్తున్నాను.

కర్నూలు
తేది : 23-12-92

శాఖమూరి రవిచంద్రబాబు

# ధ్రువీకరణ పత్రం

## "అన్నమయ్య సంకీర్తనలు-బాలసాహిత్యం"

అనే ఈ సిద్ధాంత వ్యాసాన్ని శ్రీ శాఖమూరి రవిచంద్రబాబు స్వయంకృషిచే రూపొందించడం నిజమని పరిశోధనా పర్యవేక్షకునిగా నేను ధ్రువపరుస్తున్నాను.

కర్నూలు

తేది : 23-12-92 ఆచార్య జాస్తి సూర్యనారాయణ

# కృతజ్ఞతా సుమనోంజలి

పరిశోధనా వ్యాసంగానికి కర్నూలు తెలుగు అధ్యయనశాఖలో అనుమతినిచ్చి పర్యవేక్షించిన అస్మదాచార్యులు, కర్నూలు పి. జి. సెంటర్ స్పెషల్ ఆఫీసర్ జాస్తి సూర్యనారాయణగారికి హృదయ పూర్వక నమస్సుమాంజలులు.

రెండేళ్ళపాటు సాగిన నా పరిశోధన కృషిలో ఉపకార వేతనాన్ని ఏర్పాటు చేసిన ధర్మకార్య బద్ధకంకణులు, మనస్వి, మనీషి అయిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ M. V. S. ప్రసాద్, I.A.S గారికి హృదయపూర్వక కృతజ్ఞతాంజలి.

ఆకర గ్రంథాల్ని, కొన్ని ముఖ్యాంశాల్ని సూచించిన ఆచార్య కె. సర్వోత్తమన్‌గారికి, ఇతర అధ్యాపక బృందానికి—

నన్ను సౌభ్రాతృత్వంతో ఆదరించి, పరిశోధనలో మార్గాన్ని చూపిన డా॥ గార్లపాటి దామోదర నాయుడుగారికి, మన్నవ భాస్కర నాయుడుగారికి—

మరువలేని తోడ్పాటునందించిన అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ అవధాన చక్రవర్తి, శతావధాని, అవధాన సార్వభౌమ డా॥ మేడసాని మోహన్‌గారికి—

వెన్నుబలాన్నిచ్చిన పూజ్యులు శ్రీ దేవసేన నాయుడుగారికి—

అన్నమయ్య సంకీర్తనా సాహిత్యంపై పరిశోధన చేయాలనే నా సంకల్పాన్ని తెలియజేయగానే, బాలసాహిత్యం మీద ఆ పరిశోధన సాగించమని సూచించి ఆశీర్వదించిన శ్రేయోభిలాషులు శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారికి—

సిద్ధాంత వ్యాస నిర్మాణానికి రూపురేఖల్ని దిద్దితీర్చిన గురుతుల్యులు డా॥ మేడవరం వేంకటనారాయణ శర్మగారికి, ఆదరంతో

సొంత తమ్ముడికన్నా మిన్నగా భావించి ఆతిథ్యమిచ్చిన వారి సతీ మణి శ్రీమతి శకుంతలాదేవిగార్కి కృతజ్ఞతాంజలులు.

వృద్ధాప్యంలో ఓర్పుతో, అమూల్యమైన విషయసూచనల్ని చేసి, వాత్సల్యంతో నేను కలిగించిన విసుగును భరించిన శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యుల వారికి, డాక్టర్ మట్నూరి సంగమేశం గారికి, దాస సాహిత్య ప్రాజెక్టు వక్కలంకం సూర్యనారాయణగారికి కృతజ్ఞతాంజలులు.

అన్నమాచార్య ప్రాజెక్టులో రీసెర్చి సైంటిస్టుగా పని చేస్తూ, ఈ పరిశోధన విషయంపై ఒక అవగాహన కల్గించిన కుమారి కేసర్ల వాణిగారికి, అడిగిన గ్రంథాల్ని ఆలస్యం చేయకుండా ఆప్యాయతగా అందించిన కుమారి లీలావతి గారికి—

సోదరప్రాయులు షణ్ముగం (S. V. U. లైబ్రరీ) గారికి హార్దిక కృతజ్ఞతాంజలుల్ని సమర్పిస్తున్నాను.

నిత్యనిరంతరం నాతో కలిసి-మెలిసి తిరిగే శ్రేయోభిలాషులు నీలకంఠానికి, మురగయ్యకు, సురేంద్రకు, కోటేశ్వర రావుకు కృతజ్ఞతలు.

ఈ రకంగా ఎందరో పూజ్యులు, పెద్దలు, గౌరవనీయులు, గురువులు, గురుతుల్యులు, శ్రేయోభిలాషులు, ఆబాల్యమిత్రులు యొక్క సహాయ సహకారాలు ఎన్నోరకాలుగా ఇందులో ఉన్నాయి.

ఎందరో మహానుభావులు అన్నమయ్య సేవలో తద్వారా ఏడుకొండలవాని సేవలో ఈ సిద్ధాంత వ్యాస నిర్మాణ మహాయజ్ఞంలో పాల్గొన్న ఋత్విక్కులే. అందరికీ కృతజ్ఞతాపూర్వక సుమనోంజలిని ఘటిస్తున్నాను.

—శాఖమూరి రవిచంద్రబాబు

## ఉపక్రమము :

అన్నమాచార్యుల సంకీర్తన సాహిత్యం సంగీత, సాహిత్య సాగర సంగమం. తెలుగు వాగ్గేయకారుల్లో అన్నమయ్య ఆద్యుడు. ఆయన కీర్తనలు పాడుతూ ఉంటే శిష్యులు వాటిని తాళపత్రాల పైకి ఎక్కించేవారు. అనంతరం పెదతిరుమలయ్య మొదలైనవారు వాటికి శాశ్వతత్వాన్ని కల్పించాలని రకరకాల పరిణామాలున్న రాగిరేకుల మీద వాటిని లిఖింప చేశారు. అవి దాదాపు ముప్పైరెండు వేల దాకా ఉన్నాయి. భజన సంప్రదాయంలో సంగీత ప్రాధాన్యంతో ప్రచారాన్ని పొందిన అన్నమయ్య సంకీర్తనలు సాహిత్య దృష్టితో కూడ ఎంతో విలువైనవే. అందులో ఆయన భావాలు, వాడిన భాష, వీటికి ఆధారమైన వస్తువు ప్రధానంగా గమనించ దగ్గది.

సంగీత సాహిత్యాత్మకమైన అన్నమయ్య సంకీర్తన అటు సంగీత శాస్త్రానికి, ఇటు సాహిత్య శాస్త్రానికి, వాటి ప్రయోగ విధానానికి అవకాశాన్నిచ్చింది. సంగీత పరిశోధక విద్యార్థులకు అన్నమయ్య కీర్తన సాహిత్యంలో కావలసినదానికంటే అధికంగానే పరిశోధన వస్తువు ఉంది అలాగే సాహిత్య పరిశోధకులకు కూడా జానపదరీతులు, ఛందో వైవిధ్యం, అన్నమయ్యనాటి వ్యావహారిక భాషాస్వరూపం, వాటి పలుకుబళ్ళు, శైలి ఎన్నో అంశాలు, ప్రత్యేకించి చూడదగినవిగా అందులో ఉన్నాయి.

అన్నమయ్య సంకీర్తన సంగీతవిభాగానికి చెందిన పరిశోధన కొద్దిగానే జరిగింది. కానీ ఆయన కీర్తనల్ని సాహిత్యపరంగా పరిశోధించి ఎందరో సిద్ధాంత గ్రంథాల్ని ప్రకటించారు. ఎందరో ఎంతెంత చేసినా ఆ మహామహుడి సంకీర్తన మహావాఙ్మయము కరిగేది కాదు; పైగా పెరిగేది.

ప్రదర్శన దృష్టితో ఎందరో పరిశోధక పండితులు, విద్యార్థులు, ఈ విషయంలో కృషి చేస్తున్నారు. కానీ అన్నమయ్య సంకీర్తనల్లో

ప్రతిపాదితమైన బాలసాహిత్యాన్ని ప్రత్యేకంగా, ఒక పరిశోధనాంశంగా గ్రహించి పరిశీలన చేసినవారెవరూ ఇంతవరకు కన్పించరు. కానీ మల్లెల శ్రీహరిగారు పై అంశంపై ఒక లఘుసిద్ధాంత వ్యాసాన్ని మాత్రం ప్రచురించారు.1

అన్నమయ్య తన బాలసాహిత్యంలో బాలలకు సంబంధించిన ఎన్నో విషయాల్ని కీర్తనల ద్వారా గానంచేస్తూ, వాటితోపాటు అంతరంగా, తలపండిన ఎన్నో తాత్త్వికవిషయాల్ని కూడా అందులో ఆవిష్కరించాడు. మామూలు బాలకుల చేష్టలే ఎంతో ముద్దుమురిపాలతో ఉంటాయి. అలాంటప్పుడు పరమేశ్వరుడే బాలకుడై అతడు చూపిన లీలలు, ఆడిన ఆటలు వాక్కులకు అందరానివి.

ఈ శాఖలో సమధికపరిశోధన జరగాల్సిన అవసరం ఉందని నాకు తోచింది. అందువల్ల ఈ సంకీర్తన శాఖలో పురోగమించాలని తపన, పట్టుదల నాలో అధికమైంది. దానికితోడు తిరుమల తిరుపతి దేవస్థానము వారు, విశేషించి కార్యనిర్వహణాధికారి శ్రీ M. V. S. ప్రసాద్, I. A. S. గారు హార్దికంగానే కాక ఆర్థికంగా అన్నమాచార్య ప్రాజెక్టువారు ఇచ్చే ఉపకారవేతన సౌలభ్యాన్ని కూడా నాకు అనుగ్రహించారు.

మనసులో జిజ్ఞాస కలిగినదేతడవుగా పై సహకారం లభించడం, ఇంకా పెద్దల ప్రోత్సాహం నన్నా ప్రయత్నానికి నిరంతరం ప్రేరేపించాయి. యథాశక్తి నా ప్రయత్నం కొనసాగి సకాలంలో ఈ సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించే అవకాశాన్ని కల్పించి దివినుండి నన్ను ఆశీర్వదిస్తున్న అన్నమయ్యకు, ఆయన వాఙ్మయ మూలకారకుడైన ఏడుకొండల స్వామికి మనసా వాచా కర్మణా అనంత నమస్కారాల్ని సమర్పిస్తూ ప్రస్తుత సిద్ధాంత వ్యాస నిర్మాణానికి పూనుకొంటున్నాను.

---

1. తాళ్ళపాక అన్నమయ్య బాలక్రిష్ణసంకీర్తనలు – ఒక పరిశీలన – మల్లెల శ్రీహరి (M. Phil, Thesis) ముద్రణ–1985

# విషయసూచిక

## మొదటి విభాగం :

### మొదటి ప్రకరణం


అన్నమయ్య జీవిత విశేషాలు :

1. ఆధారాలు 1
2. తాత ముత్తాతలు 2
3. తల్లిదండ్రులు 3
4. అన్నమయ్య అవతరణ–నేపథ్యం 3
5. అవతరణ 3
6. నామకరణం 3
7. బాల్యం–తిరుమల పయనం 4
8. తిరుమలలో అన్నమయ్య 5
9. పంచ సంస్కార దీక్ష 5
10. వివాహం 5
11. సంతానం 6
12. అహోబిలంలో అన్నమయ్య 6
13. రాజాశ్రయం 6
14. రాజాశ్రయ నిరాకరణ 7
15. అన్నమయ్య–పురందరదాసు 7
16. అన్నమయ్య హరి పద యాత్ర 8

రెండవ ప్రకరణం : అన్నమయ్య రచనలు–పరిచయం 9

1. ముద్రితాలు – అముద్రితాలు 9
2. లభ్యాలు – అలభ్యాలు 9

మూడవ ప్రకరణం : సంకీర్తన లక్షణం 12

1. పదకవిత పరిచయం 12
2. పదం 15

3. నిఘంటువుల్లో పదం 16
4. లక్షణ గ్రంథాల్లో పదం 17
5. విమర్శకుల దృష్టిలో పదం 18
6. కృతి - కీర్తన 20


## నాల్గవ ప్రకరణం :


1. తెలుగులో బాలసాహిత్యం–పరిచయం 29
2. ఇతర భాషల్లో బాలసాహిత్యం 39


## ఐదవ ప్రకరణం :


భక్తి సామాన్య పరిచయం_అన్నమయ్య భక్తి పరిశీలన 55
భక్తి - నిఘంటువులు 55
భక్తి - వేదాలు 56
భక్తి - ఉపనిషత్తులు 56
భక్తి - పురాణేతిహాసాలు 57
భక్తి - సూత్రాలు 57
భక్తి - దేవీభాగవతం 58
భక్తి - యోగశాస్త్రం 58
భక్తి - ఆదిశంకరులు 58
భక్తి - శ్రీభాష్యం 58
భక్తి నవీనులు 58
భక్తి - తత్త్వం 60
భక్తి - వైశిష్ట్యం 61
శైవ వైష్ణవాలు 62
విశిష్టాద్వైత సిద్ధాంత తత్వం 64
భక్తి - అన్నమయ్య 65


## రెండవ విభాగం :


అన్నమయ్య బాలసాహిత్య వర్గీకరణ - పరిశీలన : 73

మొదటి ప్రకరణం : బాలకృష్ణ కథాత్మకాలు 73

1. ఉత్సవ సంకీర్తనలు 73
   జయంతి సంకీర్తనలు 77
   జన్మాష్టమి సంకీర్తనలు 83
   జాతకర్మ సంకీర్తనలు 88
   అవతార పరమార్థ కీర్తనలు 91
   సువ్వి (దంపుళ్ళ) పాట 98
2. వాత్సల్య సంకీర్తనలు 102
   ఉగ్గుపాట 103
   ఉయ్యాల పాట, లాలి పాట 107
   జోల పాట 118
   చందమామ పాట 121
   దోబూచి పాట 123
   మేలుకొలుపు పాట 125
3 విక్రమ సంకీర్తనలు 130
   పూతనాహరణం 131
   కాళియ మర్దనం 136
   గోవర్ధనోద్ధరణం 141
   తృణావర్త సంహారం 146
   శకటాసుర భంజనం 148
   కంస వధ 149
4. లీలా సంకీర్తనలు 157
   ఉలూఖల బంధన లీల 157
   నవనీత చౌర్య లీల 162
   అగడపు విన్నపాలు 171

## రెండవ ప్రకరణం


1. క్రీడా సంకీర్తనలు 188

బలరామకృష్ణుల క్రీడలు 188

ఉట్లపండుగ పాటలు 193

2. మహిమా సంకీర్తనలు 199

3. క్షేత్రీయ బాలకృష్ణ సంకీర్తనలు 221

ఉద్ధగిరి 223

మాడుపూరు 229

విజయనగరము 232


## మూడవ ప్రకరణం


1. శ్రీరామ కథాత్మకాలు 235

2. హనుమద్విషయకాలు 246


## మూడవ విభాగం 259-268


అన్నమయ్య బాలసాహిత్యంలో భాష-శైలి : 260

ఉపసంహారము : 269

ఉపయుక్త గ్రంథసూచి : 271

# అన్నమయ్య జీవిత విశేషాలు :

క్రీ. శ. 15వ శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వరాంకితంగా 32 వేల పదాల్నిరచించి వైష్ణవ మతాన్ని పునరుజ్జీవింప చేసిన చరితార్థుడు తాళ్ళపాక అన్నమయ్య.

భగవంతుడి లీలాగుణ విశేషాల్ని సంకీర్తన వాఙ్మయంలో పొందుపరచి, ఆ చంద్రతారార్కం తరిగిపోని కీర్తిని పొందిన అన్న మయ్య జీవితచరిత్ర పరమపవిత్రం.

## 1.1. ఆధారాలు :

అన్నమయ్య మనుమడైన తాళ్ళపాక తిరువేంగళనాథుడు (ఇతడి వ్యవహారనామం చిన్నన్న) రచించిన అన్నమాచార్య 'జీవిత చరిత్ర' (ద్విపద) ఆధారంగా అన్నమయ్య జీవితవిశేషాలు తెలుసు కొ వచ్చు. ఇది సాహిత్యపు విలువలున్న ప్రామాణిక గ్రంథం.

కడపజిల్లా రాయచోటితాలూకా 'మడితాడు' గ్రామనివాసి శ్రీ తాళ్ళపాక సూర్యనారాయణయ్యగారు క్రీ. శ. 1940 లో తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యగ్రంథాలయానికి 'అన్నమాచార్యద్విపద' వ్రాత ప్రతిని అందజేశారు. ఈ వ్రాతప్రతి తిరువేంగళనాథుని యొక్క 'అన్నమాచార్య చరిత్ర' ద్విపదను చూసివ్రాసింది

క్రీ. శ. 1949లో సూర్యనారాయణయ్యగారు అందించిన ద్విపద వ్రాతప్రతిని పరిష్కరించి దేవస్థానంవారు విపుల పీఠికతో ముద్రించారు.

తదుపరి క్రీ. శ. 1966లో పీఠిక మాత్రమే ద్వితీయ ముద్ర ణగా వెలువడింది.

మరల క్రీ. శ. 1978లో తాళ్ళపాక వాఙ్మయ పరిష్కర్తలైన శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారి పరిష్కరణతో మూడవ ముద్రణను దేవస్థానం వారు వెలువరించారు.

ఈ ద్విపదకావ్యంలో అన్నమయ్య పూర్వులనుంచేకాక అన్నమయ్య జన్మాదిక జీవితవృత్తాంతాలూ, ఆయన పుత్రపౌత్రాదుల వివరాలూ పేర్కొనబడ్డాయి.

భారద్వాజసగోత్రులైన అన్నమయ్య పూర్వుల ప్రస్తావన చిన్నన్న 'అన్నమాచార్య ద్విపద' వల్లా, అష్టమహిషీ కల్యాణం వల్లా గ్రహించవచ్చు.

## 1. 2. తాతముత్తాతలు :

అన్నమయ్యకు ముందు నాల్గోతరంలో జన్మించిన విఠలయ్య కుమారుడు నారాయణయ్యతో అన్నమయ్య చరిత్ర మనకు ప్రారంభమౌతుంది. కాగా అన్నమయ్యతాత నారాయణయ్య ఆయన తండ్రి విఠలయ్య.

అన్నమయ్యతాత నారాయణయ్యకు చిన్నతనంలో చదువుసంధ్యలు అబ్బకపోగా అతడి తల్లిదండ్రులు 'ఊటుకూరు'కు పంపారు అక్కడ గురువులు నారాయణయ్యను చతుర్విధ ఉపాయాలకు గురిచేశారు. అయినా బాలుడికి చదువుపట్ల శ్రద్ధకలగలేదు. అందరూగేలిచేశారు. ''పంతులి దగ్గరి పాఠంకన్నా పాముపుట్టలో చేయిపెట్టడమే నయం" అనుకొని అవమానంతో బాధచెంది, ఊరిచివరఉన్న చింతలమ్మగుడి దగ్గరున్న పుట్టలో చేయిపెట్టాడు. బాలుడైన నారాయణయ్యకు చింతలమ్మ ప్రత్యక్షమై "తాళ్ళపాకలో వెలసిన చెన్నకేశవుడి అనుగ్రహంతో నీకు సకలవిద్యలు అబ్బుతాయని" ఆ తల్లి వరమిచ్చి,

అదియును గాక మూడవ తరంబునను
వదలనికీర్తి నీ వంశంబునందు.
పరమ భాగవతుడు ప్రభవించు శౌరి

వరమున ..................................." అని నారాయణయ్యను అనుగ్రహించి అంతర్ధానమౌతుంది. నారాయణయ్య తాళ్ళపాక చేరినాడు. క్రమంగా ఆయన స్వామి అనుగ్రహంతో వేదవేదాంగ పారంగతుడై సకలవిద్యల్ని పొందినాడు.

## 1. 3. తల్లిదండ్రులు :

నారాయణయ్య కుమారుడు నారాయణసూరి. సకల విద్యాదురంధరుడు. ఈయన ఇల్లాలు లక్కామాంబ. లక్కామాంబకే లక్ష్మమ్మ అనే పేరు ఉంది. ఈమె మహాభక్తురాలు. వీరి కులదైవం వేంకటేశ్వరుడు.

## 1.4. అన్నమయ్య అవతరణ - నేపథ్యం :

వీరికి సంతానంలేదు. అందుకోసం వేంకటేశ్వరుణ్ణి సేవించగోరి తిరుమలకొండకు ప్రయాణమౌతారు. తిరుమల శ్రీవేంకటేశ్వరుడి మందిరం ప్రవేశించి ధ్వజస్తంభంవద్ద సాగిలపడతారు. స్వామి వారిని అనుగ్రహించి తనఖడ్గమైన నందకాన్ని (కలలో) ప్రసాదిస్తాడు.

## 1. 5. అన్నమయ్య అవతరణ :

స్వామి అనుగ్రహంచే నారాయణసూరి. లక్కామాంబలకు క్రీ. శ. 1408లో వైశాఖ విశాఖ నక్షత్రమున తాళ్ళపాకలో పుత్రోదయమౌతుంది. ఈ తాళ్ళపాకగ్రామం కడపజిల్లా రాజంపేట తాలూకాలో ఉంది.

## 1. 6. నామకరణం :

'అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" అనే శ్రుతి ప్రకారం నారాయణసూరి తనపుత్రుడికి 'అన్నమయ్య' అని నామకరణం చేశాడు.

## 1. 7. బాల్యం : తిరుమల పయనం :

అన్నమయ్య శిశుప్రాయం నుండి వేంకటపతి మీద ధ్యాసతో ఉండేవాడు. వెంకన్న ప్రసాదమని చెపితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. లక్కమాంబ వేంకటపతిమీదజోలపాడితే నిద్రపోయేవాడు. ఇలా అన్నమయ్యకు 5 సం॥లు నిండాయి.

నారాయణసూరి అన్నమయఅష్టవర్ష ప్రాయంలో ఉపనయనం చేయించాడు అన్నమయ్య ఆడినమాటెల్లా అమృతపదంగా, పాడిన పాటెల్లా పరమకీర్తనగా జాలువారింది.

అన్నమయ్య ఎప్పుడూ దండెభుజాన తగిలించుకొని పాటలు పాడడం ఇంటివారలకు నచ్చలేదు. ఒకనాడు పశువులకు గడ్డితెమ్మని పితరులు అన్నమయ్యను అడవికి పంపారు. శ్రీహరి మీది ధ్యానంతో పచ్చికకోస్తున్న అన్నమయ్యకు కడవేలుతెగి రక్తం చిందింది. భౌతికదేహంపై మమకారం మాయమైంది. కాగా ఇదే అన్నమయ్య జీవితంలో భక్తితత్వ ప్రబోధానికి నాంది. ఐహిక బంధాలపై మమకారంవీడి అన్నమయ్య,

"తల్లియుఁ దండ్రియు దైవంబు గురువు
నెల్లసంపదలునై యెల్ల చందముల
నన్నుఁబోచు శేషాద్రినాథుని గొలిచి
మనియెద.... .. .... ....

(అన్నమాచార్య జీవిత చరిత్ర పుట-12) అని అనుకొని తిరుమలకు ప్రయాణమయ్యాడు. అన్నమయ్య తిరుపతిచేరి గంగమ్మను దర్శించి తిరుమలకొండ అధిరోహిస్తూ మోకాళ్ళపర్వతంవద్ద సొమ్మసిల్లిపోతాడు. జగన్మాత అలమేల్మంగ పెద్దముత్తైదువ వలె ప్రత్యక్షమై అన్నమయ్యను సేదతీర్చి, ప్రసాదాన్నాలుపెట్టి, సాలగ్రామమయమైన తిరుమలను పాదరక్షలతో ఎక్కరాదని హెచ్చరించి, తిరుమల ప్రభువును దర్శించే మార్గాన్ని సూచించి అంతర్ధానమౌతుంది

## 1-8. తిరుమల్లో అన్నమయ్య :

అన్నమయ్య తిరుమల్లో స్వామిపుష్కరిణిలో స్నానంచేసి వరాహస్వామి ఆలయాన్ని సందర్శించి, తిరుమలస్వామి సందర్శనానికి వెళ్ళగా ఆలయం మూసివుంది. వెంటనే వేంకటపతి మీద వేంకట శతకంతో విన్నవిస్తాడు. ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. అర్చకులు అన్నమయ్య మహిమను గుర్తించి, స్వామి దర్శనానికి తీసుకు వెళతారు. స్వామిని సేవించుకొని ప్రసాదాన్ని స్వీకరించి వరాహస్వామి ఆలయంలో అన్నమయ్య విశ్రమించాడు.

## 1-9. పంచసంస్కార దీక్ష :

అప్పట్లో తిరుమలలో ఘనవిష్ణువనే వైష్ణవయతి నివసించేవాడు. స్వామి ఆదేశంపై ఘనవిష్ణువు అన్నమయ్యకు పంచసంస్కారదీక్షను అనుగ్రహించాడు.

నాటినుండి అన్నమయ్య అన్నమాచార్యుడైనాడు. తాళ్ళపాకలో నారాయణసూరి, లక్కమాంబలు అన్నమయ్య కోసం పరితపించసాగారు. స్వామి అనుగ్రహంతో తిరుమల చేరుకొని పుత్రుడికోసం వెదకసాగారు. వైష్ణవదీక్షపొంది, వేంకటేశ్వరుడి సన్నిధిలో గానం చేస్తున్న కుమారుణ్ణిచూచి సంతసించారు. అన్నమయ్యను తాళ్ళపాకకు రమ్మని వారు ఆహ్వానిస్తారు. అన్నమయ్య తిరుమల విడిచి వెళ్ళేదానికి ఇష్టపడలేదు. ఎట్టకేలకు స్వామి ఆదేశంపై ఆయన తల్లిదండ్రులతో తాళ్ళపాక చేరుకుంటాడు.

## 1-10. వివాహం :

యౌవ్వన ప్రాయంలోవున్న అన్నమయ్య తాళ్ళపాక చేరి సమ్మతికి పరతత్వాన్ని ప్రబోధించే గీతాలు పాడుకొనేవాడు. ఇది

గమనించిన అన్నమయ్య తల్లిదండ్రులు వివాహ ప్రయత్నం చేయ సాగారు. అయినా ప్రయత్నం ఫలించలేదు. చివరకు స్వామి అనుగ్రహంతో తిరుమలమ్మను, అక్కలమ్మను పరిణయమాడాడు.

## 1-11. సంతానం :

పెద్దభార్య తిరుమలమ్మ ద్వారా నరసింహయ్యనూ, చిన్నభార్య అక్కలమ్మ ద్వారా పెదతిరుమలయ్య, కుమార్తె తిరుమలాంబనూ అన్నమయ్య పొందాడు. అన్నమయ్య గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వర్తిస్తూ తన పదహారో ఏటనుండీ రోజుకొక్కకీర్తన రచిస్తూ, పల్లవి చరణాలతో కూడిన తెలుగు సంకీర్తన సాహిత్యప్రక్రియకు ప్రాణ ప్రతిష్ఠ చేశాడు.

## 1-12. అహోబిలంలో అన్నమయ్య :

అహోబిలం ప్రసిద్ధవైష్ణవక్షేత్రం, వేదాంత రహస్యాలు తెలుసుకోవాలని అన్నమయ్య అహోబిల మఠస్థాపకుడైన 'ఆదివన్ శఠగోప యతిని ఆశ్రయించాడు. ద్వాత్రింశద్వర్ణ సంపుటిబద్ధమైన నృసింహమంత్రాన్ని పొంది ముప్పైరెండువేల సంకీర్తనలు రచించాడని తాళ్ళపాక వాఙ్మయ పరిష్కర్తలైన శ్రీ గౌరీపెద్ది రామసుబ్బ శర్మగారి అభిభాషణ.

## 1-13. రాజాశ్రయం :

అన్నమయ్య ప్రఖ్యాతిని టంగుటూరును పాలించే సాళ్వ నరసింహరాయలు విని తన కొలువుకు ఆహ్వానిస్తాడు. రాజాశ్రయంతో వైష్ణవమతప్రచారం సులభంగా చేసుకోవచ్చని భావించి రాయల కోరికను అన్నమయ్య మన్నిస్తాడు. సాళ్వనరసింహరాయలు

అన్నమయ్యను గురువుగా, బాంధవాధికుడుగా, హితుడుగా గౌరవించి అన్నమయ్య దీవెనలతో పెనుగొండ రాజ్యానికి ప్రభువైనాడు.

అన్నమయ్య పెనుగొండచేరి సంకీర్తనలద్వారా విశిష్టాద్వైత మతవ్యాప్తి చేయసాగాడు. అన్నమయ్య పదాలు ఆధ్యాత్మిక, శృంగార తత్త్వప్రతిపాదితాలై విశేషవ్యాప్తిని చెందినాయి. రాజాశ్రయం లోనే వుంటూ అన్నమయ్య రాయలసీమలోని వివిధ వైష్ణవక్షేత్రాల్ని సందర్శిస్తూ, అక్కడి దైవతాలపై ఎన్నో కీర్తనల్ని ఆయన రచించాడు.

## 1-14. రాజాశ్రయ నిరాకరణ :

ఒకనాడు సాళ్వనరసింహరాయలు అన్నమయ్యను కొలువుకు ఆహ్వానించి ఒకశృంగార సంకీర్తన పాడమని కోరాడు. అన్నమయ్య నరసింహరాయల కోర్కెను మన్నించి "ఏమొకొ చిగురుటధరమున యెడనెడ గస్తురి నిండెను" అనే మధురభక్తి కీర్తన వినిపించాడు.

సాళ్వనరసింహరాయలు తన మీద ఒక శృంగార సంకీర్తన వినిపించమని కోరగా అన్నమయ్య తిరస్కరిస్తాడు. అహంకారంతో నరసింహరాయలు అన్నమయ్యను బంధిస్తాడు. అన్నమయ్య శ్రీవేంకట విభుని ప్రార్థించగా సంకెళ్ళు వీడిపోతాయి. రాజు తిరిగి సంకెళ్ళు వేస్తాడు. అన్నమయ్య స్వామిని తిరిగివేడుకోగా సంకెలలు ఊడిపోతాయి. రాజు పశ్చాత్తాపంతో అన్నమయ్యను వేడుకొని, రాచ మర్యాదలతో ఆదరిస్తాడు. అన్నమయ్య రాజాశ్రయం వీడి తిరుపతి కేగి స్వామికి 'శృంగార మంజరి'ని సమర్పిస్తాడు.

## 11-5. అన్నమయ్య - పురందరదాసు :

అన్నమయ్య కవితాశక్తిని, వైష్ణవ భక్తితత్పరతను విన్న పురందరదాసు అన్నమయ్యను దర్శించడానికి తిరుపతికి వస్తాడు. అన్నమయ్యను దర్శించి సాక్షాత్తు వేంకటేశ్వరుడి అవతారమని

స్తుతిస్తాడు. అన్నమయ్య దాసులవారిని విఠలుని అవతారమని కీర్తిస్తాడు. ఇద్దరివీ అంశావతారాలే.

## 1-16. అన్నమయ్య హరిపదయాత్ర :

స్వామి ఆజ్ఞతో రోజుకొక కీర్తనచేస్తూ ముప్పై రెండువేల సంకీర్తనలు వ్రాసిన అన్నమయ్య కీ. శ. 1503 లో పరమపదించాడు. అది దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశీతిథి.

అన్నమయ్య నిర్యాణ తిథిని పురస్కరించుకొని తాళ్ళపాకవారు రచించిన కీర్తన గమనించదగ్గది.

"దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు
జనకుడ అన్నమాచార్యుడ విచ్చేయవే" 2-151

సహస్రమాసాధిక చంద్ర సందర్శన మహామహితాత్ముడైన పూర్ణపురుషాయుషజీవి అన్నమయ్య.

అన్నమయ్య జీవిత విశేష విషయ పరిశీలన తరువాత ఆ మహాత్ముడి రచనలను పరిశీలించడం అనంతర కర్తవ్యం.

## అన్నమయ్య రచనలు - పరిచయం :

దాదాపు ఒకటిన్నర శతాబ్దంపైగా తిరుపతిలో దీక్షా బద్ధులుగా ఉండి, ఆంధ్రుల మతసాంస్కృతిక రంగాల్లో నూతనోత్తేజాన్ని కల్పించిన తాళ్ళపాక వంశీయులందరూ మహాకవులే1 పండితులే; వీరందరూ వాగ్గేయకారులే! వారు పదుగురైనా ఒక సంస్థగా పనిచేసి ఆంధ్రసారస్వత ప్రపంచానికి గొప్ప సేవ చేశారు. వారిలో ఒకరిని మించి ఒకరుగా రచనలు చేశారు. అట్టి వారిలో తాళ్ళపాకవారి వంశానికి మూలపురుషుడు అన్నమయ్య.

## ముద్రితాలు - అముద్రితాలు :

తాళ్ళపాక అన్నమయ్య శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలు అన్నీకలిసి ముప్పది రెండువేలు. వీటిలో కొన్ని ప్రకటించ బడ్డాయి.

## లభ్యాలు - అలభ్యాలు :

అన్నమయ్యచే రచింపబడిన 'శృంగార మంజరి' అనే ద్విపద లభించింది.

అన్నమయ్య పన్నెండు శతకాలు రచించినట్లు ప్రతీతి. ఈ శతకాల్లో అలిమేలు మంగమ్మపై చెప్పబడిన 'వేంకటేశ్వరా' అనే మకుటంతో ఉన్న శతకమొక్కటే లభించింది. తక్కిన శతకాలు లభించలేదు.

---

1. వాగ్గేయకార ప్రయోగంలో. వాక్ అంటే కవిత్వం అని గేయ అంటే పాట అని అర్థం. కాగా వాగ్గేయకారుడు అంటే స్వయంగా పాటను రచించి పాడేవాడని అర్థం.

అన్నమయ్య 'ద్విపదరామాయణాన్ని' రచించినట్లు కూడా చెప్పబడింది. కాని అది అలభ్యం.

అన్నమయ్య 'వేంకటాచల మహాత్మ్యం' అనే సంస్కృత రచన చేసినట్లు చెప్పబడింది. కాని ఇది కూడా లభించలేదు.

అన్నమయ్య 'సంకీర్తన లక్షణమ'నే లక్షణ గ్రంథాన్ని సంస్కృతంలో రచించినట్లు చెప్పబడింది కానీ ఇదీ అలభ్యమే.

అన్నమయ్య ఒక్కడే 'పరమతంత్రములు ముప్పదిరెండు వేలు' యోగ, వైరాగ్య, శృంగార మార్గాలననుసరించి వ్రాసినట్లు చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య చరిత్రనుబట్టి తెలుస్తుంది.

అన్నమయ్య తాళ్ళపాకవంశ విఖ్యాతికేగాక, సమస్త వాగ్గేయ కార వంశవిఖ్యాతికీ మూలభూతుడే :

ప్రాయికంగా వాగ్గేయకారులందరూ భక్తులే, వారిలో అన్న మయ్య అనన్య భక్తుడు. హరికీర్తనాచార్యుడు, పదకవితా పితా మహుడు, పంచమాగమ సార్వభౌముడు. ద్రావిడ వేదాన్ని తెలుగు చేసిన మహనీయుడు. వైష్ణవకావ్యాల్ని, శతకాల్ని, క్షేత్రమాహ త్మ్యాన్ని మాత్రమేకాక శ్రీవైష్ణవసిద్ధాంత ప్రచారానికై కొత్తగా తెలుగులో పదకవితకు శ్రీకారంచుట్టిన ఆది వాగ్గేయకారుడు. రాశిలో, వాసిలో కూడా అన్నమయ్య స్థానం వాగ్గేయకార ప్రపంచంలో అనన్యమే.

ముప్పైరెండువేలకుపైగా ఇతడు తిరువేంగళనాథ దేవుడుపేర శృంగారాధ్యాత్మిక కీర్తనలు రచించాడు. అవన్నీ వైష్ణవతత్త్వ పరిమళాన్ని సుదూరం వ్యాప్తంచేసే మందమలయానిల వీచికలే. సంకీర్తనసార సరస్వతీ రుచిరనూపుర రవళులే.

తద్దేవతా కచ్ఛపీ విపంచికా తంత్రీ నిస్వనాలే

ఆ మహాత్ముని వాగ్విశేషాలు

"శ్రుతులై, శాస్త్రములై, పురాణకథలై, సుజ్ఞానసారంబులై
యతిలోకాగమ వీథులై, విపులమంత్రార్థంబులై, నీతులై
కృతులై. వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళ్ళయపాక యన్నయవచో సూక్తుల్ క్రియల్
చెన్నగున్"1

అని ప్రశంసితాలైనాయి.

పైవిధంగా ప్రశంసితాలైన అన్నమయ్య రచనల్ని అనుశీలించిన తర్వాత ఆ రచనలకు ప్రాణభూతమైన సంకీర్తన లక్షణాన్ని పరామర్శించడం అవసరం కనుక అనంతరప్రకరణలో పై ప్రయత్నం జరుగుతుంది.

---

1. అన్నమయ్య మనుమడు చినతిరుమలాచార్యుడు.

# సంకీర్తన లక్షణం :

ఇంతవరకు పదకవితా పితామహుడు అన్నమయ్య జీవిత విశేషాల్ని రచనల్ని పరిచయం చేయడం జరిగింది.

తెలుగు సాహిత్యంలో పదకవితకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ గుర్తింపును తెచ్చినవాడు అన్నమయ్య. ఎన్నివేల కీర్తనలు ఆ మహామహుని గాత్రంనుండి వెలువడినవో కాని ఆంధ్రుల అదృష్ట వశాత్తు తిరుమల తిరుపతి దేవస్థానంవారి కృషిఫలితంగా పండిత ప్రకాండులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ మొదలైనవారి కృషివల్ల ఇప్పటికి దాదాపు పదివేల సంకీర్తనలను పరిష్కరించి ప్రచురించడం జరిగింది. అన్నమయ్య విభజించకపోయినా పండితులు ఈకీర్తనల్ని శృంగార ఆధ్యాత్మికాలని రెండు విధాలుగా విభజించారు.

పరమ సంకీర్తనాచార్యుడై పదకవితకు ఊపిరిపోసిన అన్నమయ్య ప్రశంసా సంస్మరణతో సంకీర్తన లక్షణాన్ని పరామర్శించడం సముచితం అని అనుకొంటాను. అందుకే అన్నమయ్య ప్రసక్తిని మొదట సూక్ష్మంగా చెప్పడం జరిగింది.

కీర్తన సంకీర్తన పదకవితలో ఏకదేశమే. కనుక మొదట పదకవితను పరిశీలించాలి.

## పదకవిత - పరిచయం :

తెలుగు సాహిత్యంలో ఆదినుండి పదకవితకు ఒక ప్రత్యేకత ఉంది. ప్రాచీనకాలంలో పండితులు పదకవితకు సముచిత స్థానాన్ని ఇవ్వకపోయినా కాలంలో అది తన ఉనికిని కోల్పోలేదు.

తెలుగులో మనకులభించే మొదటిగ్రంథం నన్నయ భారత భాగం. కాని అంతకుముందు ఎంతో తెలుగుసాహిత్యం లేకపోలేదు.

నన్నయకు ముందు శాసనసాహిత్యం ఉంది. ఈ శాసన సాహిత్యాని కన్నా మునుపే పదసాహిత్యం ఉండి ఉంటుందనడం నిర్వివాదం అని పండితుల అభిప్రాయం. కారణం ఏ సాహిత్యంలో అయినా మొదట ఆవిర్భవించేది పదసాహిత్యమే అన్నది సాహిత్య పరిణామ మూలసూత్రం.

సాహిత్యం జాతి జీవనాన్ని ప్రతిబింబింప చేసే నిలువుటద్దం1 మనోజ్ఞాంశాలతో మరిపించి మురిపింపజేసే మహత్తర సాధనం సాహిత్యం వ్యక్తియొక్క, హృదయభావాన్ని మరోవ్యక్తికి అందించి తద్వారా అచిరానుభూతిని కల్గించే అపురూపమైన ఉపకరణ సాహిత్యం. ఈ సాహిత్యంలో మనకు రెండు ప్రధాన విభాగాలు కన్పిస్తాయి. ఒకటి వస్తువు, రెండు రూపం. కవి గ్రహించే విషయం లేదా వస్తువును ఆంగ్లంలో **'theme'** అంటారు. రచయిత పాఠకులకు అందించాలనుకునే సందేశాత్మకమైన ఇతివృత్తం, తదితర అంశాలూ వస్తువు క్రిందికేవస్తాయి. కవి ప్రతిపాదించే తీరు రూపం. అనగా కవి అనుసరించే ప్రక్రియ అని చెప్పవచ్చు. ఈ రూపం ప్రాతిపదికగా సాహిత్యాన్ని మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి పద్య. గద్య, గేయ సాహిత్యాలు. పాడుకోవడానికి అనువుగా పాటలరూపంలో వెలువడేది. గేయసాహిత్యం.

ఉద్దిష్టులను బట్టి సాహిత్యాన్ని రెండు విధాలుగా విభజించవచ్చు. ఒకటి పండిత సాహిత్యం, రెండు పామరసాహిత్యం. దీన్నే శిష్ట, శిష్టేతర సాహిత్యాలని అనవచ్చు. లేదా ప్రౌఢ జానపద సాహిత్యాలన్నా అనవచ్చు.

ఏ భాషా సాహిత్యంలో అయినా శిష్టేతర సాహిత్యమే ఆదిలో ఆవిర్భవించి వికాసం చెందుతుంది. శిష్టేతర సాహిత్యం ప్రజల

---

1. **'Literature is the Mirror of the Society'** అవి ఆంగ్ల సాహితీ వైమర్శిక సూక్తి

నాలుకల మీదనే నిలిచి ప్రాచీనకాలంలో గ్రంథస్థం కాలేదు. మహా రాజుల కాలంలో వారి ఆదరణకు నోచుకున్న పండితుల సాహిత్యాన్ని లిఖితరూపంలో ఉంచడం జరిగిందే కాని, జానపదులు ఆడి పాడుకున్న పదసాహిత్యాన్ని భద్రపరచాలన్న ఆలోచనే ఆనాడు లేదు. కానీ సరళమై, సులలితమై, సులభగ్రాహ్యమైన సాహిత్యం ప్రజల నోళ్ళ గ్రంథాలుగా, నాలుకలే గ్రంథపత్రాలుగా ఎవరుకాదని ఎంత ఈసడించినా తన ఉనికిని నిలుపుకుంటూ వచ్చింది.

ప్రాచీన పండితులు పదకవితను ఆదరించకపోగా తీవ్రంగా నిరసించినట్లు కూడా తెలుస్తుంది. కవిసార్వభౌముడు శ్రీనాథుడి చాటువుగా లోకంలో వ్యాప్తిచెందిన ఈ పద్యం ఆనాటి పండిత ప్రకాండులకు పదకవితపైగల నిరసనకు నిదర్శనం

" ముదివిటులు, విధవ లంజలు,
పదకవితలు, మారుబాస బాపనవారల్
చదువని పండిత వర్యులు
కదనార్భట వీతవరులు కడిది పురమునన్ "1

అంతేగాక ద్విపదలో కావ్యాన్ని వ్రాసిన పాల్కురికి సోమనాథుడు పండిత లోకాన్ని మెప్పించడానికి ప్రయత్నించినట్లు క్రింది ద్విపదవల్ల తెలుస్తుంది.

ద్విపద : "నురుతర గద్యపద్యోక్తుల కంటె
సరసమై పరగిన జానుఁదెనుంగు
చర్చింపగా సర్వసామాన్యమగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కిదైవాఁట
దెలుఁగు మాటలనంగ వలదు వేదముల
కొలదియ కాజూడు డిలనెట్టులనినఁ

---

1 శ్రీనాథుడు – వీధినాటకము. చాటుపద్యములు 47 పద్యం

బాటి తూమునకును బాటియౌనేనిఁ
బాటింప సోలయుఁ బాటియకాదె "[1]

పదకవితను, ద్విపదల్ని పండితులు ఎంత నిరసించినా సామాన్య ప్రజలు అంతగా వాటిని ఆదరించారు.

లాక్షణీకులు కవితాన్ని చిత్ర మధుర ఆశు విస్తర కవిత అని నాలుగు రకాలుగా విభాగించారు వీటినే చతుర్విధ కవితలంటారు. పదకవిత మధురకవితాశాఖలో చేరుతుందని పెద్దల అభిప్రాయం.

లక్షణ దీపికలో మధురకవిత్వాన్ని గూర్చి చెబుతూ 'యక్ష గానంబున వెలయు పదంబులు కూడా మధురకవితగానే చెప్పబడి ఉంది. మధురకవితారీతికి చెందిన పదానికి, అన్నమయ్య రచించిన కీర్తనలకి, క్షేత్రయ్యాదుల కృతులకు స్థూలదృష్టితోచూస్తే భేదంలేదని పిస్తుంది. కాని సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే భేదం కన్పిస్తుంది.

పదం, కీర్తన, కృతి వీటిని ఆవిర్భావ వికాసాల్ని స్థూలంగా గుర్తించాలి. ముందుగా మొదట 'పదం' అంటే ఏమిటో చూడాలి.

## పదం :

జానపద సాహిత్య లక్షణాల్ని అధికంగా. శిష్టసాహిత్య లక్ష ణాల్ని అల్పాల్పంగా ఇముడ్చుకొని, శిష్టజానపద సాహిత్యాలకు మధ్యేమార్గంగా ఒక సాహిత్యశాఖ వెలువడింది. ఇదే పదకవితగా రూపించి ప్రసిద్ధిచెందింది. 'పదకవిత' అన్న పదబంధానికి 'కవి తాత్మకమైన పదావళి' అన్న అర్థం చెప్పవచ్చు. పదకవితలోని

---

1 బసవపురాణము (ద్విపద) - పాల్కురికి సోమనాథుడు ప్రథమా శ్వాసము పుట 89

గేయాలకు పదం, కీర్తన, కృతి అనే వ్యావహారిక నామాలు కన్పిస్తున్నాయి. స్థూల దృష్టికి ఇవన్నీ ఒకటే అనిపించినా సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే వీటి అర్థపరిధుల్లోను స్వరూప స్వభావాల్లోను కొంతభేదం కన్పించకపోదు.

మధుర కవితారీతికి చెందిన పదకవితలోని 'పద' శబ్దానికి పాట అని సామాన్యార్థం. కాగా పదం ఒక పారిభాషిక శబ్దం.

## నిఘంటువుల్లో పదం :

'గురుబాల ప్రబోధిక' అనే అమరకోశ వ్యాఖ్యానంలో 'పదం వ్యవస్థిత, త్రాణస్థాన లక్ష్మాంఘ్రి వస్తుషు' అని చెప్పబడింది. అనగా వ్యవసాయానికి, రక్షించడానికి, స్థానానికి, చిహ్నానికి, అడుగుకు వస్తువుకు 'పదం' అని పేరు అని తేలింది.

ఆంధ్ర వాచస్పత్యంలో పదానికి సంబంధించి పారిభాషిక పదాలుగా శుద్ధపదం, తుల్యపదం, పూర్వపదం, సాధారణపదం అని ఇవ్వబడ్డాయి.

'సూర్యరాయాంధ్ర నిఘంటువు'లో పదశబ్దానికి పాదం, పద్యచరణం, చిహ్నం. ధనం, కిరణం, చోటు, ఊనిక, వాక్యం, పాట, శబ్దం, లక్షణం, కపటం. కారణం వేదపద విభాగం, సంరక్షణం అనే అర్థాలు చెప్పబడినాయి.

'శబ్దార్థచంద్రిక'లో మహాకాళి సుబ్బరాయలుగారు పాదం. పద్యపాదం, వాక్యం, పాట అనే అర్థాలిచ్చారు.

'శబ్దరత్నాకరం'లో బహుజనపల్లి సీతారామయ్యగారు పాదం, పద్యపాదం, చిహ్నం, శబ్దం, వాక్యం, ప్రయత్నం, స్థానం, కపటం, వస్తువు కిరణం అనే అర్థాలిచ్చారు.

'సంగీత శబ్దార్థ చంద్రిక'లో అరిపిరాల సత్యనారాయణమూర్తి గారు పదశబ్దానికి నాయికా నాయక లక్షణాలుకల్గి శృంగార రస

ప్రధానమైనట్టి సంగీత రచనకు పదమని పేరు.' ఇందు పల్లవి, అనుపల్లవి, చరణములు అను విభాగములుండును. దీనిలో సంగీతము యొక్క నడక నెమ్మదిగా, ఆకర్షణీయంగా ఉండును. సాహిత్యము పాండితీ ప్రతిభ కల్గియుండి గంభీరమైన వేదాంతార్థము ఇమిడియుండును అని పేర్కొన్నారు.

పదశబ్దానికి నిఘంటువులు ఎన్ని అర్థాలిచ్చినా జానపదుల దృష్టిలో పదం అనగానే స్ఫురించేది పాట అన్న అర్థమే. పదం పాడుతూ, కదం తొక్కుతూ అన్నది జానపదుల్లో స్థిరంగా నిల్చిపోయిన నానుడి.

## లక్షణ గ్రంథాల్లో పదం :

భరతముని పదశబ్దాన్ని నిర్వచించాడు.

" గాంధర్వం యన్మయా ప్రోక్తం, స్వరతాళ పదాత్మకమ్
పదం తస్య భవేద్వస్తు స్వరతాళాను భావకమ్
యత్కించి దక్షరకృతం తత్సర్వం పద సంజ్ఞితమ్
నిబద్ధం చాని బద్ధంచ తత్పదం ద్వివిధం స్మృతమ్
అతాళంచ, సతాళంచ ద్విప్రకారంచ తద్భవేత్
సతాళంచ ధ్రువార్థేషు నిబద్ధం తచ్చవై స్మృతమ్ "

స్వరతాళ పదాత్మకమైంది గాంధర్వమనీ, స్వరతాళాను భావకమైన పదమే వస్తువనీ, అర్థసహితమైన అక్షరాలతో కూడింది, పదం అనీ ఇది నిబద్ధం అనిబద్ధం అని రెండు విధాలనీ అవి అతాళ, సతాళ భేదాలతో రెండు రకాలనీ పద విషయంలో భరతముని ప్రవచనం.

తాళ్ళపాక అన్నమయ్య సంస్కృత సంకీర్తన లక్షణ గ్రంథం మనకు లభించలేదు. ఆ గ్రంథానికి పెదతిరుమలాచార్యుడు వ్రాసిన వాఖ్యకూడా దొరకదు. కాని వాటిని అనుసరించి చిన తిరుమలయ్య

వ్రాసిన గ్రంథం మనకు లభ్యమౌతుంది. అందులో పదస్వరూపం ఇలా ఉంది.

" పదమగు సుప్తి జిగ్నమ
పదమవయవ, మవయనియును బదమన బరగున్
దుది సెతెఱంగు లన్నియు
బదకవితా మార్గ సార్వభౌముడు దెలిపెన్ "

ఈ పదాలు శృంగార, వైరాగ్య పదాలని రెండు విధాలు శృంగార పదాలు సహజంగా గ్రామ్యోక్తులతో నిండి ఉండవచ్చు.

" పదములు శృంగారవధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగా బొంక మెఱిఁగి పలుకగ జెల్లున్ "

వైరాగ్యపదాలు ఉదాత్తంగా ఉండాలి. వీటినే ఆధ్యాత్మిక పదాలంటారు. ఈ పదాల్ని సంస్కృత, ప్రాకృత దేశభాషల్లోనూ చెప్పవచ్చు.

## విమర్శకుల దృష్టిలో పదం :

శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు పదాన్ని ఈవిధంగా నిర్వచించారు.

' శృంగారమయమై, ఎక్కువగా విలంబకాలమందు, క్వచిత్తుగా మధ్యమకాలమందు నడచుచూ, పల్లవి అనుపల్లవములు, మూడింటికి తక్కువగాని చరణములు కల్గి ప్రాచీన రక్తిరాగములలో చేయబడిన గేయరచనకు పదమని పేరు. "

" పదమంటే కేవలం సంకీర్తన పాట అనేగాక పద పద్యాలకూ అది సంకేతమవుతుందనీ. పదం అంటే కేవలం శృంగార పదమే

కాదనీ, సమస్తమయిన పాటలు అందులో గతార్థమవుతాయ''ని వడ్లమూడి గోపాలక్రిష్ణయ్యగారు తమ సుదీర్ఘచర్చలో సహేతుకంగా నిరూపించారు.

సుబ్బరాయ దీక్షితులు పద నిర్వచనంచేస్తూ "పదంయొక్క మాతువు శృంగార రస నాయికా నాయక లక్షణ వ్యవహారాదులతో కూడినదని" చెప్పారు. సంగీత సాంప్రదాయ ప్రదర్శనిలో కీర్తన, పదం, దరువు, చౌకవర్ణం. తానవర్ణం, స్వరజతి, జతిస్వరం, జావళి, తిల్లాన, శబ్దలక్షణాన్ని వివరించారు1.

ఆచార్య సాంబమూర్తిగారు **"Pada is a scholarly composition the term, Pada is some times used to signfy any devotional composition. It is only in the sense that we talk of kanarese Padas of Purandaradasa. The Pada has the dicrisions - Pallavi, Anupallavi and charana. There are on sangeetas and no tense sancharas. The Music is slow and flows in a natural manner. Its diction is simple."** అని పేర్కొన్నారు.

లక్షణభేదాన్ని బట్టి పదాన్ని వృత్తపదం, నిబంధ పదం, అనిబంధ పదం అని మూడుగా విభజించవచ్చు.

ఇందులో వృత్తపదాన్ని సమం, అర్థసమం, విషమం అని మూడుగా విభజించవచ్చు.

తొలిరోజుల్లో పదం, సంకీర్తనం పర్యాయ పదాలుగా వ్యవహరించబడేవి. క్రమంగా అవి - శృంగార సంకీర్తనలనీ, ఆధ్యాత్మిక సంకీర్తనలనీ రెండు విధాలైనాయి. క్రమక్రమంగా క్షేత్రయ్య

---

1. ఆంధ్రవాగ్గేయకారచరిత్ర - బాలాంత్రపు రజనీకాంతరావు పుట: 175

53.5.74



రామదాసు కీర్తనల్లో అక్కడక్కడా శృంగారం ఉంది. అంటే పదాలైనా, కృతులైనా, కీర్తనలైనా వాటిలో శృంగార, నీతి, వైరాగ్య భావాలు కన్పిస్తుంటాయి.

పరిశీలనా దృష్టితో చూస్తే సాహిత్యాన్ని మించిన సంగీతం కృతిలోను, సంగీత సాహిత్యాలు ఇంచుమించు ఒకటిగా కన్పించినా ప్రధానంగా భక్తే కీర్తనల్లో కన్పిస్తుంది. కీర్తనల్లో కన్పించే సాహిత్యం చాలవరకు భక్తి ప్రధానంగానే ఉంటుంది.

ప్రత్యేకించి తెలుగుసాహిత్యంలో పదకవితనుగూర్చి పరిశీలిస్తే, ఈ పదకవిత్వం కృష్ణమాచార్యుల సింహగిరి నరహరి వచనాలతోనే ప్రారంభమైందని చెప్పాలి. 12, 13 శతాబ్దాల కాలంలో దేవాలయ ప్రాంగణాల్లో కొందరు సంకీర్తనలు గానం చేసేవారని తెలుస్తుంది.

కృష్ణమాచార్యుల తదనంతరం చెప్పుకోదగిన పద కవులు యాగంటి కవులు. వీరు శైవులు. యాగంటి కవులు ఒకరో పలువురో ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. యాగంటి కవుల్లో ప్రసిద్ధుడు యాగంటి లక్ష్మయ్య. ఇతడు కృష్ణమాచార్యుడు, అన్నమయ్యకు మధ్యకాలంలోనివాడు.

మొట్టమొదట పదకవితా సాహిత్యాన్ని పరిశీలించి ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర అన్నపేరుతో బాలాంత్రపు రజనీకాంతరావుగారు ప్రకటించారు. ఈయన పదసాహిత్యాన్ని 11 యుగాలుగా విభజించారు.

## సామగాన యుగం :

ఇందులో వేదకాలంనాటి ప్రబంధాలు, ఋక్కులు, గాథలు, సామములు చేర్చబడ్డాయి.

## గాంధర్వ యుగం :

దీన్నే మార్గయుగం అని అన్నారు. గాంధర్వపద్ధతి ప్రబంధాలు సంస్కృత కావ్యభాషలో ఈ యుగంలో వెలిశాయి.

## ఆఖ్యాన యుగం :

రామాయణ, మహాభారత, ఇతిహాసాల్ని ఆఖ్యానాలుగా వీణాది వాద్యాల సహాయంతో గానం చేసేవారు. ఈ గానం చేసేవారిని కుశీలవులు అనేవారు.

## ధ్రువాగాన యుగం :

దేశభాషల్లోని ప్రబంధ రీతుల్ని పరిశీలించి వాటిని తమ లక్షణ గ్రంథాల్లో చేర్చి ఈ యుగంలో ధ్రువాగానాలుగా సభాగౌరవ స్థాయికి తేవడం జరిగింది.

## రాగకావ్య యుగం :

అభినవగుప్తుడు రాగకావ్యాలచే ప్రబంధాల్ని గూర్చి చెప్పాడు.

## గీతగోవింద యుగం :

ధ్రువాపట యుగంనాటి లక్షణాలు, రాగయుగాల లక్షణాలు కలుపుకొని అనేక రాగాలతో గీతగోవిందం వెలువడింది. ఈయుగంలో జయదేవుడు (11, 12 శతాబ్దాల కాలం) వెలిశాడు.

## దేశభాషా సంకీర్తన యుగం :

(13 వ శతాబ్దం) దేశిగేయ రచనారీతుల్ని స్వీకరించి వాగ్గేయకారుడు తమ మాతృభాషలో సంకీర్తనల్ని రచించడం ప్రారంభించిన కాలమిది. సింహగిరి నరహరి వచనములు ఈ యుగంలోవే : ఇవి

1. అన్నమయ్య పూర్వయుగం (1400 వరకు)
2. అన్నమయ్య యుగం (1400 – 1600)
3. క్షేత్రయ్య యుగం (1600 – 1750)
4. త్యాగయ్య యుగం (1 50 – 1850)
5. ఆధునిక యుగం (1850 నుండి)

పదకవితా పితామహుడైన అన్నమయ్యతో తెలుగులో పద కవితా సాహిత్యానికి సువర్ణయుగం ప్రారంభమైంది. అయితే అంతకుముందు పదకవితలేదనికాదు. (తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ్య అనినంతమాత్రాన ముందు సాహిత్యం లేదని అర్థం కాదుకదా.)

అన్నమయ్య తరువాతివాడైన అల్లసాని పెద్దన్నకు ఉన్న బిరుదం ఇలాంటిదే. అన్నమయ్యకుముందే పదకవిత ఉన్నప్పటికీ, అది ఆయనకాలంలో సరికొత్తరూపంలో విశ్వరూపాన్ని సంతరించు కుంది. అలాగే పెద్దనకుముందే తెలుగు కవిత ఉన్నా, ప్రబంధ మార్గం ఆతనితోనే పరిపూర్ణతను సంతరించుకుంది. పెద్దనకు పితా మహుడి బిరుదు ఎలాంటిదో అన్నమయ్యకుకూ ఆ బిరుదు అలాంటిదే.

అందుకే అన్నమయ్యకు ముందున్న యుగాన్నంతటినీ, అన్నమయ్యకు పూర్వయుగంగా ఆచార్య గంగప్ప పేర్కొనడం సమంజసమే అన్పిస్తుంది.

ఆచార్య లక్ష్మీకాంతంగారు పల్నాటి వీరచరిత్రలో పదకవిత ఆవిర్భావాన్ని గూర్చి ఇలా పేర్కొన్నారు.

'ఏ వాఙ్మయం నందైనను ఈ పదకవిత్వం, పద్యకవిత్వం కంటే ముందుపుట్టి పెరుగుననుట బహుజనాంగీకృతమైన సిద్ధాంతము. చిత్రవిచిత్రకావ్యకమనీయ పర్వతారణ్యమయమైన ప్రకృతిలోపుట్టి పెరిగిన ప్రాకృత జీవియగు ప్రాక్తన మానవుని హృదయమున

సంతోషమయమో, దుఃఖమయమో అగు ఒకానొక భావము జనించి పరవశుని చేయగా, అతని నోటివెంట అప్రతర్క్యకముగా ఒకపాట వ్యక్తమై ఉండుననియు, ఆవేశపూరితుడై అతడాపాటను చిందులు తొక్కుచు పాడియుండుననియు. ఆట పాట లేక నృత్యగీతము అని పేరు పెట్టవచ్చుననియు, అదియే కవిత్వమునకు శ్రీకారమనియు"1 పేర్కొన్నారు. పై లక్ష్మీకాంతంగారి అభిప్రాయం **R. C. Moutton** పండితుని అభిప్రాయానికి తెలుగుసేత.

**R. C. Moutten** గారు పదకవిత ఆవిర్భావాన్ని గూర్చి **'Methods and Metirials of Literery criticism'** అనే గ్రంథంలో ఇట్లా నిర్వచించాడు.

" The improvised lyrical song, communal or individual, popular or artistic, is probably the simplest and most spony taneous form of lyric expression... The rtue song is primarl- the instinctive our quest of emotion of emotional thought in langnage which by aptness of word and rythm echoes or suggest the underlying emotion and by melody of line and hormony of stanza is adapted to such modulations of fhe singing voice as naturally distingc sh emotionl uttergnce The wo d must be and at the seme time ri h in connotation and sensuous They rythem must reproduce the urgency end spe d, the flew and ebb, of the dominant feeling on the one hand emphasizing the movement by the regularity of metre on the other avoiding rigidity. The melody must be facile in its consonent - seguences, Preferable open in the quality and varied in the musical piten of its vowel sounds... The song is there fore, more then any other lyric kind a musica l ciy.

That the popular or fraditional ballad is tolk poetry, poetry that has originated usually in oral form among a

---

1. R C. Moutton గారి Modern Study of Literature అనే గ్రంథంపై పింగళి లక్ష్మీకాంతంగారి వ్యాసం పుట 615, 1915.

homageneous. nonliterery people, and has be:n handed down among them by word of a mouth is generaly conceded. But the exact method of origin is a questo on s.ill under disension. " Ballad Manner - from the three possib e methods cf expres.ion, singing, sayind, doing one derived the three p imary kinds of poetry song secital and drama - the ballad combiness song and secilal on its earlier stages it is both a secital or saving and a song in later stages it loses some thing of its lyricals there while its narrative content comes to the front. It also assumel daamatic quality to the degree in which the singer or recitor of tha poem impoessonates the speaking charecters. The verse of the balled is character istically a simple messure, the iyrical effect of which is of ten heightened by a cherus. burden of refrain. The subject matter of he ballad is deeds. Which may be historical, romantic or mythical; "

సహజంగా భావోద్వేగమనేది వ్యక్తిహృదయాన్ని మాత్రమే కాకుండా శరీర అవయవాన్నికూడా కదిలిస్తుంది. అంటే ఒక వ్యక్తి పరవశించి పదంపాడినా, ఆవేశంతో లేక ఉద్వేగంతో ఉపన్య సించినా హృదయంతోపాటు శరీరావయవాలు సైతం భావాల్ని వ్యక్తం చేయడానికి ఉపకరిస్తాయి. భావపారవశ్యంతో పాటపాడే ప్రాక్తన కవి ఆడుతూనే పాటపాడి ఉంటాడనడం శాస్త్రీయమైన విషయం. అనగా ఆ ప్రాక్తన కవి అడుగువేస్తూ, రాగంతీస్తూ పాట పాడి ఉంటాడని భావించవచ్చు. శాస్త్రపరిభాషలో వీటిని నృత్యం, గీతం, శబ్దం అంటున్నాం. కాలక్రమంగా ఈ మూడు శాఖలే నాట్యం, సంగీతం, పద్యం అనే కళలుగా రూపొందాయి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు 'మనదేశంలో చాలా పాత పాటలు వేదసూక్తములు. మనిషి జాతికి అవి మొదటి రచనలని ఊహింపవలసినవి. వాటి గానమందు తాళంలేదు అన్నది మనం ఇక్కడ గమనించవలసిన తత్తం. నేటికినీ తెలుగులో పరమ ప్రాచీన మైన పద్ధతి అని చెప్పదగిన పల్లెపాటలు, కపిలపాటలు మొదలగునవి

కొన్ని తాళనియమము లేకుండా పాడబడుచున్నవి. ఈ రాగతాళము లను రెంటినీకలిపి హృదయంగమములైన భావములను వెలువరచు భాషను అలంకరించుటయే పదరచనకు పరిపూర్ణ స్వరూపము. దాని పూర్ణానుభవమును మనకప్పుడే సతాళముగనో, వితాళముగనో కావ్యకళా రసానుభవమును ప్రాచీన మనుష్య జాతి పాటరూపముననే అనుభవించి రచించినదని పండితులూహింతురు. మన పద్యము లన్నియు పదముల పరిణామములే అని భావించుటకు పెద్ద సూక్ష్మ దృష్టి అక్కరలేదు"1 అని పదకవితనుంచే పద్యకవిత్వం ఉద్భవిం చిందని భావించారు.

పాల్కురికి సోమనాథుడు పేర్కొన్న తుమ్మెద, వెన్నెల పదా దుల్ని పరిశీలిస్తే నన్నయకు ముందు నుండి కూడా ఈ పదకవిత తెలుగులో ఉండేదని స్పష్టంగా తెలుస్తుంది. నన్నెచోడుని కాలంనాటి ఊయలపాటలు, గౌడగీతాలు కూడా పై దానికి బలం చేకూరుస్తాయి. ఐతే లిఖితరూపంలో మనకు లభించింది కృష్ణమాచార్యుల సింహగిరి వచనాలు మాత్రమే. ఇతడు 12 వ శతాబ్దంవాడని పరిశోధకుల అభి ప్రాయం.

ప్రాచీనకాలంనుంచి కూడా దేవాలయాల్లో సంకీర్తన లుండేవని శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి అభిప్రాయం. "కావ్యరచన చేశారో లేదో గాని, నాటి కవులు దేవాలయాల్లో స్తుతులు చేస్తుండేవార"ని ముఖలింగంలోని సుకవీంద్ర స్తుత్య నిత్యోదయః"2 అన్న శాసన ఖండంవల్ల తెలుస్తుంది.

---

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాహిత్య ఉపన్యాసములు-3 క్షేత్రయ్య పదసాహిత్యం పుట 12, 13.

2. ఆంధ్ర వాగ్గేయకారుల నృత్యసంగీత వ్యాసరత్నావళి. విస్సా అప్పారావు పుట 4.

13, 14 శతాబ్దాల్లో అహోబిలం, సింహాచలం మొదలైన దేవాలయాల్లో కృష్ణమాచార్యులి నామసంకీర్తనలు సంకీర్తనం చేయబడేవని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారి అభిప్రాయం. అంటే కృష్ణమాచార్యునితో ప్రారంభమైన ఈ వచనకీర్తన దేవాలయాల్లో బాగా వ్యాపించిందని మనం ఊహించవచ్చు.

తెలుగు పదకవితకు నిజమైన వసంతకాలం 15 వ శతాబ్దం. పదకవితా పితామహుడు అన్నమయ్య వెలసిన శతాబ్దమిది. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి అన్నమయ్య చరిత్ర పీఠిక వ్రాస్తూ "అన్నమయ్యకు పూర్వం వాడుకలో ఉన్న జానపద గీతములు, జాజరలు. చందమామ పదాలు, తుమ్మెద పదములు, గొబ్బి పదములు, లాలులు, జోలలు, తందానాలు మొదలగునవి ఆయన రచనలో ఉన్నవి".1 అని అభిప్రాయపడినారు.

అన్నమయ్య సంకీర్తనల్లో శృంగార ఆధ్యాత్మిక కీర్తనలని ప్రధానంగా రెండు భాగాలు కనిపిస్తాయి కాని. సూక్ష్మదృష్టితో విడ మరచి పరిశీలిస్తే ఎన్నెన్నో విభాగాలు గోచరిస్తాయి. అందులో అన్నమయ్య శ్రీకృష్ణుణ్ణి, శ్రీరాముణ్ణి మొదలైనవారిని బాలులుగా ఊహించుకొని వారి చిన్ననాటి సాహసాన్ని, వారి తొక్కుపలుకుల్ని, తడబడే నడకల్ని, వచ్చీరాని మాటల్ని ఇంకా ఎన్నిటినో వివరిస్తూ తల్లులు పిల్లల్ని నిద్రపుచ్చడానికి పాడేపాటల్ని, తల్లీబిడ్డలమధ్య ఉండే అనుగారాల్ని, ఆప్యాయతల్ని చిరుకోపాల్ని ఇంకా అనేక విషయాల్ని తన కీర్తనల్లో వస్తువులుగా చేసుకున్నాడు.

పదం, కృతి, కీర్తనల పరిశీలనతర్వాత ప్రస్తుత సిద్ధాంతవ్యాస ప్రధాన విషయమైన అన్నమయ్య బాలసాహిత్యపరిశోధనకు ముందు సామాన్య పరిచయాన్ని సంగ్రహంగానైనా పరిచయం చేయడం సమంజస మనుకుంటాను.

---

1. అన్నమాచార్యచరిత్ర పీఠిక పుట 2, 3. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

# తెలుగులో బాలసాహిత్యం - పరిచయం

ఏ సాహిత్యమైనా వివిధకాలాల్లో వివిధప్రక్రియలతో విలసిల్లుతుంది. కాని ఇది బాలలకోసమనీ, ఇది యువకులకోసమనీ, ఇది వృద్ధులకోసమనీ ఏ సాహిత్యంలోనూ ప్రత్యేక విభాగాలుండేదానికి ఆస్కారంలేదు. ఎందుకంటె సాహిత్యం ఏ ఒక వర్గానికో, ఏ ఒక ప్రాంతానికో, ఏ ఒక వయస్సుకో పరిమితం అయితే సార్వజనీనం, సార్వకాలికంకాదు. ఏ కవి అయినా తన కావ్యం సార్వజనీనం, సార్వకాలికం కావాలని లక్షిస్తాడు. ఐతే కవి కృతిలో స్త్రీలగూర్చి, పురుషుల గూర్చి, బాలబాలికలగూర్చి, వృద్ధుల గూర్చి, యువకుజ గూర్చి కొన్నికొన్ని ఘట్టాలలో సందర్భానుసారంగా ప్రసక్తి రావడం జరుగుతుంది. ఈ ప్రసక్తి కవి ప్రతిభ, వ్యుత్పత్తులపైగాక, కవిపై పరిసర ప్రాంతాలప్రభావం, ఇష్టదైవాల ప్రభావం ప్రత్యేకంగా కన్పిస్తుంది.

ఉదాహరణకు నన్నయ శకుంతలో పాఖ్యానంలో శకుంతల నోటివెంట బిడ్డను కౌగిలించుకున్న తండ్రి అనుభూతిని వ్యక్తంచేశాడు. "పుత్రగాత్ర పరిష్వంగ" విషయంలో ఇది నన్నయ అనుభూతిని, అభిప్రాయాన్ని తెలిపే పద్యం. ఇక్కడ నన్నయ ఒక బిడ్డనుగూర్చి చెప్పాల్సిన అవసరానికంటె శకుంతల మనోభావాన్ని వ్యక్తం చేయడానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు కన్పిస్తుంది. అయితే అనుభవం, ప్రతిభ, వ్యుత్పత్తి, లోకసంస్కారం పెనవేసుకున్న కవిలో ఇటువంటి పద్యాలు మనకు గోచరమౌతాయి. ఈ పద్యం బాలురకోసంగాని, బాలురగురించిగాని చెప్పిన పద్యం కాకపోయినా. సాహిత్యంలో 'బాలసాహిత్యం' అని పరిశీలించాల్సివస్తే ఈ పద్యాన్ని గ్రహించవచ్చు.

సాహిత్యంలో వయస్సునుబట్టి విభాగం లేకపోయినా పరిశీలనార్థం బాలసాహిత్యాన్ని ప్రత్యేకంగా గ్రహించి పరిశోధనలు చేయడం జరుగుతూ ఉంది. అట్లే అన్నమయ్య తన ముప్పైరెండువేల

సంకీర్తనల్లో బాలుర కోసంగానీ, బాలుర గురించిగానీ ప్రత్యేకంగా సంకీర్తనలు వ్రాయలేదనడం స్పష్టం. అయితే ఆ మహనీయుడి గళం నుంచి జాలిన సుమధుర మధు వాగ్ధారల్లో తొక్కుపలుకుల బాలుర గూర్చి, తప్పటడుగుల పసికందుల గూర్చి, ఆటపాటల్ని గూర్చి, వాళ్ళ ఆగడాల్ని గూర్చి, ఇంకా ఎన్నిటినో గూర్చి ఉంది. ఆయన కీర్తనల్లో ఇలాంటి సందర్భాల్ని ఒకచోట చేర్చి పరిశీలిస్తే అన్నమయ్య ఆ కాలంలో పసి బాలుర విషయాలు ఎలాంటివో వాటిని ఆయన ఏ విధంగా వివరించాడో, ఆనాటి సాంఘిక పరిస్థితులు ఎలా ఉండేవో, తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. అనన్య భక్తి మహిమోపేతులైన అన్నమయ్యవంటి మహాత్ములైన వాగ్గేయకారుల మధుర వాక్కల్లాపంలో పారవశ్యమహితాలూ, భక్తిరసభావలలితాలూ అయిన బాలభగవానుల విషయాలు మనస్సుల్ని ఎలా పులకరింప చేస్తాయో ఈ ప్రయత్నం వల్ల తెలుసుకోవచ్చు.

అన్నమయ్య బాలసాహిత్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించేదానికి ముందు 'బాల' శబ్దాన్ని గూర్చి తెలుసుకోవాల్సిన అవశ్యకత ఉంది. బాలశబ్ద వ్యుత్పత్తి నిఘంటు, స్మృతి, గీతాశాస్త్రాదుల్లో ఎలా ఉందో పరిశీలించాలి. కనుక మొదట నిఘంటువులోని బాలశబ్ద విషయాన్ని చూడాలి.

## నిఘంటువులు 'బాల' శబ్ద వ్యుత్పత్తి :

'బల ప్రాణనే - బలతి అల్పాయాసేన బాలః'1

—అల్పాయాసంతో బ్రతికేవాడు బాలుడు

'వలసంచలనే - వలతి ఇతి బాలః'2

—సంచలించేవాడు బాలుడు

1. గురుబాలప్రబోధిక

2. మనుస్మృతి

నిత్యం చలించే మనస్సు కలిగినవాడు, నిల్చినచోట నిలువని మనశ్శరీరాలు కల్గినవాడని, క్రీడాసక్తుడని, సుఖంగా, శాంతంగా దిగులులేకుండా బ్రతికేవాడని, ఇతరులపై ఆధారపడినవాడు కాబట్టి 'అల్పాయాసేన' అని 'బాల' శబ్దానికి నిర్వచనం చెప్పబడింది అని నైఘంటిక బాల శబ్ద వ్యుత్పత్తి సారాంశం.

'ఆషోడశాద్ధ వేద్బాలః తతస్తరుణ ఉచ్యతే'1

—పదహారేండ్లవరకు బాలుడు తర్వాత తరుణుడు

'గ్రహణధారణ పటుద్బాలః' – అని శాస్త్రనిర్వచనం

గ్రహణధారణ పటువు బాలుడని పండితుల అభిప్రాయం. అంటేవిషయాన్ని గ్రహించి జ్ఞాపకముంచుకునేవాడూ. చెప్పింది చక్కగా గ్రహించి మనస్సునం దుంచుకొనేవాడని అర్థం.

బాలశబ్దం వృద్ధశబ్దానికి వ్యతిరేకం. వృద్ధుడంటే వయస్సులో మనస్సులో పెద్దవాడు, బాలుడంటే వయస్సులో మనస్సులో చిన్న వాడు. వృద్ధుడిది వికాసంపొందిన మనస్సు. బాలుడిది అప్పుడే వికసిస్తున్న మనస్సు. బాలుడి మనస్సు ఆర్ద్రంగా, సున్నితంగా ఉంటుంది. అలాంటి బాలల మనస్సులను ఉన్నతంగా, ఉత్తమంగా తీర్చిదిద్దేదానికి సాహిత్యం ఒక గొప్పసాధనం.

బాలబాలికలకు వినటానికి, చదవటానికి ఉద్దేశించబడిన రచనలే బాలసాహిత్యం. ఇది వారు చదువుకోదగినవి నేర్చుకోదగిన లేదా వినదగిన సాహిత్యం. ఇది ప్రధానంగా బాలల ఉపయోగార్థం సృష్టించబడినది.

భారతీయ సిద్ధాంతాన్నిబట్టి మానవుడి జీవిత ప్రమాణం

1. మనుస్మృతి

సూరేండ్లు. ఆ నూరేండ్ల ప్రాయాన్ని బాల, కౌమార, యౌవన, వార్ధక్యాలని నాలుగు విధాలుగా విభజించడం శాస్త్రసమ్మతం.

భగవద్గీతలో కౌమార, యౌవన, జరాస్థితులు మాత్రమే చెప్పబడ్డాయి.1

ఈ అభిప్రాయమే శంకరాచార్యులవారి భజగోవింద శ్లోకాల్లోనూ తెలుపబడింది.

'బాలస్తావ త్క్రీడాసక్త స్తరుణస్తావ త్తరుణీసక్తః
వృద్ధస్తావ చ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోపిన క్తః'2

బాలుడు క్రీడాసక్తుడు అన్న విషయం ఇక్కడ తెలుస్తుంది. అలాగే ఇతర దశల ఆసక్తులూ తెలుస్తాయి.

పసిబిడ్డను లాలించే విధానాన్ని గూర్చిన ప్రసిద్ధ శ్లోకంకూడా కలదు.

'లాలయే త్పంచ వర్షాణి
దశవర్షాణి దాసవత్
ప్రాప్తేతు షోడశే వర్షే
పుత్రం మిత్ర వదా చరేత్'

ఈ శ్లోకం బాల, కౌమార, యౌవనదశల్ని స్పష్టంగా నిర్దేశించక పోయినా వయః పరిమితి క్రమాన్ని సూచిస్తుంది.

---

1. "దేహినోఽస్మిన్యథా దేహే కౌమారం యౌవనం జరా
తథాదేహాంతర ప్రాప్తిర్ధీర స్తత్ర నముహ్యతి"
—భగద్గీత 2 అధ్యాయం 13 శ్లోకం

2. బాలశబ్ద వివరణ, భజగోవింద శ్లోకములు - ఆదిశంకరాచార్యులు.

'బాలానాం సుఖబోధాయ క్రియతే తర్క సంగ్రహః' అని అన్నంభట్లు తర్కసంగ్రహం ఆరంభంలో ఉంది.

మానవ జీవితంలో ప్రథమదశ బాల్యదశ. ఇది మనిషి జీవితంలో చీకూచింతా తెలియని దశ. అమాయకత్వానికి, మంచి తనానికి బాల్యం మరొకపేరు. దీనివల్లనే పిల్లల్ని పరబ్రహ్మ స్వరూపాలుగా పెద్దలుభావిస్తారు.

బాల్యం నుండి పదునాలుగు సంవత్సరాల వరకూ వారి వారి కనువైన సాహిత్యాన్ని బాలసాహిత్య మనవచ్చనీ 'బాలవాఙ్మయం' అనే రచనలో ఎ. లక్ష్మీనారాయణగారు తెలిపారు.

బాలబాలికలు ఈనాడు తమ వయస్సుకు మించిన మనో వికాసాన్ని పొందగలుగుతున్నారు. కావున పుట్టినప్పటి నుంచీ పదిహేనేండ్ల వరకు బాల్యదశగా పరిగణించవచ్చు.

ఈ బాల్యదశను పిల్లలపెరుగుదలలో, మనః ప్రవృత్తిలో కలిగే మార్పుల్ని బట్టి మూడు దశలుగా విభజించవచ్చు.

## ప్రథమ దశ :

పిల్లలు పుట్టినప్పటినుండి ఐదేండ్లవరకూ ప్రథమదశగా భావించ వచ్చు. ఇందులో మూడేండ్లవరకూ మరీ పసితనం, ఆ తర్వాత పరి సరాల ప్రభావానికి స్పందించే మానసిక పరిణతి పిల్లల్లో కన్పిస్తుంది.

ప్రథమ దశలోని బాలలకు చాలా ప్రీతికరమైంది శ్రవ్య సాహిత్యం, అంటే పిల్లల్ని ఉద్దేశించి తల్లులు పాడే జోలపాటలు, లాలిపాటలు, చందమామ పాటలు మొదలైనవన్నీ శ్రవ్య సాహిత్యా నికీ చెందినవే. ఇవన్నీ ప్రథమ దశలో పిల్లలకు ఉల్లాసాన్ని కగిలి

స్తాయి. దృశ్యరూపమైన రంగురంగుల బొమ్మలు వారికి ఆకర్షకంగా కన్పిస్తాయి.

## ద్వితీయ దశ :

ఐదు పది సంవత్సరాలవరకు మధ్యగల బాల్యాన్ని ద్వితీయ దశగా పరిగణించవచ్చు. ఐదేండ్లు నిండిన పిల్లల మాటల్లో కొంత మానసికమైన ఎదుగుదల కన్పిస్తుంది. ఈవయసు పిల్లలు క్రమంగా పాటల్ని, కథల్ని అర్థం చేసుకోవడమేగాక, సులభశైలి రచనల్ని చదివి విషయగ్రహణ శక్తిని పెంపొందించుకో గలరు.

ద్వితీయదశలోని పిల్లలకు బొమ్మలతోకూడిన దృశ్యసాహిత్యం ఎక్కువగా ఉపకరిస్తుంది. శ్రవ్య సాహిత్యంలో శబ్దం ప్రధానమైతే దృశసాహిత్యంలో బొమ్మలు ప్రధానం. రంగురంగుల బొమ్మలతో కూడిన పుస్తకాలు, నాటికలు. సినిమాలు, టెలివిజన్లు మొదలైనవన్ని దృశ్య సాహిత్యానికి చెందినవే.

## తృతీయ దశ :

బాల్యంలో పదకొండు సంవత్సరాలనుండి పదహేనేండ్ల వరకు తృతీయ దశ. ఈ దశను కౌమారం అనికూడా అంటారు. సాధారణంగా పదకొండు సంవత్సరాల వయస్సునుండి పిల్లల మనః ప్రవృత్తిలో ప్రత్యేకమైన మార్పులు గోచరిస్తాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

తృతీయదశలోని పిల్లలకు పఠన సాహిత్యం ఎక్కుగా ఉపకరిస్తుంది. పఠించి అర్థం చేసుకోగలిగే సాహిత్యం పఠన సాహిత్యం ఇది వివిధ సాహితీప్రక్రియలతో కూడుకున్న సాహిత్యం వచనరూపంలో ఉన్న నీతికథలు, అద్భుతకథలు, హాస్యకథలు, వీరగాథలు మొదలైన వాటిని పఠించడంద్వారా తృతీయ దశలోని పిల్లలు మనోవికాసాన్ని పొందుతారు.

'బాల దాయాది కం రిక్థం తావ ద్రాజాను పాలయేత్
యావత్తస్యాత్స మావృత్తో యావచ్చీతీత శైశవహః'1

వివరణ : తన ద్రవ్యాన్ని కాపాడుకోవడానికి శక్తిలేని బాలుని ద్రవ్యాన్ని వాడు వేదాల్ని చదివి వచ్చువరకైనా లేదా వానిబాల్యం పోపువరకైనా రాజు కాపాడవలెనని పైశ్లోకానికి భావం.

బాలుడు తన ద్రవ్యాన్ని సైతం కాపాడుకొనే శక్తిలేని వాడని మనువు భావం. అంటే బాలుడు పదహారేండ్లలోపు వాడని మనువే చెప్పాడు. మనువు అభిప్రాయానికి భిన్నంగా సాహిత్యంలో మనకు అనేక ఉదాహరణలు కన్పిస్తాయి.

ఉదాహరణకు శ్రీరామ శ్రీకృష్ణులను అవతార పురుషులుగా కాకుండా కేవలం ఒక ఉన్నత వ్యక్తులుగా మనంభావిస్తే బాల్యంలో వాళ్ళు రాక్షస సంహారం చేయడం మనువు అభిప్రాయానికి భిన్నమైన విషయం. ఇలాంటివి సాహిత్యంలో ఎన్నో మనకు కన్పిస్తాయి. కాని ఇలాంటివి అపవాదాలే కాని సాధారణ విషయాలుకావు.

తెలుగులో బాలసాహిత్య విషయాన్ని మనం పరిశీలిస్తే వివిధ కాలాల్లో వివిధ విధాలుగా దాని అభివృద్ధి మనకు కన్పిస్తుంది. ఏ సాహిత్యంలో అయినా బాల వాఙ్మయం సహజంగానే గేయరూపం లోనే ప్రారంభమౌతుంది. ఈ గేయసాహిత్యం జానపదసాహిత్యంలో విలీనమై ఉండేది. గేయమే ఏ వాఙ్మయంలో ఐనా కవితా పరిణామంలో ప్రథమదశ. ఆటపాట రూపమైన ఈ గేయకవిత, ప్రారంభ

---

1. మనుధర్మ శాస్త్రము, అష్టమాధ్యాయము 27 శ్లో.

దశలో ఒక వ్యక్తినిగాని. ఒక సమూహాన్నిగాని ఆశ్రయించి, అవత రించి ఉండవచ్చని పెద్దల అభిప్రాయం.

మనకు ప్రాచీన బాలగేయ సాహిత్యంలో బాలల నుద్దేశించి పెద్దలుపాడే పాటలే అధికంగా కన్పిస్తాయి. దీనికి బహుశా ఈ బాల గేయ సాహిత్యానికి కర్తృత్వం మాతృహృదయం కావడమేకావచ్చు. ప్రాచీనకాలంనుండీ తెలుగులో వెలువడిన లాలిపాటలు, జోలపాటలు పరిశీలిస్తే తెలుగు తల్లులు తమ బాలలకు ఉగ్గుపాలతో పాటు సంగీత సాహిత్యాలని రంగరించి పోసినారనిపిస్తుంది.

ఎఱ్ఱన ఉత్తర హరివంశంలో, పాల్కురికి సోమనాథుని బసవ పురాణంలో, వెన్నెలకంటి సూరన విష్ణుపురాణంలో, ధూర్జటి కాళహస్తీ శ్వర మహత్మ్యంలో, తెనాలి రామకృష్ణుని పాండురంగ మహత్మ్యంలో ధరణీదేవుల రామయ్యమంత్రి దశావతార చరిత్రలో, అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతిలో, బాలల ఆటపాట వర్ణనలు మనకు కన్పిస్తాయి,

తాళ్ళపాకవారి కీర్తనల్లో బాలగేయాల ప్రస్తావన విరివిగా ఉంది. ప్రత్యేకించి అన్నమయ్య సంకీర్తనలలో లాలిపాటలు, జోల పాటలు, ఉగ్గు పాటలు, ఊయల పాటలు మొదలైనవెన్నో కన్పిస్తాయి,

గ్రంథస్థమైనవేకాక ప్రాచీన బాలసాహిత్యంలో మౌఖికమై వస్తున్న గేయాలు, అమ్మమ్మలు చెప్పే కాశీమజిలీ కథలు, పిట్టకథలు, పేదరాశిపెద్దమ్మ కథలు మొదలగునవి కాలగర్భంలో పోయినవి. పోగా ఇంకా ఎన్నో మనకు లభిస్తున్నాయి. ఇవన్నీ కూడా బాలలను ఆనం దింప చేసేదానికేకాక వారికి మానసిక వికాసాన్నికూడా కల్గించేదానికి జాలువారినవే.

అలాగే పిల్లల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు, వారి ఊహా శక్తిని పెంచేందుకు, వారికి లోకరీతిని, జ్ఞానాన్ని వివరించేందుకు పంచతంత్ర కథలు మొదలైనవెన్నో వెలిశాయి. అంటే మొదట గేయ రూపంగా ఉన్న ఈ బాలసాహిత్యం క్రమక్రమంగా చారిత్రకగాథలు, నీతికథలూ సాహస గాథలకూ నిలయమైంది. 19 వ శతాబ్దం తరువాత బాలసాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ బాల సాహిత్యం అనేక విధాలుగా వికసించిందని చెప్పవచ్చు. ఆంగ్ల భాషా ప్రభావంకూడా ఈ వికాసానికొక కారణం.

బాలలకుద్దేశించిన రచనలు సులభశైలిలో ఉంటే మంచిదని కందుకూరి వీరేశలింగం పంతులుగారు భావించారు. 1872 లో కందుకూరి, పిల్లలకోసం 'నీతిదీపిక' అనే శతకాన్ని ప్రకటించాడు. 1889 లో బాలికలకోసం 'స్త్రీనీతిదీపిక' అనే శతకాన్ని ప్రకటించారు. 1887 లో అపద్ధాలవల్ల వచ్చే అనర్థాల్ని వివరిస్తూ పిల్లల కోసం' సత్య సంజీవిని' అనే పెద్దకథ వారే వ్రాశారు. 1893 లో రెండు సంపుటాలుగా బొమ్మలతోసహా అనేక కథల్ని 'నీతికథా మంజరి'గా అనువదించారు. వావికొలను సుబ్బారావుగారు రామాయణ భారత, భాగవతాల్ని 'బాలకహితచర్య' 'కుమారహితచర్య' మొదలైన గ్రంథాల్ని పిల్లలకోసం ప్రచురించారు. శ్రీ సుబ్బారావుగారు చిన్నపిల్లలలో ఆర్యసంస్కృతిని పెంపొందింప జేయడానికి అష్టాదశ పురాణాల్లోని కథలను తీసుకొని ' ఆర్యకథానిధి' పేరుతో ప్రకటించారు.

ఇట్లే తెలుగు సాహిత్యంలో వేంకటపార్వతీశ్వర కవుల్ని బాల సాహిత్య స్రష్టలుగా పేర్కొనవచ్చు. గురజాడ అప్పారావుగార్ని బాలవాఙ్మయ వైతాళికులుగా చెప్పవచ్చు. కుమారీ శతకాదులు, తెలుగుబాలవంటి శతకాలు కూడా కంద, గీత పద్యాల్లో వచ్చాయి

ఆధునిక కాలంలో పత్రికలు, రేడియోలు, టెలివిజన్లు బాలసాహిత్య వికాసం కోసం తమవంతు ప్రయత్నాల్ని చేస్తూనే ఉన్నాయి.

బాలసాహిత్యం దినదినాభివృద్ధి చెందుతూనే ఉంది. అన్నమయ్య బాలలకోసం వ్రాసిన సాహిత్యానికంటే, బాలలకు సంబంధించిన సాహిత్యం ఎక్కువగా వ్రాశారు. అది వివిధ రకాలుగా అన్నమయ్యలో మనకు కన్పిస్తుంది. స్థూలదృష్టికి బాలసాహిత్యమే అని మనం అన్నా, దాన్ని అనేక రకాలుగా వింగడించి పరిశీలించేదానికి అవకాశమేకాక అవసరం ఉంది,

ప్రత్యేకించి భగవంతుడ్ని బాలుడుగా భావించి అన్నమయ్య చేసిన భావన, వత్సలతా భావనోదాత్త సహితమైంది.

తర్వాత తెలుగులోనేగాక దానికి సోదర భాషలైన తమిళ, కన్నడ భాషల్లోనూ, జాతీయభాషయైన హిందీలోను ఉన్న బాల సాహిత్య స్వరూప స్వభావాల్ని తులనాత్మకదృష్ట్యా గమనించాల్సిన అవసరం ఉంది.

## ఇతరభాషల్లో బాల సాహిత్యం :

'ఇతర భాషల్లో బాలసాహిత్యం' అని అన్నప్పటికీ ఇందులో కేవలం క్రిష్ణకథాత్మకమైన బాలసాహిత్యమే గ్రహించ బడుతుంది.

ప్రస్తుత సిద్ధాంత వ్యాసం అన్నమయ్య బాలసాహిత్యానికే పరిమితం కావడంవల్లా, అందులోను అది అత్యధిక భాగం క్రిష్ణకథా పరకం కావడంవల్లా ఇతర భాషల్లోని క్రిష్ణకథాత్మకమైన బాల సాహిత్యమే గ్రహించబడింది.

## తమిళంలో బాల సాహిత్యం :

ద్రావిడ భాషల్లో ప్రాచీనమైన తమిళ సాహిత్యంలో కృష్ణా త్మకమైన బాలసాహిత్యం ఎలారూపించిందో మొదట పరిశీలించాలి.

వైష్ణవభక్తి సంప్రదాయంలో భక్తి సముద్రానికి ఏతమెత్తిన మహాభక్తి కర్షకులు ఆళ్వార్లు. తమకీర్తనల్లో విష్ణువు దశావతారాల్ని వీళ్ళు కీర్తించారు. అన్ని అవతారాలకన్నా వీరు క్రిష్ణావతారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్నోమార్గాల్లో ఆ అవతారంపట్ల విశేష భక్తి ప్రపత్తుల్ని వారు ప్రకటించారు. అన్నమయ్య కూడా వారి మార్గాన్ని దశావతారాల విషయంలో అనుసరింటాడు.

ఆళ్వార్లలో పేయాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్‌లను ప్రత్యేకించి ఇందుకు గ్రహించడం జరిగింది,

ఆళ్వార్లలో బాలకృష్ణుణ్ణి కీర్తించిన వారిలో పేయాళ్వార్ చెప్ప దగ్గవాడు. ఈయన కృష్ణుణ్ణి మనసా, వాచా, కర్మణా స్మరిస్తూ చేసిన కృష్ణ సంకీర్తన 32 పద్యాలకు పరిమితమైంది.

భక్తి సాంప్రదాయంలో ఆళ్వార్ల కృష్ణభక్తి భావ ధార విచిత్రంగా ఉంటుంది. మానసీరూపంలో తనకు చన్ను గుడువ వచ్చిన మాయావి, దానవి పూతనను సంహరించిన బాలకృష్ణుడు సామాన్య గోపభామిని అయిన యశోదమ్మకు భయపడినట్లు బెరుకు చూపులతో ఆ తల్లి ఎదుట కృష్ణుడు నిలవడం పేయాళ్వారుకు ఆశ్చర్య పారవశ్యాలను కల్గించింది. మాతృత్వ మహత్యానికి బాలకృష్ణ రూపు డైన పరమాత్ముడు ఇచ్చిన విలువలకు ఈ ఆళ్వారు హృదయం ద్రవించి ఆనంద తాండవం చేసింది. ఇలాగే పేయాళ్వార్ ఎన్నో సందర్భాలలో బాలకృష్ణ లీలావిలాసాలకు పరవశించి పరవశించి పాడిన భక్తిరసప్లావితాలైన పాటలే భక్తికి బాటలైనాయి.

తర్వాత కులశేఖరాళ్వార్ తన 27 పద్యాలలో కృష్ణుణ్ణిస్మరించాడు ఆ స్మరణలో కృష్ణుడి బాలలీలల్ని తాను చూడలేక పోయినాను. అనే తీవ్రతరమైన ఆవేదనను అభివ్యక్తంచేశాడు. ఎలాగైనా బాలకృష్ణుడి లీలావిశేషాల్ని చూడగలగే ఉపాయాన్ని చూపమని సర్వేశ్వరుణ్ణి మనసార ప్రార్థించాడు. ఆ అభ్యర్థన ప్రార్థనారూపమైనట్టిది. భక్తిలో ఇది ఒక విశిష్టమార్గం. ఇది మధురభక్తి సాంప్రదాయానికి చెందింది. తన్ను తాను మరచి అణువణువులో కృష్ణాంశను ప్రత్యక్షీకరించుకొని తన్మయం చెందడం, విశేషించి తనను నాయికగా పురుషోత్తముడైన బాలక్రిష్ణణ్ణి నాయకుడిగా భక్తుడు భావించుకోవడం ఇందులో కన్పిస్తుంది.

కులశేఖరులు క్రిష్ణుడి బాల్యక్రీడల్ని కొన్నిటిని పేరెత్తి చూపి నాడు. అందులో కొండను గొడుగుగా ధరించి చేసిన గోవర్ధనోద్ధరణ దాసక్రీడ, పాదంతో కాళీయుడి పడగల్ని త్రొక్కి మర్దించడం, కుంభ క్రీడలు మొదలైన జయోపేతాలైన బాల్యక్రీడల్ని స్మరిస్తూ, తాను

ఒక్కదాన్నికూడా పారవశ్య మహితమయిన మనస్సుతో చూడలేదని ఆవేదన చెందాడు.1

తర్వాత పెరియాళ్వార్ బాలక్రిష్ణ లీలాత్మకాలైన కీర్తనా విశేషాల్ని చూడాలి.

పెరియాళ్వార్ క్రిష్ణావతార కథను భావించి 233 కీర్తనల్ని రచించాడు. శ్రీకృష్ణావతార కథలో ప్రముఖమైన కృష్ణ జననం, యదుకులరక్షణ, గోపికలతో క్రీడించడం, కంసవధల్ని ఒకే పద్యంలో స్మరించాడు.

ఇది బాలకృష్ణుని లీలామాలిక లాగా మనోహరంగా ఉంది.

రాత్రివేళ జన్మించి, గోకులాన్ని ప్రవేశించి, ప్రేతలభయాన్ని వారించి, బలవంతుడైన కంసుణ్ణి వధించి అతని దేహాన్ని పొర్లించిన వాడు, తమ పట్టుపుట్టాల్ని అపహరించినవాడు ఈ బాలకృష్ణుడే అని గోపికలు అన్నట్లు పెరియాళ్వార్ ఒక కీర్తనలో మనోహరంగా భావించారు.2

ఈవిధంగా ఎన్నో మధుర రస భావాంచితాలైన కీర్తనల్ని ఉదహరించవచ్చు.

ఆళ్వార్ల కృష్ణభక్తి ఎన్నోరకాల ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించుకుంది.

---

1. కుంద్రినాల్ కుడైక విత్తదుం కోలకురవై కొత్తదుం కుడమాట్టుం
కున్రినాళ్ విళవెరిందదుం కాలాల్ కాళియన్ తలై మిదిత్తదుం ముదలా
వెన్రిశేర్ పిళ్లైనల్ విళైయాట్టమనైత్తిలుం అంగెన్నుళ్ళముళ్కు శిర
ఒన్ట్రుం కండిడప్ పెట్రిలే నడియేన్ కాణు మారెని యుండెడిలరుళె

2. ఇరుపెట్టి యాల్ విరందు పోయ్ ఏళై వల్లాయర్
మరుట్టైత్త విర్నిత్తువన్ కంజన్ మాళ
పురట్టి యన్నాళ్ ళెంగళ్ పూంపట్టు కొండ
అరట్టన్.........................

## కన్నడంలో బాల సాహిత్యం :

కన్నడ సాహిత్యంలో పురందరదాసునే ప్రస్తుత పరిశీలనకు గ్రహించడం జరిగింది. పురందరుల బాలకృష్ణ సాహిత్య పరిశీలనకు ముందు ఆయన జీవితరేఖల్ని కొంతవరకైనా ప్రసరింప జేయడం సమంజసం అనుకుంటాను. కన్నడ సంకీర్తనాచార్యుడైన పురందర దాసు అన్నమయ్యకాలానికి యవ్వనదశలో ఉన్నాడు.[1] కన్నడంలో లక్షలాది సంకీర్తనల్ని చేసి, కర్నాటాంధ్ర ద్రావిడ మహారాష్ట్రాల్లో కూడా పరమ భక్తుడుగా, వాగ్గేయకారుడుగా ఆరాధించబడ్డాడు.

పురందరదాసు లాక్షణికుడుగా కాక, కర్నాటక సంగీత సాంప్రదాయంలో లక్ష్యాలుగా నాదకల్పనాత్మకాలై, ధాతు, మాతు సంయుతాలైన ఎన్నో కీర్తనల్ని చేశాడు. ఈయన రచనల్లో ఎక్కువ భాగం సంకీర్తనలే.

పురందరదాసు కొంతకాలం పునహ2 నగరంలో ఉన్నట్లు తెలుస్తుంది. తర్వాత ఈయన విజయ విద్యానగరంలో ఉన్నాడు. శ్రీకృష్ణదేవరాయలు ఈయనకు సమకాలికుడే.

నలభై ఏండ్ల ప్రాయంలో ఈయన వ్యాసతీర్థులవారివద్ద ఉపదేశాన్ని పొంది, పురందరదాసుగా ప్రసిద్ధిచెందాడు.

పురందరదాసు 4,75,000 పదాల్ని వ్రాసినట్లు ప్రసిద్ధి.3 కొన్ని లక్షల పదాలున్నా, లభ్యమానాలైనవి కొన్ని వందలు మాత్రమే.

---

1. అన్నమయ్యకాలం క్రీ. శ. 1408-1503, పురందరదాసు కాలం 1484-1564 కాగా పురందరదాసు అన్నమయ్య నిష్క్రమణ కాలానికి సుమారు సం॥ మధ్య వయస్సులో ఉన్నాడు.
2. ఇది మహారాష్ట్ర, కర్నాటక రాజ్యాల సరిహద్దు ప్రాంతం.
3. 'వాసుదేవనామావళియు' అన్న ఈయన ముఖారిరాగ కీర్తన పై పదసంఖ్యకు ఆధారం.

పురందరదాసు అన్ని పదాలు కాని, వాటి సంగీత బాణీలు కాని సమగ్రంగా ఇంతవరకు లభించలేదు. ఈయన కీర్తనల్ని 'దాసరపదగళు' అని 'దేవరనామ' అని అంటారు.

పురందరదాసు సంకీర్తనలు సులభ గ్రాహ్యాలు. సంవాదశైలి, జాతీయాలు, సామెతలు, ఉదాత్తభావాలు ఈ కీర్తనలకు సహజాలంకారాలు. ఇవి పరతత్వ ప్రబోధకాలేకాక లోకవృత్త విమర్శనాత్మకాలు, స్వానుభవ ప్రబోధకాలుగా కూడా ఉంటాయి.

అన్నమయ్య వలెనే పురందరదాసు కూడా సంకీర్తనాత్మకాలైన పదాలనేకాక, బాలక్రిష్ణ లీలాత్మకాలైన కీర్తనల్ని, గోపికాగీతాల్ని, గోపికలు యశోదతోచేసిన విన్నపాల్ని, కృష్ణవిరహాతురలైన గోపికల విరహగీతాల్ని, ఇంకా ఎన్నో రకాల కీర్తనల్ని వైవిధ్యంతో గానం చేశారు. ఈయన కీర్తనలు పురందర విఠలునికి అంకితాలు. అన్నమయ్యకు ఏడుకొండలస్వామి ఎట్లో పురందరులకు విఠలుడు అట్లే.

హంపీలో ఒక మంటపంలో ఈయన ఎక్కువకాలం ఉండడం వల్లదానికి 'పురందరదాస' మంటపం అన్న పేరు వచ్చింది. జీవితం మలిసంధ్యలో తురీయాశ్రమాన్ని స్వీకరించాడు. రక్తాక్షి అమావాస్య పర్వదినంనాడు కారణజన్ముడైన పురందరదాసు ఇహ జీవితయాత్ర చాలించాడు.1

తర్వాత బాలక్రిష్ణ కథాసంబంధులైన పురందరదాసుల కీర్తనల్ని పరిశీలించాలి.

---

1. రక్తాక్షినామ సంవత్సర పుష్య అమావాస్య పురందరుల మహాప్రస్థానం (1564 జనవరి 2 వ తేది మంగళవారం)

2. పురందర సాహిత్య—4, కృష్ణలీలా_పురందరదాసు గోకులభాగ్యం-3

మంచి గుర్రాన్ని ఎక్కించమని రోధిస్తున్నాడు. ఇది కల్కి అవతారాన్ని సూచిస్తుంది.

ఓ గోపమ్మ, మురవైరి ఉయ్యాలలో పడుకోవడంలేదు. పురందర విఠలుడు నిన్ను పిలుస్తున్నాడు రావే గోపమ్మ.

ఈ వర్ణనా ప్రక్రియ అన్నమయ్యకు, ఆయన్ని అనుసరించిన పురందరదాసుకే చెల్లింది.

ఎక్కువగా గోలచేసే అల్లరి పిల్లల్ని, అన్నం తినక హఠంచేసే పిల్లల్ని తల్లులు అదుగో బూచి, ఇదుగో బూచి అని భయపెట్టడం లోక సహజం. అందుకు ఆ పిల్లలు వినయాన్ని నటిస్తూ తల్లుల్ని తృప్తిపరచే లోక సహజమైన విషయాన్ని పురందరదాను దృష్టిలో పెట్టుకొని, సహజాతి సహజంగా యశోదా బాలకృష్ణుల విషయాన్ని మధురగాన విలాసభంగిమలో వర్ణించాడు

పైసామాన్య విషయాన్ని పరమాత్మ ప్రతీకుడైన బాలక్రిష్ణుడిలో ఆరోపించి పురందరదాసు,

'గుమ్మన కరెయదిరె అమ్మ నేను గుమ్మనకరెయదిరె'1 అనే కీర్తనలో వివరించాడు.

దీని పూర్తిభావం ఇలా ఉంది.

అమ్మా ! బూచిని పిలవద్దే. బూచిని పిలవద్దే. ఊరకే ఉంటాను. చనుబాలు నిన్నడగను. అన్నం తింటాను. ఏడవను.

ఆడవాళ్ళున్న చోటికిపోయి వాళ్ళకండ్లను మూయనులే. చిన్న

---

1. శైశవలీల-39, పురందరదాసరసాహిత్య-4, కృష్ణలీల-పురందరదాసు

పిల్లల్ని ఏమీ అననులే. కొట్టనులే. అన్ననూ తిట్టను, వెన్న అడగను, ప.ట్టిని తినను.

బావుల దగ్గరకు పోను. పాముపై ఎక్కి ఆడనులే. దూడల్ని ఆవుల దగ్గరికి వదలను. దేవుడిలాగా ఉన్న చోటనే ఉంటాను.

కొడుకుమాటల్ని వింటూ యశోద ముసిముసి నవ్వుల్తో జగన్నాయకుడు అయిన పురందర విఠలుణ్ణి తనివిదీరా కౌగిలించుకొంది.

పై కీర్తనలో ప్రసారితమైన పురందర భావధార యశోద వత్సలతా రసామృత పూర్ణమైన ఒక దివ్య నిరూపణ ముగ్ధమనోహరమైన పరమాత్మ శైశవ లీలా విలాస మహితం - తర్వాత.

'పోగదిగెలో రంగ బాగిలిందాచే'1

'తలుపుదాటి అవతలకు పోవద్దురా రంగ' అని భావం. దీని వివరణ ఇలా చేయవచ్చు.

భాగవతులు చూస్తే ఎత్తుకు పోతారు. దేవతలు, మునులు హృదయ గుహల్లో నిను చూడగోరి చిక్కని వస్తువు చిక్కిందని పరమానందంతో నిన్ను పిలిచి ఎత్తుకుపోతారు. పరమాత్మా! తలుపు దాటి అవతలకు పోవద్దు.

లోకంలో స్త్రీలు బాలమాణిక్యం చేతికి చిక్కిందని వేగిరంగా వచ్చి నిన్ను కౌగిలించుకొంటారు. కాన అగణిత గుణా! తలుపు దాటవద్దు.

సెరజాణలు వారి కోర్కెలు తీర్చమని నిన్నడుగుతారు. పురం

---

1. శైశవలీల-49 పురందరదాస సాహిత్యం-4 కృష్ణలీల, పురందరదాసు

దర విఠలా ! నీకు వెన్న ఇస్తాను. నా రంగా ! తలుపు దాటవద్దురా తండ్రీ.

ఇందులో భగవంతుణ్ణి 'తలుపు దాటవద్దని' ఆనపెట్టే మాతృమూర్తి ఆవేదన, అమాయకత్వం వ్యక్తమౌతాయి. ఎంత పరమాత్మ అయినా మాతృత్వ మహితమైన వాత్సల్యానికి లొంగవలసిందే అన్న పరమమైన సృష్టిరహస్యాన్ని పురందర వాగ్గేయకారుడు ధ్వన్యమానం చేశాడు.

అల్లరిపిల్లల విషయంలో భయపడే తల్లులు మనస్తత్వాన్ని యశోదద్వారా పురందరదాసు నిరూపించారు. దుడుకు తనం ఉన్న తన బాలకృష్ణ కుమారుణ్ణి యశోద అతడి దుడుకు చేతల్ని కొడుకుకి వివరిస్తూ భయపడడాన్ని ఈ క్రింది కీర్తనలో పురందరదాసు అభివర్ణించాడు.

'కణ్ణముందిరో రంగ కణ్ణముందిరో'1

'కంటి ముందుండు రంగ కంటి ముందుండు' – అని భావం.

పూతన చన్నుదాగి తృణావర్త శకటాసురాది దైత్యులను కూల్చిన నీ దుడుకు తనానికి రంగా ! భయపడుతున్నాను.

చెట్టెక్కి మడుగులో దూకి పాము పడగల్ని తొక్కిన నీ దుడుకు తనానికి భయపడుతున్నాను.

గోపికల ఇళ్ళకువెళ్ళి పాలు పెరుగుల్ని దొంగిలించి తాగవద్దు పురందర విఠలా ! నా కళ్ళముందరే ఉండు. ఎక్కడికీ వెళ్ళవద్దు

---

1. శైశవలీల–50

పై కీర్తనలో యశోద భయానికి ఒక వంక హేతువుల్ని కూరుస్తూ మరోవంక బాలకృష్ణుడి లీలల్ని కూడా ధ్వనింప చేయడం పురందర దాసుకే చెల్లింది. ఈ ప్రక్రియ ఇతనికన్నా ముందువాడైన అన్న మయ్యలో కూడా ఉంది

## హిందీ – బాల సాహిత్యం :

తమిళ, కన్నడ సాహిత్యాల్లోని బాలకృష్ణలీలా విశేషాల్ని పరి శీలించిన తర్వాత, భారత జాతీయభాషా సాహిత్యమైన హిందీలో పరమ భక్తుడు, కారణజన్ముడు అయిన సూరదాసు బాలకృష్ణ లీలా విశేషాల్ని రేఖామాత్రంగానైనా పరిశీలించాలి. దానికి ముందు సూరదాసు సంగ్రహ పరిచయిం అవసరం అనిపిస్తుంది.

దాససాహిత్యంలో సూరదాసుకు సమధిక స్థానం ఉంది. కొందరు ఇతడిని పుట్టుగుడ్డి అని అంటారు. చర్మచక్షువుల సంగతి ఎలా ఉన్నా, ఈతడి ప్రజ్ఞాచక్షువునుండి వెలువడిన వెలుగురేకలు సాహిత్యాన్ని తేజోమయం చేశాయి. చర్మచక్షువులకు కనపడని ఎన్నో మహత్తర విషయాల్ని ఈయన ప్రజ్ఞాచక్షువు దర్శించింది. ఇతడు పారదృశ్య.

మహాసారస్వత బ్రాహ్మణుడైన సూరదాసు, మధుర ప్రాం తంలోవున్న రేణుకాక్షేత్రంలో జన్మించాడని ప్రతీతి. ఇతడు ఆబాల్య భక్తుడు, గాయకుడు, కవి, వెరసి వాగ్గేయకారుడు.

ఇతడు బాల్యంనుంచే విరాగి. అందుకే చిన్నతనంలోనే ఇల్లు విడిచి గ్రామ బాహ్యప్రదేశంలో ఒక కుటీరాన్ని నిర్మించుకొని తర్వాత కాలంలో శకునాలు చెప్పుకుంటూ ఉండేవాడట. కొందరు ఈయనవద్ద సేవకులుగాచేరి భజన గోష్ఠుల్లో పాడుకుంటూ భక్తులై దాస్యాశ్రమంలో ఆశ్రయాన్ని పొందేవారు.

ఏ కారణంచేతనో సూరదాసు తన ఆశ్రమాన్ని 'గౌఘాట్' లోనికి మార్చివేశాడు. ఇది ఆయన ఆధ్యాత్మిక జీవితంలో ఒక మలుపు అనే చెప్పాలి. ఇక్కడే వల్లభాచార్యుల వారి దర్శనం, ఉపదేశం సూరదాసుకు ప్రాప్తించాయి. వల్లభాచార్యుల వారిది శుద్ధాద్వైతం. దాసు ఇందులో దీక్షితుడైనాడు. తద్వారా 'పుష్టిమార్గ' భక్తి శిఖరాల్ని అధిరోహించాడు.

వల్లభుడు వినయ పదాలకు (భగవంతునితో దైన్యాన్ని ప్రకటించే పదాలు) మారు లీలా పదాల్ని (భగవల్లీలల్ని) పాడమని ప్రోత్సహించడమేకాక దానికి ఊతగా దాసుకు భాగవతానుక్రమణకు ఉత్తేజపరచి ఉపదేశించాడు.

అనంతరం వల్లభాచార్యులవారు సూరదాసును గోవర్ధనగిరి మీద ఉన్న శ్రీనాథ దేవాలయానికి తనతో తీసుకొనివెళ్ళి ఆ స్వామి సంకీర్తనసేవకు నియమించాడు. వల్లభుల అనంతరం వారికుమారుడు గోస్వామి విఠలదాసుకూడా సూరదాసును సంకీర్తన గాయకుడుగానే గౌరవించాడు. అంతేగాక సూరదాసు వంటి ఎనిమిది మంది కవుల్ని కూర్చి గోస్వామి విఠలదాసు 'అష్టచాప్' అనే పేరుతో ఏర్పాటుచేశాడు. వారిలో సూరదాసుది అధ్యక్షస్థానం.

సూరదాసు కవిత భాగవతం ఆధారంగా ప్రవర్తిల్లినా అన్నీ ముక్తకాలే. విశేషించి భాగవత దశమస్కంధ పూర్వభాగ పరిమితాలైన పదాలే అందులో అధికభాగం. అందులోకూడా కృష్ణకథాత్మకాలైన బాలలీలతోపాటు రాధాకృష్ణ ప్రేమలీలలు, రాసక్రీడలు ప్రధానంగా ఉన్నాయి.

సూరదాసు వర్ణించిన బాలలీలలు భాగవతానికే పరిమితం అయినా అందులో ఆయన భావుకత, కాల్పనికత, అనుభవ జ్ఞానం

TIRUPATI.
5.3.5.74



కూడా గోచరిస్తాయి. కృష్ణుడి జన్మం మొదలుకొని వయోనుగుణాలైన సంస్కారభేదాల్ని వర్ణిస్తూ విషయాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. అందుకే విశ్వవాత్సల్య సాహిత్యంలో సూరదాసుకు అగ్రతాంబూలం చిక్కింది. వాత్సల్య రసపోషణంలో తర్వాతి తరాల వారికి సూరదాసు అవకాశమీయలేదన్నా సహజోక్తిగానే ఉంటుంది.

ఏతాదృశ భక్తిరస నిర్భరుడైన సూరదాసు బాలకృష్ణ సాహితీ క్షేత్రంలో ప్రవహించి సారవంతం చేసిన భావామృతధారలో క్రుంకులిడడం అనంతర కర్తవ్యం,

'జననీదేఖి బలిజాతి'1 అన్న కీర్తన కవితలో బాలకృష్ణుడు దోగాడుతూ మణిరత్నమయమైన వాకిట్లో తన ప్రతిబింబాన్ని చూచుకొని అమాయకంగా పట్టుకోబోయినట్లు, దాన్ని చూచిన యశోదానందులు ఆనంద పారవశ్యం చెందినట్లు సూరదాసు భావించాడు.

బాల్యదశలో దోగాడడం ఒకలీల. అందులో పరమాత్మస్వరూపుడైన బాలకృష్ణుడిదోగాట లోకోత్తరశైశవలీల. లోకసహజమైన సామాన్య శిశువుల దోగులాటను పరమాత్ముడికి అన్వయించి సూరదాసు ఈ గీతాన్ని వెలువరించాడు.

'సునిసుత ఏక్ కథా కహూ ప్యారి'2

ఇందులో యశోద కృష్ణుణ్ణి ఊయలలో ఊపుతూ కథచెప్పినట్లు కవి భావించాడు. అది రామకథ. ఆ కథాకథనాన్ని వింటూ, ఊకొడుతూ ఉన్న బాలుడు సీతాపహరణ విషయంరాగానే తటాలున

---

1. దశమస్కంధము 71, సూరసాగర్ సూరదాసు.
2. సూర్ సాగర్ (దశమస్కందము 198) - సూరదాసు.

ఊకొట్టడానికి బదులు "చావ చావకరి వుశే ప్రభూ లక్ష్మణ్ దేహు" అంటూ పైకిలేచాడు.

ఈ భావనలో ఒకమహా విశేషం ఇమిడి ఉంది. అది రామకృష్ణులకు అభేదాన్ని పాటించడమే. అంతేగాక రామావతారానికి తర్వాత కృష్ణావతారం వచ్చినది అని తెలపడం కూడా ఇందులో భాగమే. హైందవ సాంప్రదాయాన్ననుసరించిన పూర్వజన్మ జ్ఞానం, కర్మసిద్ధాంతం కూడా ఇందులో ధ్వన్యమానమైనాయి. ఈ భావ పరిమళం ఎన్నో ఇతర సాహిత్యాల్లో కూడా గుభాళించింది.

'మయ్యా కవహి బఢైగి ఛోటి'1

ఇందులో కృష్ణుడు తల్లిని ఒత్తైనజుట్టుకోసం మారాముచేయడం ఉంది. తల్లితో కృష్ణుడు పాలు పట్టినప్పుడల్లా జుట్టు అన్నయ్యలాగే పొడుగ్గా పెరుగుతుందని చెప్పావు కాని తన జుట్టు ఇంకా పొట్టిగానే ఉందనీ, పాలు పట్టేదానికి ఏదో సాకు చెప్పావని, వెన్న రొట్టె ఇవ్వలేదని అన్నట్లు కవి భావించాడు.

లోకంలో తల్లులు బిడ్డ పాలు తాగాలని, అన్నం తినాలని ఎన్నో సాకులుచెప్పి, కథలుచెప్పి బతిమలాడుతుంటారు. సహజమైన ఈ విషయాన్నే సూరదాసు భావించాడు. ఈ భావన బిడ్డ అమాయకతను, తల్లి ఆత్మానందాన్ని నిరూపిస్తుంది.

అలాగే మరో పాటలో సూరదాసు, ఆడుకోవడానికి కృష్ణుడు చంద్రుణ్ణి బొమ్మగా కావాలని కోరేదాన్ని వర్ణించాడు.2 అందని వస్తు

---

1. సూర్‌సాగర్ (దశమస్కందము-175) సూరదాసు.
2. 'మయ్యామైతో చంద్ ఖిలౌనా లైహుమ్' - సూర్‌సాగర్ (ద. స్క. 193) - సూరదాసు.

వుల్ని, ఆకర్షణీయంగా ఉన్న వస్తువుల్ని పసిపిల్లలు కావాలనడం పరిపాటే. అందుకు పట్టుబడ్డడం కూడా మామూలే. తల్లులు ఏదో ఉపాయంతో గోముతో గోలచేసే పిల్లల్ని సమాధాన పరచడం కూడా సహజమే. ఈ సహజ సుందరమైన భావనావిశేషాన్ని సూరదాసు ఈ గీతంలో కన్నులకు కనుపింప చేశాడు.

మారాము చేస్తున్న బాలకృష్ణుడికి యశోదామాత ఒకపళ్ళెంలో నీళ్ళుపోసి. అందులో చంద్రుడి బింబాన్ని చూపుతూ కృష్ణుడికి ఇచ్చి నట్లు కవి వర్ణించాడు. బాలకృష్ణుడు ఆ పళ్ళెరాన్ని ఆడించి ఊగే చంద్రుడి ప్రతిబింబాన్ని చూచి ఆనందించాడు.1

కృష్ణుడు చంద్రుణ్ణి రమ్మని పిల్చినట్లు, అది రానందుకు కృష్ణుడు ఏడ్చినట్లు యశోద "నీ ముఖంచూసి చంద్రుడు చిన్నబోయి పారిపోతున్నాడనిచెప్పి" నట్లు కవి ఒక గీతంలో వర్ణించాడు.2

తలమీద నెమిలి పింఛము, మొలకు గంటల మొలత్రాడు, పాదాలకు మణినూపురాలు, మెడలో హారం, కస్తూరిబొట్టు, పీతాంబరంతో ముగ్ధమనోహరమైన రూపంతో తలవాకిట దోగాడే చిన్నికృష్ణుణ్ణి చూచి యశోద ఆనందపారవశ్యంతో ఆ దృశ్యాన్ని నందుడికి చూపిన శైశవలీలను ఈ పాటలో సూరదాసు అభివర్ణించాడు,

నిజానికి ఇది యశోద పరవశం కాక సూరదాసు పొందిన ఆనంద పారవశ్యమే అనిపిస్తుంధి. ఆ గీతం ఇది........

'ఆంగనఖైలై నందకేనంద జదుకుల కుముద సుఖద చారు చందా3

---

1. సూర్‌సాగర్ (దశమస్కందము.195) – సూరదాసు.
2. ,, ,, 196 ,,
3. ,, ,, 765 ,,

సూరదాసు ఇందులో శాబ్దికంగా, ఆర్థికంగా భావనా సౌంద ర్యాన్ని ప్రతిపాదించాడు. రమణీయ భావనాత్మకత ఇందులో ఆర్థిక సౌందర్యాన్ని ప్రతిపాదించగా 'నందకే నంద', 'జదుకుల కుముద సుఖద చారు చందా' ప్రయోగాలు శాబ్దిక సౌందర్యాన్ని చిందిస్తు న్నాయి. ఆద్యంతాల్లో బిందుపూర్వక 'ద' కారం మధ్యలో 'ద' కార పౌనః పున్యం ఇందలి ప్రత్యేకత. పైవాటికి మించిన మృదుల లలిత సంస్కృత పదయోజన దీనిలోని ప్రత్యేకత ఇలాంటివి సూరదాసు కవితలో తామర తంపరలు.

ఇది తమిళ, కర్నాటక, హిందీ భక్తిసాహిత్యాల్లో ప్రాసారితమైన బాలకృష్ణ భావనాధార పరిశీనాలేశం.

ఆళ్వార్ల కాలం విభిన్నంగా ఉన్నా, అన్నమయ్యా, పురందర దాస సూరదాసుల భావపరంపర ఇంచుమించు ఒకేరకంగా ప్రసరించ డం గమనించదగ్గది. దీనికి వారి మమతాలీనతే హేతువు. అంతేకాక ఈ సమావత్వానికి పైవారు భక్తులు కావడం (అందులో కృష్ణభక్తులు) కూడా ఒక కారణమే.

తర్వాత 'భక్తి సామాన్య పరిచయం - అన్నమయ్యా భక్తి పరిశీలన' అన్న అంశాన్ని పరిశీలించాలి.

# భక్తి – సామాన్య పరిచయం

# అన్నమయ్య భక్తి – పరిశీలన :

పరమ సంకీర్తనాచార్యుడైన అన్నమయ్య తన బాల సంకీర్తన సాహిత్యంలో ప్రతిపాదించిన భక్తి విశేషాలను పరామర్శించే దానికి ముందు భక్తిని గూర్చిన సామాన్య పరిచయం చేయడం అవసర మనుకుంటాను.

కనుక మొదట భక్తి సామాన్య పరిచయం చేయడం జరుగుతుంది.

నిఘంటు, వేదోపనిషత్, పురాణేతిహాస నారదాది భక్తిసూత్రాలే కాక, నవీన తాత్వికులు భక్తిని ఎలా నిర్వచించారో ముందు గమనించాలి. పై క్రమాన్ననుసరించి భక్తి నిర్వచనం చేయబడుతున్నది.

## భక్తి – నిఘంటువులు :

భక్తి—స్త్రీ (భజ్యత + ఇతి)

భజ + క్తిన్ – విభాగః సేవా ఇతి మేదినీ – శబ్ద కల్పద్రుమః

'భజ' ధాతువుకు 'సేవ' అని మేదినీకోశం చెప్పినా, ఆ ధాతువుకు అనురాగం, అర్చన, ప్రేమ అనే అర్థాలుకూడా ఉన్నాయి. ఈ అర్థాలేకాక 'ఉపాసన' అనే విశేషార్థంకూడా 'భజ' ధాతువుకుంది.

పూజ్యులపై అనురాగం "భక్తి' ఈశ్వరే పరాను రక్తిః' అన్న ప్రమాణంతో 'పరమమైన అనురక్తి' 'భక్తి' అని సారం.

పరమేశ్వర విషయంలో ఉన్న పరమ ప్రేమ, భక్తి, ఉపాసన తుది ఆవృత్తి రూపమైన పరిపక్వమైన నిధి ధ్యాస, శ్రవణ మనన, అభ్యాస ఫలభూతమైన చిత్తవృత్తి భక్తి అని తాత్పర్యార్థం.

పై పరిశీలనవల్ల 'భక్తి' శబ్దానికి సేవ, భజన, అర్చన, అనురాగ విశేషం, పరానురక్తి, ఉపాసన అనే అర్థాలున్నట్లు తెలుస్తుంది.

ద్రవీభూతమైన మనస్సులో భగవదాకారతారకంగా కనపడే సవికల్పన మనోవృత్తి 'భక్తి' అనీ చెప్పవచ్చు.

దీన్నే వేదాలు ఎలా చెప్పాయో చూడాలి.

## భక్తి – వేదాలు :

వైదిక వాఙ్మయంలో శరణాగతికి, ప్రపత్తికి తేడాకన్పించదు. అదే భక్తి. ప్రపత్తితో భక్తి సమాప్తమవుతుంది. 'ప్రపత్తి' 'న్యాస' విద్యగా అరణ్యకాల్లో ప్రతిపాదించ బడింది. అదే ఋగ్యజుర్వేదాల్లో "ఆత్మసమర్పణ" విద్యగా నిర్దేశితమైంది.1

"దేవా! మేము మీ వారము. నీపై ఆధారపడియున్నాము. అని, నీవు మావాడవు మేము నీ వారము" అని వేద ఋక్కులు భక్తిని పరోక్షంగా నిర్వచించాయి.2

## భక్తి – ఉపనిషత్తులు :

ఇదే ఉపనిత్తుల్లో కూడా ఉంది. ఉనిషత్తులు భక్తి శబ్దార్థాన్ని "శరణాగతి"లో సూచించాయి. మోక్షకాంక్షగల నేను శరణుజొచ్చుచున్నాను అని భక్తిని శరణాగతి రూపంలో శ్వేతాశ్వర ఉపనిషత్తు భావించింది.3

---

1. తం పత్నీభిః అనుగచ్ఛేమ దేవాః పుత్రైర్భ్రాతృ ఋతువా హిరణ్యైః నాకం గృహ్ణానాః సుకృతస్యలోకే తృతీయ పృష్ఠే అధిరోచనే దివః
–యజుర్వేదం 15-50
2. తం అస్మాకం తవస్మాసి. –ఋగ్వేదం 8.92-32
3. ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే.

'భక్తి' అంటే భగవంతుడి సేవ అని, ఇహపర సుఖాన్ని అపేక్షించక భగవంతుడిలో మనస్సును తనం చేసేదిగా ఆసేవ ఉండాలని గోపాల "పూర్వతా పిన్యుపనిషత్తు."

## భక్తి – పురాణేతిహాసాలు :

నిరంతర అతి గాఢంగా ఉన్న పరమేశ్వర విషయకమయిన ప్రీతి "భక్తి" అనీ, ఆ ప్రీతిని ఈశ్వరపరం చేయడమే భక్తి అని "విష్ణుపురాణం" చెబుతుంది.

భక్తి విషయాన్ని మధ్వాచార్యులు భగవంతుడి మాహాత్మ్య జ్ఞానంతో సుదృఢమయిన సర్వాధికమయిన స్నేహబుద్ధి భక్తియని, దానివల్ల మాత్రమే "ముక్తి" అని, అనగా జ్ఞానపూర్వకమయిన నిత్యమయిన "పరస్నేహమే" భక్తి అని వివరించారు.1

## భక్తి - భక్తి సూత్రాలు :

'సాత్వస్మిన్ పర(మ) ప్రేమ రూపా', - 'భగవంతుని యందు శ్రేష్ఠమైన ప్రేమ భక్తి'యని నారద భక్తి సూత్రం.

'భక్తిరీశ్వర విషయె వానురక్తి రితి యజ్యతే'అని శాండిల్యుడు 'భవద్విషయ పరమైన అనురక్తి భక్తి' అని భావం.

'భగవంతుడ్ని ఇంద్రియార్థాలు లేని నిర్మల చిత్తంతో సేవించడం భక్తి' అని స్వప్నేశ్వరుడి వ్యాఖ్యానం.

సమస్త ఆచార్య వ్యవహారాల్ని భగవదర్పితంచేసి 'దైవ విస్మృతులు'కలగడం వల్ల ఏర్పడిన వ్యాకులస్థితి 'భక్తి' అని నారద మతం.

---

1. మహాత్మ్య జ్ఞాన పూర్వాస్తు సుదృఢ సర్వోతిధికం : స్నేహోభక్తిరితి ప్రోక్తః తయాముక్తిర్న చాన్యధా - జ్ఞానపూర్వః పరస్నేహో నిత్యా భక్తిః కీర్యతే —మహాభారత తాత్పర్యనిర్ణయం.

## భక్తి – దేవీ భాగవతం :

'భగవత్ పరమైన ప్రవాహరూపమైన భావవిశేషమే భక్తి'యని దేవీ భాగవతం.

## భక్తి – యోగశాస్త్రం :

'ఈశ్వర పణిధానమే భక్తి' అని యోగశాస్త్రం.

## భక్తి – శంకరులు :

'ఆత్మనిష్ఠ భక్తి' యని శంకరులు.

## భక్తి – శ్రీభాష్యం :

'తైలధారవలె అవిచ్ఛిన్నమైన స్మృతి భక్తి' యని రామానుజులూ భక్తిని నిర్వచించారు.

పై విధంగా వేదాల్లో, ఉపనిషత్తులో పురాణేతిహాసాల్లో, భక్తి నిర్వచనం పరిశీలించ బడింది.

తర్వాత నవీనులదృష్టిలో భక్తి నిర్వచసం ఎలా ఉందో చూడాలి.

## భక్తి – నిర్వచనం - నవీనులు :

మధుసూదన సరస్వతి :

"ద్రుతస్య గవద్ధర్మాద్ధారా వాహికతాం భగతా

సర్వేశే మనసోవృత్తిర్భక్తి త్యభి ధీయతే" యని భక్తి నిర్వచించారు.

('భగవదర్పితాను రక్తి ఆర్ద్రమై, హృదయంలో ప్రతిబింబించి చలించక, భగవత్పరంగా ఉన్న భావనా విశేషం భక్తి'అని తాత్పర్యం)

## రామకృష్ణ పరమహంస :

'ప్రేమ లేక ప్రవృత్తి ద్వారా భగవదైక్యాన్ని పొందడం భక్తి' యని 'రామకృష్ణ బోధామృతం' నందు ప్రవచించాడు.

'హృదయ పూర్వకంగా చిత్తశుద్ధితో చేసిన దైవపూజ భక్తి' యని వారే తెలిపారు.

## వివేకానందుడు :

'ప్రేమతో ప్రారంభించి, ప్రేమతో అభివృద్ధి చెంది, ప్రేమతో సమాప్తి నొందే పరమేశ్వరాన్వేషణమే భక్తి' అని నిర్వచించాడు.

తర్వాత భక్తి స్వరూపాన్ని గమనించాలి.

## భక్తి - స్వరూపం :

ప్రేమ రూపాత్మకం భక్తి. అది అనిర్వచనీయమైనది. భగవంతుడు అనిర్వచనీయమైన ప్రేమ స్వరూపుడు. కనుక భగవంతుడికి భక్తుడికి అభేదం చెప్పబడింది. భగవంతుడి స్వరూపాన్ని ఏవిధంగా వర్ణించడానికి వీలుకాదో, ఆయన్ను పొందడానికి మూలమయిన భక్తి స్వరూపాన్ని సందర్శించడానికి కూడా వీలుకాదు.

ప్రేమరూపమయిన భక్తి అమృత స్వరూపమయింది. అమృత శబ్దం ముక్తి, కైవల్యం, అపవర్గాది మోక్షవాచక శబ్దాలకు పర్యాయ పదం. అమృత శబ్దానికి శాశ్వతత్వమే కాక 'మాధుర్యం' అనే లక్షణం కూడా ఉంది. కనుక అమృత స్వరూపమయిన భక్తిమాధుర్యమైంది. అలాగే 'సేవించేకొద్దీ పెరిగేది భక్తి' అనే విషయాన్ని కూడా అమృత శబ్దం తెలియజేస్తుంది, అని మహాపురుషుల మతం.

శ్రద్ధతో భగవంతుడి కథల్ని విని, పాడి మననంచేసి భగవంతుడి కోసమే ధర్మార్థకామాల్ని నిర్వర్తిస్తే నిశ్చలమయిన భక్తి ఏర్పడుతుంది.1

---

1. ఏకాదశ స్కంధము - భాగవతము.

భాగవతంలో శ్రవణ, కీర్తన, స్మరణ, పాదసేవ, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదనలు అనే నవవిధ మార్గాల్లో భక్తి స్వరూపం ప్రస్ఫుటమౌతుంది.

భక్తి స్వరూపం అనంతంగా ఉన్నా, భక్తికి చరమ ప్రమాణమయిన భాగవత ప్రతిపాదితమయిన దానిస్వరూపాన్ని గ్రహించడం జరిగింది.

భక్తి స్వరూపాన్ని నవవిధమార్గాల్లో దర్శించాకదాని తత్వాన్ని గమనించాలి.

## భక్తి - తత్త్వం :

ప్రేమ స్వరూపం అమృత తత్త్వాత్మకం - అదే భక్తి తత్త్వం అది నిగూఢం. ప్రేమరూపంగానే గాక ద్వేషపూర్వకంగానైనా భగవంతుణ్ణి స్మరిస్తే అది కూడా ఒక భక్తి విధానమే! భగవంతుడి విషయంలో భక్తి ఎలాంటిదో భయం, ద్వేషం, మోహంకూడా అలాంటివే. కొందరి మతంలో నిరంతర స్మరణ భక్తి కన్నా ద్వేషాదుల్లోనే అధికంగా భగవత్పరమౌతుందని చెప్పవచ్చు.

"దీనికి భాగవతమే ఆధారం. ఏదో ఒక ఉపాయంతో మనస్సును కృష్ణుడియందు లగ్నం చేయమని భాగవతం. ఈ తీవ్రమయిన మానసిక సంలగ్నం ద్వేషంతోగాని, కామంతోగాని' భయంతోగాని, బాంధవ్యంతోగాని, స్నేహంతోగాని చేయవచ్చును.

దీన్నిబట్టి భక్తితత్త్వం ప్రేమపూర్వకమే గాక ద్వేషం, సఖ్యం, భయం, బంధం, విరహం మొదలైన ఎన్నోభావాల్లో ఇమిడి ఉంది. అందువల్లనే భక్తి అన్నది విశాలమయిన లక్షణం కలిగింది.

భగవంతుడితో అద్వైత భావమే భక్తికి ప్రాణభూతమయిన తత్త్వం. ఇది అన్నిమతాల అభిప్రాయమని నారదభక్తిసూత్రములు.

భక్తితత్వ నిరూపణ తర్వాత భక్తి వైశిష్ట్యాన్ని పరిశీలించాలి.

## భక్తి – వైశిష్ట్యం :

చతుర్విధ పురుషార్థాల్లో తురీయ పురుషార్థమయిన మోక్షం సర్వోత్కృష్టం. సమస్తజీవకోటిలో దుర్లభమయిన నరజన్మనుపొందిన మానవుడి పరమగమ్యం మోక్షమే. మహర్షులు భక్తి జ్ఞాన కర్మల్ని మోక్షలబ్ధికి ఉపాయాలుగా నిర్దేశించారు. అందులో భక్తి సర్వప్రాణి గమ్యమయినట్టిది. ఆ భక్తి మార్గమే గరీయం. అందుకే ఆదిశంకరులు "మోక్షసాధన సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ' అని ప్రవచించారు. శంకరులు ఎంతటి మహాజ్ఞానులో అంతటి మహా భక్తులు. స్తోత్రరూప మయిన వారి కవిత్వమంతా మహా భక్తి ప్రవాహ రూపంగా ప్రవహించి మానవజాతిని తరింపజేసింది.

నారద భక్తిసూత్రాలందుకూడా భక్తియొక్క ఆధిక్యం చెప్ప బడింది. ఈ విషయాన్నే "త్రిపాద్విభూతి"లో మహానారాయణోప నిషత్తు కూడా చెప్పింది.

భక్తితోగాక మరిదేనితో కూడా బ్రహ్మజ్ఞానం కలగదని, ఇతరో పాయాలను వదలి భక్తిని ఆశ్రయించమని, భక్తినిష్ఠను పాటించమని భక్తి వల్ల సిద్ధించనిది ఏదీలేదని తెలిపింది.

భక్తిమార్గానికి యోగ్యతలు వేదాంతాదులకు మాదిరిగా కఠినాలు కావు. సర్వజన సులభమయినవి. భక్తిమార్గంలో ఎవరైనా గమనించ వచ్చు, నిషేధంలేదు. అయితే భగవంతుడిపై విశ్వాసం, భగవదను గ్రహంతో జనన మరణ రూపమయిన సంసార విముక్తి కలుగుతుం

దనే నిశ్చయం ఉంటే చాలు. భక్తిని అవలంభించడానికి చదువులు అక్కరలేదు. భక్తికి అందరూ అర్హులే. పరమ పాపి కూడా భగవంతుడిపై విశ్వాసంతో భక్తి ఫలాన్ని పొందవచ్చు. చండాలుడి నుండి బ్రాహ్మణుడిదాకా భక్తికి అర్హులే.

భక్తి హృదయాన్ని మృదులతరంచేసి ద్వేషాన్ని, అసూయను, కామాన్ని, క్రోధాన్ని, ఆనందాన్ని, జ్ఞానాన్ని, శాంతిని ప్రసాదిస్తుంది. భక్తివలన జడత్వం, చింతలు సకల వ్యాకులాలు, భయాలు మానసిక వ్యధలు, అన్ని ఆపదలు దూరమై పోతాయి.

భక్తి పై శిష్ట్యాన్ని శంకరాది మహాపురుషులు, భాగవతాది పురాణాలు, భగవద్గీత, నారదభక్తిసూత్రాలు, స్మృతిసూత్ర గ్రంథాలు, ఇంకా ఇతర ఉపనిషత్తుల ద్వారా నిరూపించడం జరిగింది. మోక్ష సాధనలో భక్తి, కర్మ, జ్ఞానాలకన్నా విశిష్టమయిన సాధనమనే దానికి లింగభేద, వర్ణ భేద, వయోభేద దేశకాలాది భేదాలులేవనీ, సాధనమార్గ త్రయంలో సులభతరమని పై మహానుభావులవల్ల తేలిన సారాంశం.

భక్తి పై శిష్ట్యాన్ని చూశాక, భక్తిలో ప్రధానశాఖలైన శైవ, వైష్ణవ భేదాల్ని అనుశీలించాలి.

## శైవ వైష్ణవాలు :

తరువాత భక్తి మార్గంలో శైవవైష్ణవాలు రెండు ప్రధానశాఖలు,

శైవవైష్ణవాలు ప్రాచీన మతశాఖలు. హైందవ ధార్మిక జీవన విధానంలో, విశేషించి దక్షిణాదిలో ఇవి ఎక్కువగా విస్తరించాయి. వేదమౌలికాలైన ఈ రెండు శాఖలు కాలక్రమంలో ఎన్నో పరిణామాలు పొందాయి. శివప్రాధాన్యం కల్గింది శైవం. విష్ణుప్రాధాన్యమైంది వైష్ణవం. దక్షిణ భారత ప్రజల జీవన విధానంలో వీటి ప్రభావం

అధికంగా కన్పడుతుంది. శైవవైష్ణవాల్లో ఎన్నో అవాంతర భేధా లున్నాయి. ఇవి ఎలా ఉన్నా వీరశైవం, వీరవైష్ణవం అనే ప్రధాన అవాంతర శాఖలు బయలుదేరి ఒకేదశలో దక్షిణాదిని అట్టుడికించాయి. సామాజిక జీవనానికే ప్రమాదాన్ని కల్గించాయి.

తిక్కనకాలంతో ఈమతాల కారణంగా ముఖ్యంగా తెలుగునాడు అల్లకల్లోలమైంది. అందుకే తిక్కన హరిహరనాథ తత్త్వం రెండు తెగలకు సమన్వయ దృష్టితో అవతరించింది.

పాల్కురికి సోమనాథుడు వీరశైవాన్ని ప్రతిపాదిస్తే అన్న మయ్య వీరవైష్ణవాన్ని ప్రతిపాదించాడు.

## వైష్ణవం :

వైష్ణవంలో విశిష్టాద్వైత వైష్ణవసిద్ధాంతం ముఖ్యమైంది. వేదాలు, ఉపనిషత్తులేకాక విష్ణుభక్తులైన ఆళ్వార్ల దివ్యప్రబంధాలు కూడా విశిష్టాద్వైతానికి ప్రమాణాలు. అందుకే విశిష్టాద్వైతాన్ని 'ఉభయవేదాంతం' అని కూడా అంటారు. ఆళ్వార్లు పరమ భక్తులు. ఆళ్వారుల అనుభూతుల సంప్రదాయమే వైష్ణవానికి ఆధారమైంది.

ఈ వైష్ణవానికి శాస్త్రత్వాన్ని ప్రథమాచార్యుడైన నాదముని కల్పించాడు. ఇతడు ఆచార్యుడు. ఇతడు విశిష్టాద్వైతానికి ఒక రూపా న్నిచ్చాడు. తర్వాత నాదముని పౌత్రుడైన యమునాచార్యులు, పితా మహుల ప్రయత్నాన్ని పటిష్టతరం చేశాడు. రామానుజుల చేతిలో విశిష్టాద్వైతం బాగా అభివృద్ధి చెందింది. వీరితోనే ఈ సంప్రదాయ ప్రాశస్త్యం పతాకస్థాయి నందుకొనింది.

భగవద్రామానుజులకు దివ్యప్రబంధాలు ప్రబోధకాలు. వారు ఈ సంప్రదాయానికి వైదికప్రామాణ్యాన్ని కల్గించారు. దాన్ని ఒక

తత్త్వంగా తీర్చిదిద్దారు. రామానుజులు తమ సిద్ధాంత స్థాపనకు వేదోపనిషత్తులు, భారత భాగవత పాంచరాత్ర వైఖానసాది ఆగమాల్ని దివ్యప్రబంధాల్ని ప్రమాణ గ్రంథాలుగా స్వీకరించారు.

రామానుజుల సిద్ధాంతం తర్కసహమై, శాస్త్రప్రాణాన్ని పొందింది. వారు దాని కంతటిస్థితినికల్పించి ప్రచుర ప్రచారాన్ని కల్పించారు.

భగవద్రామానుజాచార్యులు విశిష్టాద్వైతానికి ప్రామాణ్యాన్ని చేకూర్చిన తర్వాత ఆ సంప్రదాయానికి ఇతోధికమైన ప్రాశస్త్యాన్ని ప్రచారాన్ని కల్పించడానికి ఎన్నో ప్రామాణిక గ్రంథాలు ఆ సంప్రదాయంలో అవతరించాయి

## విశిష్టాద్వైత సిద్ధాంత తత్త్వం :

'శ్రీమన్నారాయణ ఏవ చిద చిద్విషాద్వైత తత్త్వం భక్తి ప్రపత్తి భ్యామ్ ప్రసన్నః స ఏవ ఉపాయః అప్రాకృత దేశవిశిష్టః స ఏవ ప్రాప్య ఇతి వేదాంత వాక్యైః'1

విశిష్టాద్వైత సిద్ధాంతానికి ఇది మూల వాక్యం

జీవుడు, ప్రకృతి, ఈశ్వరుడు అని తత్త్వం మూడు రకాలు. జీవుడు అంటే జీవ స్వరూపం శరీర ఇంద్రియాలకు విలక్షణమైనదీ, జ్ఞానానంద మయమైనది నిత్యం. ఇది అణుపరిమాణం ఈశ్వరుడికి నియామ్యమయినది

ప్రకృతియే మాయ ఇదే అవిద్య అని పిలవబడుతుంది ఇది జడం వికారాస్పదం భగవంతుడి ఇచ్ఛతో నైకవిధ పరిణామాలు

---

1. యతీంద్ర మత దీపిక

పొందుతుంది. భగవంతుడికి లీలా పరికరభూతమై సట్టిది. ఇదే సంసా రానికి మూలం.

ఈ మతంలో ఈశ్వరుడు నిత్యుడు. అఖిలహేయ ప్రత్యనీకుడు సకలకళ్యాణ గుణుడు. ప్రపంచానికి సర్గస్థితి సంహారకర్త. చేతనా చేతనాలకు ఇతడు అంతర్యామి. జీవుడు, ప్రకృతి ఆయననుంచి వేరు గాని విశేషణాలు. కారణావస్థలో పరమాత్మ, సూక్ష్మస్థితిలో ఉన్న ఈ ప్రకృతి జీవుడితో కలిసి ఉంటాడు. కార్యావస్థలో స్థౌల్యాన్ని పొందిన జీవ ప్రకృతిలచేత అతడు కూడి ఉంటాడు. ఇలా రెండు రకా లైన పరమాత్మలకు ఐక్యాన్ని బోధించడం వల్లనే ఇది విశిష్టాద్వైత మైంది.

## భక్తి – అన్నమయ్య :

తెలుగు సాహిత్యంలో 12 వ శతాబ్దంలో వచ్చిన కావ్యాలు అత్యధికం శైవమత వ్యాప్తికి సంబంధించినవిగానే కన్పిస్తాయి. అందు ప్రత్యేకించి పాల్కురికి సోమనాథుడి బసవపురాణం, పండి తారాధ్యచరిత్ర శైవ వ్యాప్తికోసమే అవతరించాయి. అంతకుముందు నన్నయాదుల చంపూపద్ధతిని(మార్గ)కాదని 'దేశి' అని కొత్తపంథాను తొక్కాడు పాల్కురికి సోమనాథుడు. ద్విపద రచనచేసి తన ప్రత్యేక తను నిలుపుకొన్నాడు.

ప్రక్రియలోనేగాకుండా భాషలోకూడా వైవిధ్యాన్ని పాల్కురికి చూపించాడు. తన కాలంలో లోకవ్యవహారంలో ఉన్న పదజాలాన్ని గ్రహించి గ్రంథస్థంజేసి సామాన్య జనానీకానికి అందుబాటులో ఉండే విధంగా ద్విపద ఛందాన్ని చేపట్టాడు. అంతే కాకుండా తనకు ఇంచుక ముందు నివసించిన శైవభక్తుడు బసవన్న చరిత్రను ఇతి వృత్తంగా గ్రహించి అందులో, జనంలో, పుక్కిటి పురాణాలుగా

ఉండే అనేక కథలకు స్థానాన్ని కల్పించాడు. ఇది ఆనాటికి అపూర్వమూ, అద్భుతమూ. ఒక మతవ్యాప్తికోసం ఇంతగా సాహిత్యంలో కృషిచేసినవాడు అప్పటికి మరొక్కరులేరు. అంటే సాహిత్యాన్ని మత ప్రచారానికే మీదు గట్టినవారు శైవ కవులు అని సారాంశం. ఈ ప్రభావం తర్వాత వచ్చిన వైష్ణవ కవుల్లో బాగా కన్పిస్తుంది.

15 వ శతాబ్దంలో వైష్ణవమత వ్యాప్తికోసం సాహిత్య నిర్మాణం గావించిన ప్రముఖుల్లో 'అన్నమయ్య' అగ్రగణ్యుడు. సోమనాథుడు ఎంచుకున్న ద్విపద ప్రక్రియను అన్నమయ్య గ్రహించలేదు. కాని సోమనాథుడువలె భాషను, పదజాలాన్ని మాత్రం జనంలోంచి ఆయన గ్రహించాడు. ఆయనలాగే ఈయన కూడా వ్యవహారంలోని పుక్కిటి పురాణాలెన్నిటికో కావ్యత్వ సిద్ధినికల్గించాడు. అయితే సోమనాథుడు కథను కథగా గ్రహిస్తే, అన్నమయ్య కథావిషయాన్ని సూచన ప్రాయంగా తన కీర్తనల్లో గానం చేశాడు. సోమనాథుడు కావ్యాలు వ్రాశాడు గాబట్టి కథను స్వీకరించాడు. అన్నమయ్య కీర్తనలు పాడినాడు గాబట్టి కథను సూచనగానేచేశాడు, లోకవ్యవహారంలోని కథల్నేగాక పురాణ ఇతిహాసాల్లో ఉండే వైష్ణవపరమైన అనేక కథాంశాల్ని సూచనమాత్రంగా తన కీర్తనల్లో అన్నమయ్య చేశాడు. 12 వ శతాబ్దంలో సోమనాథుడు, 15 వ శతాబ్దంలో అన్నమయ్య శైవవైష్ణవ మత వ్యాప్తికోసం కంకణం కట్టుకొని సాహిత్య నిర్మాణం గావించారు.

అన్నమయ్య స్మార్తుడు. ఇంటి నుండి తల్లిదండ్రులకు చెప్పకుండా తిరుమలగిరి చేరి, ఘనవిష్ణువు ప్రేరణతో వైష్ణవుడైనాడు. అయితే అన్నమయ్యలో గ్రహించదగిన ముఖ్యాంశం కొందరు వైష్ణవులవలె ఈయన ఈశ ఈశ్వర శబ్దప్రయోగానికి విరోధికాడు అన్నది. వేంకటేశ్వరా! అని ఎంత ఆర్ద్రతతో పలికాడో, అమ్మవారిని కూడా అంత ఆర్ద్రతతో సంబోధించాడు.

అన్నమయ్య తాను సాధించిన ప్రపత్తి ప్రస్థానంలోని ప్రతి అడుగును, అనుభూతిని రచనగా మలిచి తెలుగువారికి అందించిన మధురకవి. దాదాపు 32 వేల సంకీర్తనల్లో సగానికి ఎక్కువగానే శృంగార సంకీర్తనలు కన్పిస్తాయి. ఈ శృంగార సంకీర్తనల్లో కూడా అనేక రకాలభక్తి ఇమిడి ఉంది. అందుకే తాళ్ళపాకవారిసాహిత్యంపై పరిశీలన చేసిన డా॥ వేటూరి ఆనందమూర్తిగారు "వైష్ణవ తత్త్వం ముల్లెగట్టిన ముత్యాల మూటలు అన్నమయ్య సంకీర్తనలు" అని పేర్కొన్నారు.

వైష్ణవమతం, భక్తి ప్రపత్తులే మోక్షసాధనకు మార్గాలని నమ్ముతుంది. అయితే భక్తి అనేది వివిధరకాలుగా మనకు గోచరిస్తుంది. భాగవతం నవవిధ భక్తి సంప్రదాయాన్ని చెపుతుంది.

"కామోత్కంఠతగోపికల్ భయమునన్ గంసుండు: వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్; సంబంధులై వృష్ణులున్
ప్రేమన్ మీరలు; భక్తినేము; నిదె చక్రిం గంటి మెట్లైన ను-
ద్దామ ధ్యాన గరిష్ఠుడైన హరిఁ జెందన్ వచ్చు ధాత్రీశ్వరా!"

పై పద్యంలో దాస్య, శాంత, వాత్సల్య, మధుర భక్తులేగాక శృంగార పరముగా కొందరు, భయంతో కొందరు, విరోధులుగా కొందరు, బంధుత్వపరంగా కొందరు, ప్రేమతో కొందరు శ్రీకృష్ణుణ్ణి ధ్యానించినట్లు వర్ణించబడింది.

అయితే రూపగోస్వామి భక్తి సంప్రదాయాన్ని ఇలా చెప్పాడు.

"ముఖ్యస్తు పంచధా శాన్తః ప్రీతిః ప్రేయాంశ్చ వత్సలః
మధుర శ్చేత్యమీ జ్ఞేయా యథా పూర్వ మనుత్తమాః

హాస్యోద్భుత స్తథా వీరః కరుణో రౌద్ర ఇత్యపి
భయానకః స బీభత్స ఇతి గౌణశ్చ సప్తథా"

—భక్తిరసామృత సింధువు.

శాంత ప్రీతి, ప్రేమ, వత్సల, మధుర భక్తులు ముఖ్యమైనవిగా పేర్కొంటూ, అవి ఉత్తరోత్తరం బలీయమైనవని రూపగోస్వామి అభిప్రాయ పడ్డాడు. అనగా శాంత భక్తికన్నా ప్రీతిభక్తి, అంతకంటే ప్రేమభక్తి వీటికి మించి వాత్సల్యభక్తి, అన్నికన్నా మధురభక్తి గొప్పదని గోస్వామి సిద్ధాంతం.

అన్నమయ్యతో రూపగోస్వామి ప్రవచించిన ఈ పంచవిధ భక్తులు మనకు కన్పిస్తాయి. అన్నమయ్య మధురభక్తి అనితర సాధ్యమని పండిత విమర్శకులు నిరూపించారు. పరిశీలనా దృష్టితో చూస్తే వాత్సల్య దృష్టిని ప్రతిపాదించడంలో కూడా అన్నమయ్య అనితర సాధ్యుడనిపిస్తుంది.

రూపగోస్వామి ప్రకారం జగత్తు జడజగత్తు, చిజ్జగత్తు అని రెండు విధాలు. జడజగత్తులో శాంత భక్తి ఉత్తమంగాను, మధుర భక్తి అధమంగాను కన్పిస్తుంది. చిజ్జగత్తులో మధుర రసం ఉత్తమంగాను, శాంతం అధమంగాను కన్పిస్తుంది. చిజ్జగత్తులో శాంత రసం కంటె వాత్సల్య రసం, దానికన్నా మధుర రసం విరాజిల్లుతుంటాయి. చిజ్జగత్తులో శ్రీకృష్ణుడు ఏకైక పురుషుడు వైష్ణవ సాంప్రదాయమయిన పంచవిధభక్తి ప్రస్థానం శ్రీకృష్ణ పరబ్రహ్మ చుట్టూ తిరుగుతుంటుంది. శ్రీకృష్ణపరమైన భక్తియే సంపూర్ణరసమౌతుందని వైష్ణవభక్తి మార్గం భావిస్తుంది. అన్నమాచార్యుడికి శ్రీవెంకటేశ్వర స్వామియే పరతత్వం అన్నమయ్య శ్రీవేంకటేశ్వరుడిలోనే అన్ని రూపాలు దర్శించాడు. అన్నమయ్య అలిమేలుమంగమ్మలో గోపికల్ని, రాధాదుల్ని దర్శించాడు. చివరకు తనను తానే అలిమేలు మంగమ్మగా మార్చుకున్నాడు. శ్రీకృష్ణపరమైన భక్తి తత్త్వాన్ని

వేంకటేశ్వరుడి పరం చేశాడు. వైష్ణవ పంచవిధ తత్వాలకు ప్రమాణంగా తన పద సాహిత్యాన్ని నిలిపాడు.

అన్నమయ్య తన కీర్తనల్లో వాత్సల్యభక్తికి ఆలంబనగా ఎక్కువగా శ్రీకృష్ణుని గ్రహించాడు. రామ బలరాముల బాల్యాద్యవస్థల్ని కూడా అక్కడక్కడా స్మరించాడు. బాలకృష్ణుణ్ణి వర్ణించే సందర్భాలలో అన్నమయ్య కొన్నిచోట్ల తనను యశోదగా, మరి కొన్నిచోట్ల తనను గోపికలలో ఒకదానిగా భావించుకొని ఆత్మాశ్రయ పద్ధతిలో కీర్తనలు చేశాడు. శ్రీకృష్ణుడి బాల్యావస్థలోని విషయాలన్నీ దాదాపు అన్నమయ్య కీర్తనల్లో చోటుచేసుకున్నాయి. ఇక్కడ గమనించదగిన ముఖ్యాంశం ఏమంటే, కృష్ణుడి రూపాన్ని తార్క్యంగానే గాకుండా అన్నమయ్య వేంకటేశ్వరుడితో అభేదంగా కూడా చూపించాడు.

అన్నమయ్య శ్రీకృష్ణ బాల్యావస్థనంతా కూడా, తిరుమల్లో శ్రీవేంకటేశ్వరాలయంలో జరిగే కృష్ణజయంతి, గోకులాష్టమి, కృష్ణాష్టమి మొదలైన ఉత్సవాల్ని దర్శించి, స్ఫూర్తిపొంది రచన సాగించినట్లు తెలుస్తుంది. శ్రీకృష్ణుడి లోకరంజక, లోకరక్షకరూపాలు అన్నమయ్య కీర్తనల్లో మనకు అడుగడుగునా కనిపిస్తాయి.

బలరామకృష్ణుల బాలలీలల్ని వర్ణించే కొన్ని సందర్భాల్లో అన్నమయ్య గ్రామీణ ప్రజాసంస్కృతిని చక్కగా చిత్రించాడు. 15 వ శతాబ్దం నాటి రాయలసీమ ప్రాంతపు ఇండ్లు, వాకిళ్ళు, ఆచార వ్యవహారాలు, ఆటపాటలు, ఉత్సవాలు, అభిరుచులు, వేషభాషలు అనేక విషయాలు అందులో వర్ణితాలు. ఒక విధంగా ఆనాటి రాయలసీమ ప్రాంతపు సంస్కృతికి ఈ కీర్తనలు ప్రతిబింబాలు.

శ్రీకృష్ణుడి జననం ఒక విశిష్ట ప్రయోజనం కల్గిందని అది ఒక విశ్వవ్యాపకమైన ప్రభావాన్ని నిలిపిందని, అతడి జననం ఈలోకంలో అసాధారణమైన ఘటన అని అన్నమయ్య మతం. రాక్షసాంధస్సును తొలగించడానికి శ్రీకృష్ణ చంద్రుడుదయించాడని అన్నమయ్య అభివర్ణించాడు.

# రెండవ విభాగం

## అన్నమయ్య బాలసాహిత్య వర్గీకరణ - పరిశీలన

మొదటి ప్రకరణం :

రెండవ ప్రకరణం :

### బాలకృష్ణ కథాత్మకాలు

మూడవ ప్రకరణం :

### శ్రీరామ కథాత్మకాలు

### హనుమద్విషయకాలు

# అన్నమయ్య బాలసాహిత్య వర్గీకరణ - పరిశీలన

ఇందులో ప్రధానంగా మూడు విభాగాలున్నాయి. బాలకృష్ణ కథాత్మకాలు, శ్రీరామ కథాత్మకాలు, హనుమద్విషయికాలు.

ఇది అన్నమయ్యా బాలసాహిత్య పరిశీలనా సౌలభ్యం కోసం చేసిన వర్గీకరణ. బాలకృష్ణకథాత్మకాలైన సంకీర్తనల్ని మరలాఉత్సవ వాత్సల్య, విక్రమ, లీలా, క్రీడా, మహిమా సంకీర్తనలుగా విభజించడం జరిగింది, అంతేకాక వివిధక్షేత్రాల పేర్లతో వెలసిన బాలకృష్ణ సంకీర్తనల్ని కూడా ఇందులో చేర్చడం జరిగింది.

## బాలకృష్ణ కథాత్మకాలు :

బాలకృష్ణ కథాత్మకాల్లో ఉత్సవ సంకీర్తన విభాగంలో జయంతి సంకీర్తనలు, జన్మాష్టమి సంకీర్తనలు, జాతకర్మ సంకీర్తనలు, అవతార పరమార్థ సంకీర్తనలు అన్న అంశాలున్నాయి. కాగా సువ్వి పాటను కూడా ఉత్సవ సంకీర్తనల విభాగంలోనికి చేర్చడం జరిగింది.

## ఉత్సవ సంకీర్తనలు :

ఈ విభాగంలో మొదట జయంతి సంకీర్తనల్ని పరిశీలించాలి. ఈ పరిశీలనకు ముందు జయంతిని గూర్చిన సామాన్య పరిచయం చేయడం అవసరం.

జయంతి శబ్దానికి 'జి_జయే' ధాతువు కాగా ఈ ధాతువుకు 'లట్' ప్రథమ పురుష ఏకవచనరూపం ''జయతి' అలాగే ద్వివచన రూపం 'జయతః', బహువచన రూపం 'జయింతి.

మాన్యులైనహరి జన్మదినాన్ని గూర్చి చెప్పుకునేటప్పుడు కాలక్రమేణ వ్యవహారంలో 'జయతి' అనే ఏకవచన క్రియాపదానికి

మారుగా 'జయంతి' అనే బహువచన శబ్దాన్ని వాడడం ఒక సంప్రదాయంగా సంక్రమించింది.

"జి" ధాతువుకు "జయమ్" అని అర్థం కనుక జయాన్ని కల్గించేది 'జయంతి' అని భావం. నిఘంటువుల్లో "జయంతి" శబ్దానికి 'అవతారపురుషుల జన్మదినం' అనే అర్థం ఉంది. అంతేగాక 'జయంతి' అంటే రోహిణీనక్షత్రయుక్త శ్రావణ బహుళాష్టమి అనీ, యాత్రాయోగ విశేషం అనీ, దుర్గాశక్తి భేదం అనీ, నిఘంటువుల్లో అర్థాలు చెప్పబడ్డాయి.1

ఈ క్రింది ప్రామాణిక శ్లోకాన్ని బట్టి చంద్రుడి గమనంలో ఉచ్ఛదశ "జయంతి" అని తెలుస్తుంది.2

శ్లో॥ యత్ర స్వోచ గతశ్చంద్రో లగ్నా దేకాదశే స్థితః
జయంతీనామ యోగోఽయం శత్రుపక్ష వినాశకృత్

వ్యవహారంలో 'జయంతి' అంటే పండుగ, శ్రీరామ, శ్రీకృష్ణ జయంత్యాధులు.

ఈ క్రింది ఉల్లేఖనంవల్ల జయంతికి సంబంధించిన మరికొన్ని విషయాలు స్పష్టమౌతాయి,

**An occation devoted to festive community observances often held annually to celeberate the anniversary of a notable person or event or the account harvest of on inportent product.**

పై నిర్వచనం ప్రకారం **'Festive'** అంటే మహాపురుషుల జన్మదినం. అదే జయంతి.

---

1. సూర్యరాయాంధ్ర నిఘంటువు.
2. చంద్రుడు 11 వ స్థానంలో ఉచ్ఛలో ఉన్న యోగం. ఇదిజ్యోతిష సంబంధమైన సంప్రదాయం.

ప్రతిపండుగ ఒక్కోదేవుడికి ప్రత్యేకమైతే, "జయంతి" పండుగ మాత్రం భూలోకంలో పుట్టి జీవనం సాగించిన భగవదంశ సంభూతులు, మహాపురుషులు, భగవద్భక్తులు, తత్త్వవేత్తలు, దేశభక్తులు మొదలైన వారికి ప్రత్యేకం. ఇలాంటి మహానుభావుల సత్చరిత్రల్ని స్మరించి తత్ప్రవర్తనను, త్యాగశీలతను, సేవానిరతిని సామాన్యులు అనుసరించాలన్నదే జయంతి ముఖ్యోద్దేశం.

జయంతి ఉత్సవాలు దైవ, మానవభేదంతో రెండు రకాలు. భగవంతుడు స్వయంగా లేక భగవంతుడి అంశంతో జన్మించినవారి జయంతులు దైవపరాలు. ఇవి ఎక్కువగా దశావతారాలకు సంబంధించినవే. కాగా తక్కినవి హనుమజ్జయంతి, శ్రీదత్తజయంతి మొదలైనవి ప్రముఖంగా ఆచరించబడుతున్నాయి. శంకర, రామానుజ, బుద్ధ, మహావీర, గాంధీ జయంతులు మొదలైనవి మానవ పరంగా జరిగే జయంతుల్లో కొన్ని మాత్రమే.

జయంత్యుత్సవ సంప్రదాయం ఇప్పటిది కాదు. అనాదిగా వస్తున్నదే. దీనికి ఆధారాలున్నాయి. పుట్టినరోజు పండుగ లో ప్రాచీన కాలాల్లోకూడా కవులతో వర్ణించబడి ఉండడం గమనార్హం.

భోజుడు తన చంపూరామాయణంలో శ్రీరామ జననాన్ని వర్ణించాడు.1

---

1. 'ఉచ్చస్థే గ్రహపంచకే....నిర్దగ్ధుమ్ నిఖిలాస పలాస సమిధః
మేధ్యా దయోధ్యారణేః ఆవిర్భూత మభూత పూర్వ మపరమ్
యత్కించి దేకమ్ మహః — భోజ చంపువు.

(రాక్షసులు అనే కాష్టసముదాయాన్ని నిశ్శేషంగా కాల్చి వేయడానికి అయోధ్యానగరం అనే యజ్ఞవేదికనుంచి అత్యపూర్వకంగా ఇదమిత్థంగా నిరూపింప వీలుకాని ఒకానొక తేజస్సు ఉద్భవించిందని భావం.)

ఇది జయంతి సామాన్య పరిచయం. తర్వాత కృష్ణ జయంతిని పరిశీలించాలి.

## కృష్ణ జయంతి :

హిందువులు చేసుకునే పండుగల్లో కృష్ణాష్టమి మొదటిది. శ్రీరామ నవమి రెండవది. ఆంధ్రదేశంలోనేగాక ఇతర రాష్ట్రాలలో కూడా కృష్ణార్చన ప్రాచీనకాలం నుంచే ఉంది. దశావతారాలలో ఇది ఎనిమిదవది. హరివంశ, భాగవత, విష్ణుపురాణాలు కృష్ణచరితాన్ని సమధికంగా వర్ణించాయి. వీటినిబట్టి కృష్ణుడు రోహిణీనక్షత్ర సహిత శ్రావణబహుళాష్టమినాడు జన్మించినట్లు తెలుస్తుంది. దేవకీవసుదేవులు కన్నవారు. యశోదానందులు పెంచినవారు. కృష్ణుడి జన్మతిథినే దేశంలో జయంతిగా భావించి వేడుకలు జరుపుకుంటున్నారు. ఆదినం ఉపవసించి కృష్ణుణ్ణి అర్చిస్తే చతుర్వర్గ ప్రాప్తి, సర్వత్రా విజయం కలుగుతుందని, ఆ జయంతిని జరపకుంటే రాక్షస జన్మ లభిస్తుందని స్కంధపురాణం తెలుపుతుంది. కృష్ణజయంతిరోజు చంద్రుడికి అర్ఘ్యమిచ్చి, వెండితోగానీ, బంగారుతోగానీ ద్వాదశాంగుల పరిమితమైన చంద్రబింబాన్ని రూపించి బంగారుపాత్రలో ఉంచి, అర్చించి అర్ఘ్యమిస్తే సమస్తమైన కోరికలు తీరుతాయని భవిష్యోత్తర పురాణం చెపుతుంది.

పై పురాణోక్తిని అనుసరించి ప్రజలు అనాదిగా ఈ జయంతిని జరుపుకుంటున్నారు. పగలంతా ఉపవసించి సాయంకాలం కృష్ణ విగ్రహాన్ని ఊరేగిస్తారు. పుట్టినరోజుకు గుర్తుగా ఉయ్యాలలుకట్టి ఊగుతారు. దేవకీదేవి బాలకృష్ణునికి చనుబాలిస్తున్నట్లు విగ్రహాన్ని రూపించి, సాలంకృతశోభతో దాన్ని పూజించడం కూడా ఉంది.

ఈ సంప్రదాయాన్ని తాళ్ళపాకవారు కూడా ఆచరించారు. వైష్ణవాలయాల్లో కృష్ణజయంతిరోజు వారు పూజల్ని జరిపించేవారు.

ఆ సమయంలో అన్నమయ్య కీర్తనలు పాడి దీన్ని పుత్రోత్సవంగా పేర్కొన్నాడు.1 దీన్నే ఈ నాటికీ మనం కృష్ణజయంతిగా పండుగ చేసుకుంటున్నాం.

తర్వాత అన్నమయ్య జయంతి సంకీర్తనల్ని చూడాలి.

## జయంతి సంకీర్తనలు :

కృష్ణ జయంతిని గూర్చి అన్నమయ్య కొన్ని సంకీర్తనలు గానంచేశాడు. అందులో ఈ క్రింది కీర్తనను మొదట చెప్పుకోవచ్చును.

"భూమిలోన గ్రొత్తలాయ బుత్రోత్సవ మిదివో
నేమపు కృష్ణజయంతి నేడేయమ్మా ॥పల్లవి॥
కావిరి బ్రహ్మాండము కడుపులో నున్నవాని
దేవకి గర్భమున నద్దిర మోచెను
దేవతలెల్ల వెదకి తెలిసి కాననివాని
యీవల వసుదేవుడు యెట్టు గనెనమ్మా ॥భూమి॥
పొడవుకు బొడవైన పురుషోత్తముడు నేడు
అడరి తొట్టెల బాలుడాయెనమ్మ.
వుడుగక యజ్ఞభాగ మొగి నారగించేవాడు
కొడుకై తల్లి చన్ను గుడిచీనమ్మా. ॥భూమి॥
పాలజలధి యల్లుండె (డై?) పాయకుండే యీతనికి
పాల వుట్లపండుగ బాతే (తా?) య నటే
అలరి శ్రీవేంకటాద్రి నాటలాడనే మరిగి
పేలరియై కడుపెచ్చు పెరిగీ నమ్మా2 ॥భూమి॥

---

1. "భూమిలోన గ్రొత్తలాయ బుత్రోత్సవ మిదివో"

(తాళ్ళపాకవారు ఈజయంతిని పురస్కరించుకొని, శ్రీకృష్ణుడికి చేసిన సేవలను తెలిపే శాసనాలు కూడా తిరుపతిలో చాలా ఉన్నాయి)

2. రాగం-రామక్రియ, సం. 8, సంకీ. 17, రేకు. 203, అధ్యా. సం.

'కృష్ణ జయంతి నేడేయమ్మా' అనడంలో అన్నమయ్య ఆ పండుగ దినాన్ని అందరికీ గుర్తుచేసినట్లనిపిస్తుంది.

బ్రహ్మాండాన్ని కడుపులో ఉన్నవాడిని దేవకి తన గర్భంలో మోసిందని, దేవతలు వెదికి తెలుసుకోలేని వానిని వసుదేవుడు ఎలా కన్నాడని అన్నమయ్య భావించాడు.

'పొడవుకు బొడవైన పురుషోత్తముడు తొట్టెల బాలుడాయ నమ్మ' అనుటలో అన్నమయ్య పరమాత్ముడి సూక్ష్మరూపాన్ని దర్శించాడు. యజ్ఞభాగాన్ని ఆరగించేవాడు కొడుకుగా తల్లిచన్ను గుడిచె నని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చి నాడు. పాలజలధి అల్లుడైనవానికి, పాలఉట్ల పండుగ ఏమి 'బాతే' అని అంటాడు.

వేంకటాద్రిలో ఆటలాడ మరిగి పెచ్చుపెరిగినాడని బాల కృష్ణుని అన్నమయ్య వర్ణించాడు.

అన్నమయ్య తనకీర్తనల్ని వేంకటేశ్వర ముద్రాంకితాలుగా చేశాడు. కృష్ణుడిక్కీ, వేంటేశ్వరుడికీ అభేదాన్ని పాటించి ఏదోవిధంగా ఆ ఇద్దరికీ సంబంధాన్ని కల్పించాడు. అన్నమయ్య లాగానే పురం దరదాసు కూడా తనకీర్తనల్ని 'పురందర విఠలా' అన్నముద్రతో ముగించాడు.

పైకీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడుగా పుట్టినవాడు సామా న్యుడు కాదని, సాక్షాత్తు విష్ణువే అన్న భావాన్ని ప్రకటించాడు.

పరమాత్మ స్వరూపుడైన కృష్ణుడు, పుట్టినప్పటి నుంచే శిష్ట రక్షణను, దుష్టశిక్షణను ఒక్కవేళనే సృష్టించాడని, మునులు భయ ముడిగినారని, దైత్యుల గుండెలు దిగులు చెందాయనీ అన్నమయ్య ఈక్రిందికీర్తనలో భావించాడు. అంతేగాక గోవిందుడైనబాలకృష్ణుడు

వసుదేవునికి కొడుకైనపుడే, గోవులు రంకెలు వేశాయనీ. కంసుడికి నూరేండ్లు నిండాయనీ ఆయన వర్ణించాడు.

శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాడు ॥పల్లవి॥

హరి కృష్ణావతారమందిన యంతలోనే
పరమ మునులకెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి
సిరుల మించిన యట్టి శ్రీజయంతినాడు ॥శిష్ట॥

గోవిందుడు వసుదేవ కొడుకైన యప్పుడే
గోవులు రంకెలు వేసె గొల్లపల్లెను
నోవితోడ గంసునికి నూరునిండె జూడగానే
చేవలు మీరినయట్టి శ్రీజయంతినాడు ॥శిష్ట॥

నారాయణుడు భువివరుడు దా గాగానే
మేర బాండవులెచ్చిరి మేనవావిని
కౌరవుల పనిదీరె కమ్మి శ్రీవేంకటేశుడు
చేరువనే మెరయగ శ్రీ జయంతినాడు1 ॥శిష్ట॥

నారాయణుడు "భువివరుడు" కాగానే పాండవులు 'మేనవావిని' పొందారని, కౌరవులపని తీరిందని శ్రీ వేంకటేశుడు 'చేరువనే మెరయగ' ఇది జరిగిందని అన్నమయ్య అన్నాడు.

ఈకీర్తనలో భావఫల సూచకాలను అన్నమయ్య కృష్ణజయంతి తోనే ప్రకటించాడు. అన్నమయ్య ఊహించిన భావి మహాకార్యాలు బాలకృష్ణుడు చేయబోయేవే.

బాలకృష్ణుడి అవతార ప్రయోజనాన్ని ఈ క్రింది కీర్తనలో పల్లవిలోనే అన్నమయ్య వ్యక్తంచేశాడు.

---

1. రాగం-పాడి, సంపు-8, సంకీ-258, రేకు 245, అధ్యా. సం.

"ఎక్కడి కంసుడు ఇకనెక్కడి భూభారము
చిక్కవాప జనియించె శ్రీకృష్ణుడు ॥పల్లవి॥

అదివో చంద్రోదయ మదివో రోహిణీపొద్దు
అదన శ్రీకృష్ణుడందె నవతారము
గదయు శంఖ చక్రాలుగల నాలుగు చేతులు
నె ధరించి యున్నాడు యిదివో బాలుడు ॥ఎక్కడి॥

వసుదేవు డల్లవాడే వరుస దేవకియదే
కొసరే బ్రహ్మాదుల కొండాటమదే
పొసగ బొత్తుల మీద బురుటింటి లోపల
సిసువై మహిమ చూపె శ్రీకృష్ణుడు ॥ఎక్కడి॥

పరంజోతి రూపమిదె పాండవుల బ్రతికించె
అరిది కౌరవుల సంహారమూ నిదె
హరికర్ఘ్యములీరో జయంతి పండుగ సేయరో
కెరలి శ్రీవేంకటాద్రి కృషుడితడు1 ॥ఎక్కడి॥

'ఎక్కడ కంసుడు ఇక నెక్కడ భూభారము' అంటూ "చిక్కవాప జనియించె శ్రీకృష్ణుడు' అని అన్నమయ్య తదవతార ప్రయోజనాన్ని సూచించాడు. చంద్రోదయ సమయంలో, రోహిణిపొద్దులో శ్రీకృష్ణుడు పుట్టినట్లు ఆయన తెల్పినాడు.

'పొసగ పొత్తులమీద పురిటింటి లోపల సిసువై మహిమజూపె శ్రీకృష్ణుడు' అని అన్నమయ్య కీర్తించాడు. ఇందులోనే బాలకృష్ణుణి పరంజ్యోతి స్వరూపుడుగా, పాండవుల బ్రతికించే వాడిగా, కౌరవ సంహర్తగా వర్ణిస్తూ అన్నమయ్య జయంతి పండుగ చేయమని, హరికి అర్ఘ్యము ఇవ్వమని, ఇతడు వేంకటాద్రి కృష్ణుడని లోకానికి హెచ్చరించాడు.

జగతిలో మనకెల్ల జయంతి నేడు
సగటున నందరికి పండుగ నేడు ॥పల్లవి॥

---

1. రాగం-రామక్రియ, సంపు-10. సంకీ-1, రేకు-501, అధ్యా. సం.

అదివో శ్రావణ బహుళాష్టమి నేడు
పొడగొన్న రోహిణి సంపూర్ణము నేడు
కదిసి యర్ధమరేతిరి కాడ నేడు
వుదయించె గృష్ణుడు చంద్రోదయాన నేడు ॥జగ॥

వసుదేవ దేవకుల వరము నేడు
పసగా ఫలియించె రేపల్లెలో నేడు
కొసరి యశోద నందగోపుడు నేడు యీ
సిసువును సుతుడంటా చెలగిరి నేడు ॥జగ॥

హరి మామకంసు మదమడచె నేడు
హొరు గిరుగుల వారుప్పొంగిరి నేడు
సిరి నలమేల్మంగతో శ్రీ వేంకటేశుడై నిల్చె
అరుదుగా గొల్లెతలు ఆడుకునేరు నేడు ॥జగ॥

అని అన్నమయ్య కృష్ణజయంతి వేడుకను అందరి పండుగగా భావించాడు.

దేవకీ వసుదేవుల వరము రేపల్లెలో ఫలించిందని, యశోదా నందగోపులు ఈ శిశువును సుతుడని సంతోషించారని ఆయన వర్ణించాడు. ఇతడే సిరియైన అలమేల్మంగతో వేంకటేశుడై నిల్చినాడని భావించాడు.

ఈ క్రింది సంకీర్తనలో బాలకృష్ణ జననం వల్ల దేవతలు ప్రకాశించారనీ, దిక్కులు సంతోషించాయనీ, అసురులు అణిగినారనీ అన్నమయ్య బాలకృష్ణుడి అవతార ప్రభావాన్ని కీర్తించాడు.

"దేవతలు చెలగిరి దిక్కులెల్లా సంతోషించె
అవల నసురులెల్లా నడగిరి యపుడే ॥పల్లవి॥

---

1. రాగం-భల్లాటి, సంపు-10, సంకీ-179, రేకు-3ι1, ఆధ్యా. సం.

అందమై పధుఁరలోన నడివో కృష్ణావతార
పొందెను శ్రావణ బహుళాష్టమి నేడు
ఓందు వడిరి దేవకీ దేవి వసుదేవుడును
అందరి బ్రహ్మానంద మంతరంగ ములను ॥దేవ॥

నడుమ రేపల్లెలోన నందగోప యశోదల
కొడుకై పెరిగినదే గోవిందుఁడు
అడరి గోపికలును అవుల మందలును
వుడివోని వేడుకల నుప్పొంగ గలిగెను"1 ॥దేవ॥

ఈకీర్తనలో కృష్ణుని జననకాల పరిస్థితి కంసుడివల్ల భీతావహంగా ఉన్నదని, తమ అష్టమ సంతానమైన ఈశిశువు సామాన్యుడు కాదనీ అంతరంగాల్లోనే వారు బ్రహ్మానందాన్ని అనుభవించారని తత్కాలీన దేవకీవసుదేవుల మనస్తత్వాన్ని అన్నమయ్య చాలా నేర్పుగా చిత్రించాడు. పైకి దిగులుపడినా లోలోపల సంతోషపడే ఈ పరిస్థితి దేవకీ వసుదేవుల జీవితాల్లో చాలా క్లిష్టమైనట్టిది,

రేపల్లెలో నందగోప యశోదల కొడుకగా పెరిగే గోవిందని చూచి గోపికలు, గోవులమందలు 'వుడివోని వేడుకల ఉప్పొంగి' నాయని అన్నమయ్య పై జయంతి సందర్భాన్ని వర్ణించాడు.

పై జయంతి సంకీర్తనల్లో అన్నమయ్య కృష్ణుడి జన్మనక్షత్ర తిధి జనన సమయాన్ని, అవతార ప్రయోజనాన్ని, దాన్ని ప్రభావాన్ని, దిగ్దేవతా సంతోషాన్ని, దేవకీవసుదేవుల నిగూఢమైన బ్రహ్మానందాన్ని భక్తిరస ప్రచురంగా, భావనా బంధురంగా కీర్తించాడు. పల్లవి సంప్రదాయంతో, రాగతాళ లయాన్వితంగా పై కీర్తనల్ని

1. రాగం సాళంగనాట, సంపు-19, సంకీ-62, రేకు-516, శృం. సం.

అన్నమయ్య రసవ్యంజకాలుగా తనదైన భక్తి హృదయ క్షీరాబ్ధి తరంగాలుగా ప్రస్తరించాడు.

తర్వాత అన్నమయ్య జన్మాష్టమి కీర్తనల్ని పరికించాలి.

## జన్మాష్టమి సంకీర్తనలు :

అన్నమయ్య జయంతి కీర్తనల్లో అక్కడక్కడా కృష్ణ జన్మతిథి విషయాలుకూడా ఉన్నట్లే, జన్మాష్టమి కీర్తనల్లో జయంతి విషయాలు కూడా ఒకటి రెండు కన్పిస్తాయి. అంటే జయంతికీర్తనలని నిగ్గుతేల్చడానికి వీలుకాదు. కీర్తనలోని ప్రధానాంశాన్ని బట్టి జన్మాష్టమి కీర్తనలు అన్న విభాగం చేయబడింది. ఇక అన్నమయ్య పరిణత భక్తి హృదయం నుంచి నిర్గమించిన అష్టమి సంకీర్తనా మాధుర్యాన్ని అనుభూయమానం చేసుకోవాలి.

ఈ క్రింది కీర్తనలో "అరయ శ్రావణ బహుళాష్టమి చంద్రోదయాన - సిరులతో నుదయించె శ్రీకృష్ణుడిదివో" అన్నది పల్లవి.

"వసుదేవ పాలిట వరతపోధనము, దేవకీదేవి యెదపై సొమ్ము
గొల్లెతలపొంపు మంగళసూత్రము-నందగోపుడు నమ్మిననిధానను
యశోదకు పూజదైవం, యాదవులకు వజ్రపంజరం"

అయిన శ్రీకృష్ణుడు-ఉదయించాడని అన్నమయ్య భక్తిభావనాధార ఉత్ప్రేక్షా మహితంగా జాలువారింది. దీనికి ఆధారమైన ఈ కీర్తన పరికించ తగ్గది.

''అరయ శ్రావణ బహుళాష్టమి చంద్రోదయాన
సిరులతో నుదయించె శ్రీకృష్ణుడిదివో ॥పల్లవి॥
వసుదేవు పాలిట వరతపోధనము
యొసగి దేవకీదేవి యెదపై సొమ్ము

సుసరాన గొల్లెతల సొంపు మంగళ సూత్రము
శిసువై యుదయించె శ్రీకృష్ణుఁ డిదివో ||అరయ||
నందగోపుడు గన్న నమ్మిన నిధానము
పొందగు యశోదకు పూజదైవము
మందల యావులకు మంచి వజ్ర పంజరము
చెంది యుదయించినాడు శ్రీకృష్ణుడిదివో"1 ||అరయ||

బాలకృష్ణ జన్మకథనాన్ని అన్నమయ్య ఇంకా ఇలా విస్తరించాడు. కీర్తనలో 'అదర శ్రావణ బహుళాష్టమి నేడితడు చూడగదరె' అన్నది పల్లవి.

ఇందులో కృష్ణబాలుణ్ణి కుంతి మేనల్లుడుగా గోపసతుల మగడిగా, పాండవులబావమరిదిగా, ఇంతటి కృష్ణుడు జనియించినాడు గదరె' అని తజ్జనన సన్నివేశాన్ని అన్నమయ్య వర్ణించాడు.

"అదర శ్రావణ బహుళాష్టమి నేడితడు
నడురేయి జనియించినాడు చూడగదరె ||పల్లవి||
గొంతిదేవి మేనల్లుడు గోపసతుల మగడు
పంతపు పాండవులకు బావమరది
వంతుతో వసుదేవ దేవకుల కుమారుడు
యింతటి కృష్ణుడు జనియించినాడు గదరె"1 ||అదర||

కృష్ణ జననంతో భావిలో జరుగబోయే విషయాలను కృష్ణజనన మంగళోత్సవానికి సూచనగా, దిక్కుల దేవదుందుభులు మ్రోయడాన్ని ప్లావిగాచేసి అన్నమయ్య వసుదేవ దేవకీదేవులకు చంద్రోదయ వేళలో కొడుకై జన్మించిన కూరిమి కృష్ణుణ్ణి వర్ణించాడు.

---

1, రాగం_లలిత, సంపు. 19, సంకీ_353, రేకు_566, శృం. సం.
1. రాగం_రామక్రియ. సంపు_10, సంకీ_160, రేకు_628, ఆధ్యా. సం.

"సురలు సంతోషించి రసురలెల్లా నడగిరి
తొరలి దిక్కుల దేవదుందుభులు మొరసె ॥పల్లవి॥
కడగి వసుదేవుని కాంత దేవకీదేవికి
వుడివోవి వేడుక జంద్రోదయవేళ
కొడుకై జన్మించినాడు కూరిమి శ్రీకృష్ణుడు
నడురేయి నేడె శ్రావణ బహుళాష్టమిని"1 ॥సురలు॥

తర్వాతి కీర్తనలో కృష్ణుడు శ్రావణ బహుళాష్టమి నాటి రాత్రి తిరువవతారముతో పుట్టాడని, ఆశిశువును దేవకి ఎత్తుకొని 'వసుదేవు కరములందు' పెట్టిందని, దానికతడు 'సంతోషించాడనీ' అన్నమయ్య వర్ణించాడు.

"తల్లి యీపె కృష్ణునికి దండ్రి యీతడు
చల్లగా లోకములెల్లా సంతోసమందెను ॥పల్లవి॥
అరుదైన శ్రావణ బహుళాష్టమినాటి రాత్రి
తిరువవతార మందెను శ్రీకృష్ణుడు
యిరవై దేవకీదేవి యెత్తుకొని వసుదేవు
కరములందు బెట్టితే కడుసంతోసించెను"2 ॥తల్లి॥

ఇందులో కృష్ణుడి అవతార విశేషాన్ని, తల్లిదండ్రుల ఆనందాన్ని అన్నమయ్య భావించాడు. అంతేగాక తల్లిగా దేవకి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిందని, తర్వాత కంసుని నుండి శిశువు రక్షణ భారాన్ని వసుదేవుడికి అప్పగించిందని ఇందులో అన్నమయ్య సూచించాడు.

---

1. రాగం-దేసాళం, సంపు-9, సంకీ-220, రేకు-288, ఆధ్యా. సం.
2. రాగం-వసంత, సంపు-11, సంకీ-8, రేకు-52, ఆధ్యా. సం.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య మాస, తిథి, నక్షత్రాల్నే కాక జన్మసమయాన్ని కూడా (అర్ధమ రేతిరికాడ) రాగయుక్తంగా ఆలాపించినట్లు కన్పిస్తుంది. చంద్రోదయాన పుట్టిన కృష్ణుడి అభ్యుదయం 'చంద్రోదయాన' అన్న ప్రయోగం తెలుపుతుంది. పాప తాపంతో ఉడుకెత్తిన లోకం బాలకృష్ణ చంద్రోదయంతో అణుగుతుందని ఉదాత్త భావుకుడైన అన్నమయ్య ఈ కీర్తనలో ధ్వనింపజేశాడు. అందుకే చంద్రోదయ ప్రయోగాన్ని ఇంచుమించు అన్ని కీర్తనలలో ఆయన జేయడం జరిగింది. చంద్రుడు అమృతానికి సంకేతం. లోకమంతా విషమయంగా ఉంది. ఆ అమృతం లోక విషాన్ని హరించాలి. అన్న భావం చంద్రోదయ శబ్దాన్ని సూచిస్తుంది. ఈకీర్తనల్లో ఈ ప్రయోగానికి ఉత్కటమైన భావప్రకర్ష ఉంది. ఈ భావనావిధానానికి ఆధారమైన కీర్తన ఇది.

"జగతిలో మనకెల్ల జయంతి నేడు
సగటున నందరికి పండుగ నేడు ॥పల్లవి॥

అదివో శ్రావణ బహుళాష్టమి నేడు
పొదిగొన్న రోహిణి సంపూర్ణము నేడు
కదిసి యర్ధమ రేతిరికాడ నేడు
ఉదయించె గృష్ణుడు చంద్రోదయాన నేడు"1 ॥జగతి॥

అనంతర కీర్తనలో అన్నమయ్య కృష్ణకిశోరాన్ని పురాణపురుషుడే అవతరించినట్లు భావించాడు. శ్రావణ బహుళాష్టమినాడు చంద్రుడుదయించాడని, రోహిణి నడుస్తున్నదని, అర్ధమ రేతిరికాడ దేవతలు నుతించగా దేవకి కృష్ణుణ్ణి దర్శించిందని జనులెల్లా పండుగ సేయండని అన్నమయ్య ధార్మికప్రబోధం ఈ కీర్తన ఇలా ఉంది.

---

1. రాగం-భల్లాటి. సంపు-10, సంకీ-179, రేకు-౬౩౬, అధ్యా. సం.

"పురాణ పురుషుడు భువినవతరించెను
సిరుల జయంతి నేడు సేయరో పండుగలూ ॥పల్లవి॥

శ్రావణ బహుళాష్టమి జందురు డుదయించెను
ఆవేళ రోహిణిని అద్దమ రేతిరికాడ
దేవకి గృష్ణుని గాంచె దేవతలు నుతియించ
చేవదేరె బనులెల్లా సేయరో పండుగలూ"1 ॥పురాణ॥

ఈ కీర్తనలో జయంతిని, జన్మాధికాన్ని అన్నమయ్య భావించాడు. వసుదేవుని పాలిట భాగ్యదేవతగా, దేవకికన్న దివ్యరత్నంగా సురల రక్షించే 'కల్పతరువు'గా కృష్ణకైశోరం జన్మించిందని అన్నమయ్య అన్నాడు,

"శ్రావణ బహుళాష్టమి జయంతి నేడు
సేవించరో నరులాల శ్రీకృష్ణుడితడు ॥పల్లవి॥

భావింప వసుదేవుని పాలిటి భాగ్యదేవత
దేవకి గనిన యట్టి దివ్యరత్నము
చేవమీర సురల రక్షించే కల్పతరువు
యీవేళ జన్మించినాడు యిదె కృష్ణుడు"2 ॥శ్రావణ॥

"సేవించరో నరులాల" అన్న పల్లవి ప్రయోగాన్ని బట్టి ఈ రహస్యాన్ని గ్రహించలేని అజ్ఞానులైన నరులను ప్రబోధనచేస్తూ అన్నమయ్య వాగ్గేయకారుడు పై కీర్తనను ఆలాపించాడు.

అన్నమయ్య కృష్ణుడి జన్మాన్ని వివరిస్తూ ఆ జన్మ లక్ష్యమేమిటో, తద్రహస్యమేమిటో వివరిస్తూ క్రింది కీర్తనను ఆలాపించాడు.

---

1. రాగం ప్రతాపనాట, సంపు_18, సంకీ_283, రేకు_474,
2. రాగం_సాళంగనాట, సంపు._10, సంకీ_287, రేకు_349, అధ్యా.సం.

"శ్రావణ బహుళాష్టమి నవరేత్రికాడను
శ్రీవిభుడుదయించె జలులాల వినరే ||పల్లవి||

అసురుల శిక్షించ నమరుల రక్షించ
వసుధ భారమెల్లా నివారింపను
వసుదేవునికిని దేవకీదేవికిని
అసదృశమగు కృష్ణుడవతార మందెను"1 ||శ్రావణ||

అసురుల్ని శిక్షించేదానికి, అమరుల్ని రక్షించేదానికి, భూ భారము నివారించేదానికి దేవకీ వసుదేవులకు కృష్ణుడు అసదృశంగా అవతరించాడని, గో గోపిగా గోపకులను కాపాడేదానికి, మునుల్ని రక్షించేదానికి కృష్ణుడు వచ్చాడని అన్నమయ్య కృష్ణజనన భావిఫల సూచకంగా పై కీర్తనను ఆలాపించాడు.

పై పల్లవిలోని 'శ్రీవిభుడుదయించె' అన్న ప్రయోగంసాక్షాత్తుగా శ్రీ మహావిష్ణువే జన్మించినాడన్న విషయం సంసూచ్యమైంది.

జన్మాష్టమి సంకీర్తనల్లో మాస, తిథి, నక్షత్ర జన్మసమయాది విషయాలకు అన్నమయ్య ప్రాధాన్యాన్ని ఇచ్చి 'అదే జయంతి'అని సర్వరక్షకుడైన జగత్ వల్లభుడు శ్రీ మహావిష్ణువే బాలకృష్ణుడుగా అవతరించాడనీ, లోకాన్ని ప్రబోధిస్తూ అన్నమయ్య తన కృష్ణ జన్మాష్టమి సంకీర్తనా కార్యాన్ని నిర్వర్తించాడు.

అంతేగాక జన్మాష్టమి కీర్తనలు ఎనిమిదింటిని మాత్రమే చెప్పడంలో కృష్ణ జన్మాష్టమి తిథికి సూచకంగా అన్నమయ్య భావించిన ఔచిత్యం దైవికమైనదే.

## జాతకర్మ సంకీర్తనలు :

జననానంతరం జీవికి జరగవల్సిన శుభసంస్కారాలైన పంచదశ కర్మల్లో పుణ్యహవాచన జాతకర్మ నామకరణ, అన్న

---

1. రాగం-మాళవశ్రీ. సం-10, సంకీ-287. రేకు-349, ఆధ్యా. సం.

ప్రాసాదులు శాస్త్ర ప్రోక్తాలు. ఈ కర్మలు తాత్వికంగా శాస్త్రీయంగా (Scientify) మానవుడి జీవితంలో ప్రాధాన్యం వహిస్తున్నాయి. ధర్మసింధు, నిర్ణయసింధు బృహజ్జాతకాది ధర్మశాస్త్ర గ్రంథాల్లో జాతకర్మాదుల ప్రయోజన, ప్రాముఖ్యాలు నిర్దేశితమైనాయి. కర్మసిద్ధాంతాన్ని విశ్వసించే హైందవ సంప్రదాయ సంబంధులైన ఈ కర్మలు పుట్టిన ప్రాణికి తప్పనిసరి; అని మన విశ్వాసం. భగవంతుడే పుట్టినప్పటికీ, మానవ యోని సంజాతుడైన ఆతడికి కూడ ఇవి తప్పవు అనడం సంప్రదాయానుసరణమే. పంచదశ కర్మలు మానవ జీవితంలో వేడుకలై ఇహపరాలకు అభ్యుదయ సూచకాలు కాగా, చివరిదైన షోడశకర్మ పరగతికే లక్షించబడింది. కనుక కృష్ణ శిశువు జాతకర్మాదికాన్ని అన్నమయ్య సంకీర్తన రూపంలో నిర్వహించడంజరిగింది. ఇందులో అన్నమయ్య తత్తత్ కర్మకాలోచితాలైన సంప్రదాయాన్ని, గీత ఫణితిలో కొన్నిటిని సూచనగా, కొన్నిటిని స్ఫుటంగా వ్యంగ్య వాచ్య మర్యాదలతో చేయడం జరిగింది.

ఇక జాతకర్మలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనల్ని రేఖామాత్రంగానైనా పరిశీలించాలి.

చంద్రోదయ సమయాన హరి అవతరించాడని, మొదట జాతకర్మ చెయ్యాలని, పుత్రోత్సవ సూచకమైన పుణ్యాహం చేయాలని, అన్నమయ్య ఈకీర్తనలో సూచించాడు. బాలింతరాలైన దేవకికి కాయం (బాలింతకిచ్చేమందు) ఇవ్వమని, వసుదేవుడికి గంధాక్షితలు ఇవ్వమని 'కాయపు గాడిదకు కవణముపెట్టి' తర్వాత 'వియ్యపుచుట్టాలకూ వీడుపెట్టమని' అన్నమయ్య తననాటిసంప్రదాయాన్ని ఇలా తెలిపాడు.

"జోజోయని మీరు జోల పాడరో
సోజవు జయంతి నేడు సఫలమందరికి ॥పల్లవి॥

ఆదె చంద్రోదయమాయె హరి యవతారమందె
మొదల జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహముచేసి
కదిపి యిట్టె నామకరణము జేయరో ॥జో జో॥

కానుకము దేవకికిచ్చి గక్కన వాసుదేవుని
కియరో గంధాక్షతలిటు వీడేలు
కాయపు గాడిదెకు కవణముపెట్టి మరి
వియ్యపు చుట్టాలెల్ల వీడువెట్టరో"1 ॥జో జో॥

శ్రీకృష్ణుడు పుట్టినరోజు జయంతి అని' దేవతలు గెలిచారనీ, దైత్యులు పారిపోయారనీ, భూ భారమెల్లా అణగిందనీ, రేపల్లెలో నెలవైన బాలుడు యశోదకు బిడ్డడైనాడనీ, అక్కడే జాతకర్మ ముగిసిందనీ, చెప్పరాని బాలలీల సేయగలదెల్లాచేసి, బాలుని తొట్టిలో పెట్టారనీ, విష్ణుమాయ కప్పిందనీ, వసుదేవుడికి చెరవదిలిందనీ, దేవకి తపం ఫలించిందనీ అంటూ అన్నమయ్య అలమేల్మంగ చెదరక వెంకటాద్రి ఎదపై నిలిచిందని భావించాడు.

కృష్ణుడికి వేంకటేశుడికీ అభేధాన్ని పాటించిన అన్నమయ్య ఇలా భావించడం పరిపాటి.

"దేవతలు గెలువరో తెగిదైత్యులు పారరో
భావించ నింతటిలో భూభారమెల్ల నణిగె ॥పల్లవి॥
నేడు కృష్ణుడు జనియించె నేడే శ్రీజయంతి
నేడే రేపల్లెలోన నెలవైనాడు
వేడుక యశోదకు బిడ్డడైనాడిదె నేడే
పోడిమి జాతకర్మమొప్పగ నాయ నేడు ॥దేవ॥

---

1. రాగం_దేసాళం, సంపు_9, సంకీ_172, రేకు_280, ఆధ్యా. సం.

ఇప్పుడిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము
ఇప్పుడు తొట్టెలనిడి రింతులెల్లాను
చెప్పరాని బాలలీల సేయగలదెల్లా జేసి
కప్పెను విష్ణుమాయలు గక్కున నేడిపుడు ॥దేవ॥

ఇదివో వసుదేవుని ఇంటి చెరలెల్ల బాసె
ఇదివో దేవకి తపమిట్టె ఫలించె
చెదరక తానిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె
యెదుర నలమేల్మంగ యెక్కివున్న దిదివో"1 ॥దేవ॥

బాలకృష్ణ జాతకర్మాది సంస్కారాలకు సంబంధించిన అన్నమయ్య కీర్తనలు మాత్రమే లభించాయి. మిగతా వాటి విషయం ఇతోధిక భావిపరిశీలనవల్ల తెలితే ముదావహమే.

తర్వాత ప్రస్తుత వర్గీకరణ ప్రకారం అన్నమయ్య వాగ్గేయకార అవతార పరమార్థ కీర్తనల్ని పరిశీలించడం కర్తవ్యం. దానికిముందు అవతార విషయాన్ని సంగ్రహంగానైనా పరిశీలించాలి.

## అవతార పరమార్థ కీర్తనలు :

అవతార శబ్దానికి దిగడం, రేవు మొదలైన అర్థాలున్నాయి.2

1. రాగం-సాళంగనాట, సంపు.-2, సంకీ-478, రేకు-193, ఆధ్యా. సం.

2. అవపూర్వక 'తౄ' ధాతువుకు 'ఘఞ్' ప్రత్యయము చేరి వృద్ధి కార్యంతో ఈశబ్దము ఏర్పడింది. 'అవే తౄస్త్రోర్ఘఞ్' అని సూత్రం ఇక్కడ 'ఘఞ్' పత్యయము కరణార్థం అధికరణార్థం వివక్షితమై నప్పుడు ఏర్పడుతుంది. భావార్థం వివక్షితమైతే అప్రయుక్తం 'ఋ దోరప్' అనే సూత్రంతో విహితమౌతుంది. కాబట్టి (నదులు మొదలైన వాని యందు) 'దిగడం' అనే అర్థంతో 'అవతరః' అనే రూపం అవుతుంది. అవతరణానికి 'ఆశ్రయం-సాధనం' అనే అర్థంలో (రేవు) మొదలయిన వాటిలో 'అవతార' శబ్దం సంపన్నం.

పాదటీకలోని వ్యుత్పత్తిని బట్టి భగవంతుడు. భూలోకాన మనుష్యాది రూపాల్లో అవతరించడం అవతారమని తాత్పర్యార్థాన్ని గ్రహించాలి. తన్ను తాను భూమిపై ఈశ్వరుడు ఆవిష్కరించుకోవడం అవతార సిద్ధాంతం. ఇక్కడ ఈశ్వర శబ్దం భగవత్ సామాన్య వాచకం.

అవతారశబ్దం విపులార్థకం. ఏర్పడడం అని కూడా దీనికి అర్థమే. ధర్మసంస్థాపన అవతార పరమార్థం. భగవంతుడు ధర్మగ్లాని కలిగినపుడు అవతరిస్తానని గీతలో 'యధాయధాహి ధర్మస్య గ్లానిర్భ వతి భారతా' ఇత్యాదిగా సెలవిచ్చాడు.

మహావిష్ణువు అవతారాలు పది1 ఇవి ప్రసిద్ధాలే, ఈఅవతారాల్లో ఎన్నో భేదాలున్నాయి. భౌమాతారాలు, పూర్ణావతారాలు, అంశావ తారాలు, అర్చావతారాలు, అంతర్యామ్యవతారాలు మొదలగునవి చాలా ఉన్నాయి. దశావతారాల్లో వామనావతారం మాత్రం దివ్యమని ఇతరాలు భౌమావతారాలని ప్రసిద్ధి,2

కృష్ణావతారం దశావతారాల్లో ఎనిమిదవది. ఇది పూర్ణావతారం. పురాణాల్లో కృష్ణచరిత్ర మిశ్రమంగా ఉంది. భాగవతంలో ఈతనిలో దైవత్వం ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తుంది. భారతంలో రాజకీయ వేత్తగా ఇతడు కన్పిస్తాడు. 'ఛాందోగోపనిషత్తు'లో కృష్ణుడు ఘోరాంగి

---

1, మత్స్యః కూర్మో వరాహశ్చ
నారసింహూఽథ వామనః
రామో రామశ్చ కృష్ణశ్చ
బుద్ధః కల్కిశ్చతే దశ ఏతేతు విభవావస్తా
బ్రాహ్మణః పరమాత్మనః (పద్మపురాణము)

2, అన్నమయ్య సంకీర్తనలు–దశావతారాలు – డా॥ జి. డి. నాయుడు తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయము–తిరుపతి

రః ఋషివల్ల పురుషయజ్ఞ రహస్యాన్ని నేర్చిన శిష్యుడుగా కన్పిస్తాడు. దేవత్వం అంతగా కన్పించదు. కాలభేదాన్ని బట్టి కృష్ణుడి విషయం దైవమానుష సంకీర్ణంగా దృఢపడింది. ఏది ఎలా ఉన్నా అన్నమయ్య కృష్ణుణ్ణి భాగవత మతమాధారంగా సంకీర్తన రూపంలో ఆరాధించాడు.

శ్రీమన్నారాయణమూర్తి బాలకృష్ణుడుగా అవతరించిన వరమార్గాన్ని అన్నమయ్య సంకీర్తన మయంగా వివరించాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కృష్ణుని అవతార వరమార్గంగా అన్నమయ్య భావించాడు.

"జగములెల్లా నీడేరె జయవెట్టిరిందరును
తగనేడు కృష్ణావతారమాయ నిదివో ॥పల్లవి॥

అచ్యుతుడు జనియించె నద్దమరేతిరికాడ
ముచ్చిమి రాకాసులు ముట్టువడిరి
పచ్చిగాను లోకులాల పండుగసేయరో నేడు
అచ్చుపు గృష్ణావతారమాయ నిదివో ॥జగము॥

గోవిందుడు జనియించె గోకులాష్టమిదే నేడు
కావరపు గంసుని గర్వమణిగె
భావించి ప్రజలాల పారణసేయరో నేడు
ఆవేళ గృష్ణావతారమాయ నిదివో ॥జగము॥

అనంతుడు శ్రీవేంకటాద్రీశుడు జనియించె
ఘన శిశుపాలాదులు గతమైరి
తనివంది జనులాల ధర్మాన బ్రతకరో
అనుగు కృష్ణావతారమాయ నిదివో"1 ॥జగము॥

---

1. రాగం-సాళంగనాట, సంపు-10, సంకీ-20, రేకు-204, అధ్యా. సం.

ఈ కీర్తనలో 'ముచ్చిమి రాకాసులు' కృష్ణజననంతో ముట్ట పడ్డారనీ, ఇదే గోకులాష్టమియనీ, కావరవు కంసుని గర్వమణిగిందనీ, శిశుపాలాదులు గతమైనారనీ, ప్రజలందరూ ధర్మంతో బతకాలనీ అన్నమయ్య భావించాడు.

మరో కీర్తనలో అన్నమయ్య కృష్ణావతార పరమార్థాన్ని తెలిపినాడు.

"శ్రావణ బహుళాష్టమి నవరేతిరి కాడను
శ్రీవిభుడుదయించె జెలులాల వినరె ॥పల్లవి॥

అసురుల శిక్షింప నమరుల రక్షింప
వసుధ భారమెల్లా నివారింపను
వసుదేవునికి దేవకీదేవికిని
అసదృశమగు కృష్ణుడవతార మందెను ॥శ్రావణ॥

గోపికల మన్నించ గొల్లల నెల్లా గావగ
దాపై మునులనెల్లా దయసేయను
దీపించ నందునికి దేవియైన యశోదకు
ఏపున సుతుడై కృష్ణుడన్నిటా బెరిగెను"1 ॥శ్రావణ॥

క్రింది కీర్తనలో రాకాసులను గొట్టడానికీ, సాధువుల్ని రక్షించే టానికి కృష్ణుడు అవతరించాడని అన్నమయ్య భావించాడు.

"వింటిరటె చెలులాల వేడుక సంతోసవార్త
ఇంటనింట ఊరనెల్ల ఇదేసుద్ది ॥పల్లవి॥
ఇట మీద రాకాసుల నిందరి గొట్టెనట
ఘటన సాధులనెల్లా గరుణ రక్షించెనట

---

1. రాగం—మాళవశ్రీ. సం—10, సంకీ—287. రేకు—349, అధ్యా. సం.

పటుగతి వీడు శ్రీవేంకటగిరి కృష్ణుడట
నటించు నలమేల్మంగ నాయకుడు దానట"1

అతడు వేంకటగిరి కృష్ణుడని, అలమేల్మంగ నాయకుడని అన్నమయ్య భావించాడు.

శిష్టరక్షణను, దుష్టనిగ్రహాన్ని శ్రీజయంతి నాడే ఒకటేవేళ సృష్టించాడనీ, హరిరూపుడైన కృష్ణావతార పరమార్థాన్ని అన్నమయ్య వివరించాడు. ఇందులోకూడ శిష్టరక్షణ, దుష్టశిక్షణ ప్రధాన విషయం.

"శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాడు ॥పల్లవి॥
హరి కృష్ణావతారమందిన యంతలోనే
పరమ మునులకెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులు చొచ్చెనత్తరి
సిరుల మించినయట్టి శ్రీజయంతినాడు"2 ॥శిష్ట॥

పై కీర్తనలో కృష్ణావతార పరమార్థాన్ని అన్నమయ్య స్పష్టంగా తెలియజేశాడు.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య పల్లవిలోనే కృష్ణుణ్ణి పరమాత్ముడైన ఆది విష్ణువుగా కీర్తించాడు.

"ఆది విష్ణువీతడే యటరమ్మా
ఆదిగాని భూభార మణచీనోయమ్మా ॥పల్లవి॥

---

2. రాగం-వళపంజరం, సంపు-24, సంకీ-27, రేకు-805, శృం. సం.
1. రాగం-పాడి. సంపు-8, సంకీ-258, రేకు-245, అధ్యా. సం.

చందురు నుదయవేళ నవరేతిరికాడ
కందువ దేవకి బిడ్డ గనెనమ్మా.
పొందుగ బ్రహ్మాదులు పురుటింటి వాకిటను
చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా ||అది||

వసుదేవుని యెదుట వైకుంఠ నాథుడు
సిసువై యవతరించి చెలిగీనమ్మా.
ముసిముసి నవ్వులతో మునులకు ఋషులకు
యిసుమంత వాడభయ మిచ్చీనమ్మా ||అది||

కన్న తల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి
అన్నిటా రాకాసిమూక లణచీనమ్మా
పున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మీదేవితోడ
వన్నినిచ్చ కల్యాణాల బరగినమ్మా''[1] ||అది||

ఈ కీర్తనలో కృష్ణజన్మ విశేషాల్ని వర్ణిస్తూ 'పొందుగ బ్రహ్మాదులు పురిటింట వాకిటను, చెంది బాలుని నుతులు చేసేరోయమ్మా' అని కృష్ణజన్మ విభవాన్ని భక్తి భావనాత్మంగా అన్నమాచార్య వాగ్గేయకారుడు ఆలాపించాడు. వసుదేవుని ఎదుట వైకుంఠనాథుడే శిశువై అవతరించాడని, ముసిముసి నవ్వుల్తో ఇసుమంతవాడైన బాలుడు మునులకు, ఋషులకు అభయమిచ్చాడని, తల్లిదండ్రులకు కర్మపాశాల్ని ఊడ్చినాడని, రాకాసిమూకల్ని అణుస్తాడని వేంకటాద్రి నుండి లక్ష్మితో 'నిచ్చ కల్యాణాల బరగినమ్మా' అని అన్నమయ్య తదవతార పరమార్థాన్ని భక్తిరసాత్మకంగా భావించాడు.

క్రింది కీర్తనలో పరమభక్తుడైన అన్నమయ్య నారాయణుడి నామం శ్రీకృష్ణుడని, అతడు ఆదిమూర్తియని, మేనమామ కంసుడి

---

1. రాగం-లలిత, సంపు-8, సంకీ-192, రేకు-233. ఆధ్యా. సం.

గండంతో పుట్టాడని అంటూ, దైవశిఖామణికి మామ గండ మేమిటని అంటాడు. మధురలో పుట్టి, [ఱ్రేపల్లెలో పెరిగిన ఈశ్వరేశ్వరుడికి పాండవపక్షపాతం, కౌరవవైరం [ప్రాతఫలమా అని అన్నమయ్య ఆశ్చర్యాన్ని [ప్రకటిస్తాడు. గోవుల్ని కాయడం, గొల్లెతల్ని పొందడం ఈ అచ్యుతునికి ఆది గుణమని, శ్రీవేంకటపతి రూపుడైన ఆతడి జన్మ ఇదేనని అన్నమయ్య కృష్ణజన్మ తత్త్వాన్ని ఇలా వ్యక్తం చేశాడు.

"ఏమని చెప్పవగచ్చు నీ సంతోషపు సుద్ది
నామము శ్రీకృష్ణుడట నారాయణునికి ॥పల్లవి॥
జనని దేవకీదేవి జనకుడు వసుదేవుడు
డనఘుడైన యట్టి ఆదిమూర్తికి
ఘన లోకరక్షణ కంసుమామ గండమును
తనకు గారణమట దైవశిఖామణికి ॥ఏమని॥
పుట్టినది మధుర పెంపుడుజోటు రేపల్లె
వొట్టిన మాయల పురుషోత్తమునికి
పట్టిన పాండవ పక్షపాతము కౌరవవైర
మిట్టి [ప్రాతఫలమట సర్వేశ్వరునికి ॥ఏమని॥
గోవుల గాచేదియు గొల్లెతల బొందేదియు
ఆవేళ గుణము యీ అచ్యుతునికి
[శ్రావణబహుళాష్టమి చం[ద్రోదయము రోహిణి
కావింప జన్మమిదివో శ్రీవేంకటపతికి"[1] ॥ఏమని॥

అవతార పరమార్థ కీర్తనల్లో అన్నమయ్య భగవంతుడైన బాల కృష్ణుణ్ణి దుష్టశిక్షణ, శిష్టరక్షణ కార్యాన్ని [ప్రధానంగా భావించినట్లు [గహించగలము. లోకరక్షణకు భగవంతుడే బాలకృష్ణుడుగా అవత రించి తల్లిదం[డ్రి, మేనమామ, పక్షపాతవైరం మొదలైన విషయా

---

1. రాగం_మాళగౌళ. సం_8, సంకీ_253, రేకు_243, అధ్యా. సం.

లతో కూడినాడని. ఆశ్చర్యభావాన్ని అన్నమయ్య తన అవతార పర మార్థ కీర్తనల్లో అభివ్యక్తం చేశాడు.

ఇందులో భగవద్విభవం అంత స్ఫూతంగా కన్పిస్తుంది. అనన్య భక్తిమహితమైన అన్నమయ్య భావామృతధార సంకీర్తనా కుల్యల ద్వారా ప్రవహించింది.

తరువాత కృష్ణావతార పరమార్థాన్ని రేఖామాత్రంగా సూచించే అన్నమయ్య ఒకే ఒక సువ్వి (దంపుళ్ళ) పాటను గమినించాలి,

## సువ్వి (దంపుళ్ళ) పాట :

అన్నమయ్య 'సువ్వి'పాటను పరామర్శించేముందు దాని సామాన్య పరిచయం కొంత అవసరం.

సువ్విపాట వ్యుత్పత్తిని ఇలా భావించడానికి వీలుంది. వడ్లను దంచేటప్పుడు స్త్రీలు శ్రమను మరిచేటానికి 'ఇస్' అని అనడం విని పిస్తుంది. పోటు ఊపులో ఇది 'సువ్వి' అయ్యిందని విమర్శకుల అభి ప్రాయం. ఇది ఊతగా ఉన్నపాట 'సువ్వి' పాట.

ఇది ఈనాటిది కాదు. నన్నెచోడుని కాలానికే ఉంది. ఆతడు, "శవరకామినియోర్తు పటికపురోల ముల్వెదురు బ్రాలుగి బోయుచు గొరుకొమ్ము రోకటిగొని దంచుచు రసోత్కటముగా"1 పాడినట్లు కవిరాజ శిఖామణి వర్ణించాడు.

అలాగే పాల్కురికి సోమనకూడా, "రోకటిపాటలట్లు వేదములు"2 అని అన్నాడు.

---

1. కుమార సంభవము, ఆరవ అశ్వాసము, పద్యం-47, నన్నెచోడుడు.
2. బసవపురాణము - పాల్కురికి సోమన.

తర్వాతి వాడైన విన్నకోట పెద్దన కూడా సువ్విపాట ప్రసక్తిని తెచ్చాడు. 'తలకొని తగ్రబాలు దంపెడు వేళ'1 తరువోజల్ని పాడు తారని అన్నారు,

జానపద సాహిత్యంపై విశేష పరిశ్రమ చేసిన ఆచార్య బిరుదు రాజు రామరాజుగారు రోకటి పాటలు 'త్రిశ, చతురస్ర గతిలో సాగు తుంటాయని'2 అన్నారు.

ఆచార్య యస్వీ జోగారావుగారు దీన్ని ఇలా వివరించారు. 'ఇది ఒక దంపుళ్ళపాట. చిరప్రసిద్ధమైనది. బహు యక్షగానములందు, వివాహ సందర్భములందు ప్రయుక్తమైనది. దీనికి సువ్వలాలి, సువ్వాల, సుంకులపాట అనియు, నామాంతరములు కలవు. ఇది సువ్వాల ద్విపద, సువ్వాల ధాతువు అను పేర్లతోగూడా కొన్ని గాన ములందు కన్పట్టుచున్నది'.

సువ్వి **A chours used by women at marriages when pounding rice** అని కన్నడ నిఘంటువులందు పేర్కొన బడినది.

సువ్వి అన్నది ధ్వన్యనుకరణ శబ్దము, నూతపదమూ కావచ్చు రోకటిపోటున కెన్ని యొడుపులుండునో, ఈపాటకన్ని గతులుండును. అందు తురగ వల్గన గతికి ప్రాచుర్యమధికం. కొన్ని యక్షగానము

---

1, కావ్యాలంకార చూడామణి – విన్నకోట పెద్దన.

2. అన్నమయ్య జయంతి మహోత్సవాలు 573 (మే-18 1981) సంద ర్భంగా ఆచార్య బిరుదురాజు రామరాజుగారు సమర్పించిన అన్న మయ్యపాటలలో జానపద రీతులుఅనేవ్యాసంనుండి గ్రహించబడినది.

అందు సుంకులు దంచేపాట సువ్విగనూ, సుంకాలు చెలరేగేపాట సువ్వాలగసూ కన్పట్టుచున్నది.1

తర్వాత అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనల్లో ఉన్న ఒకే ఒక 'సువ్వి'పాట తీరును పరికించాలి.

ఈ పాటలో దేవకి కృష్ణుణ్ణి ప్రసవించి నప్పుడు ప్రకృతిలో కనిపించిన నిమిత్తముల ద్వారా అన్నమయ్య భావిఫలాన్ని సూచించాడు.

దేవకి నందనుణ్ణి కనిన తరువాత శశిపొడిచిందని, దిశాదేవతల దిగుళ్ళువిడిచాయనీ, కావిరి విరిసిందని, కంసుడు గినిశాడని, పువ్వుల వానలు కురిశాయని, గాడిద కూసిందని, దాని నోటిని జనకుడు (వసుదేవుడు) మూశాడనీ, లోకమే గగుర్పొడిచిందనీ, విధి (కర్మ) విడిచిందనీ, మొగులు కురిసిందనీ, యమునపై నడిచాడనీ, కలి జారిందనీ, వేంకటపతి మీరినాడనీ, అలమేల్మంగ నాంచార్ల అలకలు తీరాయనీ ఆయన ఇందులో వివరించాడు,

"సువ్వి సువ్వి సువ్వలమ్మ
నవ్వుచు దేవకి నందను గనియె
శశివొడిచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్ళు విడిచె
కావిరి విరిసె కంసుడు గినిసె
వావిరి బువ్వుల వానలు గురిసె
గతిసేసె అటు గాడిదెకూసె
కుతిల కుడిచి జనకుడు నోరుమూసె

1. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర - డా॥ యస్వీ జోగారావు పుట-348, 349.

గగురు పొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియగ యమునపైన నడచె
కలిజారె వేంకటపతి మీరే
అలమేల్మంగ నాంచారలుకలు దీరె"1

ఇది దంపుళ్ళపాట శిశువు దేవకీవసుదేవులకు, యశోదానందులకు, గొల్లపల్లెకేగాక, సమస్త లోకాలకూ అతడు శిశువే. కలిగిన శుభ నిమిత్తాలనుబట్టి ప్రాకృతలైనస్త్రీలు దాన్నొక ఘనమైన సమయంగాభావించి నిత్యనైమిత్తికాలయిన వారి సమస్త కర్మల్లో హరిరూపుడైన ఆ శిశువు సంస్మరణని ఇలాంటి పాటలద్వారా చేస్తూ, ఆతడి లీలా విభవాన్ని స్మరించాడు.

పాలు పిదికినా, పెరుగు చిలికినా, ధాన్యాదుల్ని దంచినా చెరగినా గోపికలు ఇలాంటి పాటల్ని పాడుకుంటూ ఉంటారు. తద్వారా నిత్య హరినామ సంస్మరణ జరుగుతుంది.

సువ్విపాట ఖండగతిలో ఉంటుంది. అన్నమయ్య కూడా ఇలాగే కీర్తించాడు. ఈ కీర్తనలో ఉండేగతి తరువోజల్లో కన్పించే ఖండగతిగనే భావించాలి.

అవతరించిన పరమాత్మ స్వరూపుడైన బాలకృష్ణుడిపై గురు జనులు ప్రదర్శించిన వత్సలతా మహితమైన విశేషక్రియల్ని అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా ఎలా ప్రసారం చేశాడో పరిశీలించడం అనంతర కర్తవ్యం.

---

2. రాగం-భూపాలం, సంపు-12, సంకీ-261, రేకు-91, శృం. సం.

# వాత్సల్య సంకీర్తనలు:

జీవి జీవయాత్రలో వాత్సల్యం ఒక ఆర్ద్రమైన భావం. అదే కవితలో ఒక రసం. దాన్నే వత్సల రసమని పూర్వులు అన్నారు. సకల జీవుల్లో, విశేషించి స్త్రీత్వం మూర్తిగొన్న మాతృ దేవతల్లో ఈ భావం అత్యధికం. కాగా స్త్రీ వాత్సల్యరూపిణి మాతృ స్వరూపిణి. ఆమెకు మాతృత్వం ఒక వరం. ఇది నిజ జీవితంలోనేగాక, భగవద్విషయంలో కూడా ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ఇది భక్తిలో ఒక భాగం. దీన్నే చైతన్యాదులు వత్సలభక్తి అన్నారు. మాతృత్వభావ పరిపూర్ణత స్త్రీకి ఒక పరవశస్థితి. భగవంతుడే ఆమెకు శిశువుగా జన్మిస్తే ఆ వాత్సల్యానికి అవధులులేవు. ఇదే యశోదా కృష్ణుల విషయంలో జరిగింది, యశోద కన్నయ్యకు కన్నతల్లి కాకున్నా, పెంచినతల్లి, యశోదాకృష్ణుల అనుబంధం లోకోత్తరం. బహుశా దీన్ని బట్టే కన్న ప్రేమకంటే పెంచిన ప్రేమ అధికమన్నమాట పుట్టిందేమో. శకుంతలపై కణ్వుడికున్న ప్రేమ సాజమైంది. కృష్ణుడిపై యశోదకున్న ప్రేమలో ఒక విశేషముంది. అక్కడ కణ్వుడు పురుషుడు. ఇక్కడ యశోద స్త్రీ స్త్రీ సహజాతమైన ఆర్ద్రత ఆమెలోని మాతృత్వ వాత్సల్యాది రసవత్తర భావాన్ని సైకిపొంగించింది, ఇదే భక్తుడైన అన్నమయ్య కవితలో అమృతత్వాన్ని సంతరించు కొనింది,

అన్నమయ్య తన సంకీర్తనల్లో యశోద ద్వారా వాత్సల్య మహితమైన భావపరంపరను ప్రసరింపజేశాడు. భగవద్విషయకమైన వాత్సల్య రస పరిపోషణలో సూరదాసు మొదట చెప్పదగ్గవాడు, తర్వాత అన్నమయ్యను చెప్పాలి. తెలుగులో అన్నమయ్యకు ముందు పాల్కురికి సోమనాథుడు "బసవపురాణం'లో పలుచోట్ల వత్సలభక్తిని ప్రకటించాడు. అన్నమయ్య కూడా పై వారివలెనే తన సంకీర్తనల్లో వాత్సల్య రసాన్ని ప్రవహింపజేశాడు. కొన్నిచోట్ల తానే యశోదగా

మారినాడు. నందుడైనాడు. దేవకిగా రూపించాడు. వసుదేవుడిగా భావించుకున్నాడు. ఇన్ని రూపాల్లో అన్నమయ్య గోపబాలుడిపై వాత్సల్య రసామృతాన్ని చిందించాడు.

ఈ శీర్షికలో ఉగ్గుపాట, లాలిపాట, ఉయ్యాలపాట, జోలపాట. చందమామపాట, దోబూచిపాట, మేలుకొలుపుపాటలు పరామర్శకు వస్తాయి.

వరుసక్రమాన్ని బట్టి మొదట ఉగ్గుపాట విషయాన్ని చూడాలి,

## ఉగ్గు పాట :

కన్నతల్లులు పొద్దున్నే పాల పిల్లలకు ఉగ్గుపెట్టడం ఒక నిత్య క్రియ. ఉగ్గు పెట్టడంలో ఎంతో ప్రయోజనం ఉంది. ఏవిధంగా ఆలోచించినా 'ఉగ్గుపెట్టడం' పసిపిల్లల ఆయురారోగ్య అభివృద్ధికే అన్నది అసలు సంగతి. తల్లులకు ప్రొద్దున్నే ఇదొక ప్రధాన కార్యక్రమం. అంతస్తునుబట్టి రకరకాల ఉగ్గుగిన్నెలు ప్రసిద్ధాలే. తల్లి కూర్చుని, కాళ్ళను గుజ్జిగాచాచి బిడ్డను వెల్లకిలా పడుకోబెట్టుకొని వ్రేలితో గిన్నెలోని ఉగ్గును తీసికొని నోటిచెలమ వెంబడి జారవిడువడం పద్ధతి. అప్పట్లో ఉగ్గుమందు ఘాటుకు బిడ్డ ఏడ్చినా ఏడవవచ్చు ఉగ్గుపెట్టేటప్పుడు తల్లులు 'ఉగ్గుఉగ్గు' అంటూ మాటలు చెప్తూ పాటలు పాడతారు. బిడ్డ దాన్ని మింగే టప్పుడు 'ఉగ్గున్గ్గ్' అని ఏడుస్తూ ఉంటాడు. ఇందులో ఇది ఉగ్గేనుసే అది వద్దు వద్దు అనే అర్థం స్ఫురించేటట్లు అనిపిస్తుంది.

ఉగ్గు మందులో మూలిక దినుసులు వేస్తారు. త్రికటుకాలు, చనుబాలు మొదలైనవి గిన్నెలో రంగరించి ఉగ్గుమందును తయారు చేస్తారు. ఉగ్గుపెట్టిన తర్వాత గిన్నెలో కొద్దిగా మిగిలిన మందును పొట్టకు, గుండెలకు బాగా రాచుతారు. వాత, పిత్త, శ్లేష్మాది దోషాల్ని పరిహరించేదానికి ఉగ్గు మందు పిల్లలకు తప్పనిసరి. విపరీతమైన

నాగరికత ముదిరినందువల్ల ఇది ఈనాడు లోపించింది. కాని ఇప్పటికీ మారుమూల ప్రదేశాల్లో ఉగ్గుపెట్టడం ఉండనే ఉంది.

'ఉగ్గు ఆధారంగా ఉగ్గుపాటలు బయలుదేరాయి. వీటనే ఉగ్గు పాటలు, పాలపాటలు మొదలయిన పేర్లతో పిలవడం ఉంది. ఇది తెలుగుతల్లి సాంప్రదాయమని, తల్లి బిడ్డకు ఉగ్గుపెట్టూ ఆశీర్వదిస్తుందనీ ఇది బిడ్డ పెరుగుదలకే అని ఉగ్గుపాల విశిష్టతను డా॥ వెలగా వెంకటప్పయ్యగారు వివరించారు.1 తాను పాడే ఉగ్గుపాట తన బిడకు అర్థంకావాలని కాదు. పాడుతూ తల్లి అవ్యక్తమయిన ఒకానొక ఆనందానుభూతిని పొందుతుందని వారే అన్నారు.

అనుదినం పాపాయితో కలిగే ప్రవృద్ధి సంస్కృతిలో సంగమింపజేసేదానికి బాలగేయాలు మధురాలంబన విధానాలని అంటారు ఉగ్గుపాట అనే కావ్యంలో తల్లీబిడ్డలే పాత్రలు. తల్లిమాటలు బిడ్డకు తెలియవు. కాని అర్థంచేసుకున్నట్లే చూస్తుంది, బిడ్డకు భాషరాకున్నా ఆమె మనసును తల్లి తెలుసుకుంటుంది. భాషకు అతీతమయిన భావం ఇందులో కన్పిస్తుంది. శిశువులో పరబ్రహ్మతత్వం, తల్లిలో తన మాతృత్వస్థితి ఇక్కడ ఉపస్థిలుగా ఉంటాయి. తనకు తెలిసిందాన్ని బిడ్డ గ్రహించాలనే తల్లి అవిరళ ప్రయత్నం చేస్తుంది.

---

1. పిల్లల పాటలు పుట-56.

"ఊ ఊ ఉంగన్న - ఉగ్గుపాలు యిందన్న
గుండెడు ఉగ్గు కమ్మన్న - ఉమ్మక కక్కక మింగన్న
జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం
గుండ్రాల్ దిన్న గుగ్గిళ్ళరిగి
ఏనుగుల్ దిన్న ఎలక్కాయలరిగి
అబ్బాయితాగిన పాలు అముదం అరిగి

బిడ్డచేతిని తన చేతితో పట్టి ఊపుతూ తల్లి పాట పాడుతూ ముసి ముసి నవ్వుల్తో మాట్లాడినట్లే ఉంటుంది.1 ఈ క్రియ బిడ్డకు సున్నిత వ్యాయామం ద్వారా ఒళ్ళుచేయడాన్ని కల్గిస్తుంది. కనుక ఉగ్గు మందును కడుపులో పోయడమే కాక అది గొంతులో దిగి బిడ్డకు కడుపులో చేరేదాకా తల్లి మాటలు చెప్తూ పాటలుపాడుతూ ఒళ్ళుతీడుతూ ఉంటుంది.

బిరుదురాజు రామరాజుగారు తెలంగాణా ప్రాంతంలో వాడుకలో ఉన్న ఉగ్గుపాట ఉపయోగాన్ని చక్కగా తెల్పినారు.

తల్లి తన తొడల మీద బిడ్డను కూర్చొబెట్టి, ఒక చేతిని వీపుపైన మరోచేతిని రొమ్ముపైన ఉంచి పాట పాడుతూ ముందుకూ, వెనక్కు ఊపుతూ తానుకూడా ఊగుతుందని, బిడ్డ 'ఊ ఊ' అంటూ ఊగుతాడని, తద్వారా పాపశరీరానికి పరిశ్రమ కల్గుతుందని తెలిపారు.2

---

1. "చేయూచమ్మా చేయూచు
సంతకు బోదాం చేయూచు
సెనగలు తిందాం చేయూచు
చల్లగ తింవాం చేయూచు" అని అంటుంది. ఇందులో 'చేయూచు' ప్రయోగంలోని ఊపు భాషలోనే గాక క్రియారూపేణా తల్లి చూపిస్తుంది. బిడ్డతో చేయిస్తుంది.

2. ఊగూ ఊగూ గంగెద్దా
ఉగ్గుపాలే గంగెద్దా
సోల ఊగు గంగెద్దా
సోలెడు పాలె గంగెద్దా

........................ఇలా ఇంకా ఇంకా ఉంది ఈపాట.

-జానపద బాలగేయ సాహిత్యం (తెలంగాణా పల్లెపాటలు)
డా॥ M. K. దేవకి, పుట-107

అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనల్లో కనిపించే ఉగ్గుపాటను గమనించాలి. దొరికినంతవరకు ఒకే ఒక అన్నమయ్య ఉగ్గు పాట కన్పిస్తుంది.

ఈపాటలో 'ఉగ్గు' అనేమాట పల్లవి మొదట్లోనే అవృత్తమైంది ఉగ్గుపెట్టేముందు, తర్వాత తల్లి బిడ్డకుచేసే క్రియలన్నిటినీ అన్నమయ్య ఆత్మీయతా భావంతోకూడిన పారవశ్యంతో 'చతురస్రగతిలో' వర్ణించాడు.

ఇందులో అన్నమయ్య యశోదగా తాదాత్మ్యం చెందాడు. వాత్సల్యానికి రసత్వసిద్ధి ఉందో లేదో కాని, రసాను భూయమానమైన ఈ కీర్తనలో వాత్సల్యం రసస్థితిని తాకింది. దీనికి మూలమైనకీర్తన రూపం ఇలా ఉంది.

[1]ఉగ్గు పెట్టరే వోయమ్మా, చె
య్యొగ్గె నిదే శిశువోయమ్మా ॥పల్లవి॥

కడుపులోని లోకమ్ములు కదలీ
నొడ వొనకురే వోయమ్మా
తొడికెడు సరుగున దొలగ దియ్యరే
వుడికెటి పాలివి వోయమ్మా ॥ఉగ్గు॥

చప్పలు వట్టుక సన్నపు బాలుని
నుప్పర మెత్తకు రోయమ్మా
అప్పుడే సకలము నడి మీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గు॥

తొయ్యలిటు చేతుల నలిగించక
వుయ్యల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
నొయ్యక తిట్టకు రోయమ్మా ॥ఉగ్గు॥

---

1. రాగం భైరవి, సంపు_12, సంకీ_97, శృం. సం.

పరమాత్మ స్వరూపుడైన బాలకృష్ణుణ్ణి గోపకాంతలు క్షణమైనా విడిచి ఉండలేరు. వారిది పరమాత్మను అణురూపంలో దర్శించికూడా తరించలేని జీవుల పరిదేవనం. అందుకే మరల మరల ఆ పరమ శిశువును చూచేదానికి, తాకేదానికి వాళ్ళు తహ తహ పడుతూ ఉంటారు. చూస్తూనే వాళ్ళు ఏదో ఆనంద లోకంలో ఉన్నట్లు అదోలా అయిపోతారు. బాలుణ్ణి బొమ్మలాగా ఆడించారు. గిరగిర తిప్పారు. యశోద పరుగుతో వచ్చి ఉగ్గు పెట్టమనింది, ఆ నెపంతో వారు బాలుణ్ణి చేతిలోకి తీసుకొని కదిపినారు. అలా కదుపుతున్నప్పుడు చూసిన యశోద 'అయ్యో! కడుపులో బ్రహ్మాండాలు కదిలిపోతాయి' అని మందలిస్తుంది. ఊడుకు పాలను తనబిడ్డడు ఎక్కడ తాగుతాడో అని బాలుణ్ణి దూరంగా తీయమంటుంది. బాలుణ్ణి పైకెత్తి గోపికలు బంతులాడారు. అప్పుడు యశోద 'అలా చేస్తే బాలుడు సృష్టినంతా చప్పరిస్తాడు అని అంటుంది. పసివాణ్ణి ఎందుకు నలుపుతారు. ఉయ్యాల్లో ఉంచండి' అని మందలిస్తుంది. 'కొండల తిమ్మని' ఏమీ అనకండి తిట్టకండి అని, గోపికలు బాలుణ్ణి ముద్దుగా తిట్టిన తిట్లను వారిస్తుంది, తన బిడ్డ విషయంలో 'కొయ్యమాట' పనికిరావని అంటుంది, తనబిడ్డ 'ఏడుకొండలవాడే' (కొండల తిమ్మని) అని అంటుంది.

ఇది ఈ పాట సారాంశం. ఇందులో అన్నమయ్య బ్రహ్మాండ భాండోదరుడిగా బాలకృష్ణుణ్ణి భావించాడు. వేంకటేశ్వరుడిగా రూపించాడు.

తరువాత అన్నమయ్య ఉయ్యాల పాటలు,

## ఉయ్యాల : లాలి :

ముందు ఉయ్యాలపాట గూర్చిన కొంత పరిచయం చేయడం అవసరం.

భక్తులు ఇష్టదైవాలకు ఎన్నో రీతుల్లో సేవలు చేస్తారు. అలాగే ఉయ్యాలసేవ కూడా ఒకటి. ఏడుకొండలవారి అశేష ఉత్సవాల్లో 'డోలోత్సవం' కూడా ఉంది. స్వామికి జరిగే బ్రహ్మోత్సవాల్లో ఊరేగింపుకు పూర్వమే డోలోత్సవం నిర్వహించడం ఒక ఆచారం. అరవంలో ఇది 'ఊంజల్ సేవ'గా ప్రసిద్ధం. తిరుమలలోని అద్దాల మేడలో చేయబడే డోలోత్సవం (ఊంజల్ సేవ) ఆర్జితోత్సవరూపంలో జరుగుతుంది. ఆ దేవుడి ఏకాంత సేవలో కూడా ఉయ్యాలసేవ రోజూ జరిగే వేడుకే.

భక్తి సాహిత్యంలో, విశేషించి దాససాహిత్యంలో రకరకాల ఉయ్యాల పాటలున్నాయి. శైవులు, మాధ్వులు, వైష్ణవులు ఎందరో ఈ పాటల్ని పాడుతూ ఉయ్యాలసేవల్ని చేసినవారే.

మధ్వమతానుయాయులకు శ్రీకృష్ణుడు ఆరాధ్యదైవం. ఆ బాల కృష్ణుణ్ణి ఉయ్యాల్లో ఉంచి గోపికాగీతాల్లో కీర్తించడం ఉంది.

వైష్ణవంలో ఈ సంకీర్తన విధానం హెచ్చు. అన్నమయ్య 'ఉయ్యాల పాటలు' సంస్కృతాంధ్రాల్లో వ్రాశాడు. తెలుగులో ఆయన డోలోత్సవ సంకీర్తనలు ప్రస్తుతం పరామర్శించబడ్డాయి. సంస్కృతంలో ఆయన వ్రాసిన ఒక డోలోత్సవం కీర్తన కన్పిస్తుంది.1

ఉయ్యాలపాటే లాలిపాటలుగా కూడా అన్నమయ్య కీర్తనల్లో కన్పిస్తుంది. ప్రతి పాదాంతంలో "ఉయ్యాల" అన్న శబ్దం ఊత పదంగా ఆవృత్తి కావడంవల్ల ఇవి ఉయ్యాల పాటలుగా ప్రచారం పొందాయి.

---

1. డోలాయాం డోలాయాం చల డోలాయాం హరే డోలాయాం-ఇత్యాది రాగం-వరాళి, సంపు-7, సంకీ-140, రేకు-175, ఆధ్యా. సం.

బాలకృష్ణుడి ఉయ్యాలపాటకు ముందు ఆతడి విష్ణ్వంశను నిరూపించే ఏడుకొండలవాణ్ణి ఉయ్యాలలో అన్నమయ్య ఊపినతీరు పరిశీలించడం సమంజసం.

"అలరజంచలమైన" అన్న పల్లవితో కూడిన "ఆహిరి"రాగంలో సాగిన ఈకీర్తనలో కమలాదేవిని, భూదేవిని కూడా చేర్చి అన్నమయ్య స్వామిని ఉయ్యాలలో ఉన్నట్లు భావించి కీర్తించాడు.

ఇందులో ఆయన స్థితి కార్యరూపమైన విరాడ్రూపాన్ని, విభవాన్ని కీర్తించాడు. పూర్వ పశ్చిమాద్రులే కంభాలుగా, ఆకాశం అడ్డదూలంగా, నాలుగు వేదాలు బంగారు చేరులుగా దాన్ని ధర్మదేవత పీఠంగా భావించాడు.

శ్రీదేవిని ఒక ఊపులో, భూదేవిని మరో ఊపులో కౌగిలించుకునే తీరులో, అమరాంగనలకు హావభావ విలాసాన్ని చూపుతూ ఉయ్యాల ఊచబడిందని, కమలాసనాది దేవతలకు ఇది ముదావహమైందని' ఇది వేంకటశైలపతి ఉయ్యాల అని అన్నమయ్య ఉత్ప్రేక్షా మహితంగా వర్ణించాడు. ఇది భావనాబంధురమైన 'ఆహిరి' రాగంలో సాగిన ఒక కీర్తనా విశేషం.

"అలరజంచలమైన ఆత్మలందుండ నీ యలవాటు సేసె నీ ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ భావంబు దెలిపె నీ
ష్యయ్యాల ॥పల్లవి॥

ఉదయాస్తశైలంబు లొనరగంభములైన వుడు మండలము మోచె
నుయ్యాల
అదన నాకాశ పద మడ్డదూలంబైన అఖిలంబునిండె నీ వుయ్యాల
పదిలముగ వేదములు బంగారుచేరులై పట్టివెరపైతోచె నుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల వర్ణింప నరుదాయె
వుయ్యాల ॥అల॥

ఘేలుకట్లయి మీకు మేఘమండలమెల్ల మెఱుగునకు మెఱుగాయ నుయ్యాల
నీలశైలమువంటి నీమేని కాంతికిని నిజమైనతొడవాయ నుయ్యాల
పాలింద్లుగదలగాబయ్యెదలురాపాడభామినులువడిసూచు నుయ్యాల
ఓల. బ్రహ్మాండములు వొతగునోయని భీతి నొయ్యనొయ్యన వూచి రుయ్యాల ॥అల॥

కమలకును భూపతికి కదలు కదలుకు మిమ్ము గౌగలింపగజేసె నుయ్యాల
అమరాంగనలకు నీ హావభావ విలాస మందంద చూపె నీను యాల
కమలాసనాదులకుగన్నులకుపండుగై గణుతింపనరుదాయనుయ్యాల
కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు కడువేడుకై నుండె నుయ్యాల"1 ॥అల॥

'అలరజంచలమైన నీ అలవాటుసేసె నీ ఉయ్యాల' ప్రయోగం ఆత్మచాంచల్యాన్ని ఉయ్యాల అలవాటు చేసిందనీ, రెండవ చరణం వల్ల అది ఉచ్ఛ్వాస నిశ్వాస రూపంగా ఉందనీ ప్రాణచైతన్యాన్ని అన్నమయ్య ఇందు ధ్వనింప చేశాడు. దీర్ఘమైన ఉయ్యాల ఊపులు దీర్ఘమైన ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా భావించడం అన్నమయ్య తాత్విక భావనా విశేషం.

ఉదయాస్త శైలాలు కంభాలు కావడం ఉడుమండలం మోయడం ఉయ్యాలయొక్క విశ్వలీలల్ని తెలుపుతుంది. ఈ భావాన్నే 'ఆకాశపదము అడ్డదూలము', 'అఖిలంబు నిండె' ప్రయోగాలు బలపరుస్తున్నాయి,

వేదాల్ని తాళ్ళుగా చేయడం, ఆ ఉయ్యాల్ని ధర్మదేవత పీఠంగా భావించడంలో వేదాలకి ధర్మానికి ఉన్న సంబంధమే కాక

---

1. రాగం_అహిరి, సంపు_1, సంకీ_67, రేకు_10, ఆధ్యా. సం.

వేదోద్ధరణ తత్పరుడైన విష్ణువు అవతార విశేషాన్ని కూడా సూచించడం జరిగింది.

మేఘమండలమే మేలుకట్లుగా నీలశైలంవంటి స్వామి మేని కాంతికి నిజమైన తొడవైన ఉయ్యాలను బ్రహ్మాండాలు ఒరుగుతాయేమో అనే భీతితో 'పాలింగ్లు కదలగా వయ్యెదలు రాపాడ', 'భామినులు వొయ్య నొయ్యెన ఊచినారట' ఇలాంటి తత్వభావన వాసనా వాసితాలైన విశేషాన్ని భక్తికి ఎత్తిన దీపాలుగా వర్ణించడం అన్నమయ్యవంటి వాళ్ళకే వీలవుతుంది.

మరో కీర్తనలో అన్నమయ్య 'శ్రీరంగ శిశువు'కు వేంకటేశుడికి అభేదాన్ని పాటించి పాడిన ఉయ్యాలపాట రమణీయంగా ఉంది. మర్రాకు తొట్టెలో శ్రీరంగ శిశువు ఊగినట్లు భావించాడు. కావేరినదిని ఒక కలికిగా భావించి తరగల బహులతల్లో రంగ మధ్యపు తొట్టెలో చిలపాల సెలవితో ఊగినట్టి రంగశిశువును అన్నమయ్య దర్శించాడు.

అంతేగాక వేదాలే చేరులుగా శేషుడేపాదుకొన్న తొట్టెగా శ్రీదేవితో కూడిన వేంకటేశుడు సేద తీరినాడని అన్నమయ్య పరవశంతో వర్ణించాడు.

"తొల్లి యును, మఱ్ఱాకు తొట్టెలనె యూగె గన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు ॥పల్లవి॥

కలికి కావేరి తరగల బహులతలనే
తలగకిటు రంగమధ్యపు తొట్టులన్
పలుమారు దను నూచి పాడగా నూగీని
చిలుపాల సెలవితో శ్రీరంగ శిశువు ॥తొల్లి॥

అదివో కమలజుని తిరువారాధనం బనగ
అదన గమల భవాండమను తొట్టెలన్

ఉదధులు తరంగముల నూచంగా నూగిని
చెదరని సిరులతోడ శ్రీరంగ శిశువు ॥తొ్లి॥

వేదములె చేరులై వెలియంగ శేషుడే
పాదుకొను తొట్టెలై పరగగాను
శ్రీదేవితోగూడి శ్రీవేంకటేశుడై
సేదదేరెడి వాడె శ్రీరంగ శిశువు"1 ॥తొల్లి॥

ఇందులో మర్రాకు తొట్టి కల్పాంత సమయ మహాజలనిధిలో విష్ణువు అవతారాన్ని సూచిస్తుంది. కావేరి అందమయిన నది. అందుకే అన్నమయ్య 'కలికి' శబ్దాన్ని వాడినాడు. తరగల్లో బహులతల్ని ఆరోపించిన అన్నమయ్య అలంకారిక సమయజ్ఞత సర్వసహృదయ సమ్మోదావహం.

రంగమిధ్యపు తొట్టి ఒక విశ్వడోల, చిలుపాల 'సెలవితో' ఉన్న రంగ శిశువులో బాలకృష్ణుడు తొంగితొంగి చూస్తూనే ఉన్నాడు.

అన్నమయ్య ఉయ్యాలపాటల్లో సాహిత్యపు పాలుకంటె సంగీతపు పాలే ఎక్కువ అనిపిస్తుంది. అందుకే ఆయన 'ఆహిరి" రాగాన్ని ఎన్నుకున్నాడు.

ఉయ్యాలపాటలే లాలిపాటలుగా చెప్పాలి 'లాలిలాలి' అన్న శబ్దాలు తరచుగా పాదాది పాదాద్యంతాల్లో రావటంవల్ల వీటికి లాలి పాటలని కూడా పేరే. ఇది ప్రధానంగా రెండు రకాలుగా కన్పిస్తాయి. అవి శైవవైష్ణవ భేదాలే. శైవసంబంధమయిన ఈ లాలిపాట గమనించదగ్గది.

"లాలి అనుచు పూచేరు లలన లిద్దరునూ
పాలలోచన నిన్ను పాన్పుపై నిని చెలాలీ ॥పల్లవి॥

---

1. రాగం_ఆహిరి, సంపు_11, వెం.భా. సంకీ_1, రేకునిడురేకు_4 అ.సం.

శ్రీగురుని పాదములు చేరి సేవింతూ
నాగభూషణ నిన్ను నాత్మ లోనుంతు
ఆ గణాధిపు పాద మమర బూజింతూ
బాగుగా ప్రమద గణభావ మర్దింతు లాలీ ॥లాలి॥

కరచరణములు శాయి స్తంభములు గాంగ పరగ
దశవాయువులు పగ్గములు గాంగా
వురు లింగమూర్తి దా వుయ్యాల లూంగా ॥లాలి॥

........ ........ ........

లాలి చిద్రూపాంగ లాలియ్య లాలీ
లాల సజ్జన హృదయ లానియ్య లాలీ
ఆ పిడుపర్తీశ లాలియ్య లాలీ
ఆ సర్వేశ లాలియ్య లాలీ

లాలి శంకర సదాలాలిత కుమారా
లాలి పటు తాండవోల్లాస ఘనధీరా
లాలి పంచాస్య కైలాస సంచారా
లాలి మధురాలాప లాలి గంభీరా

పతిత పావన రుద్ర ఫణిరాజభూషా
జిత కాలకూట వర్ణిత భవ్యవేషా"[1]

ఇందులో ఆత్మవిచారం చిదచిత్తుల విషయం, శివుడి రూపం పిడుపర్తీశుడి విక్రమం భావితాలయ్యాయి.

అలాగే వైష్ణవాత్మకమయిన ఈ లాలిపాట అన్నమయ్యది కాకపోయినా బాలకృష్ణుడికి సంబంధించిందే కావడంవల్ల గమనించ దగ్గది.

---

1. అన్నమయ్య సంకీర్తనల్లో జానపదగేయ ఫణితులు. డా॥ పోన్నా లీలావతి. పుట_124.

లాలి మార్కండ లాలీ
మామయ్యలాలి యోగ్యశాలీ
లాలనుచు బాడరమ్మా
||త్రి|| ఈ బిడ్డ లక్ష్మీవిలాసుడమ్మా
శ్యామలా కారుడమ్మా
ఈ బిడ్డ లీలావతారుడమ్మా
కరమునా కంకణమ్మా
||త్రి|| ఈ బిడ్డ శిరమునా పింఛమమ్మా ...... .... ... ....
శిరమునా పింఛమమ్మా
ఈ బిడ్డ పురమునా శ్రీవత్సవమ్మా
ఈ బిడ్డ హరియనుచు బాడుడమ్మా"1

ఇందులో మార్కండశబ్దం బాలుడి చిరంజీవతను సూచిస్తుంది. 'మామయ్యలాలి' ప్రయోగం ఉయ్యాల ఊపులో కంసుణ్ణి దూరంగా తన్నినట్లు సూచితమౌతుంది. లక్ష్మీవిలాసుడని. శ్యామలాకారుడని, లీలావతారుడని, కరాన కంకణం, సించ పింఛము, ఉరములో శ్రీవత్సం ఉన్నబిడ్డ 'హరి" అనీ పాడమని ఇందులోని భావం,

ఇలాంటిదే మరో కీర్తన ఉంది. మాధవ, గోవింద, అచ్యుత, కేశవ రఘురాములకు అభేదాన్ని ప్రతిపాదించి చెప్పబడింది ఈ కీర్తన.

"లాలి మాధవుడ లాలీ
గోవిందలాలి అచ్యుతుడలాలీ
లాలి కేశవుడ లాలీ
హరిహరీ బాల రఘురామ లాలీ"2

---

1, 2. అన్నమయ్య కీర్తనల్లో జానపదగేయ పణితులు – డా॥ పొన్నా లీలావతి, పుట–135.

ఇందులో అనేక రూపాల్ని, నామాల్ని ధరించిన రఘురామ బాలుడి లాలిని ప్రస్తావించడం జరిగింది.

తర్వాత అన్నమయ్య సంకీర్తనల్లోని లాలిపాటల్ని గమనించాలి. అందులోనూ బాలకృష్ణ సంబంధాలైన వాటిని పరామర్శించాలి.

మొదట "బాలగండవర గోపాల బాలుడి" లాలి పాటను పరిశీలించడం జరుగుతుంది. ఇది 'శ్రీ'రాగంలో జంపెతాళంతో సాగిన కీర్తన.

"లాలనుచు నూచేరు లలన లిరుగడల
బాలగండవర గోపాల్ల నినుజాల ॥పల్ల॥
ఉదటు గుబ్బల సరము లుయ్యాల లూగ
పదిరి కంకణరవము బహుగతుల మ్రోగ
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీగ
ముదురు చెమటల నళికములు తొప్పదోగ ॥లాల॥
సొలపుతెలి గన్నుగవ చూపులిరువంక
మలయ రవళులకు బలుమాటును బెళంగ
కొలది కోవిల గముల క్రోలు మదనాంక
ముల గ్రేణిసేయు రవములు వడి దలంక ॥
సరస పదముల జంగ చాపుచ్ఛే బాయ
గురులీల మీగాళ్ళ గుచ్చె శృంరాయ
కరమూలముల కాంతి కడు జాయ జేయ
సరస నురుకుంకుమ వాసన లెదుర్కుదాయ ॥
కొలది నును మేను లతకూన బసి యాడ
మెలకకువతో నొక రొకరి మెచ్చిపరి గూడ
తల్లలూచి చొక్కిలి త్తరు బొమ్మలాడ
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ ॥లాల॥

లలిత తాంబూల రసకలితంబులైన
తళుకు దంతముల కెంపుల గుంపులీన
మొలక వెన్నెల చాలు ముసురుకొని తోన
బెలగి నెలవుల ముద్దు చిరునవ్వులాన ॥లాల॥

మలయ మారుత గతులు మాటికి జెలంగ
పలుకు గపురపు తావిపై పైమెలంగ
బలుగాన లహరి యింపులు రాల్గరగంగ
బలసి వినువారి చెవి బడలిక దొల్గంగ, ॥లాల॥

లలనాజనా పాంగలలిత సుమచావ
జలజలోచన దేవ సద్గుణ కలాప
తలుపులోపల మెలగ తత్వ ప్రదీప
భళిర గండరేశ పరమాత్మ రూప"1 ॥లాల॥

ఇందులో ఊయ్యాల ఊచే ఊవిదల వర్ణన ఉంది. ఊదుట గుబ్బలమీది సరాలు ఊయ్యాలలు ఊగగా, కంకణరవాలు మ్రోగగా కొప్పులు చెంపలపై వ్రాలగా, ముదురు చెమటల్తో నుదురు తొప్ప దోగగా, తెలిగన్నుల్లో చూపులు ఇరువంకల పారగా, కోయిలగణాలు మదనాంకాలను క్రేణిసేసేరవాలు తలకగా, సరస పదాలు జంగ చాపుచే పాయగా, కురులు మీగాళ్ళ కుచ్చెల్లు రాయగా, కరమూల కాంతి ప్రకాశింపగా, సరస కుసుమ వాసనలు రాగా, నునుమేను లత కూనలు అలసియాడగా ఒకరితో ఒకరు మెచ్చి కూడగా ఈ మోహనా కృతుల్ని అందరూచూడగా, తాంబూల రసకలితాలైన తళుకుదంతాల కెంపుల గుంపులు వ్యాపించగా, మొలక వెన్నెల చాలు ముసురుకొని ముద్దు చిరునవ్వులు ఆనగా, మలయమారుత గతులు చెలగగా, పలుకు కపురపు తావిపైన మెలగగా, గాన లహరితో వినేవారి బడలి కలు పోగా, అపాంగ సుమ చాప కలాపం తలపులో మెదలగా, తత్వ ప్రదీపమైన రూపాన్ని ఇందులో చూడవచ్చు.

---

1. అన్నమాచార్య చరిత్ర, పీఠిక-వేటూరి ప్రభాకరశాస్త్రి పుట-63.

బాల గండవర గోపాలుడ్ని కాక ఊయల ఊచే వెలదల రూప వర్ణన పరమైన ఈ కీర్తన శృంగారాత్మకమైంది. ఇందులో అన్నమయ్య తన కైత పొగసుల్ని రాగమయంగా సంకీర్తన సుఖంగా సాగించాడు.

తర్వాతి కీర్తనలో అన్నమయ్య ఉయ్యాల పదాన్ని, పల్లవికి ముందుంచి పాడినాడు. ఇది రేపల్లె బాలుడికి సంబంధించిన లాలి పాట. ఇందులో బాలయౌవనులైన సుందరాంగులు పాటపాడే తీరు భావించబడింది.

ధ్వన్యనుకరణాలైన ధిమ్మి ధిమ్మి ఘల్లు ఘల్లు అనే శబ్దాల సంయోజనతో అన్నమయ్య దీన్ని నాట్యానుకూలంగా కూడా కీర్తించాడు.

"ఉయ్యాలా బాలు నూచెదరు కడు
వొయ్య నొయ్య నొయ్యనుచు ॥పల్లవి॥

బాల యవ్వనులు పసిడి వుయ్యాల
బాలుని వద్ద బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మయెల్ల
లాలి లాలి లాలి లాలనుచు ॥ఉయ్యాలా॥

తమ్మిరేకు గను దమ్ముల నవ్వల
వమ్ము జూపుల బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
దిమ్మి దిమ్మి దిమ్మనుచు ॥ఉయ్యాలా॥

చల్లు జూపుల జవరాండ్లు రే
పల్లె బాలుని బాడేరు
బల్లిదు వేంకటపతి జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు"1 ॥ఉయ్యాలా॥

---

1. రాగం-శంకరాభరణం, సంపు-12, సంకీ-246, రేకు-72, శృ. సం.

మొదటి పాటలో ఆరూఢ యౌవనులు ఉయ్యాలపాట పాడగా, ఇందులో బాల యౌవనలు పసిడి ఉయ్యాల్లో బాలుని యొద్ద పాడినట్లు అన్నమయ్య వర్ణించాడు. లాలి లాలి లాలి లాలెమ్మా అంటూ తమ్మి రేకు కనుదమ్ముల్లో నవ్వులు చిందిస్తూ మట్టెలు ఘిమ్మి ఘిమ్మి యనగా చూపులు జల్లే జవరాండ్రు రేపల్లె బాలుణ్ణి వేంకటపతి రూపంగా భావించి పాడారు. తాళ లయాత్మకమైన ఈ కీర్తన శంకరాభరణ రాగంలో తీగలు సాగింది.

ఈవిధంగా అన్నమయ్య ఉయ్యాల లాలిపాటల్ని ఎన్నో విధాలుగా గాన రస రంజితాలుగా, సాహిత్య రసకందాలుగా పాడి పాడి పరమాత్మ స్వరూపుడైన ఆ బాలుణ్ణి జోకొట్టి నిద్రపుచ్చేదానికి తర్వాత జోలపాట పాడాడు.

## జోల పాట :

అన్నమయ్య జోలపాట పరమరమణీయమైంది అంతేకాక చాలా ప్రసిద్ధమైంది. పాటకంటె దీని పల్లవి రాని స్త్రీ తెలుగుదేశంలో బహుశా కన్పించదేమో ఆ పల్లవితో కూడిన కీర్తన ఇలా ఉంది.

"జోఅచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామ గోవింద ॥పల్లవి॥

నందునింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవజేయంగ
నందమున వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దు రంగ ॥జో॥

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయ మిచ్చినావు

మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు ||జో||

అట్టు గట్టిన మీగడట్టె తిన్నాడే
పట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్తయడుగ విన్నాడే
గట్టిగా 'నిది దొంగ కొట్టు' మన్నాడే ||జో||

గొల్లవారిండ్లకును గొబ్బునకు బోయి
కొల్లలుగా త్రావి కుండలను నేయి
చెల్లునా మగనాండ్ర జెలగి యాశా యా
చిల్లతనములు సేయ జెల్లునట వోయి ||జో||

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీకొడుకు మా యిండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
నీ పావడే చెఱిచె నేమందు మమ్మ ||జో||

ఒకని యాలిని దెచ్చి నొకని కడ బెట్టి
జగడములు గలిపించి సతిపతులబట్టి
పగలు నలు జాములును బాలుడై నట్టి
మగనాండ్ర జేపట్టి మదనుడైన ||జో||

అంగజుని గన్న మాయన్న యిటురారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా ||జో||

గోవర్ధనం బెల్ల గొడుగుగా బట్టి
కావరమ్మున నున్న గంసు బడగొట్టి
నీవు మధురాపురము నేల జేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి ||జో||

అంగుగా దాళ్ళపాకన్నయ్య చాల
శృంగార రచనగా జెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల"1 ॥జో॥

పై పాటలోని పల్లవిలో అచ్యుత, ఆనంద, ముకుంద, పరమానంద, రామ, గోవింద శబ్దాలున్నాయి.

బాలుడు పై శబ్దాలయొక్క అర్థస్వరూపుడని భావం. ఆతడు "అచ్యుత'మైన ఆనందాన్నిచ్చే వాడని, పరమానంద రూపుడని (రామ), మనోహరమైన వాడని, గోవిందుడని అన్నమయ్య తాత్విక భావన.

నందునింటిలో చేరి చంద్రవదనలు సేవచేయగా వారిండ్లలో ఆడుతూ మందలకు దొంగ అయిన 'ముద్దు రంగడ్ని అన్నమయ్య మనసా దర్శించాడు. పాల వారాశిలో పవళించాడని, బాలుడిగా మునుల కభయ మిచ్చాడని, వసుదేవునికి ఉదయించాడని, గోపాలుడై నాడని, అట్టుగలపై కట్టిన మీగడల్ని అట్టేతిన్నాడని, కోడలు మూతిపై రాసినాడని, అత్తే తిట్టిందని, ఇదుగో దొంగ కొట్టుమన్నాడని అన్నమయ్య బాలుడి లీలల్ని వత్సలతా మధురంగా వర్ణించాడు.

కుండలలో నెయ్యి కొల్లలుగా త్రాగినాడని, మగనాండ్రను బిల్లతనాలు సేయ చెల్లునటవోయి యీశా అని అన్నమయ్య బాలుడ్ని ప్రశ్నించాడు. గోపికలు గోపమ్మతో కోపంతో నీ కొడుకు మాపుగా యిండ్లకు వచ్చి మానాల్ని చెరిచాడని విన్నవించినట్లు బాలుడికి జోల పాడినాడు.

---

1. అన్నమార్య సంకీర్తనలు - ఉదయగిరి శ్రీనివాసాచార్యులుగారు.

ఒకడి ఆలినిదెచ్చి ఒకనికడబెట్టి జగడాలు కల్పించి, పట్టపగలు నలుజాములో మగనాండ్రనే చేపట్టి మదనుడైనట్టి మదనగోపాల బాలుణ్ణి అన్నమయ్య జోకొట్టాడు.

అందుపు యశోద అభిమానంతో "అంగజుని గన్న మాయన్న యిటు రారా, బంగారు గిన్నెలో పాలుపోసేరా, సతులు నిన్ను దొంగని అంటున్నారు. వారిండ్లకుపోక ఇంటిముంగిట్లోనే మోహనాకారా నీవు ఆడుకోరా'' అని అన్నట్లు అన్నమయ్య భావించాడు.

ఈ భావనలో తన కొడుకును తప్పుబట్టిన ఒక తల్లి మానసిక ప్రవృత్తి అభివ్యక్తమౌతుంది.

అలాగే అన్నమయ్య బాలుడు గోవర్ధనాన్ని ఎత్తడాన్ని, కంసుణ్ణి పడగొట్టడాన్ని, మధురను చేపట్టడాన్ని, దేవకి పట్టిగా ఆతణ్ణి వర్ణించి తరించాడు.

కీర్తనాంతంలో తిరుపట్ల మదనగోపాలుడికి తాను హంగుగా, శృంగార రచనగా జోలను చేశాడని, సకల మంగళాలు కలగాలని మంగళ నాదాన్ని పలికించాడు.

ఈ విధంగా అన్నమయ్య జోలపాటలో ఒక ప్రత్యేకత సంతరించుకొనింది.

తర్వాత అన్నమయ్య బాలసాహిత్యంలోని చందమామపాటల్ని చూడాలి.

## చందమామ పాట :

తల్లులు పసిబిడ్డలకు, ఏడ్పించి మారాము చేసేటప్పుడు, పాలు ద్రాపేటప్పుడు, గోరుముద్దలు తినిపించే టప్పుడు, చంక నెత్తుకొని

తిప్పుతూ వెన్నెల్లో తిరుగుతూ, చందమామను చూపుతూ పిల్లలకు ఉల్లాసాన్ని కల్పిస్తూ పాడేపాట చందమామ పాట.

అన్నమయ్య తన చందమామ పాటలో, బాలకృష్ణుడి వైష్ణవ విభవాన్ని స్మరిస్తూ వేంకటేశ్వరుడికి అభేదాన్ని పాటించి చందమామ వెన్నపాలు 'చందనపు పైడికోరలో' తెమ్మంటాడు. ఈ పాట లోక వ్యవహారంలో చాలా ప్రసిద్ధమైంది.

"చందమామ రావో జాబిల్లి రావో మంచి
కుందనపు పైడి కోరవెన్న బాలుదేవో ॥పల్లవి॥
నగుమోము చక్కని యయ్యకు నలువ బుట్టించిన తండ్రికి
నిగమము లందుండే యప్పకు మా నీలవర్ణునికి
జగమెల్లనేలిన స్వామికీ జక్కని యిందిర మగనికి
ముగ్గురికి మొదలైన ఘనునికి మా ముద్దుల మురారి బాలునికి ॥చంద॥
తెలిదమ్మి కన్నులమేటికి మంచి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతల కోడెకు మాకతలకారి యీ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచిగుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండు వొయ్యారికి నవవిధులచూపులజూచే సుగుణకు ॥చంద॥
సురలు గాచిన దేవరకు చుంచు గరుడని నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మా నీటు చేతల పట్టికి
విరుల వింటివాని యయ్యకు వేవేలు రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా వేంకట నాథునికి"1 ॥చంద॥

పై కీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడికి చతుర్వింశతి విశేషణాల్ని షష్ఠిలో ఉపయోగించి అలాంటివానికి 'కుందనపు పైడికోర'లో 'వెన్న పాలు తెమ్మని చందమామ రావో జాబిల్లిరావో' అనిపిలుస్తాడు.

---

1. అన్నమయ్య సంకీర్తన-144, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు, రాగం సౌరాష్ట్రం.

ఈవిశేషణ ప్రయోగాల్లో బాలకృష్ణుడి అందం, మహిమ, రక్షణక్రియ మొదలైన అంశాల్ని అన్నమయ్య ప్రతిపాదించాడు. చివర్లో మా శ్రీవేంకటనాథునికి' అని అంటూ శ్రీకృష్ణుడిలో అభేదాన్ని చాటించాడు పై విశేషణాల్లోని 'కతలకారి' ప్రయోగం కృష్ణలీలల్ని సూచిస్తుంది. "వేవేలు రూపుల స్వామి" అన్న ప్రయోగం అసంఖ్యాకాలైన భగవదవతార విశేషాల్ని సూచిస్తుంది.

భక్తిరూపమయిన సాహితీ నిబంధనల్లో విశేషణాలకు ప్రాముఖ్యం ఎక్కువ. అవి భగవంతుడి రూప, గుణ, స్వభావాదికాన్ని నిరూపిస్తాయి. ఉత్తాలమైన భక్తి, ఉదాత్తమైన భావం కలిసి ఈ కీర్తనగా పరమ వాగ్గేయకారుడైన అన్నమయ్య తంబుర తీగలపై ప్రసరించి దిగ్దిక్కులకు వ్యాపించింది.

తర్వాత క్రమాన్ని బట్టి అన్నమయ్య 'దోబూచి' పాటలో బాలకృష్ణ భగవంతుణ్ణి దర్శించిన విధానాన్ని చూడాలి.

## దోబూచి పాట :

'దోబూచి' బాలక్రీడా విశేషం పసిబిడ్డల్ని ఉల్లాసపరచి ఆడించేటప్పుడు ఇలాంటి పాటలు పాడడం లోకంలో కన్పిస్తుంది. తల్లి తన కండ్లను మూసుకొని బిడ్డను మరిపించి కన్నులు తెరిచి 'అదిగోబూచి', 'ఇదిగోబూచి' అంటూ ఆడిస్తుంది. ఇదే బిడ్డ ఎదిగిన తర్వాత దాగిలి ముచ్చులాట అవుతుంది. కొన్ని ప్రాంతాల్లో "దొంగదొర ఆట" అని కూడా అంటారు. శైశవదశలో తల్లి, బిడ్డ ఇద్దరే ఈ ఆటలో పాల్గొంటారు. ఇలాంటి ఆటవల్ల బిడ్డలో చురుకుదనం, ఉత్సాహం, ఆలోచనా శక్తి క్రమంగా పెరుగుతాయి. పాదాంతంలో "బూచి, దోబూచి" శబ్దాలు అవృత్తమౌతుంటాయి. ఒకరకంగా ఇది "తందాన" పాటలాగా ఉంటుందని కూడా భావించేదానికి వీలుంది. "తందాన" శబ్దం ప్రతి పాదాంతంలో ఉండడమే దీని సాదృశభావనకు అలంబనం.

అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనల్లో 'దోబూచి'పాటకన్పిస్తుంది ఇది చతురస్రగతిలో సాగింది.

'బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచి ॥పల్లవి॥

పెరుగు వెన్నలు బ్రియమున వే
మరు ముచ్చిలించు మాయకాడు
వెరవున్న దన విధము దాచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి ॥బండి॥

గొల్లపల్లెలో యిల్లిల్లు జొచ్చి
కొల్లలాడిన కోడెకాడు
యెల్లయినా వేంకటేశుం డిదే
తొల్లిటి దొంగవచ్చె దోబూచి"1 ॥బండి॥

ఇందులో కృష్ణలీలలు ప్రధానంగా కన్పిస్తాయి. "బండి విరిచి పిన్నపాపలతో నాడి, దుండగీడువచ్చె దోబూచి" అంటూ ఈ పాట సాగుతుంది. అన్నమయ్య ఈపాటలో ప్రతి పాదాంతాన్ని 'దోబూచి' శబ్దంతో ముగించక, నాలుగు నాలుగు పంక్తులకు పునరావృత మయ్యేట్లు ఈ శబ్దాన్ని ప్రయోగించాడు. పాట మొదట్లో ఉన్న రెండు పాదాలు, ప్రతి వాక్య గుచ్ఛానికి మొదట్లో ఆవృత్త మౌతాయి. ఇందులో అన్నమయ్య కృష్ణుడి పెరుగు, వెన్నల ముచ్చిలింత, మాయ, పడుచు గుబ్బెత పరుపుపైపోక ముడికొంగు నిద్రముంపు, గొల్లపల్లెలో యిల్లిల్లుజొచ్చి కొల్లలాడడం మొదలైన విషయాల్ని వేంకటేశుడి రూపంగా భావించాడు. పరమభక్తుడైన అన్నమయ్య కవిగా, గాయకుడుగా, వెరసి వాగ్గేయ కారుడుగా ఏ భావాన్ని వెలువరించినా అది పరవశస్థాయిని అందుకొనేది గానే ఉంటుంది.

---

1. రాగం_ధన్యాసి, సంపు_12, సంకీ_227, శృ. సం.

తర్వాత బాలకృష్ణ సాహిత్యంలో అన్నమయ్య ఆలపించిన 'మేలుకొలుపు' పాటలతీరును పరిశీలించాలి. ఇవి రెండు కన్పిస్తాయి. అన్నమయ్య ఈ పాటల్ని పరిశీలించేదానికి ముందు మేలుకొలుపు పాటల స్వరూప స్వభావాల సామాన్య పరిచయాన్ని చేయాల్సిన అవసరం ఉంది.

## మేలుకొలుపు పాటలు :

భక్తిగేయ సాహిత్యంలో మేలుకొలుపు పాటలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రత్యేకించి వీటిని ఒక శాఖగా పరిగణించదగ్గ అవసరం కూడా ఉంది. భక్తులు తమ ఇష్టదేవతల్ని సూర్యోదయత్పూర్వమే (ఉషస్సులో) మేలుకొలుపుతూ భక్తి రసాత్మకంగా పాడుతారు. గనుక వీటికి మేలుకొలుపు పాటలు అన్న పేరువచ్చింది. ప్రభాత, మధ్యాహ్నిక, సాయం సంధ్యల్లో దైవాన్ని సేవించే భక్తులు వీటిని ప్రభాత సేవలో పాడతారు. ఇవే సుప్రభాతాలైనాయి. పాదారంభంలో గాని, పాదాంతంలో గాని 'మేలుకో' అన్నమాట వీటిలో కన్పిస్తుంది. 'కొలుపు" అంటే 'సేవ'. భగవంతుడు మేలుకోవడానికి చేసే సేవలో పాడబడే ఈపాటలు "మేలుకొలుపు'లైనాయి. అంతేకాక ఇవి ప్రధానంగా భూపాల రాగంలోనే ఉండడం వల్ల వీటికి భూపాలాలు అనికూడా పేరే. ఇది వైష్ణవ సంప్రదాయం. ఈ షద్భేదంతో శైవంలో కూడా ఇదే సంప్రదాయం జాలువారింది.

పాల్కురికి సోమనాథుడు ప్రస్తావించిన 'ప్రభాత' పదాలే 'మేలుకొలుపు' అని కొందరి భావన.

డా॥ S. V. జోగారావుగారి దృష్టిలో మేలుకొలుపు పాట వైతాళికగీతం. వారు దీన్ని ఇలా వివరించారు.

"ఇదియొక వైతాళిక గీతము. చిరప్రసిద్ధమైనది. యక్షగానము లందు తఱచుగనే కన్పట్టుచుండును. తఱచు దేశాక్షి, మలహరి, దేవ గాంధారి, భైరవి, జాళి, సౌరాష్ట్రి మొదలయిన ఉదయరాగాలతో ఉండును. భూపాలరాగము తోడి దాని అనుబంధము కడుప్రసిద్ధము.1

పైన చెప్పిన రాగాలు ఉదయ రాగాలు అంటే ఉదయకాలంలో ఆలాపితమయ్యే రాగాలు.

అల్లసాని పెద్దనకూడా తన మనుచరిత్రలో "లోలత్తంత్రుల మేళవింపగదవే లోలాక్షి దేశాక్షికిన్" అని అంటాడు.

డా॥ రామరాజుగారు మేలుకొలుపు పాటల్ని ఇలా వివరించారు. వైష్ణవ పరముగానున్న మేలుకొలుపులందు సాధారణముగా కృష్ణు నుద్దేశించిన వాటిలో మధురభక్తి కన్పించదు. సాధారణముగా ఈ మేలుకొలుపులు వ్రాసినవారందరును కొంత సాహిత్యజ్ఞానముకలవారే. యతిప్రాసాది నియమములు చక్కగా పాటింపబడుటయేగాక శబ్దా లంకారములు, ప్రౌఢ పద బంధములును వీనిలో నక్కడక్కడ కాన నగును.

ప్రాతఃకాలమున పల్లెపట్టులందిప్పటికిని ప్రాతఃవేళలపూజారులు మందిరములందును, స్త్రీలు చల్లచేయుచునో, ఇల్లలుకుచునో, పురు షులు కార్యములు దీర్చుకొని తమ ప్రక్కల పైననే కూరుచుండియో భూపాలరాగములందు భగవంతుని విభూతిని కొనియాడి తమ ఆత్మ లను, ఇరుగు పొరుగు సోదరులను మేలుకొల్పుదురు.2

---

1. ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర డా॥ S.V. జోగారావు పుట-340
2. తెలుగు జానపదగేయ సాహిత్యము, ఆచార్య బిరుదురాజు రామరాజు పుట-400, 403

ఇందులో రామరాజుగారు మేలుకొలుపు పాటల విషయంలో చేసిన వివరణ గమనించ దగ్గది. ఇందులో వారి సునిశిత పరిశీలన వ్యక్తమౌతుంది.

తర్వాత అన్నమయ్య బాలకృష్ణ సాహిత్యంలో సంకీర్తితాలైన మేలుకొలుపు కీర్తనాద్వయాన్ని పరిశీలించడం కర్తవ్యం.

"మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా

సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా" అన్న పాదాలు ఈ కీర్తనకు జీవనాడులు లీలామానుషవేషధారి అయిన శ్రీ మహావిష్ణువును మేలుకొల్పడమే ఈ గీతానికి లక్ష్యం. నిత్యజాగ్రత్ ప్రత్యగ్ర ప్రగతి శీలుడైన మహావిష్ణువును మేలుకొలపడ మేమిటి అన్న సందేహం సామాన్యులకు కల్గుతుంది. కాని అది మామూలు నిద్రకాదు. యోగనిద్ర అని అన్నమయ్య పైన సూచించాడు. అందుకే మిన్నక వేసాలు మాని మేలుకోమన్నాడు. జగన్నాటక సూత్రధారి అయిన విష్ణువును యోగనిద్రనుంచి మేలుకొలిపే మిషతో అన్నమయ్య తన ప్రాభాత గీతంతో లోకాన్నే మేలుకొలుపుతున్నాడు. మేలుకొలుపు పాట సూర్యోదయం లాంటిది. ప్రత్యక్షదైవమైన సూర్యుణ్ణి, తద్వారా నూతన చైతన్యాన్ని ఆవిష్కరించేదానికి, లోకబాంధవుడైన అయన్ని ఆరాధించేదానికి ఉదయంలోనే లోకం మేలుకోవాలని మేలుకొలుపు పాట లక్ష్యం. దీన్నే అన్నమయ్య బాలకృష్ణ మూర్తికి అన్వయించాడు.

ఆవులవద్దకు దూడల్ని విడిచి పాలుపిదకాలని, పడుచులు త్రోవ కాచుకున్నారని, వాడవాడల గోపికలు ముద్దాడేదానికి వచ్చారని, యశోద పెరుగు వంటకము తెచ్చిందని, వేంకటాద్రిమీదున్న బాలకృష్ణా ! మామాటలు విన్నావుకదా మేలుకోవయ్యా అని అన్నమయ్య బాలకృష్ణుణ్ణి మేలుకోమంటాడు.

మహారాజుల్ని, దేవతల్ని మేలుకొల్పడం ఒక సంప్రదాయమే వైతాళికులు మహారాజును, భక్తులు భగవంతుణ్ణి మేలుకొలపడం ఒక మహాభోగం. భగవద్విషయంలో సేవాపూర్వకమైన భక్తుడి భక్తినిష్ఠ, ఏకాగ్రత ఈ పాటల్లో కన్పిస్తుంది.

"మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీ యోగనిద్ర చాలు మేలుకోవయ్యా ॥పల్లవి॥
ఆవుల పేయలకు గానణచీ బిదుకవలె
గోవిందుడ యింక మేలుకొనవయ్యా
ఆవలీవలె పడుచు పాటలు మరిగివచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్యా ॥మిన్నక॥
వాడల గోపికలెల్లా వచ్చి నిన్ను ముద్దాడ
గూడియున్నారిదె మేలుకొనవయ్యా
తోడనె యశోద గిన్నెతో బెరుగు వంటకము
యీడకు దెచ్చిపెట్టెనిక మేలుకోవయ్యా ॥మిన్నక॥
పిలిచీ నందగోపుడు పేరుకొనె యదెకన్ను
గొలుకులు విచ్చి మేలుకొనవయ్యా
అలరిన శ్రీ వేంకటాద్రి మీది బాలకృష్ణ
యిల మా మాటలు వింటివిక మేలుకోయ్యా"[1] ॥మిన్నక॥

ఇందులో ద్వితీయ, చతుర్థ పాదాంతాల్లో మేలుకోవయ్యా అన్న ప్రయోగం ఆవృత్తమైంది. 'మిన్నక వేసాలుమాని' అన్న ప్రయోగం అనన్య భక్తితత్పరుడైన అన్నమయ్యకు, భగవంతుడికి ఉన్న దగ్గర సంబంధాన్ని తెలుపుతుంది. పెద్దలు పిన్నల్ని గోముగా పెంచడం సహజమే ఆ చనువుతో పిల్లలు పొద్దెక్కేదాకా నిద్రించడం

1. రాగం_భూపాలం, సంపు_1, సంకీ_374, రేకు_78, అధ్యా. సం.

మామూలే. ఈ భావాన్నే అన్నమయ్య తర్వాత మేలుకొలుపుపాటలో వ్యక్తం చేశాడు.

ఈ కీర్తనకూడా భూపాల రాగంలోనే సాగింది. "హరిక్రిష్ణ మేలుకొను ఆదిపురుషా - తరువాత నామోము తప్పకిటుచూడు" అని ఇది ఆరంభమౌతుంది.

ఆది పురుషుణ్ణి మేలుకొల్పుతూ అన్నమయ్య ఆయన మేల్కొని కన్నులు విప్పుతూనే, తన మోమును తప్పక చూడమంటాడు. ఇది వాత్సల్య, భక్తిభావనా గుంభితమైన భావనా విశేషం.

తనతోడి బాలురు పిలుస్తున్నారని, నిద్రలిక చాలని, "చద్దికూళ్ళ పొద్దు వేళాయె నా తండ్రీ వేగలేవె' అని, కమలాప్తు డుదయించాడు కనులు తెరవమని, నిన్ను ముద్దాడేదానికి నీ తండ్రి నందుడు నిలిచాడనీ, దనుజాంతకుడైన నీవు ఇక లెమ్మని, నీ లీలల్ని పొగిడేదానికి దేవతలు, మునులు, నారదాదులు ఆకసంలో నిల్చారని 'వేంకటాద్రి పతి శ్రీరమణా లేవె నాతండ్రీ' అని అన్నమయ్య ఈ కీర్తనను ఆలాపించాడు.

ఇందులో 'మేలుకోవయ్యా' అన్న ప్రయోగం ఉపరి నియత స్థానాల్లోలేదు. మేలుకొలుపుల్లో ఇది ఒక పద్ధతి.

"హరిక్రిష్ణ మేలుకొను ఆదిపురుషా
తరువాత నామోము తప్పకిటుచూడు ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడినాడ
చాలునిక నిద్దరలు చద్దికూళ్ళ పొద్దు
వేళాయ నాతండ్రి వేగ లేవె ॥హరి॥

కనుదెరువు నాతండ్రి కమలాప్తు డుదయించె
వనితమొక మజ్జనము వడిదెచ్చెను

మొనపి మీతండ్రి యిదె ముద్దాడ జెలగిని
దనుజాంతకుండ యిక దగ మేల్కొనవోపె ॥హరి॥

లేవె నాతండ్రి నీలీల లటు పొగడేరు
శ్రీవేంకటాద్రి పతి శ్రీరమణుడా
దేవతలు మునులు జెందిన నారదాదులు
ఆవలను బాడేరు ఆకసము నందు"1 ॥హరి॥

ఇందులో అన్నమయ్య భౌమ, వ్యోమ చారులకు బాలకృష్ణుడితో సంబంధాన్ని కల్పించి, ఆతడి ఆదిపురుషత్వాన్ని అంటే పురుషోత్తమత్వాన్ని నిరూపించాడు.

పై విధంగా అన్నమయ్య కొన్ని విలక్షణ లక్షణాల్ని పాటించి ఆధ్యాత్మిక తత్త్వాన్ని ఇమిడించి, పైకి సామాన్యంగా కన్పిస్తున్నా లోతుకు దిగి పరిశీలించేకొద్దీ ఆలోచనామృతప్రాయంగా ఉన్న మేలుకొలుపు సంకీర్తనల్ని పాడి అటు బాలకృష్ణుణ్ణీ, ఇటు నిద్రాముద్రితమైన జగత్తును మేలుకొలిపాడు.

బాలసాహిత్యంలో బాలకృష్ణ సంబంధాలైన వాటిలో తర్వాత తద్విక్రమ సంకీర్తనల్ని పరామర్శించడం అనంతర కర్తవ్యం. ఇందులో పూతనాహరణం, కాళీయమర్దనం, గోవర్ధనోద్ధరణం, తృణావర్తసంహారం, శకటాసుర భంజనం, కంసవధ పరామృష్టాలౌతాయి,

## విక్రమ సంకీర్తనలు :

కృష్ణుడు బాల్యదశలో విక్రమంతో సాధించిన పూతనాహరణాదులకు సంబంధించిన సంకీర్తనలే విక్రమ సంకీర్తనలుగా విభాగించబడ్డాయి. భాగవత దశమస్కంధం పూర్వభాగంలోనూ, హరివంశం

---

1. రాగం-భూపాలం, సంపు-9, సంకీ-254, రేకు-294, ఆధ్యా. సం.

లోనూ అభివర్ణితాలైన కృష్ణుడి విక్రమ లీలలతో అన్నమయ్య విక్రమ సంకీర్తనలు, విశేషించి ఆయన లీలాసంకీర్తనలకు కూడా ఆకరాలైనాయి.

రక్షస్సంబంధమైన సంహారక్రియల్ని గమనిస్తే పూతనాహరణ, శకటాసుర భంజన, తృణావర్తసంహారాలు, ఉలూఖల బంధనం, వత్సాసుర, బకాసుర, అఘాసురనిర్హరణ, కాళీయమర్దనం, దావాగ్ని భక్షణం, గోవర్ధన పర్వతోద్ధరణం, గుహ్యక, వృషభాసుర, కేశిన్యా ఘుర భంజనం, కువలయాపీడ, చాణూరముష్టిక కంసాదుల సంహారం భాగవత దశమస్కంధ పూర్వభాగంలో సంగ్రథితాలైనాయి.

అన్నమయ్య సంకీర్తనల్లో పూతనాహరణ, కాళీయమర్ధన, గోవర్ధనోద్ధరణ, తృణావర్త సంహరణ, శకటాసుర భంజన, కంసవధలు కన్పిస్తాయి. వత్సాసుర, బకాసుర, అఘాసుర, వృషభాసుర సంహరణలు, కేశివ్యోమాసుర, కువలయాపీడ, చాణూరముష్టిక భంజనాలు, దావాగ్ని భక్షణాదుల విషయం కనపడదు. పై ఘట్టాల్ని విక్రమ సంకీర్తనలుగా పరిగణించడం జరిగింది. అలాగే ఉలూక బంధన, నవనీత చౌర్యాలు, ఆగడపు విన్నపాల్ని అన్నమయ్య లీలాకీర్తనలుగా వర్గీకరించబడ్డాయి. కనుక మొదట విక్రమ సంకీర్తన విభాగంలోని పూతనాహరణాన్ని పరిశీలించాలి.

## పూతనా హరణం :

అన్నమయ్య ప్రత్యేకించి పూతనహరణ వృత్తాంతాన్ని కీర్తించలేదు. విభిన్నకీర్తనల్లో అక్కడక్కడా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించాడు. ఈ ప్రస్తావన అన్నమయ్య తొమ్మిదిమార్లు చేసినట్లు తెలుస్తుంది.

'కుడువడా ప్రాణములు గొనుచు బూతకి చన్ను'1

ఇందులో బాలకృష్ణుడు కుడిచింది పాలనుగాక ప్రాణాలనీ, 'బూతకి' ప్రయోగం 'భూతకి'కి వికృతి. వికృతాకారయైన రక్షోంగన పూతన ఇందులో సూచితము.

'పిసికి పూతకి చన్ను బిగియించి పట్టిన
యిసుమంత చేతులివియపో'2

ఇందులో పూతన చన్ను పిసికి బిగించి పట్టడం తన్మర్దనవిధం. అలా పట్టిన బాలకృష్ణుడి ఇసుమంత చేతులు ఇవే అని అన్నమయ్య బాలుడి విక్రమాన్ని ఆశ్చర్యంతో వర్ణించాడు. "ఇసుమంత" శబ్దం చిన్న అనే అర్థంలో వాడబడింది.

నోటితో చన్ను పీకుచూ చేతుల్తో పిసుకుతూ ఉన్న బాలకృష్ణుడి మాయాజాలాన్ని అన్నమయ్య ఇందులో దృశ్యమానం చేశాడు.

"చిమ్మెడి విషములు చేసిన రొమ్ములు
కొమ్మని యిచ్చిన గుడిచేసి
బొమ్మర పోవడు పూతకి బొరిగొని
అమ్మరో గయ్యాళి శిశువు"3 అని మరోచోట అన్నమయ్య వర్ణించాడు.

విషమయమైన రొమ్ముల్ని పూతన ఇవ్వగా బాలుడు 'బొమ్మర పోవక' దాన్ని పొరిగొన్నాడు. అలాంటి శిశువును సాశ్చర్యుడై అన్నమయ్య 'గయ్యాళి శిశువు' అని అన్నాడు. పసివాని అసాధ్య కార్య సాధనకు పెద్దలు అచ్చెరువందడాన్ని భక్తుడైన అన్నమయ్య ఇందులో వ్యక్తం చేశాడు.

---

1. సంపు-1, సంకీ_126, రేకు_21, అధ్యా. సం. రాగం_శ్రీరాగం,
2. సంపు_1, సంకీ_166, రేకు_27, అధ్యా. సం. రాగం_ఆహిరి.
3. రాగం_కన్నడగౌళ, సంపు_4, సంకీ_149

"చిమ్మిడి విషములు చేసిన రొమ్ములు "పూతన క్రౌర్యానికి, విషతీవ్రతకు సూచకాలు కాగా, "బొమ్మర పోవడు" అన్న ప్రయోగం బాలుడి అతిలోక విక్రమానికి నిదర్శనం.

అలాగే మరోపాదంలో "పిచ్చిల బూతకి చన్ను పిరిచినాడు"1 అన్నదానిలో 'పిచ్చిల' శబ్దం చాలా అర్థవంతమైంది. 'చన్ను పిరిచినాడు' అనడంలో "పిల్చి నిస్సారం చేశాడు" అన్న అర్థం కూడా ధ్వనిస్తుంది.

మరో కీర్తనలో "ఈతడా దేవకిగన్న ఇంద్రనీల మాణికము. పూతకి చన్నుదాగి పొదలినాడు"2

ఇందులో 'పూతకి చన్నుదాగి' అన్న ప్రయోగం అందులోని ప్రమాదాన్ని సూచిస్తుంది. తర్వాత ఉన్న 'పొదిలినాడు' అన్న ప్రయోగంలో, విషపుచన్నుపాలనుంచి బాలుడు ప్రమాదాన్ని పొంద లేదనే విషయాన్ని సూచిస్తుంది. 'ఈతడా' అన్నది ఆశ్చర్యార్థకం.

'ఇంద్రనీల మాణికము' ప్రయోగం అతడి రూపవిభావాన్ని స్మరణకు తెస్తుంది.

మరో కీర్తనలో "చన్నుదాగి రాకాసి పీచము హరించితివి"3

'రాకాసిపీచము' అంటే పూతనప్రాణమని భావం. 'చన్నుదాగి' ప్రయోగం పాలుద్రాగి చంపడాన్ని సూచించినా అది రాకాసి కనుక అది తగినదే అన్న భావాన్నే సూచిస్తుంది.

---

1. రాగం_ముఖారి, సంపు_8, సంకీ_235, రేకు_241, అధ్యా. సం.
2. రాగం_లలిత, సంపు-10, సంకీ_6, రేకు_301, అధ్యా. సం.
3. సంపు_10, సంకీ_171, రేకు_329, అధ్యా. సం. రాగం_శంకరా.

ఈ కీర్తన పాదంలో

"వెడలి పూతకి చంటి విషము దాగిన యంత
వడి దనకునే మాయవట్టి బూమెలుగాక"1

ఇందులో అన్నమయ్య బాలకృష్ణుడి లీలావతార ప్రభావాన్ని సంస్తావ్యం చేసాడు. చంటి విషం తాగినాగాని 'తనకు విమాయ' అవడంతో భగవంతుడి చిత్రవిచిత్ర చిద్విలాసం ద్యోతకమౌతుంది.

'వట్టి బూమెలుగాక' అన్న ప్రయోగం మామూలు విషం పరమాత్ముడైన బాలుణ్ణి ఏం చేస్తుంది అన్న విషయాన్ని సూచిస్తుంది.

"చన్నుదాగి పూతనను సగ్గుడుగా జప్పరించె"2
అన్న పాదంలో 'సగ్గుడుగా జప్పరించె' ప్రయోగం పీల్చి పిప్పిచేశాడు అన్న అర్థాన్ని సూచిస్తుంది.

"చప్పరించు" ప్రయోగ సారస్యం సహృదయైకవేద్యం.
అలాగే 'సందడించి పూతకి చంటిపాలు తాగెనట'3

అన్న కీర్తన పాదంలో, బాలుడు హరణక్రియలో సందడించడాన్ని భావుకుడైన కవి ధ్వన్యాత్మకంగా భావించాడు.

పూతనాహరణ సందర్భాన్ని అన్నమయ్య ఉచిత పద ప్రయోగాలతో రసనిర్భరంగా భక్త్యాత్మకంగా బాలకృష్ణుడి విక్రమాతిశయాన్ని ఉల్లేఖించాడు.

పూతనాహరణ ఘట్టాన్ని ముందు తరాల వారైన ఎఱ్ఱన, పోతన మహాకవులు ఎలా వర్ణించారో గమనించడం అవసరమే. కారణం అన్న

---

1. సంపు-11, ద్వి. వి. కీర్తన-47, రేకు-75, ఆధ్యా. సం.
2. సంపు-11, సంకీ-76, రేకు-117, ఆధ్యా. సం. రాగం-రామక్రియ
3. కీర్తన-185, రేకు-1176

మయ్య వారిని కొంతవరకు అనుసరించినట్లు కనపడుతుంది.

ఎఱ్ఱన వర్ణన ఇలా ఉంది.

"ఎత్తిలి తావుకావురవ నేడ్చి తదీయ పయోధరాగ్రముల్
కుత్తుకదాక బెట్టుకుని గ్రోలెగ్రమంబున జన్నుబాలతో
నెత్తురు మున్నుగాగ గణనీయములై చను సప్తధాతువుల్
పొత్తుగ బ్రాణముల్చెనట బొందియ త్రిక్కగ నొక్క వ్రేల్మిడిన్"1

వర్ణనాప్రియుడైన ఎఱ్ఱన ఇందులో సంహరణ విధానాన్ని శాస్త్రీయంగా వర్ణించాడు. నెత్తురు మున్నుగా, సప్తధాతువులతోడి ప్రాణాన్నే కృష్ణుడు పీల్చినట్లు, బొందియ తప్ప వేరేమీ మిగలనీయనట్లు, అది కూడా ఒక్క వ్రేల్మిడిలో అంటే క్షణంలో చేసినట్లు చెప్పాడు.

పయోధరాగ్రాల్ని కుత్తుకదాకా బెట్టుకొని క్రోలిన బాలకృష్ణ దివ్యస్వరూపం కన్నులకు కట్టినట్లే ఉంది. కాగా ఎఱ్ఱన చేసిన వర్ణన సాంగోపాంగంగా ఉంది. అన్నమయ్య చన్నుబాలను త్రాగిన ఫలితాన్ని ప్రధానంగా కీర్తించాడు. పైగా అన్నమయ్యది కీర్తన, ఎఱ్ఱనది పద్యం. ఛందోభేదంవల్ల వర్ణన అక్కడక్కడా ఇరువురిలో ఉచితంగా చోటుచేసుకుంది.

అలాగే పరమ భక్తుడైన పోతనామాత్యుడు ఇలా వర్ణించాడు.

'అదెరం గొండలతోడ భూమి గ్రహతారానీకముల్ మింటిపై
బెదరెన్ దిక్కుల మారు మ్రోత తెసగన్ భీతిల్లి లోకంబులుం
గదలం బాఱెనువజ్రభిన్న గిరిరేఖం బూర్వదేహంబు తోఁ
బ్రదరద్ధ్వంసిని గూలి కుయ్యిడిన తద్ఘోరు ఘోషంబునన్'2

1. హరివంశము పూర్వభాగము, 154 వ పద్యము, ఎఱ్ఱనామాత్యుడు.
2. పోతన-భాగవతం, ద. స్క. పూర్వభాగము, పద్యం-227

ఇందులో పోతన '(త్రి)దశ ధ్వంసిని కూలి కుయ్యిడిన తద్దీర్ఘోరు ఘోషంబు'తో ప్రకృతిలో జరిగిన భీతావహ పరిస్థితిని అభివర్ణించాడు శైలీరమ్యమైన ఈ పద్యంలో పోతన, పూతన పూర్వదేహంతో చేసిన ఘోషను మాత్రమేవర్ణించాడు. ఒక్క విషయాన్ని గ్రహించి, దానికి ప్రోద్బలకంగా తత్సంబంధాలైన ఎన్నో విషయాల్ని వర్ణిస్తూ, ప్రధాన విషయాన్ని ప్రస్ఫుటం చేయడం పోతనకు సైజగుణం.

ఎఱ్ఱన ఉత్పలంలో ఈ ఘట్టాన్ని వర్ణిస్తే, పోతన మత్తేభంలో అభివర్ణించాడు. అన్నమయ్య కీర్తన రూపంలో ఈ విషయాన్ని జానపదశైలిలో సుకుమారంగా వర్ణించాడు.

ఎఱ్ఱన భావం, శైలి; పోతన భావం, శైలి; అన్నమయ్య భావం, శైలి వేరువేరుగా కన్పిస్తాయి. దేనికదే రస పరమాధికంగా ఉంది. అదే మహాకవుల లక్షణం. ఎఱ్ఱన, పోతనలు ప్రత్యేకించి పూతనాహరణ ఘట్టాన్నే వర్ణించారు. అన్నమయ్య దీన్ని ప్రస్తావన మాత్రంగానే వర్ణించాడు. అందువలన వర్ణనలలో కొంత తేడా కన్పించడం సహజమే.

## కాళీయ మర్దనం :

అతిలోకమైన బాలకృష్ణవిక్రమ కార్యాల్లో కాళీయమర్దనం ఒకటి కాళీయుడు శేషజాతివాడు. లోక భయంకరుడు. యమునలో ప్రవేశించాడు. ప్రాణిమాత్రాన్ని దగ్గరకు రానియ్యడు. కాగా లోకానికి ప్రమాదం వచ్చింది. దాన్ని బాలకృష్ణరూపుడైన భగవంతుడు అణచాడు. ఇది సమస్త భారతీయ సాహిత్యాల్లో ఉంది. బాలకృష్ణ భగవద్విక్రమ లీలావిశేషమైన కాళీయమర్దన కార్యాన్ని అన్నమయ్య తన బాలకృష్ణ కీర్తనల్లో ఎన్నో సందర్భాల్లో ప్రస్తావించి వర్ణించాడు. ఈ సందర్భాల్లోని అన్నమయ్య సంకీర్తన పాదవిశేషాల్ని పరిశీలించాలి.

"మెట్టడా కాళింగు మేటి శిరములు"1 అన్నపాదంలో అన్నమయ్య బాలుడి వీరాన్ని గుర్తుచేశాడు.

అలాగే కాళింగు పడగలపై కడు నాట్యమాడితివి'2 అన్న పాదంలో కృష్ణుడి విక్రమ విభవాన్ని అతిలోకంగా సూచించాడు.

అలాగే "శేషజాతి కాళింగు జిక్కించికాచె"3 అన్న పాదంలో శేషజాతి ఉత్తమమైనదని, ఆ జాతివాడైన కాళింగుని గర్వాన్ని చిక్కించి, శరణన్న అతడిని కాచినాడని అన్నమయ్య భావించాడు. ఇందులో భగవంతుడి దుష్టశిక్షణ శిష్టరక్షణ శరణార్థుల సమాదరణ ద్యోతకమౌతాయి.

"కాళింగు తలపై గప్పిన పుష్యరాగము"4 పడగ పైకెక్కిన కృష్ణుణ్ణి పుష్యరాగంగా భావించి, పాము తలపైనున్న నాగమణిని సూచించాడు. కృష్ణుడు ఆ మణిని కప్పినట్లున్నాడు.

"క్రూర కాళింగ మర్దన గోవిందుడితడు"5 అని కృష్ణుడి విక్రమాన్ని 'ఇతడు' శబ్దం ద్వారా గుర్తుచేశాడు. శత్రువు బలాధిక్యాన్ని సూచించేదానికి 'క్రూర' అన్న విశేషాన్ని అన్నమయ్య ప్రయోగించి అంతవాణ్ణేమర్దించిన గోవిందుడు ఇతడేయనిచెప్పి ఆయనవిక్రమాన్ని ప్రస్ఫుటం చేశాడు.

---

1. రాగం_శ్రీరాగం. సంపు_1, సంకీ_126, రేకు_21, అధ్యా. సం.
2. రాగం_పాడి, సంపు_8, సంకీ_179, రేకు_231, అధ్యా. సం.
3. రాగం_రామక్రియ, సంపు_9, సంకీ_113, రేకు_270, అధ్యా. సం.
4. రాగం_సాళంగనాట, సంపు_9, సంకీ_288, రేకు_2`9, అధ్యా. సం.
5. రాగం_ఆహిరి, సంపు_10, సంకీ_180, రేకు_331, అధ్యా. సం.

"బండిదొక్కె, బామునెక్కె, పసులెల్లాదక్కె"1 అన్న పాదంలో శకటాసుర, కాళీయమర్దన క్రియల్ని కలిపి అన్నమయ్య భావించాడు. 'పసులెల్లాదక్కె' అన్న ప్రయోగం బాల భగవంతుడు మూగజీవాన్ని కాపాడిన విధం తెలుస్తుంది.

"కాళింగు దొక్కితివట కటకట ఉద్దండాలు"2 ఇందులో కృష్ణ విక్రమాన్ని 'దొక్కితివట' ప్రయోగంతో అన్నమయ్య సూచించాడు.

"పట్టగ పట్టగ బాము తలదొక్కె"3 అన్నపాదంలో శ్రీకృష్ణుడు కాళీయుణ్ణి ఎలా సాధించాడో 'పట్టగ పట్టగ' ప్రయోగంతో అన్నమయ్య సూచించాడు.

అలాగే 'కాళింగు మెట్టెనట'4 పాదంలో 'అట' శబ్దంతో బాల కృష్ణుని విక్రమ కథను స్మరణకు తెచ్చాడు.

ఉల్లేఖాలంకార మర్యాదా పూర్వకమైన అన్నమయ్య వర్ణన విధానం ప్రత్యేకం. ఇదే ఘట్టాన్ని ఎఱ్ఱన, పోతనామాత్యులు ఎల వర్ణించారో పరిశీలించడం ప్రస్తుతానికి దూరం కాదనుకుంటాను పైగా కాళీయుడి పడగల మీద కృష్ణుడు నాట్యం చేసినట్లే ముగ్గురు కవులు వర్ణించారు. మొదట ఎఱ్ఱన పద్యకవితా వధూటితో చేయించిన నాట్యాన్ని ఈ ఘట్టంలో ఎలా ఉందో దర్శించాలి.

'యమునావీచి మృదంగ వాద్యములు మ్రోయన్ దీర గోపౌఘహ
ర్ష మనోజ్ఞ ధ్వనితంబు గేయముగఁ జంచత్కాళీయ వ్యాళభో

---

1. రాగం_లలిత, సంపు_12. సంకీ_48, రేకు_8, శృం. సం.
2. రాగం_ముఖారి, సంపు_17, సంకీ_427, రేకు_372, శృం. సం.
3. కీ_248, రే_1143.
4. రాగం_ధన్యాసి, సంపు_27, సంకీ_685, రేకు_1176, శృం. సం.

గమహారంగ తలంబునం బటుగతిం గంజాక్షు నిశ్శబ్దనా
ట్యము హృద్యాద్భుత భీమమై పరఁగ దివ్యశ్రేణి చూచెన్‌దివిన్‌[1]

యమునానది వీచికలే మృదంగాలుగా వాద్యాలు మ్రోయగా నదీతీరంలో గోపసమూహం యొక్క హర్షమనోజ్ఞమైన ధ్వనే గేయంగా కాళీయుడి పడగలే మహారంగస్థలంగా, దివ్యశ్రేణి చూడగా కంజాక్షుడి నిశ్శబ్ద నాట్యము హృద్యాద్భుత భీమమై పరగిందట.

ఇందులో కేవలం నాట్యమేగాక గీతం కూడా జోడించబడింది. లోకంలో గీతాన్ననుసరించి నాట్యం చేయడం సహజం. కాని బాల కృష్ణపరమేశ్వరుడి నిశ్శబ్ద నాట్యాన్నే అనుసరించే గీతంవెలువడింది. ఇది అతిలోకమైన దివ్యభావం. చందం మత్తేభం. పద్యగతి కూడా నాట్యానుకూలంగా లయ విన్యాసాన్ని చూపింది. ఇందులో భావం భాష జోడు గుర్రాలై పరుగెత్తాయి.

వర్ణనా ప్రియుడైన ఎఱ్ఱనకు ఏతాదృశ మహిమోపేతమయిన పద్యావిష్కరణ నల్లేరుపై బండినడక.

సహజభావుకుడైన పోతనకు వృత్తచందం చాలలేదు. అందుకే ఆయన వర్ణ్యవస్తువుకు సీసాన్ని గ్రహించాడు. యమునానదీ కల్లోలిత ఘోషమే మృదంగ ఘోషంగా సాధు బృందావన చర చంచరీక గానమే గాయకుల గానంగా కలహంసాదుల మంజుశబ్దాలు తాళ శబ్దాలుగా దివిజగంధర్వాదులు ప్రేక్షకులుగా, పద్మరాగాది రత్న కాంతులతో మహితమైన కాళీయ ఫణిఫణాపంక్తులు మంటపంకాగా, నళినలోచనుడనే విఖ్యాత వర్తకుడు నిత్యనైపుణ్యంతో నృత్యమాడి నాడని పోతన పద్యభావనా స్రవంతి ఈ ఘట్టంలో ఉరకలువేస్తూ ప్రవహించింది. దీనికి ఆధారమైన పద్యం ఇలా ఉంది.

---

1. ఎర్రన హరివంశము, పూర్వభాగము పద్యం 49.

సీ॥ ఘన యమునానదీ కల్లోల ఘోషంబు
  సరసమృదంగ ఘోషంబుగాఁగ
సాధుబృందావన చర చంచరీక గా
  నంబు గాయక సుగానంబు గాఁగ
గలహంస సారస కమనీయ మంజు శ
  బ్దంబులు దాళ శబ్దములు గాఁగ
దివినుండి వీక్షించు దివిజ గంధర్వాది
  జనులు సభాసీన జనులు గాఁగ

తే॥ బద్మరాగాది రత్న ప్రభాసమాన
మహిత కాళీయ ఫణిఫణా మండపమున
నళినలోచన విఖ్యాత నర్తకుండు
నిత్యవైపుణ్యమునఁ జేర్చి నృత్యమాడె.1

ఎఱ్ఱనలో యమునా వీచికలు మృదంగ కార్యాన్ని చేశాయి. పోతనలో నదీకల్లోల ఘోషమే మృదంగ ఘోషమైంది. ఎఱ్ఱన గోపాలుర హస్తమస్తోత్థధ్వని గేయంకాగా, పోతనలో సాధుబృందావన చరచంచరీక గానం గాయక ధర్మాన్ని నిర్వర్తించింది. కలహంసాదుల మంజు శబ్దాల్లో పోతన విన్న తాళశబ్దం ఎఱ్ఱనలో లేదు. ప్రేక్షకులు ఇరువురిలో సమానులే. ఎఱ్ఱన కాళీయవ్యాళ భోగ మహారంగతలం, పోతనపద్యంలో మహితకాళీయ ఫణిఫణా మంటపంగా రూపించింది. ఎఱ్ఱన కంజాక్షుడు, పోతన నళినలోచనుడైనాడు. పైగా విఖ్యాత నర్తకుడని కూడా పోతన చెప్పాడు. విఖ్యాత శబ్దంలో నర్తకుడి జగన్నాటక సూత్రధారిత్వం ద్యోతమానమౌతుంది. ఎఱ్ఱన నిర్మర్ద నాట్యం హృద్యాద్భుత భీమం కాగా, పోతన దాన్ని నిత్యవైపుణ్య ప్రయోగంలో సాగించాడు, రెంటిలో తత్కాలీన వర్ణనా సముదాత్తమైన భావశబలత మెండుగా ఉంది, ఇరువురూ మహాకవులు.

---

1. పోతన భాగవతం ద., స్క., పూర్వభాగం పద్యం 666.

ముందువాడైన ఎఱ్ఱనను అనుకరణతో పోతన గౌరవించాడు. ఇది ప్రత్యేక వర్ణనా ఘట్టం.

అన్నమయ్య దీన్ని సూచనా మాత్రంగా సూచించాడు. "కాళింగు పడగలపై నాట్యమాడితివి" అని బాలకృష్ణ పరమేశ్వరుడి నాట్యక్రియను భావించాడు. అన్నమయ్యది సంకీర్తన మార్గం. ఇది ఎఱ్ఱన, పోతనలకు భిన్నమైంది. వారు 'గురువద్యవిద్యకు నాద్యుడైన నన్నయ మార్గంలోని వారు. పైగా అది మార్గ, ఇది దేశి. దేశి అంటూనే ప్రధానంగా భాషాభావ సారళ్యం ఉండాలి. కాగా అన్నమయ్య కవిత ప్రజావాణికి దగ్గరలో ఉంది.

తర్వాత అన్నమయ్య బాలకృష్ణ సాహిత్యంలో గోవర్ధనోద్ధరణకు సంబంధించిన సంకీర్తన విషయాన్ని పరామర్శించాలి.

## గోవర్ధనోద్ధరణం :

ఈ ఘట్టానికి సంబంధించిన ప్రసక్తిని అన్నమయ్య తన బాలకృష్ణ సాహిత్యంలో, విభిన్న కీర్తనల్లో ప్రస్తావించాడు.

"కినిసి గోవర్ధనగిరి పెల్లగించిన
యినుమువంటి చేతులివియ పో"1 అన్న కీర్తనభాగంలో అన్నమయ్య పర్వతోద్ధరణకు మూలమైన హరి బాహుబలాన్ని మొదట వర్ణించాడు. లోహాల్లో ఇనుముదృఢతరం. ఉక్కుదృఢతమం. ప్రాసకోసం అన్నమయ్య 'ఇనుము' అని వేయవలసి వచ్చినా, లోక వ్యవరాన్ని బట్టి ఇనుమే గట్టితనానికి బదులుగా చెప్పడం కనిపిస్తుంది. కనుక ఇది స్వారస్య హేతువే.

---

1. రాగం_ఆహిరి, సంపు_1, సంకీ_166, రేకు_27, అధ్యా. సం.

'గిరి పెల్లగించిన' అన్న ప్రయోగంకూడా హరి బాహుబలాన్నే వ్యంజిస్తుంది. క్రియా (పని) ప్రాధాన్యాన్ని బట్టి ఆయా అవయవాలకు ప్రథమ ప్రాధాన్యాన్ని ఇవ్వడం ఉచితజ్ఞుడైన అన్నమయ్య వంటి కవుల లక్షణం.

ఈ క్రింది కీర్తన భాగంలో కూడా అన్నమయ్య, హరి బాహు విక్రమాన్నే వర్ణించి, మహిమను సూచించి, 'ఈతని పాదాలే కొలువవద్దా' అని అంటాడు.

ఈకీర్తన అంశ ఇలా ఉంది.

'సిసువు గోవర్ధనాద్రి చేతబట్టి ఎత్తెనంటె
కొసరితని పాదాలే కొలువవద్దా'1 ఇందులో 'చేతబట్టి ఎత్తెనంటె' ప్రయోగం అవలీలగా కొండను ఎత్తినాడన్న భావాన్ని తెలుపుతుంది పైగా 'సిసువు' అన్న ప్రయోగం దాన్ని మరింత ఆశ్చర్యావహం చేస్తుంది.

ఈ తర్వాత కీర్తనలో అన్నమయ్య "కోపుల్లో" (దిక్కుల్లో) ధర్మం దక్కిందని, గోవర్ధనగిరి నిక్కిందని అంటూ చాపల్యాన్ని వీడి బాలుణ్ణి శరణువేడమని లోకాన్ని ప్రబోధిస్తాడు.

ఈ కీర్తన ఇలా ఉంది.

"కోపుల ధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె
చాపలమేటి కితని శరణనరే"2

పై గీతంలో అన్నమయ్య గోవర్ధనోద్ధరణవల్ల ధర్మం ఎలా నిలిచిందో సూచించాడు.

---

1. రాగం_లలిత, సంపు_1. సంకీ_503, రేకు_100, ఆధ్యా. సం.
2. రాగం_లలిత, సంపు_7, సంకీ_276, రేకు_199, ఆధ్యా. సం.

పీధిలో పారాడేబాలుడు 'వేల గొండె త్తినవాడు' అని బాలుని మహిమను భావిస్తాడు. సామాన్య బాలకుడిగా కన్పిస్తూ అసామాన్య కార్య దురంధరుడైన బాలకృష్ణుడి విక్రమాధిక్యాన్ని పై విధంగా భావించాడు.

ఈగీతంలో 'ఎన్నికగా వ్రేలకొండసెత్తినాడు"1 అని అన్న మయ్య కృష్ణబాలకుడు వ్రేలితోనే కొండ నెత్తినాడని, అదే ఎన్నికగా చేశాడనీ హరి బాహుబల సౌభాగాన్ని వివరించాడు.

మరో కీర్తనపాదంలో కొండని గొడుగుగా ఎత్తి గోగోపకుల్ని కాచిన విషయాన్ని అన్నమయ్య లక్షించాడు.

"కొండ గొడుగుగా ఎత్తి గోవుల గాచేవాడు"2

'కొండ గొడుగు' ప్రయోగం హరి విక్రమానికి సూచన.

ఇంకొక కీర్తన భాగంలో కృష్ణుణ్ణి అన్నమయ్య

"రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడం, గోవర్ధనపుగోమేధికం"3 గా ఉత్ప్రేక్షించాడు. ఇందులోని అలంకారిక భావన ఉదాత్తమైంది. గోమేధికాలు పర్వత సానుజన్యాలు. పర్వతాన్నే ఎత్తిన కృష్ణుడే ఒకలోకైక గోమేధిక రత్నం. భక్తినీ, రక్తినీ రంగరించిన ఈ సంకీర్తన పాదనిర్మితి అన్నమయ్యకే చెల్లింది.

ఇంకొక కీర్తన పాదంలో 'గోవర్ధన మెత్తినట్టి గోవిందుడితడు'4

---

1. రాగం_ముఖారి, సంపు_8, సంకీ_225, రేకు_241, అధ్యా. సం.
2. రాగం_రామక్రియ, సంపు_9, సంకీ_113.
3. రాగం_సాళంగనాట, సంపు-9, సంకీ_288,
4. రాగం_అహిరి, సంపు_10, సంకీ_180, రేకు_331, అధ్యా. సం.

అని గోవర్ధనోద్ధరణ కార్యం గోవిందుడికే చెల్లిందని, దాన్ని ఒక అర్హతగా అన్నమయ్య వ్యక్తం చేశాడు. 'గోవింద' శబ్దంలోని ఔచిత్యం సహృదయ సమ్మతం.

ఈ క్రింది కీర్తన విభాగంలో అన్నమయ్య.

"కొండ గొడుగుగాబట్టె గొన్నాళ్ళు'1 అని కొండను కేవలం ఎత్తడమే గాక కొన్నాళ్ళు దాన్ని వ్రేలిమీదనే మోసిన వ్రేలిబలాన్ని అఖిలాండపతి మహిమను అన్నమయ్య భావించాడు.

ఈ క్రింది కీర్తన భాగం గొబ్బిళ్ళపాటకు చెందింది.

"కొండ గొడుగు గాపులం గాచిన

కొండొక శిశువుకు గొబ్బిళ్ళో"2 అన్న గీతంలో కొండను గొడుగుగా బట్టి శ్రీకృష్ణుడు ఆవులం గాచిన విషయం భావితం. ఇందులోని 'కొండొక శిశువు' ప్రయోగం సాభిప్రాయక స్ఫోరకమైంది. విక్రపు సంకీర్తనలో గొబ్బిళ్ళపాట తీరు పదానికి ఊపునిస్తుంది. ఇది పాడేతీరే వేరు.

అలాగే మరో సంకీర్తన పాదం గోవింద శబ్దాంతంగా దరువుతో కూడి ఉంది.

'కొండ వేలెత్తినట్టి గోవిందా

నిన్ను గొండించేరు యశోదకు గోవిందా"3

ఇందుల్లో గోవింద శబ్దం పాదాంత పునరావృత్తితో ఒక లయ విన్యాసాన్ని నిర్వహించింది. జానపదుల గీతాల్లో ఈ తీరు జనరంజ

---

1. రాగం_భైరవి. సంపు_12, సంకీ_94, రేకు_16, శృ. సం.
2. రాగం_దేసాళం, సంపు_12, సంకీ_98, రేకు_17, శృ. సం.
3. రాగం_భూపాలం, సంపు_22, సంకీ_325, రేకు_756 శృ, సం.

కంగా ఉంటుంది. వీటిని 'గోవింద' పాటలని కూడా అంటూ ఉంటారు.

బాలకృష్ణుడు కొండను ఎత్తవలసిన అవసరాన్ని అన్నమయ్య ఒక చిన్న పాదంలో సూచించాడు. భగవంతుడి క్రియావసారాలు లోకోపకారకాలే.

'గుట్టున గొల్లలకుగా కొండ ఎత్తితివి'1 అని అనడంలో భగవంతుడి ఆపద్ధారకత్వం సూచ్యమానమైంది.

గోవర్ధనాన్ని ఎత్తి దొరతనాలు చేసిన వాడే వీడుగా (వేంకటేశ్వరుడు) ఉన్నాడని అన్నమయ్య ఈకీర్తన పాదాల్లో భావించాడు.

"తొల్లిఁ గోవర్ధనమెత్తి దొరతనాలెల్ల జేసి
అల్లవాడె నిలుచున్నాడాతడీతడా"2

అల్లవాడు, ఆతడు, ఈతడు అనే సర్వనామాలు సర్వనామాంకితుడైన పరమాత్మ నామవిభవాన్ని ధ్వన్యమానం చేయడం ఒక ప్రత్యేకత.

మరో కీర్తన పాదంలో 'చెప్పగ జెప్పగ జేత గొండయెత్తె'3 అని అన్నమయ్య బాలకృష్ణుడి పరాక్రమాన్ని స్మరించాడు.

అలాగే 'ఇంచుకంతవేల గొండ యెత్తినాడట'4 అని 'అట' శబ్దంతో ఆ కథామహిమను అన్నమయ్య సూచించాడు.

---

1. రాగం_ముఖారి, సంపు_27, సంకీ_151, రేకు_1126, శృ. సం.
. రాగం_మాళవి, సంపు_24, సంకీ_301, రేకు_851, శృ. సం.
3. రాగం_దేవగాంధారి, సంపు_27, సంకీ-248, రేకు_1143, శృ. సం
4. రాగం_ధన్నాసి. సంపు_27, సంకీ_385, రేకు_1176, శృ. సం.

గోవర్ధనోద్ధరణ ఘట్టాన్ని పోతన వర్ణించిన విధమిది.

'కిరియై ధర యెత్తిన హరి
కరి సరసిజ ముకుళమెత్తుగతిఁ త్రిభువన శం
కరకరుడై గోవర్ధన
గిరి యెత్తె జక్కనొక్క కేలన్ లీలన్'1

అన్నమయ్య గోవర్ధనోద్ధరణ సంస్మరణలో హరి బాహు విక్రమానికి, గోగోప గోపికా అవనతకే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు కన్పిస్తుంది.

తర్వాత తృణావర్త సంహరణ విషయాన్ని అన్నమయ్య ఎలా ప్రస్తావించాడో చూడాలి.

## తృణావర్త సంహారం :

ఈఘట్టానికి సంబంధించి అన్నమయ్య ప్రస్తావన కొంతమేరకే

తృణావర్తుడు గాలిరూపంలో వచ్చిన రక్కసుడు. కంస ప్రేరితుడై కృష్ణ నిర్మూలనానికి వచ్చినవాడు. సుడిగాలి రూపంలో వాడు కృష్ణుణ్ణి గాలిలో ఎగురగొట్టాడు. క్రమంగా కృష్ణుడు వాడికి మహా భారమైనాడు. కృష్ణుణ్ణి మోయలేక బలహీనుడై కిందపడ్డాడు. బాల కృష్ణుడు వాణ్ణి సంహరించాడు.

"గాలి రక్కసుని ములుగంగ మోది"2 అన్నపాదంలో తృణావర్తుడు 'ములుగంగ' మోదబడినట్లు అన్నమయ్య వర్ణించాడు. 'గాలి రక్కసుడు' ప్రయోగం అచ్చపు దేశీయతను సంతరించుకొనింది.

---

1. శ్రీమదాంధ్ర భాగవతము. ద. స్క. పూర్వభాగము పద్యం 916.
—పోతనామాత్యుడు

2. రాగం_దేసాక్షి, సంపు_11, సంకీ_234, రేకు_391, అధ్యా. సం.

తర్వాత తృణావర్తుణ్ణి చంపిన బాల హరి పరాక్రమాన్ని అన్న మయ్య ఈక్రింది కీర్తన విభాగంలో భావించాడు.

"గాలికూటివాని మెట్టె గాలి రాకాసుని గొట్టె
గాలిబిడ్డ తమ్ముని సంగడినాడె నీతడు"1

ఇందులో అన్నమయ్య ప్రయోగ వైచిత్రిని ప్రదర్శించాడు. ఆ వైచిత్రితోపాటు బాలకృష్ణుడి గొప్పతనాన్ని గూడ సూచించాడు.

"గాలికూటివాని మెట్టె"2 అనడంలో ఆదిశేషువు పాన్పుగా కల వాడని 'గాలిబిడ్డ తమ్ముని సంగడి'3 అని అన్నమయ్య అంటాడు.

అన్నమయ్య 'గాలికూటి వానిమెట్టె' 'గాలిబిడ్డ తమ్మునిసంగడి' అన్న ప్రయోగాల్ని ప్రత్యేకించి ఎందుకు చేశాడో గమనించాల్సిన అవసరం ఉంది.

బలశాలియైన తృణావర్తుడు సుడిగాలి రూపంలో వచ్చాడు. గాలికి మహాబలుడు అన్న పేరు ఉంది. దీన్నిబట్టి అన్నమయ్య శత్రువు బలాధిక్యాన్ని ధ్వనింప జేశాడు. అంతటి బలశాలియైన తృణావర్త శత్రువును సంహరించిన బాలకృష్ణుడి విషయం కూడా ఇందులో ధ్వనితమే. మహాబలుడైన వాయువునే ఆహారంగా కలిగిన శేషుణ్ణి పాన్పుగా కలవాడని చెప్పడంలో కృష్ణుడి బలశాలిత అభి వ్యక్తం. అంతేగాక కృష్ణుడికీ, వాయువుకూ ఉన్న సంబంధాన్ని

---

1. రాగం-దేసాక్షి, సంపు-13, సంకీ-87, రేకు-1157 శృ. సం.
2. పాముకు వాయుభుక్కు అనిపేరు అంటే గాలిని మేసేది. అని అర్థం. అందుకే అన్నమయ్య 'గాలికూటివాని' అనేపదం ప్రయోగించాడు
3. గాలిబిడ్డ అనగా భీముడు, అతని తమ్ముడు అర్జునుడు, సంగడి అనగా స్నేహితుడు 'గాలిబిడ్డ తమ్ముని సంగడి' అంటే కృష్ణుడనే అర్థాని అన్నమయ్య ఈ సందర్భంలో వాడాడు.

అన్నమయ్య 'గాలిబిడ్డ తమ్ముని సంగడి' ప్రయోగంలో లక్షించాడు. ఏతావతా ప్రాణస్వరూపుడైన వాయువు పరమాత్మకు సర్వత్రా విధేయమే. అందుకే తృణావర్త నిర్వారణకార్యం బాలకృష్ణునికి ఒక లీలాజాలమైంది. ఇంతటి మహార్థాన్ని లక్షించి అన్నమయ్య పై రెండు ప్రయోగాల్ని చేశాడని భావించడం సహృదయ సమ్మతం.

తర్వాత బాలకృష్ణ భగవద్విక్రమ క్రియలో శకటాసురభంజన విధానాన్ని అన్నమయ్య సంకీర్తన పాదాల ద్వారా చూడాలి.

## శకటాసుర భంజనం :

ఈ విషయాన్ని అన్నమయ్య రెండుచోట్ల ప్రస్తావించాడు.

వీడూ ఒకరాక్షసుడు, కంసప్రేరితుడు. చక్రరూపంలో ప్రేవల్లెకు వచ్చాడు. బాలకృష్ణుడు ఇది గమనించి శకటచక్రాన్ని తన పాద తాడనంతో చూర్ణం చేశాడు. శకటాసురుడు భయంకరంగా అరుస్తూ మరణించాడు.

"అడువడా నేలతో నలమి శకటాసురుని"1 అని అన్నమయ్య ఈ విషయాన్ని ప్రస్తావించాడు. ఇందులో కృష్ణుడు శకటాసురుణ్ణి నేలతోరూడ అదిమి చంపినట్లు చెప్పినాడు.

మరో పాదంలో 'అచ్చపు బాలుడై శకటాసుర మర్దించినాడు'2 అని అన్నమయ్య అచ్చపు బాలుడు చేసిన శకటాసుర మర్దనక్రియను మనోజ్ఞంగా చిత్రించాడు.

తర్వాత కృష్ణుడు మేనమామ కంసుడి వధను అన్నమయ్య ఎలా కీర్తించాడో పరికించాలి.

---

1. రాగం_శ్రీరాగం, సంపు_1. సంకీ_126, రేకు_21, ఆధ్యా. సం.
2. రాగం_ముఖారి, సంపు_8, సంకీ_235, రేకు_241, ఆధ్యా. సం

## కంసవధ :

కంసవధా సందర్భాన్ని అన్నమయ్య తనబాలకృష్ణ సంకీర్తన సాహిత్యంలో ఎన్నో మార్లు ప్రస్తావించాడు.

"వడువడా నెత్తురులు వసుధకంసునినిని"1 బాలకృష్ణుడు సంహరించాడు

కృష్ణజననంతో "పొట్టిన రాకాసులతో గూడి భువి మీద
నట్టె కంసుని మదము హతమాయెను"2 అని అన్నమయ్య రాక్షసులతో కూడ కంసుని మదము హతమయ్యిందని భావించినాడు.

అలాగే "వన్ని కంసుని మదము భంజించినాడు"3 అంటూ అన్నమయ్య కంసవధను కీర్తించాడు.

దైవశిఖామణి అయిన బాలకృష్ణుడి అవతారానికి లోకరక్షణకు మామగండం ఒక కారణమని అన్నమయ్య అంటాడు.

"ఘనలోక రక్షణ కంసుమామ గండమును
తనకు గారణమట దైవశిఖామణికి"4 అన్న కీర్తన భాగంలో దాన్ని సూచించాడు.

శ్రీజయంతినాడే కంసుడికి నూరు నిండినట్లు ఈ క్రింది పాదాల్లో సూచించ బడింది.

---

1. రాగం-శ్రీరాగం, సంపు-1, సంకీ-126, రేకు-21, అధ్యా. సం.
2. రాగం-సాళంగనాట, సంపు-8, సంకీ-161, రేకు-228, అధ్యా. సం.
3. రాగం-ముఖారి, సంపు-8 సంకీ-2[illegible], రేకు-241 అధ్యా. సం.
4. రాగం-మాళవిగౌళ, సంపు-8, సంకీ 2[illegible], రేకు-2[illegible], అధ్యా. సం.

"నోవితోడ గంసునికి నూరునిండె జూడగానే

చేవలు మీరినయట్టి శ్రీజయంతినాడు"1 ఇందులో బాలకృష్ణుడి అవతార ప్రయోజనం దుష్ట శిక్షణని తేలింది. ఈ భావమే క్రింది పాదాల్లో అన్నమయ్య మరలా తెలిపినాడు.

"పొడరో ధర్మము నిల్పె భారమణచె

నోడించె కౌరవ దానవుల కంసాదుల జంపె"2

ధర్మాన్ని నిల్పడం, భూభారాన్ని అణచడం అన్నది ఇందులో పూర్వభాగం. కౌరవుల్ని ఓడించడం, కంసాదుల జంపడం ఉత్తర భాగం. ఉత్తరభాగ ఫలమే పూర్వభాగ ప్రయోజనం.

బాలకృష్ణుణ్ణి అన్నమయ్య కంసుడి పాలి వజ్రంగా భావించాడు. ఈభావన 'పంతమాడె కంసునిపాలి వజ్రము'3 అని అనడం ద్వారా తెలుస్తుంది. కృష్ణుణ్ణి పురిటిలోనే చంపాలని పట్టుబట్టిన కంసుని పంతానికి కృష్ణుణ్ణి వజ్రాయుధంగా కవి భావించాడు.

కృష్ణుడి జన్మ విశేషాన్ని వర్ణిస్తూ అన్నమయ్య,

'ఎక్కడి కంసుడు ఇక నెక్కడ భూభారగు

చిక్కువాప జనియించె శ్రీకృష్ణుడు'4 అని అంటాడు. భూమికి భారంగా ఉన్న కంసుడివల్ల లోకానికి వచ్చిన చిక్కును తొలగించే దానికే కృష్ణుడు జన్మించాడని అన్నమయ్య నిరూపణ.

బాలకృష్ణుడు కంసుని జంపిన విధానాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు. 'చేతనే గంసుని బుద్దచెండు సేసినాడు"5

---

1. రాగం_పాడి, సంపు_8, సంకీ-258, రేకు_245, ఆధ్యా. సం.
2. రాగం_దేసాళం, సంపు_9, సంకీ_172, రేకు_280 ఆధ్యా. సం.
3. రాగం—సాళంగనాట. సంపు—9, సంకీ—388.
4. రాగం—రామక్రియ, సంపు—10, సంకీ—1, రేకు—301. ఆధ్యా. సం
5. రాగం_లలిత, సంపు_10, సంకీ—6, రేకు—301, ఆధ్యా. సం.

'చేతనే' 'బుట్టచెండు' ప్రయోగాలు రాయలసీమకు ప్రాంతీయాలు. బుట్టచెండు చేయడం అంటే ఒక వస్తువును పిసికి ముద్దచేయడం అని భావం. 'బుట్టచెండు' ప్రయోగం కడప, కర్నూలు జిల్లాల్లో విశేషంగా ఉంది. ఇది బాలక్రీడా పరిభాష. దేశీయమైన ఈ ప్రయోగాన్ని అన్నమయ్య సహజంగా ప్రయోగించాడు,

బుట్టచెండుగా కృష్ణుడు చేయగా, "కావరపు గంసుని గర్వ మణగె"1 అని అన్నమయ్య భావించాడు.

ఈ క్రింది కీర్తన పాదాల్లో అన్నమయ్య గోవిందుడి అతిలోక పరాక్రమాన్ని సూచించాడు. దాన్ని బాలకృష్ణుడి మాటల్లో ఆయన వ్యక్తం చేశాడు.

"వొద్దు నీవు నాకెదురా ఓరి కంసుడా
కొద్దిగాదు పెనగంగ గోవిందుతో కంసుడా"2

వొద్దు నీవు నాకెదుర' అనే దేశీయ్యమైన ప్రయోగంలో అన్నమయ్య భావ సహజత్వం తెలుస్తుంది. 'కొద్దిగాదు పెనగంగ' అన్న ప్రయోగం కూడా గోవిందుడి లోతుపాతుల్ని సూచిస్తుంది. ఇవి చాలా అర్థవంతమైన ప్రయోగాలు.

దుష్ట శిక్షణలో అనుబంధానికి తావులేదని సూచిస్తూ అన్నమయ్య ఇలా అంటాడు. 'హరి మామ కంసు మదమడచె నేడు'3

కంస హరణ క్రియను హరి శబ్దంలో ఆయన ధ్వనింప జేశాడు.

---

1. రాగం-సాళంగనాట, సంపు-10. సంకీ-20, రేకు-304, అధ్యా. సం.
2. రాగం-నాట. సంపు-10, సంకీ-110, రేకు-319, అధ్యా. సం.
3. రాగం-భల్లాటి, సంపు-10, సంకీ-179, రేకు-331, అధ్యా. సం.

కంసుణ్ణి చంపిన గోవిందుణ్ణి 'అవల గంసు జంపిన ఆ గోవిందు డితడు'1 అన్న పాదంలో వర్ణిస్తూ 'ఇతడు' శబ్దాన్ని అతని ఘనతను సూచించే విధంగా ప్రయోగించాడు.

వ్రేపల్లెలో పెరిగి పెద్దయిన బాలకృష్ణుడు కంసుణ్ణి మధుర లోనే జంపినాడని "మరిగి పెద్దై కృష్ణుడు మధురలో గంసు జంపె"2 అని అన్నాడు.

మరోపాదంలో మేనమామ ఉక్కను అణచిన కృష్ణుడు వీరాన్ని అన్నమయ్య స్మరిస్తాడు.

'మెండుకొని ఉక్కణించె మేనమామను'3 'మెండుకొని' ప్రయోగం ఇక్కడ వ్యర్థపదం కాదు.

మరో కీర్తన పాదాల్లో ఇతడు మేనమామకు గండమని, దేవుడని బ్రాహ్మణులు అన్ని దిక్కుల్లో చెప్పారని అన్నమయ్య వర్ణించాడు.

'కావింప మేనమామకు గండమట యాతడే
దేవరట బాపలెల్లా దిక్కుల జెప్పిరి'4

కృష్ణజన్మం పురస్కరించుకొని, దాన్ని కంపవధకు అన్వయించి అన్నమయ్య,

---

1. రాగం–ఆహిరి, సంపు–10, సంకీ–80, రేకు–331, అధ్యా. సం.
2. ,, వసంతం ,, 11, ,, 8. ,, 352 ,,
3. ,, రామక్రియ ,, 11, ,, 76, ,, 117 ,,
4. ,, వళపంజర సంపు–24, సంకీ–27, రేకు–805 అధ్యా. సం.

'పెరిగె కంసజైత్రుడు భీషణ తేజమిత్రుడు
వరవసుదేవ దేవకీ పుత్రుడు"1 అని వర్ణించాడు

జైత్ర, మిత్ర ప్రయోగాలు సాభిప్రాయ సూచకాలు.

'పుత్ర' శబ్దం దేవకీవసుదేవుల దాస్య విమోచనా సూచకం. ఇందులోని అలంకారిక భావన సార్థకం,

మరో కీర్తన భాగంలో అన్నమయ్య,

"కావిరి విరిసె గంసుడు గినిసె
వావిరి పువ్వుల వానలు గురిసె'2 అని ప్రకృతి నిమిత్తాల్ని సూచించాడు. మహాపురుష సంజనన సందర్భంలో ఇలాంటినిమిత్తాలు పొడసూపినట్లు వర్ణించడం కవితా సంప్రదాయం.

దుష్టుడైన కంసుణ్ణి నానా హింసలు పెట్టిన గోప బాలునికి అన్నమయ్య గొబ్బిళ్ళపాట పాడాడు. ఈ గొబ్బిళ్ళపాట ఆనందోత్సాహాన్ని సూచిస్తూ లోక కంటకుడైన కంసుడి కష్టాన్ని భావించి అన్నమయ్య దీన్ని ఆలాపించాడు.

'ఏపున గంసుని యిడుముల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో'3

కంసుణ్ణి పొరిగొన్న చిన్నికృష్ణుడే వేంకటేశుడై ఇందర్ని కాచినాడని అన్నమయ్య ఇలా భావించాడు.

---

1. రాగం_సాళంగనాట, సంపు_18, సంకీ_137, రేకు_423, శృ. సం.
2. రాగం_భూపాళం, సంపు_12, సంకీ_?61, రేకు_91, శృ. సం.
3. రాగం_దేసాళం, సంపు_12, సంకీ_ 8, రేకు_17 ఆధ్యా. సం

'చిన్నికృష్ణుడై బెరిగి చేరి కంసుని బొరిగొని
యెన్న శ్రీవేంకటేశుడై ఇందరి గాచీ నిదె1'

ఇందులో చిన్నికృష్ణ వేంకటేశ్వరులకు రూప, నామ భేదాన్ని సాటించి తత్వతః అభేదంతో లోకరక్షణ కార్యాన్ని అన్నమయ్య కీర్తించాడు

ఇది అన్నమయ్య కంస వధను భావించిన తీరు.

తర్వాత కంసవధను వర్ణించిన ఎఱ్ఱన, పోతనల బాలకృష్ణ విక్రమ విలాసాన్ని రేఖామాత్రంగా చూడడం సమంజసమే అనిపిస్తుంది.

ఎఱ్ఱన తన హరివంశంలో కంసవధను ఇలా వర్ణించాడు.

సీ॥ మణులు రాలంగ జారుమకుటంబు వడదన్ని వడి వెంట్రుకలు వట్టి
త్రావలదిగిచి
నడుతల యందంద పిడికిట మెడఁడును గలగంగ బొడిచి మోకాల
నురము
దాకింప నొక్కచేతయు జేయలేక నిశ్చేష్టుడై రోజునిర్జీవు బెలుచ
హారఘుల్ త్రెవ్వ గర్ణావతంసములూడ నత్తఱి నుత్తరియంబు వీడ

తే॥ నోరముక్కునఁ జెవులును ఘోరరుధిర మొలుకగ్రుడ్లు
వెలుపలి కుఱుక మేడ
డిగ్గద్రోచి తోడనడిగ్గి ప్రగ్గెల, గుమ్మె నుసుఱుపోవంగ
సక్రోధలీల2

---

1. రాగం-ప్రతాపనాట, సంపు-18. సంకీ-383, రేకు-47!, శృ. సం.
2. హరివంశం పూ-భా. అష్టమ అశ్వాసం పద్యం 145 ఎఱ్ఱనామాత్యుడు

మొదట కృష్ణుడు కంసుడి మకుటాన్ని తన్ని, వెంట్రుకలుపట్టి ప్రాలలాగినాడు. నడితలపై పిడికిటి పోట్లతో మెదడును చెదరచేశాడు. రొమ్ముపై మోకాలితో గుద్దినాడు. అప్పుడు కంసుడు నిశ్చేష్టుడై రోసినాడు. కర్ణావతంసములు ఊడినాయి. ఉత్తరీయం తొలగింది. నోటినుంటి, ముక్కునుండి, చెవులనుండి రక్తాన్ని కక్కినాడు. కనుగుడ్లు వెలుపలికి వచ్చాయి.

ఇది ఎఱ్ఱన చేసిన కంసవధా వర్ణన.

కృష్ణుడు ఆయుధంతో కాక చేతులతోనే కంసుణ్ణి 'సక్రోదలీల'తో ఉసురు తీసినాడు. మేడమీదినుంచి డిగ్గద్రోచినాడు. ఇది ఒకదృశ్య వర్ణన. పదాడంబరం, శైలి, ఆర్భాటం లేని ఒక దృశ్య చిత్రణ విధానం. ఇది ఎఱ్ఱన మార్గం.

కాళీయమర్దన వర్ణన సందర్భంలో ఉన్న శైలి, ప్రాధాన్యం కన్నా దాన్ని మించిన ఒక క్రియా నిశ్శబ్దత ఇందులో కన్పిస్తుంది.

తర్వాత పోతన బాలకృష్ణుడు కంసుణ్ణి ఎలా సంహరించాడో చూడాలి. ఆ పద్యం ఇలా ఉంది.

శా॥ పక్షీంద్రుం డురగంబు బట్టువిధ మొప్పం గేశ బంధంబు లో
కక్షోభంబుగ బట్టి మౌళి మణులా కల్పాంత వేళా పత
న్నక్షత్రంబుల భంగి రాల రణ సంరంభంబు డిందించి రం
గక్షోణిం బడద్రొబ్బె గృష్ణుడు వెసం గంసున్ నృపోత్తంసునిన్.1

---

1. శ్రీమదాంధ్ర భాగవతము, ద. స్క. పూ-భా. పద్యము-1378
—పోతనామాత్యుడు

గరుడుడు ఉరగాన్ని పట్టిన విధంగా 'కంసుడి కేశబంధాన్ని కృష్ణుడు లోకక్షోభంబుగా పట్టాడు. కంసుడి మౌళిమణులు ప్రళయ కాలంలో నక్షత్రాలవలె రాలినాయి. అప్పటికే కంసునిలో రణ సంరంభం డిందింది. కృష్ణుడు రంగక్షోణిపై కంసుణ్ణి పడద్రొబ్బినాడని పోతన పద్యభావం.

ఇది ఆలంకారిక శైలీ రమ్యమైన వర్ణనా విధానం. జుట్టు పట్టుకోవడం ఎఱ్ఱన పోతనల వర్ణనల్లో సమానమే. పోతనలో ఆ పట్టుకోవడం ఆలంకారికంగా రూపించింది. అది లోకక్షోభంగా ఉంది. మౌళిమణులు రాలినట్లు ఇరువురూవర్ణించారు. దీనిని పోతన అతిశయోక్తితో వర్ణించాడు. 'ఒక్కజేతయు జేయలేక నిశ్చేష్టుడై' అన్న ఎఱ్ఱనప్రయోగం "రణసంరంభంబు డిందింది" అన్న పోతన ప్రయోగంలో సామ్యాన్ని పొందింది. ఎఱన సీసాన్ని, పోతన శార్దూలాన్ని గ్రహించారు. పోతన పద్యప్రాస బాలకృష్ణుడి దుష్టశిక్షణకు సూచకం.

అన్నమయ్య కూడా కిరీటమణులు రాలడాన్ని, జుట్టుపట్టుకోవడాన్ని ప్రస్తావించాడు. ఈ సమాన ధర్మం ఇలా ముగ్గురిలో కన్పిస్తుంది.

తర్వాత అన్నమయ్య బాలకృష్ణ సాహిత్యంలో ప్రస్తావితమైన లీలా సంకీర్తనల్ని పరిలీలించాలి.

# లీలా సంకీర్తనలు :

## ఉలూఖల బంధన లీల :

బాలకృష్ణ లీలల్లో ఉలూఖల బంధనలీల ఒకటి. అన్నమయ్య ఈ లీలా విశేషాన్ని వేరు వేరు కీర్తనల్లో అక్కడక్కడా పన్నెండు మార్లు ప్రస్తావించాడు. బాలకృష్ణుడు రోటికి కట్టుబడడాన్ని ఆశ్చర్యంతో అన్నమయ్య ఇలా అంటాడు.

"పటుగతి బలీంద్రుని బంధించినట్టి నీవు
నటరోల గట్టువడ్డ చందానికే మందును"1

ఇందులో బాలుడి త్రివిక్రమాకృతి లీల అన్నమయ్యకు మనోగోచరం కాగా, అలాంటివాడు రోటికి కట్టుబడడమేమి అని అచ్చెరువందాడు.

అలాగే "ఘనయోగీంద్రుల మతి గట్టువడ నట్టివాడు
పనిలేక రోల గట్టువడి నాడట్టె"2 అని అంటూ బాలుడి పరమ యోగీంద్ర హృదయ వాసాన్ని స్మరిస్తూ అచ్చెరు వందాడు.

పరమ భక్తుడైన అన్నమయ్య,

"వెలియ గొంగు వట్టితే విడుమంటా బెనగేవు
ఎలమి రోలగట్టితే నెట్టుంటివో"3 అని బాలకృష్ణుణ్ణి ప్రశ్నిస్తాడు.

---

1. రాగం-శంకరాభరణం, సంపు-6, సంకీ-31, రేకు-106, ఆధ్యా.సం.
2. రాగం-శంకరాభరణం, సంపు-3, సంకీ-27, రేకు-255, ఆధ్యా.సం.
3. రాగం-వరాళి. 25-558, రేకు-986 శృం. సం.

'మాయరోల గట్టువడి మద్దులు విరిచేసి
ఆయతమైయున్నట్టి అతడీతడా"1 అని అన్నమయ్య బాల కృషుడి లీలకు అచ్చెరువందాడు.

అలాగే 'కమ్మిరోల గట్టుబేడ గరుడ వాహనమేడ'2
బాలకృష్ణుడి గరుడవాహన మహిమను అన్నమయ్య ప్రసక్తికి తెచ్చాడు.

ఇలాంటి మహిమోపేతుడైన బాలుణ్ణి, తల్లిగనుక యశోద కట్ట కలిగిందని అన్నమయ్య సమాధాన వడ్డాడు,

"రువ్వేడి తాళ్ళదల్లి రోలదన్ను గట్టెనంటా"3 అని ఈ ఘట్టాన్ని కవి ఒక కథగా భావించాడు,

భక్తుడైన అన్నమయ్య గోపికల ద్వారా కృష్ణుణ్ణి,
"పాలు వెన్నలు మెసగి పాయపువాడవైతివి
రోలగట్టించుక తొల్లె ఘోడికెక్కితివి"4 అని అధిక్షేపింప జేశాడు, ఈ అధిక్షేపణలో భక్తుడి ఆక్షేపణ పూర్వకమైన భక్తివిధానం అభివ్యక్త మౌతుంది,

అలాగే మరోకీర్తన భాగంలో ఒక గొల్లెత,
'కల్లరివై నీవు రోలగట్టు వడుదుపుగాక
గొల్లదాన నాతోడి గొడవేల"5 అని ఆక్షేపింప జేశాడు,
ఇది కూడా పైదానివవెనే భక్తిలో భేదమే.

---

1. రాగం మాళవి, సంపు 24, సంకీ-301, రేకు-851, శృం. సం.
2. రాగం-మాళవి, సంపు-7, సంకీ-195, రేకు=185, అధ్యా. సం.
3. రాగం-కాంబోది, సంపు-3, సంకీ-142, రేకు-184, శృ. సం.
4. రాగం-ప్రతాపనాట, సంపు-18, సంకీ-540, రేకు-500 శృ, సం,
5, రాగం-సామంతం, సంపు-17, సంకీ-168, రేకు-345, శృం, సం,

బాలుడి ఆగడాల్ని చూసిన గొల్లెతలు ద్వారా అన్నమయ్య ఇలా అంటాడు,

"చాలు నీ కోపమిది సరిలేని మద్దులివి
రోలనే ఇట్లను విరుగ ద్రోయడు"1

ఇందులో బాలకృష్ణుడు మద్దులను విరిచిన లీలల్ని అన్నమయ్య భావించాడు. బాలుడి ఆగడాలకు తట్టుకోలేక మూలలో దాగిన కృష్ణుణ్ణి గోపికలు,

"మూలనున్నాడిదె ముంగిటికి దీసి
రోలగట్టరె రోసమెల్ల దీర"2 అని అంటారు,

నిముస మొకచోట నిలువక, చేసిన పని చేయక అల్లరిగా తిరుగాడే బాలకృష్ణుణ్ణి శిక్షించేదానికి 'రోలగట్టరే' అని వారంటారు. దానితో అతడి రోసం తీరుతుందని వారి నమ్మకం. అది సరికాదని అన్నట్లు దీనికి ముందు జరిగిన శకటాసుర భంజనాన్ని సూచిస్తూ అన్నమాచార్య,

'మంచి బండి దన్నెనట, మద్దులు విరిచెనట"3 అని అంటాడు.

రోటికికట్టబడ్డ బాలకృష్ణుడి విషయాన్ని విని పడతులు పరువులు పెట్టి, అతడు 'హరికాడుకదా' అని ఆతురతతో అనుకుంటారు. దీన్ని అన్నమయ్య ఇలా నిరూపించాడు.

"మరలి యప్పటివాడే మద్దులు విరిచెనంటా
పరువులు పెట్టేరు పడతులెల్లా

---

1, రాగం_శ్రీరాగం, ఏకతాళి, సంపు_2, సంకీ_27, రేకు 9 ఆధ్యా,సం,
2. రాగం_లలిత, సంపు_17, సంకీ_450, రేకు_375 శృ, సం,
3. రాగం_ధన్నాసి, సంపు_27, సంకీ_285, రేకు_1176, శృ. సం.

కిరికిరించగ రోలగట్టితే నప్పుడు మా
హరికాడుకదా అడనున్న బిడ్డడు"1

ఇందులో అల్లరి పిల్లడైన బాలకృష్ణుణ్ణి రోటికి కట్టినందుకు వారు పడే ఆదుర్దా కన్పిస్తుంది.

ఉలూఖల బంధనలీల ఆధారంగా అన్నమయ్య బాలుడు అతిలోక మహిమోపేతుడని, కేవలం మాయతో లీలగా కట్టుపడ్డాడని, అదీ తల్లికి కాబట్టి చిక్కినాడని, పరమయోగీంద్రులకుకూడా చిక్కనివాడని భావించాడు.

ఇదే ఘట్టాన్ని పోతన అన్నమయ్య లాగానే తాత్త్వికభావ సంపదతో అభివర్ణించాడు. పోతనకూడా ఉలూఖ బంధనం బాలుడికి ఒక లీలగానే భావించాడు. ఎవ్వరికీ చిక్కని బాలుడు తల్లియైన యశోదకు చిక్కి రోటికి కట్టుపడ్డాడని, మాతృత్వ మహిమాధిక్యాన్ని పోతన సూచనగా వ్యక్తం చేశాడు. ఈ వ్యక్తీకరణకు మూలమైన పోతన పద్యాలు పరిశీలించ దగ్గవి.

క॥ వెలిలోను మొదలు తుద నడు,
　　ములులేక జగంబు తుదియు మొదటన్ నడుమున్
వెలియున్ లోనగు నీశ్వరు,
　　నలవడునే కట్ట బ్రజతురాల్ గాకున్నన్"2

ఆ॥ "పట్టియలరు బోడి పట్టి యీతండని
గట్టి తలపుతోడ గట్టెగాక
పట్టికడుపు పెక్కు బ్రహ్మాండములు పట్టు
టెఱిగనేని తల్లియేల కట్టు"3

---

1. రాగం_లలిత, సంపు_6, సంకీ_65, రేకు_111 ఆధ్యా. సం.
2. పోతనభాగవతము ద. స్క. పూర్వభాగము పద్యము 379
3. పోతనభాగవతము ద. స్క. పూర్వభాగము పద్యము 380

క॥ 'చిక్కఁడు సిరికౌగిటిలోఁ, జిక్కఁడు సనకాదియోగి చిత్తాబ్జములన్
జిక్కఁడు శ్రుతిలతికావళిఁ, జిక్కెనతఁడు లీల దల్లి చేతన్ రోలన్"1

ఆది మధ్యాంత రహితుడై సర్వత్రా వ్యాపించిన ఈశ్వరుణ్ణి కట్టసాధ్యమా అని, పోతన మొదటి పద్యంలో భావించాడు. 'ప్రణతు రాల్ గాకున్నన్' అన్న ప్రయోగం యశోద పరమైంది.

అంతటా నిండిన పరమాత్మను కట్టడమా అన్న ఆశ్చర్యాన్ని భక్తుడైన పోతన ఇందులో ప్రతిపాదించాడు. ఈ భావం కందంలో అందంగా రూపించింది.

తర్వాత ఆటవెలదిలో యశోద కృష్ణుణ్ణి తన 'పట్టి' అని, గట్టి తలపుతో కట్టిందేకాని, 'పట్టి' కడుపు పెక్కు బ్రహ్మాండాలకు పట్టు అని ఎరిగితే తల్లి ఏల కట్టుతుందని ఆ మహా తాత్వికుడు అన్నాడు.

ఇందులో యశోద అమాయిక పుత్రబంధం ద్యోతకమౌతుంది. కృష్ణుడి సకల వ్యాపకత్వ సర్వేశ్వరత్వాల్ని ధ్వనింపజేస్తూ, లీలా విలాసుడై తల్లి చేతిలో రోటికి చిక్కాడని పై పద్యంలో పోతన భావించాడు.

'సిరికౌగిటికి', 'సనకాదియోగి చిత్తాబ్జాలకు' 'శ్రుతి లతికా వళికి' చిక్కనివాడు తల్లికి చిక్కినాడని అనడంలో మాతృత్వ మహత్యం సంభావితమైంది.

ఇది పోతన భక్తిభావనా విధమైన రచనా సంప్రదాయం.

అన్నమయ్యకూడా ఇంచుమించు ఈ ఘట్టాన్ని తన సంకీర్తన పాదాల్లో భావించాడు.

---

1. పోతనభాగవతము ద. స్క. పూర్వభాగము పద్యము 381

భక్తులు మహాకవులు అయిన ఇటువురు మహావ్యక్తుల భావనా సంవిధానం ఇలాగే ఉండడం సహజం. పోతన తన భావాన్ని ఛందోమయం చేయగా, వాగ్గేయకారుడైన అన్నమయ్య తన భక్తిభావాన్ని సంకీర్తనమయం చేశాడు.

తర్వాత అన్నమయ్య కీర్తించిన బాలకృష్ణ 'నవనీతచౌర్య లీలల్ని' దర్శించడం కర్తవ్యం. ఇది బాలకృష్ణుడి లీలల్లో ప్రధానాంశం.

## నవనీతచౌర్య లీలలు :

ఈ లీలాసందర్భాల్ని అన్నమయ్య కీర్తనపాదాల్లోగాక ప్రత్యేకించి ఏడు కీర్తనల్లో ప్రస్తావించాడు. దీన్ని బట్టి దీని ప్రాధాన్యం అవగతమౌతుంది.

చిలిపికృష్ణుడి చేతలకు తాళలేక రేపల్లె గోపికలు యశోదమ్మకు తెలపాలని అనుకుంటూ, వారిలో వారు చెప్పుకునే సందర్భాన్నిబట్టి 'నవనీతచౌర్య లీలలు' తెలుస్తాయి.

'ఏమో సేయగ' అన్న పల్లవితో సాగిన ఈ కీర్తనలో కృష్ణుడు ఉట్లను దించబోగా, పక్కగావచ్చి ఒక గోపిక పట్టుకున్నట్లు వెంటనే కృష్ణుడు ఆమె మొగంలోకి చూచినట్లు, దానితో మేనెల్లా మరుపు కల్గినట్లు వర్ణించాడు.

ఇందులో కృష్ణుడి చూపుల్లోని ఆకర్షణా మహిమ సూచించబడింది. ఇది భగవంతుడు భక్తురాల్ని చూచిన చూపు. దానిఫలితమే గోపికమేను మరవడం. ఇదే భక్తిలో చివరిదైన అనన్య భక్తి. ఇది మధురభక్తిలో సాగినట్టిది.

ఉట్లు దించబోయి పట్టుబడ్డ బాలకృష్ణుడు కాగుల్లో పాలను అంట బోయినాడు. వెంటనే పట్టుబడ్డాడు. ఆగోపికతో కిందుమీదైనాడు. అతడు ఆమె ఇక్కువకు చేయిచాచాడు. అంతే ఆమె చిత్తము నీరై కరగింది. ఇది భక్తురాలికి భగవంతుడి కరస్పర్శతో కల్గిన వరవశస్థితి.

తర్వాత బాలకృష్ణుడు గట్టి వెన్న ముద్దల్ని అరగించబోయాడు. గోపిక అతడ్ని కౌగిటితో కమ్ముకుంది. శ్రీ వేంకటేశుడే ఈ రూపంలో ఒంటిగా తనను కూడగా, పులకించి ఏకమైతిమి అని ఆమె అంటుంది. ఏకం కావడం జీవాత్మ పరమాత్మలో ఏకం కావడమే.

పై విషయాలకు మూలమైన కీర్తన ఇలా ఉంది.

"ఏమో సేయగ బోగా నేమో అయ
యేమని చెప్పుదు బనులిటువంటివే ॥పల్లవి॥

వుక్కుమీరి కృష్ణుడు మా వుట్లు దించబోగా
బక్కననే బారితెంచి పట్టుకొంటినే
మొక్కలాన నతడు నా మోము చూచె నంతలోనే
తక్కన నామేనెల్ల మరపాయనే ॥ఏమో॥

కమ్మంగ నంతట బోక కాగుల పాలంట బోగా
బిమ్మటగా గిందు మీదై పెనగితినే
యెమ్మెల నాతడు నా యిక్కువకు జేయి చాచె
కమ్మి నా చిత్తము నీరై కరగితినే ॥ఏమో॥

వుద్దండాన గట్టి వెన్న ముద్ద లారగించగానే
గద్దించి కౌగిటనే గమ్ముకొంటినే
వొద్దనె శ్రీవేంకటేశు డొంటి నన్ను గూడగా
నిద్దరికి బులకించి యేకమైతిమే"[1] ॥ఏమో॥

1. రాగం_కొండమలహరి, రేకు–265, సంపు 15, సంకీ–౬౯, శృం. సం.

పై కీర్తనలో అన్నమయ్య భగవంతుని దృక్కును, స్పర్శను తద్వారా అనుగ్రహాన్ని ధ్వనింప జేశాడు.

మరో గోపిక అనుభవాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

"ఎన్ని నేరుచుకొన్నాడే" అనే పల్లవితో కూడిన కీర్తనలో ఆయన దాన్ని వివరించాడు.

ఊట్లుదించగా కాచుకొన్న కృష్ణుణ్ణి చూచి, తిట్లు తిడుతూ గొల్లెత తేరిచూచింది. ఆతడు 'చట్లవంటి ఆమెచన్నుల్ని చేతముట్టిపెనగినాడు' ఇలాంటి బాలుణ్ణిచూడరే అని ఆమె, 'ఎన్ని నేర్చుకొన్నాడే ఇండుకే వెరగయ్యీని" అని అంటుంది

ఇది ఒక అనుగ్రహ లీల. పండ్ల గంపను విడువమంటూ పూల చెండుతో కృష్ణుణ్ణి పూచి వేస్తుంది. అప్పుడు కృష్ణుడు మోవివండ్లు అంటూ ఆమె అధరాల్ని అంటబట్టాడు. ఈ బాలుడు "చేవ మీరి యున్నాడు ఏమి సేతము" అని ఆమె విస్తుపోతుంది.

ఇది బాలుడి మధుర శృంగారమైన ఒకానొక చేష్టా విలాసం. ఇంత సున్నితభావం నాన్యత్రా దర్శనీయం.

ఈ భావాలికి మూలమయిన పాట తీరు చూడాలి.

"యెన్ని నేరుచుకొన్నాడే యిందుకే వెరగయ్యీని
చెన్ను మీర యశోదకు జెప్పరే యీ సుద్దులు ||పల్లవి||

వుట్లు దించగా గాచుకున్న కృష్ణుని జూచి
తిట్లు దిట్టు గొల్లెత తేరి చూడగా
చట్లవంటి చన్నులు చేతముట్టి పెనిగిని
చుట్లు చొల్లేలతోడ జూడరే ఈ బాలుని ||యెన్ని||

వేవేలు పండ్లగంప విడుమంటా వేరొకతె
పూవుల చెండున గృష్ణు బూచివేయగా
మోవి పండ్లంట బట్టి మురించి యామె యధరము
చేవమీరి యున్నాడేమి సేతమే యీ బాలుని1 ॥యెన్ని॥

పై పాటలో అధరాన్ని అన్నమయ్య పండువలె భావించాడు. 'పండు' అంటే 'దొండపండు' దీనికే 'బింబం' అని కూడా పేరు. దీని వల్ల గోపిక ప్రాకృతిక సౌందర్యం ధ్వనితం. బింబ ప్రతిబింబ భావం అంటే తాదాత్మ్యం భక్తురాలికి, భగవంతుడికిసహజమే. ఇందులో ప్రకటితమైన ఆమె ఆశ్చర్య భావం అతిలోక సంప్రాప్తమైన భగవదనుగ్రహ సౌభాగ్య ఫలమే.

పై అనుగ్రహమే మరో గోపికకు కూడా బాలకృష్ణుడు అనుగ్రహించాడు. ఈ అనుగ్రహాన్ని అన్నమయ్య క్రిందికీర్తనలో వాచ్యంగానే వర్ణించాడు.

"పడుచు జేతలుగావు బాలకృష్ణుడు
తొడికి మోవిపంటికి దుండగపు గృష్ణుడు ॥పల్లవి॥
వెన్నలు చేతబట్టుకొని వేలుచాచి ఉట్లకు
సన్నచేసీ గడవమ్మ జాణకృష్ణుడు
కన్నెలు దన్నెత్తుకొంటె కొగిట చవులుచూపి
యెన్నిట తానసకాడే యీకృష్ణుడు"2 ॥పడుచు॥

చేతిలో వెన్నముద్దలు ఊరడగానే ఉట్లకు సన్నచేసిన జాణకృష్ణుడి దివ్యసుందర రూపం పై పాటలో కన్నులకు కట్టినట్లుంది.

---

1. రాగం–లలిత, సంపు–18, సంకీ–139, రేకు–424 శృ. సం.
2. రాగం–మంగళకౌశిక, సంపు 17, సంకీ–121, రేకు–321, శృ. సం.

కన్నె పిల్లలు ఆ సుందర రూపాన్ని చూసి ఎత్తుకొంటే, వారికి కౌగిటి చవులు చూపాడు.

'కౌగిట చవులు' ప్రయోగంలో ఉన్న అందచందాలు, అర్థ సారస్యం సహృదయైక గమ్యం. ఇదే మధుర భక్తిలో అన్నమయ్య ప్రతిపాదించిన ఒక మార్గం.

మరో గోపిక యొక్క బాలకృష్ణ లీలానుభూతిని అన్నమయ్య 'తొడి బడ సందు సుడి దొంగాడిని' అనే పల్లవితో ఉన్న కీర్తనలో వర్ణించాడు.

గుర్తుపట్టి ఒక గోపికరాగా అప్పటికే అరచేతి వెన్నముద్దతో నోటి నిండా బావుకొన్న బాలకృష్ణుడు అమాయకుడివలె నటించి, మరోచేత్తో చట్టిలో వెన్నను అందియ్య బోవడాన్ని అన్నమయ్య మనోహర దృశ్యరూపంగా తీర్చిదిద్దాడు.

"గూనలో పాలెల్లా కుత్తుకబంటి దాకా తాగి" మొగం మొత్తి నట్లున్న కృష్ణణ్ణి ఎత్తుకోబోతే, నేలను ఒకచేత్తో వత్తిపట్టి ఊనుకొని ఎంతైనా కదలడట.

అన్నమయ్యలో బాలకృష్ణుడే ఆవహించనిదె ఆయన ఇలా భావించలేడు. ఇది అంతటి భక్తునికే వీలవుతుంది.

పెరుగు మీగడల్ని వెంటనున్న పిల్లవాండ్ల కందిచ్చి, దొర మాదిరిగా కృష్ణుడు తొంగిచూచాడని, ఇతడే వేంకటేశుడని మొక్కితే, ఆ గోపిక వైపుకు తిరిగి సెలవులవెంట బాలుడు నవ్వును జార్చినాడని తననే ఒక గోపికగా మార్చుకొని అన్నమయ్య దీన్ని వివరించాడు.

ఈ సుకుమార భావలీలల్ని భగవత్పరంగా భావించిన అన్న మయ్య ధన్యుడు. ఆ పాట అన్నమయ్య నోట ఇలా బయటపడింది.

తొడి బడ సందు సుడి దొంగాడిని
వెడగు గొప్ప శిరసు వెన్న ముద్ద కృష్ణుడు ॥పల్లవి॥

అదిగొని నే రాగా నఱచేతి వెన్నముద్ద
పొదుకొన నోరునిండా బాపుకొన్నాడు
సొదించీ నా మాటాడ డచ్చమయ్యీన గోలవలె
యీదెస జట్టిలో వెన్న యీయవచ్చీ జేతికి ॥తొడి॥

కుత్తుక బంటిదాకా గూనలో పాలెల్లా దాగి
యెత్తుక వున్నాడు మొగమిందు దాకాను
యెత్తుకొన బిలచితే యెంతైనా గదలడు
వొత్తిపట్టి వూదుకొనీ నొకచేత నేలను ॥తొడి॥

పెరుగు మీగడలలెల్ల పిన్నవాండ్ల కందించి
దొరవలె లోననుండి తొంగిచూచీని
యెరవులేక శ్రీవేంకటేశుడని మొక్కితేను
యిరవై తినని నవ్వి నిట్టె సెలవులను"1 ॥తొడి॥

గొల్లల ఇండ్లు సొచ్చి, గోపబాలకులతో కూడ శోధించే బాలుణ్ణి అన్నమయ్య "కోలలెత్తుకొని" అనే పల్లవితో ఉన్న కీర్తలో భావించాడు.

'కోలలెత్తుకొని గోపాలులును దాను
యీ లీల సోదించె యీతడే కదవె ॥పల్లవి॥

జన్నెవట్టి పుట్టి జక్కగ బెట్టిన
వెన్న దిన్న వాడు వీడుగదే
పన్నారు దొంతుల పాలు బెరుగులు
యిన్ని నారగించె యీతడు దగవే ॥కోల॥

1. రాగం_దేవగాంధారి. సం_29, సంకీ_450, రేకు_1075 శృం. సం.

మెఱసి అట్టుక మీఁది చెక్కిలాలు
వెఱజి గ్గైకొనె వీఁడుకదె
కఱమి కఱమి నములు గంపల నురుగులు
యెఱిగి దొంగిలె యీతఁడె కదవె"1 ॥కోల॥

గోపికలు ఒకరితో ఒకరు కృష్ణలీలల్ని చెప్పుకునే సందర్భంలో ఒకామె ఇలా అంటుంది. కోలలెత్తుకొని గోపబాలురతో ఇల్లంతా శోధించాడనీ, "జన్నెవట్టి పుట్టిపై చక్కగా బెట్టిన వెన్న దిన్న పాడు వీడేనా" ఇందులో బాలరూపంలో ఉన్న భగవానుడి లీలానైపుణ్యకథనం ఉంది. దాన్ని అన్నమయ్య సరళవ్యవహారిక భాషలో దృశ్యమానం చేశాడు.

'అందుకే వెఱచేనో' అన్న పల్లవిగోడి కీర్తనలో 'పారబోయి కాలుజారిన బిడ్డణ్ణి' అన్నమయ్య వర్ణించాడు.

"అందుకే వెఱచేనో యమ్మలాలా తన
కందువకే పారబోయి కాలు జారే బిడ్డండు ॥పల్లవి॥

పాలకడవలను బానల వెన్నలును
ఓలిం బెట్టి పుట్లపై నుండంగాను
నేలనుండి యెగసి నిక్కదీసే నిదివో
పాలు గాను సేయ విడిపడబోయె బిడ్డఁడు ॥అందుకే॥

కమ్మని నేతులును గడ్డల జున్నులును
కమ్మి పెద్ద కాగులతో కాగంగాను
దిమ్మరియై తొడికి తియ్యంబోయీ నిదివో
అమ్మరో వేళ్ళుబొక్కి అగ్గిదాకి బిడ్డఁడు"2

---

1. రాగం-వసంతం, సంపు-10, సంకీ-288, రేకు-349, ఆధ్యా.సం.
2. రాగం-సామంతం, సంపు-4, సంకీ-114,

పై కీర్తనలో ఒక గోపిక సానుభూతితో ఇలా అంటుంది. పాల కడవలు, వెన్నల బానలు వుట్లపై నుండగా నేలనుంచీ ఎగసి ఎగసి, నిక్కి తీయబోయి చేతిలో పాల గ్లాసు కిందపడ్డ బిడ్డణ్ణి చూస్తుంది. కమ్మని నేతులు, జున్నుల గడ్డలు పెద్దపెద్ద కాగుల్లో కాగుతుంటే దిమ్మరియై తీయబోయిన కృష్ణుడికి అగ్గితాకి వేళ్ళు పొక్కినాయని గోపిక అంటుంది.

ఇందులో చిన్నపిల్లలు సహజంగా ఆత్రంతో పొయ్యి మీది వస్తువుల్ని తీసుకోవాలనే తొందరతో వేళ్ళు పెట్టడం, అది చుర్రుమన డం సహజం. దీనినే అన్నమయ్య సహజంగా చిత్రించాడు.

'వేళ్ళు బొక్కి, అగ్గిదాకి బిడ్డడు' శబ్దాలు ఔచితీ స్ఫోరకాలు.

తరువాతి కీర్తనలో అన్నమయ్య, రకరకాల దొంతుల్లోని పాలు పెరుగు కుండల్ని తొలగదీసి, పాలుదాగి, దొంతుల్ని మరలా పేర్చిన బాలకృష్ణుడి చాతుర్యాన్ని ఒక గోపిక ద్వారా వివరించాడు.

దొంతుల పైనుంచీ దించిన పాలుమీగడల్ని, తోడీ బాలురకు పంచి పెట్టిన బాలకృష్ణుణ్ణి, పాలజలధి మీగడను అఖిలదేవతలకు పంచి నట్టి యోగిగా అన్నమయ్య భావించాడు. వెంటనున్న గోపబాలకులు దేవతలనీ, కృష్ణబాలుడు విష్ణువేననీ, మీగడ అమృతమనీ అన్న మయ్య భావనావిశేషం.

ఈ కీర్తనలో బాలుడి మూలస్వరూపం సంస్మరించబడింది.

"యెట్టు శయసైన నిచ్చన్ నిందు నందు నతండు
వెట్టుకొన్న విద్యలెల్ల నేర్చుంగాన యితండు ॥పల్లవి॥

పలుదెఱంగుల దొంతులైన పాలు పెరుగు కుండలెల్ల
దొలగద్రించి పాలుద్రాగి దొంతివేర్చె నితండు

తొలగ ద్రోసి దొల్లిటట్ల బహువిధముల
నెలవు కొలిపి దొంతివేర్చ నిచ్చుంగాన యితండు ॥యెట్టు॥

పాల మీగడెల్లం దిగిచి పలుదెరంగులతోడ నాడు
బాలులైన వారికెల్లం బంచిపెట్టె నితండు
మేలిమైన పాలజలధి మీగడ ఖిల దేవతలకు
నోలిం బంచిపెట్టినట్టి యోగిగాన యితండు"1 "యెట్టు"

ఇందులో అన్నమయ్య 'విద్యలెల్ల నేర్చుంగాన' అన్న ప్రయోగంతో ఆయన బ్రహ్మాండ పంక్తుల్ని పేర్చడాన్ని, 'బంచిపెట్టె' ప్రయోగంతో, దేవతలకు ఆహారమైన అమృతాన్ని పంచినాడని, 'పాలజలధి' ప్రయోగంవల్ల స్ఫురింప చేశాడు. యోగి భావనాభావితుడైన అన్నమయ్య, యోగీశ్వరేశ్వరుడైన బాలకృష్ణుడి లీలాయోగాన్ని ఆనందయోగంతో సంయోగం చేశాడు.

ఈ విధంగా అన్నమయ్య 'నవనీత చౌర్య లీలావిలాసాన్ని' గోపికల ద్వారా తన ఆనందానుభూతిని మిళితంచేసి, సహజ సుందరంగా అలౌకిక, తాత్త్విక భావనామయంగా అభివర్ణించాడు.

ఈ ఘట్టాన్ని పోతన మహాకవి కూడా సహజాతి సహజంగా వర్ణించాడు. నవనీత చౌర్య లీలతోపాటు గోపికలు యశోదకు చేసిన ఆగడపు విన్నపాల్ని కూడా మేళవించి, ఆయన ఆ ఘట్టాన్ని ఒక ముగ్ధమనోహర భావనామయ కావ్యంగా రూపించాడు. దీనిని అన్నమయ్య 'ఆగడపు విన్నపాలు' వర్ణన తర్వాత పరామర్శించడం జరుగుతుంది.

---

1. రాగం-భూపాలం, సంపు-27, సంకీ-299.

## ఆగడపు విన్నపాలు :

లోకంలో కలవారి బిడ్డల ఆగడాల్ని తల్లిదండ్రులకు విన్న వించడం సహజమే. ఇక్కడ సర్వేశ్వరుడైన కృష్ణుడే బిడ్డడు గాన ఆ బిడ్డడి ఆగడపుపనుల్ని గోపికలు యశోదమ్మకు విన్నపం చేయడం లోకోత్తర కావ్యవస్తువైంది. అందులో అన్నమయ్యవంటి భక్తశిఖా మణులైన వాగ్గేయకారుడికి ఇది మరీ ప్రీతికరమైన వస్తువు. అందుకే అన్నమయ్య ప్రత్యేకమైన పదునాలుగు కీర్తనల్లో బాలుడి ఆగడపు చేతల విన్నపాల్ని నోరారా కీర్తించాడు.

ఇందులోని శైలి ప్రత్యేకం. ఆక్షేపణకు పదశైలుల్ని అన్నమయ్య ఇందులో ఉపయోగించాడు. వర్ణ్యవస్తువుకు అవి ఎంతో సహజత్వాన్నే గాక అర్థ సౌభాగ్యాన్ని కూడా చేకూర్చినాయి. ఇక ఆ కీర్తనల్ని క్రమంగా పరిశీలించాలి.

'చూడవమ్మ కృష్ణుడు నీసుతుడోయమ్మ' అన్నపల్లవితో ఉన్న కీర్తనలో "కోలలుచాచి వుట్లుకొట్టగా" పాలు, పెరుగు కాలువలుగట్టి పారిందని, చక్కిలాల కుండలకు "దొండ్లువాడిచి" దోటి కోలలతో తీశాడని, తేనెబానల్నిరాతవేసి ధారగ్రోలాడని, అందని టెంకాయల్ని వల్లెగుడ్డల త్రాళ్ళతో [illegible]వంచాడని, బాల వేంకటేశుడు అల్లిబిల్లై యున్నాడని గోపికలు యశోదమ్మకు విన్నవించిన విధానాన్ని అన్నమయ్య వివరించాడు.

ఈ విన్నపం అన్నమయ్యమాటల్లో ఇలా ఉంది.

"చూడవమ్మ కృష్ణుడు నీ సుతుడోయమ్మా
ఆడీ వీధుల వెంట యశోదమ్మా ॥పల్లవి॥
కోలలు చాచి వుట్లుగొట్టగా బాలు బెరుగు
కాలువలు గట్టి పారె గదవమ్మా

మేలములాడీ వద్దంటే మిక్కిలి గొల్లెతలతో
ఆలకించి వినవమ్మా యశోదమ్మా ॥చూడ॥

చక్కిలాల కుండలెల్లా చలాన దొంగ్లు వొడిచి
దిక్కన దోటికోలల దీసీనమ్మా
చిక్కని తేనె చాడె చివ్వన రాతవేసితే
అక్కడ జోరునగారె యశోదమ్మా ॥చూడ॥

అల్లంత తన కందరాని టెంకాయలు
వల్లె తాళ్ళువేసి వంచీనమ్మా
బల్లిదు డలమేల్మంగ పతి శ్రీవేంకటేశుడు
అల్లిబిల్లై యున్నాడమ్మ యశోదమ్మా"1 ॥చూడ॥

'చూడవమ్మా' అన్నమాట విన్నపానికి ముందు ప్రాకృతులకు ఊతపదం, 'నీ సుతుడోయమ్మా' ప్రయోగం అమ్మా నీకొడుకే అన్న ఆక్షేపణకు గుర్తు. 'పారె గదవమ్మా' ప్రయోగం, కూడబెట్టిందంతా వ్యర్థమైపోయిందని సూచన.

విన్నప సంకీర్తనల్లో అమ్మా, యశోదమ్మా అన్న శబ్దాలు ఎక్కువగా అవృత్తమౌతుంటాయి. ఇది యశోద గొప్పతనాన్ని, గోపికల ఆశ్చర్యాన్ని, బాలుడి అతిలోక సామాన్యమైన లీలా విభవాన్ని సూచిస్తుంది.

ఒక గోపిక తన గోడును యశోదకు ఇలా విన్నవిస్తుంది. అది 'ఏటి బిడ్డ గంటివమ్మ యశోదమ్మా' అనే పల్లవితో కూడిన కీర్తనలో ఉంది.

"చెక్కుమీటి" పాలుపోసేదానికి నోరుతెరిస్తే బ్రహ్మాండాలు పొడసూపాయని, గుండెకు అదుముకుంటే అంగజతాపం మోచిందని, ఈ బాలుడిపై మక్కువతో ఈతడి మాయపనుల్ని చెప్పడానికి వెరుస్తామని అంటుంది.

---

1. రాగం_లలిత, సంపు_10, సంకీ_161, రేకు_328 ఆధ్యా. సం.

పురిటిపొత్తుల్లో ఉండగానే నాలుగుభుజాలు తోచాయనీ, ఇలలో మామూలు బాలురకు ఈ లక్షణాల్లేవనీ, ఎత్తుకొన్నవారికి మోయ లేనంతటి బరువుగా ఉంటాడని, కనుక ఈ అరడి బాలుణ్ణి ఎత్తుకోవ డానికే భయపడతామని అంటుంది.

ఆమె జంకుగొంకుల్ని అన్నమయ్య సహజంగా చిత్రించాడు. గోపికలు వారివారికి కల్గిన అనుభూతి విశేషాల్ని యశోదమ్మకు ఇలా విన్నవిస్తూ ఉంటారు.

'ఏటిబిడ్డ గంటివమ్మ యశోదమ్మ
గాటపు దేవతలెల్ల గాచుకున్నారితని ॥పల్లవి॥

చెక్కుమీటి పాలు వోయ చేరినోరు దెరిచితే
పక్కనను బొడ చూపె బ్రహ్మాండాలు
అక్కన నలుముకొంటె నంగజ తాపము మోచె
మక్కువకు పెరతుము మాయపు బాలునికి ॥ఏటి॥

పొత్తులలో నుండగానె భుజాలు నాలుగు దోచె
యిత్తల బాలునికేవి యిటువంటివి
యెత్తుకన్న వేకమై యెవ్వరికి వసగాడు
హత్తిచూడ వెరతు మీ యారడి బాలునికి'1 ॥ఏటి॥

కీర్తన చివర నాలుగు పాదాల్లో బాలకృష్ణుడి దివ్యత్వం ఉంది. 'ఎత్తుకొన్న వేకమై ఎవ్వరికి వసకాడు' అన్న పాదంలో అది మరింత స్పష్టమైంది. 'ఎవ్వరికి వసకాడు' ప్రయోగంలో పరమాత్మ లక్ష ణాన్ని అన్నమయ్య ద్యోతం చేశాడు.

అగడాలుచేసే నీకొడుకును వద్దని చెప్పినా పొలతుల్ని బూతులు తిట్టాడని, ఉట్లెక్కి పాలు మీగడలు దేపుకతిన్నాడని, అక్కజపు

---

1. రాగం_శంకరాభరణం సంపు_10, సంకీ_237, రేకు_340 ఆధ్యా.సం.

రోళ్ళెక్కి అట్టుగస్సైదాచిన చక్కిలాలు, నురుగులు చవిగొన్నాడని, ఎత్తుకొంటే ముద్దులు పెట్టాడని, తినిందిచాలక దగ్గరికొచ్చి నవ్వాడని, వన్నెల కృష్ణుడు ఇంటింటా పొంచినాడని ఒక గోపిక యశోదకు విన్నవించినట్లు అన్నమయ్య భావించాడు.

దేవుక తినడంలో బాలుడిలో నిర్భీకత, రోళ్ళెక్కడంలో అతడి ఉపాయం, ముద్దులు పెట్టడంలో అతడి కార్యచాతుర్యం చేరి నవ్వడంలో ఒక చనువు కనిపిస్తాయి.

"చూతువు రావమ్మా నీ సుతుని యశోదమ్మ
బూతులదిట్టీ వద్దంటే పొలతుల నెల్లను ‖పల్లవి‖

పొడవాటీ వుట్లెక్కి బుగుగులతోడి వెన్న
తొడికి పెట్టీ దనతోడి వారికి
కడవల పాలు మీగడలు దేవుకతిని
కడకు బాలెల్లాగార కంతలు సేసీని ‖చూతువు‖

అక్కజపు రోళ్ళెక్కి అట్టుగస్సై దాచిన
చక్కిలాలు నురుగులు జవిగొనీని
వెక్కసాన బట్టరాక వీధుల బారాడు తాను
మొక్కలాన నెత్తుకొంటే ముద్దుపెట్టీని ‖చూతువు‖

పన్నీరు దొంతులెక్కి బానల పెరుగు నేయి
చెన్ను మీర నారగించి చేరి నవ్వీని
అన్నిటా శ్రీవేంకటేశు డలమేల్మంగ విభుడు
వన్నెల క్రిష్ణు డింటింటి వాకిట బొంచీని"1 ‖చూతువు‖

ఒకగోపిక బాలకృష్ణుడి ప్రోఢచేతల్ని వివరించి 'కాంచనము వంటిబిడ్డ గంటివోయమ్మా' అని ఆక్షేపిస్తుంది.

---

1. రాగం లలిత, సంపు_30, సం కీ_267, రేకు_145 శృ. సం.

"వనకేళికి వెళ్ళితే నీకొడుకు మాకు లెక్కినాడు" 'జలకేళిలో ఈదులాడినాడు, ఏమీ ఎరగనట్టె మాకంటే ముందుగా నే మంచంపై పడుకున్నాడు, అంగడి బేరంకొంటే తానే అమ్మ వచ్చాడు ఆవుల్ని పిండితే ముంతపట్టాడు. సింగారించుకోబోతే చీరగట్టవచ్చాడు. యశోదమ్మా కంగుదేరిన బిడ్డని కంటివమ్మా గడివేసి కొంచెం కన్ను మూస్తే గడి ఎత్తి కౌగిటిలో కూడాడు' అని ఆమె అన్నట్లు అన్నమయ్య ఇలా వర్ణించాడు.

"అందరూ సంతోసించేరు యశోదమ్మ వినవమ్మ
కందువైన బిడ్డని గంటివోయమ్మ ॥పల్లవి॥

వనకేలి సేయబోతే వచ్చి మాకులెక్కి
యెనసి జలకేలిలో యీదులాడీని
మునుపె మాకంటె మంచముపై దానె పడుండీని
ఘనుడైన యీ కృష్ణుని గంటివోయమ్మా ॥అందరూ॥

అంగడి బేరము గొంటే అమ్మవచ్చీ దానె మాకు
ముంగిట వాల బిండితే ముంత వట్టీని
సింగారించుకొనబోతే చీరగట్టి వచ్చీ దానె
కంగుదేరిన బిడ్డని గంటివోయమ్మా ॥అందరూ॥

కంచము మొదలనుంటే గడియెత్తి పొత్తునను
కొంచి కన్ను మూసితేను కూడీ గాగిట
యెంచగ శ్రీవేంకటాద్రి నిరవైయాడే యట్టి
కాంచనము వంటి బిడ్డ గంటివోయమ్మా"1 ॥అందరూ॥

ఈ కీర్తనలో అన్నమయ్య గోపికల ద్వారా 'కందువైన', 'ఘనుడైన', 'కంగుదేరిన', 'కాంచనమువంటి' పదాల్ని ప్రయో

---

1. రాగం-గుండక్రియ, సంపు-13, సంకీ-188, రేకు-132 శృం. సం.

గించి, కృష్ణుడు దుడుకు చేతల్ని గోపికల ద్వారా వర్ణించిన తీరు ప్రత్యేకం.

మరో గోపిక 'వినమ్మ యశోద....యెన్ని పనులు చేసెనమ్మ కృష్ణుడు' అని మొదలుపెట్టి, ఉట్టులు కొట్టడాన్ని, దానికి ఉవిదలు తిట్టడాన్ని, అందువల్ల వీధిలో రట్టుపరచడాన్ని, పట్టకొన్న గొల్లెతలను భ్రమలో ముంచడాన్ని, పాలుకారుతున్న కృష్ణుణ్ణి చూసి పడతులు నవ్వడాన్ని, ఆలరి ఎలుగుల్తో అడ్డం వచ్చిన వాళ్ళను మేళపుచేతల్తో కృష్ణుడు మెప్పించేదాన్ని వివరిస్తుంది.

"వినవమ్మ యశోద గోవింద కృష్ణుడు
చెనకి యెన్నివనులు చేసెనమ్మ కృష్ణుడు ||పల్లవి||

వుట్టులు గొట్టగాను వువిదలు దిట్టగాను
అట్టాయ వీధులలో నురక కృష్ణుడు
పట్టిన కోలల గొల్లపౌజు లిరువంక రాగ
పట్టుకొన్న గొల్లెతల భ్రమయించె గృష్ణుడు ||విన||

పాలు దనపైగారగా పడతులు నవ్వగాను
గేలికిలోనాయను జంగిలి కృష్ణుడు
ఆలరి యెలుగులతో నడ్డము వచ్చిన వారి
మేలపు చేతలచేసి మెప్పించీ కృష్ణుడు ||విన||

యిండులు దాజూరగాను యింతులు పైకొనగాను
బందుకు లోనాయను గోపాల గృష్ణుడు
అండనె శ్రీవేంకటాద్రి నలమేలు మంగగూడి
దుండగపు జేతలనె దొరాయి గృష్ణుడు"1 ||విన||

ఇందులో అన్నమయ్య "పట్టినకోలల గొల్లెపౌజులిరువంకరాగా" ఆగడాలు చేసిన బాలకృష్ణుడి నవనీత దండ యాత్రను వర్ణించాడు.

---

1. రాగం-దేసాక్షి, సంపు-15, సంకీ 173, రేకు-279 శృ. సం.

ఇంకొక గోపిక యశోదకు కృష్ణుడి దుండగాల్ని వివరించి ఆతడికి బుద్ధిచెప్పమనీ, తాటగట్టమని, వాడు 'మునిముచ్చు' అనీ, ఉద్దండపనులు మానిపించమనీ మొరపెట్టు కొంటుంది. పైకి గోలవలె (అమాయక) ఉంటాడు కాని కోడెకాడని, తాలిమిలేని తరువరి అనీ, (అల్లరీడు) నీ బిడ్డడని, తడమారివాడని, కడలేని సాహసాలు గట్టువాయి అనీ వర్ణిస్తుంది.

"ఓయమ్మ సిలిబిడ్డ డోయమ్మా
యీ యెడ యశోద నీవెట్టు గంటివమ్మా ॥పల్లవి॥
గాలిగొట్టై తిరిగిన గామిడి వాడోయమ్మా
గోలవలె నుండుగాని కోడెకాడమ్మా
తాలిమి యించుకాలేని తరువరివాడమ్మా
ఆలరీడు నీబిడ్డడదె బుద్ధిచెప్పరో ॥ఓయమ్మ॥
కడలేని సాహసాలు గట్టువాయి వాడమ్మా
తడమారి యిందరిలో తాటగట్టమ్మ
ముడికారి తనముల మునిముచ్చు వాడమ్మ
బిడిబిడి నుద్దండ పనులు మానుపవో"1 ॥ఓయమ్మ॥

ఇందులో అన్నమయ్య 'గాలిగొట్టై' తిరిగిన గామిడి వాడని బాలుణ్ణి అంటాడు. 'గాలిగొట్టు' ప్రయోగం కేవలం గాలికి తిరిగేవాడు అనేకాక తృణావర్తుణ్ణి సంహరించాడని కూడా ధ్వనింపచేస్తుంది. 'మునిముచ్చు' ప్రయోగం సార్థకమైంది.

ఒకగోపిక 'ఎట్టిబాలుడు పుట్టెనె యశోద నీకు' అని ఆమె పడ్డ పాట్లను చెప్పుతుంది. చంక నిడుకుంటే చన్నులకే చేయిచాచాడని, అందుకే వీణ్ణి తాను ఎత్తుకోనని, తొడలపై నిడుకొని పాలుపోయగా

---

1. రాగం–బౌళి, సంపు–28, సంకీ–69, రేకు–1212 శృం. సం.

'చూచి' నవ్వాడని, ముద్దుపెట్టుకోబోతే ముంగురులు చుట్టి పట్టినాడనీ అందుకే ఒద్దికి రాసయించదని, గద్దించి చెక్కునొక్కితే కౌగిలించికాని విడవడని, వీడిపొందులు చాలునని అంటుంది. ఇందులో బాలకృష్ణుడి సొగసు చేతలు, అమాయకత ముసుగులో దాగిన శృంగార చేష్టలుగా అన్నమయ్య వర్ణించాడు. సుందర సుకుమార భావగర్భితమైన ఈ పాట తీరు రమ్యంగా ఉంది.

"ఎట్టిబాలుడు పుట్టెనే యశోద నీకు
వుట్టిపడీ నింతలేసి కోపనమ్మ నేను ॥పల్లవి॥

సారె జంకనిడుకొంటి చన్నులకే చేయిచాచీ
నీరితి వీని నెత్తుకొనిందుకే నేను
కోరితొడలపై నిడుకొని బాల్వోయగా నవ్వీ
ఆరసి వీనిదగ్గర నండఁకే నేను ॥ఎట్టి॥

ముద్దువెట్టుకొనబోతే ముంగురులు చుట్టిపట్టి
వొద్దికి రాసయించదు ఓయమ్మ నేను
గద్దించి చెక్కునొక్కితే కాగలించి విడువడు
చద్దివేడి వీనిపొందు చాలు (లఁ) నమ్మ నేను"1 ॥ఎట్టి॥

ఇందులో అన్నమయ్య గోపిక కోపాన్ని 'ఎట్టిబాలుడు పుట్టెనే యశోద నీకు' అన్న పల్లవితోనే సూచించాడు.

కొందరు గోపికలు కలసి యశోదతో బాలుడి ఆగడాన్ని విన్నవించారు. తమను రక్షించమని వేడుకొంటారు. ఉట్లమీదున్న పాలు వెన్నల్ని చట్లతోనే కొల్లగొట్టి అటకల మీదనే గోపాలురతో ఆరగించాడనీ, జిడ్డుగాకుండా పాలను తేనెను తెల్లలోనే దేవిదేవి తిన్నాడన్నీ,

1. రాగం_కేదారగౌళ, సంపు_13, సంకీ_283, రేకు_148 శృ. సం.

దిబ్బకంతల్లో తిరిగారని, పంద్లను, కాయల్ని, బానల్ని వీధుల్లో దొబ్బా రని అంటారు.

దీన్ని అన్నమయ్య వేంకటపతితో అభేదాన్ని పాటించి, కృష్ణ పరంగా ఇలా వర్ణించాడు.

"యశోద నీబిడ్డ నేమందుము
రాశికెక్క మమ్ము రక్షించుమనవో ॥పల్లవి॥

పుట్లమీదనున్న పాలు వెన్న
చట్లతోడనే సాధించి
కొల్లగొట్టుచు గోపాలులు దాను
అట్లు తోడనె ఆరగించీని ॥యశోద॥

బిడ్డ గాపంద చిలు పాలుదీనె
తెడ్లతోదనీ దివి దివి
గుడ్లకొలది కోరి మెసగుచు
దిడ్ల కంతల దిరుగాడీని ॥యశోద॥

పంద్లు గాయలును బానలు వీదుల
దొంగ్లుగాజేసి దొబ్బిదొబ్బి
బండ్ల శ్రీవేంకటపతి యలమేల్మంగతో
యిండ్లిండ్ల వాకిండ్ల వేగే రదివో"1 ॥యశోద॥

ఈ కీర్తనలోని పల్లవిలో గోపికలు యశోదతో తమను రక్షించ మని బాలకృష్ణుడికి చెప్పమన్నట్లు కన్పిస్తుంది. అంతేగాక ఇలాంటి అగడాలుచేసే నీబిడ్డను 'ఏమందుము' అని అన్నట్లూ ఉంది. అందులో బిడ్డగొప్పతనం సూచితం. బిడ్లు, తెడ్లు, గొడ్లు, దిడ్లు, పంద్లు,

---

1. రాగం:దేవగాంధారి, సంపు-29, సంకీ-331, రేకు-1356 శృ. సం.

దొండ్లు, బండ్లు, ఇండ్లు ప్రయోగాలు పై కీర్తనకు ఒక సహజత్వాన్ని కూర్చినాయి.

మొగమాటంలేని ఒక గోపిక యశోదతో, 'ఏవమ్మా యశోద నీ యింటికి మేము వచ్చితే, గామువంటి బిడ్డనిన్చి కొలువడ జేసితివి' అని అంటూ బాలుడి ఆగడాల్ని క్రమంగా ఏకరువు పెట్టింది.

చెక్కమీటితే సెలవుల్లో పాలుగారాయనీ, వేలు పెట్టితే లోకాలు వెల్లివిరిసాయనీ, ఉగ్గువెట్టేదానికి వెరచినామని, మీ వాడు దయ్యం గాక బాలుడా అని అంటుంది. తొడమీది నుంచీ నిలువునూరు వంటు తాడు, "వీడు మానిశా ఎవ్వడోకాక' అని అంటూ, వీడ్ని నీరార్చినాను పయ్యెదలో నిడుకున్నాను. అలాంటివాడే నాకు మగడైనాడని, ఇంకేమీ చెప్పగ వెరతునని వివరిస్తుంది.

'ఏమమ్మ యశోద మీ యింటికి నేను వచ్చితే
గామువంటి బిడ్డనిచ్చి కలువడ జేసితి ||పల్లవి||

పాలుగారీ సెలవుల బక్కన జెక్కమీటితే
వేలువెట్టితే లోకాలు వెల్లివిరిసీ
పీలినేము వుగ్గువెట్ట వెరతుము మీవాడు
బాలుడా దయ్యముగాక వట్టవమ్మా ||ఏమమ్మ||

సెమ్మెదొడమీదనుండీ నిలువునూరు వండీని
పమ్మి నాల్గునోముల పాపడు లోననున్నాడు
నెమ్మది బాలువోయగ నేవెరతు మీవాడు
ఇమ్ముల వీడు మానిశా యెవ్వడోగాక ||ఏమమ్మ||

పక్కన నీరార్చితి బయ్యెదలో నిడుకొంటె
మక్కువ తానే నాకు మగడైనాడు
చిక్కిన పనులింకేమీ జెప్పగవెరతును
యెక్కువ శ్రీవేంకటేశుడితడే వోయమ్మా"1 ||ఏమమ్మ||

---

1. రాగం_కాంబోజి. సం.పు 25 సం.కీ 481 ...

సామాన్య బాలకులకు అసహజమైన పనుల్ని చేసిన కృష్ణుణ్ణి ఆ గోపిక 'గాముచంటి బిడ్డ", "దయ్యము గాక", అని "మానిశా, యెవ్వడోగాక" అని గోపిక చెప్పిన భావాన్ని అన్నమయ్య ఇందులో వివరించాడు. ఆ బాలుణ్ణి సమీపించే దానికే గోపిక భయపడినట్లు ఇందులో కన్పిస్తుంది. "ఎవ్వడోకాక" అనడంలో మానవాతీతుడు అన్న అర్థం స్ఫురిస్తుంది. "తానే నాకు మగడై నాడు" అన్న ప్రయోగం బాలుడి గడుసుదనాన్ని తెల్పుతుంది.

ఇందుతో గోపిక అమాయకత్వం, బాలుడి మాయకత్వం వ్యక్తమౌతాయి. బిడ్డను గారాబంగా పెంచిన యశోదవంటి తల్లితోనే గోపిక ఇలా గాలి అనీ, దయ్యమనీ, మానిశా అనీ అనడంవల్ల విసుగుతో కూడిన ఆమె భయం వ్యక్తమౌతుంది. అందుకే ఆమె 'ఉగ్గువెట్ట వెరతుము' అని అన్నది.

మరో గోపిక యశోదతో 'సోయగపు నీ కన్నుల చూతువు రావమ్మా' అని అంటుంది. 'మేమేమి సేతుము మాకు మీరే దిక్కు' అని ఆమె దైన్యాన్ని వెళ్ళగ్రక్కింది. 'చేముట్టరాదితని చిత్తగించవమ్మా' అని యశోదానందుల గొప్పతనాన్ని ఎత్తిపొడిచింది. నీ కొడుకు, ఊరి పడుచులు కోలలతో ఉట్టిగొట్టగా జోరుపరాశే పాలూ పెరుగును నీవే చూతువు రమ్మంటుంది.

కొత్త జవ్వనులైన కొమ్మల చన్నులకు తేనెదుత్తల్ని అంటూ పొందిస్తాడు. అందరి ముంగిళ్ళలో నీకొడుకు, పడుచులు గుంపుగా ఉన్నారు. నీవే కనుగొందువు రావమ్మా అని ఆమె అంటుంది.

'మేమేమి సేతుము మాకు మీరే దిక్కు
చేముట్టరాదితని చిత్తగించవమ్మా ॥పల్లవి॥
వో యశోద నీకొడుకు వూరిపడుచులు దాను
ఖోయని వుట్లుగొట్టీ గోలలగొని

చాయల జోరున గారి చమరు బాలు పెరుగు
సోయగపు సీకన్నుల జూతువు రావమ్మా ||మేమేమి||

కొత్తజవ్వనులైన కొమ్మల చన్నుల తేనె
దుత్తలంటా పొందించ దొరకొనీని
మొత్తములై యున్నారు ముంగిళ్ళనెల్లా దామే
గుత్తముగ నీవే కనుగొందువు రావమ్మా"1 ||మేమేమి||

ఇందులో అన్నమయ్య 'చేముట్టరాదితని' ప్రయోగంలో బాల కృష్ణుడి మహిమను సూచించాడు. ఇందులో ఒక అప్యాయత, నిస్పృహా యత (మేమేమి సేతుము), ఆశ్రయభావం మీరే దిక్కు అన్న ప్రయోగంవల్ల ద్యోతకమౌతుంది. సాహిత్యపరంగానే గాక, శంకరా భరణ రాగపరంగా కూడా అన్నమయ్య దీన్ని వ్యక్తం చేయడం విశేషం.

బాలకృష్ణుడిపై గోపిక చేసిన నిందారోపణను కాదని యశోద గొల్లెతతో వాదించి మందలించిన విధానాన్ని సంభాషణా రూపంలో అన్నమయ్య కొత్తపద్ధతిలో ఆగడపు విన్నపాల్ని అభివర్ణించాడు.

"నిక్కమమ్మ యశోద నియ్యాన
అక్కడ నెవ్వరోకాక యిటువంటి వాడా ||పల్లవి||

వీడుగడె బాలుడు వెన్నలు దొంగిలీ నేడు
కాడు వో అదేమోసి గబ్బి గొల్లెత
చూడగదె నీవు సోయగపు చేతిబిడ్డ
ఆదేవు కల్లలేగాక అటువంటివాడా ||నిక్క||
చిక్కెగదె మీవాడే చేరి పెరుగుదొంగ
పొట్కలదెమోసి బొంకుగొల్లెత

1. రాగం–శంకరాభరణం, సంపు–20, సంకీ–454, రేకు–676 శృ. సం.

పుక్కిట నిదిగదె పొంగినట్టి మీగడలు
అక్కటా నీ భ్రమలింతే, అటువంటి వాడా"[1] ॥నిక్క॥

ఒక గోపిక యశోదతో బాలుడు నీ యాన (నీతోడు) దొంగిలిం చాడు. అని అంటే దానికి యశోద అదేమే ఓసి గొల్లెతా, కాదు పో అని అంటుంది. దానికి గోపిక సోయగపు చేతిజిడ్డును నీవే చూడమని అంటుంది. దానికి యశోద నీవనేవికల్లేకాక నా బిడ్డడు అటువంటివాడా అంటుంది. చిక్కిన పెరుగుదొంగ మీవాడే అని గొల్లెత అనగా, గొల్ల తను బొంకవద్దంటుంది. మరలా గోపిక బాలుడు పుక్కిట్లో మీగడలు పొంగినాయంటే, అయ్యో అది నీభ్రమ ఇంతేదాని అటువండివాడా అని యశోద బదులిస్తుంది.

ఇది ఒక రసవత్తరమైన సంవాదాత్మక ఘట్టం. కొడుకుపై నమ్మకమున్న తల్లి కొడుకును వెనకేసుకొని వచ్చేతీరు ఇందులో ఉంది. 'అటువంటివాడా' అనడంలో ఆశ్చర్యం, కాదు అన్న నిషే ధార్థంకూడా ఉన్నాయి. 'కాదువో' అనడంలో తిరస్కారార్థం ద్యోతక మౌతుంది. ఇది కూడా శంకరాభరణ రాగంలోనే సాగింది. ఇది ఒక రసవత్తర రచనారీతి.

మరో కీర్తనలో అన్నమయ్య ఒక గొల్లెత గోడును వివరిస్తూ 'గామిడి' తనంతో గొల్లలూతాను గోపిక ఇళ్ళలో ఉట్లు గొట్టి, గోపికల పాలిండ్లమీద చిల్లర సేతలు చేశాడనీ, మేలిమి సతుల మేనమామ నంటూ అల్లరిచేస్తున్నాడని, అటకలపైనున్న చక్కిలాల్ని, అటుకుల్ని దింపి గోలచేస్తున్నాడనీ వివరించాడు.

"ఏమమ్మ యశోద యిదె నీ బిడ్డడు
గామిడి తనాల గదిసీ వీడె ॥పల్లవి॥

---

1. రాగం–శంకరాభరణం, సంపు–30, సంకీ–165, రేకు–1428 శృం.సం

గొల్లలు దానును గోపికలిండ్ల
కొల్లగానుట్లు గొట్టి వీడె
వల్లదాన వారి పాలిండ్ల మీదట
చిల్లర సేతలు చేసీ వీడే ॥ఏమమ్మ॥

పాలువెన్నలును బానలు తోడుత
కేలుచాచీ యారగించీ వీడే
మేలిమీ సతుల మేనబావ నంటా
కోలుముందుగా గూడీ వీడె ॥ఏమమ్మ॥

అటుకులు జక్కిలాలడుకులు వేల
గట్టిన గోలలగొట్టీ వీడె
దిట్టయి శ్రీవేంకటాద్రి నలమేల్మంగ
గట్టుక దేవుడై కడగీ వీడె"1 ॥ఏమమ్మ॥

ఇదీ శంకరాభరణంలోనే సాగింది. శంకరాభరణ రాగౌచిత్యాన్ని బట్టి ఈ సందర్భంలో అన్నమయ్య దాన్ని గ్రహించడం జరిగింది. విన్నపానికి ఇది అరుదైనరాగం. 'పాలిండ్ల మీదట చిల్లర చేతలు సేసీ' ప్రయోగం సుందరమైంది. మేనమామనంటూ వరస కలుపుకోవడం తుంటరి తనాన్నేగాక, దాంతో గూడిన సరసాన్ని తెలుపుతుంది.

ఇందులో వేంకటాద్రి దేవుడికీ, కృష్ణుడికి సమన్వయం జరిగింది.

మరో కీర్తనలో అన్నమయ్య ఒక గోపిక యశోదతో చెప్పిన కృష్ణుడి ఆగడాల్ని ఇలా వర్ణించాడు.

వాడవాడల్లో వరదలొచ్చాయనీ, పులిపాలు పెరుగు మీగడలు వాగులు గట్టినాయనీ, పేరిపేరని నేతుల్ని, వెన్నల జున్నుల్ని సగం తిని సగపాళ్ళు పారవేసిన బానల్ని చూడమని అంటాడు.

---

1. రాగం_శంకరాభరణం, సంపు_25, సంకీ 258, రేకు_946 శృ. సం.

తమకు జరిగిన అన్యాయాన్ని అధిక్షేపిస్తూ 'చూడవమ్మా' అని గొప్పవాళ్ళకు లేనివాళ్ళు విన్నవించే తీరు ఇందులో వర్ణనాత్మకంగా కన్పిస్తుంది.

''చూడవమ్మ యశోదమ్మ
వాడ వాడల వరదలివిగో ॥పల్లవి॥

పొంచి పులివాలుం బెరుగు
మించు మించు మీగడలు
వంచి వారలు వట్టిన
కంచపుట్ల కాగులివిగో ॥చూడ॥

పేరిం జేరని నేతులు
చూరల వెన్నల జున్నులును
ఆరగించి యట సగబాళ్ళ
పారవేసిన బానలివిగో''1 ॥చూడ॥

ఇది మాళవి రాగంలో సాగింది. శంకరాభరణంకన్నా మాళవి రాగం వేగవంతమైన భావాన్ని ప్రకటించేటప్పుడు వాడడం కన్పిస్తుంది. ఇందులో గోపిక ఆవేశం కొంత కన్పిస్తుంది.

ఈ చివరి కీర్తనలో అన్నమయ్య, గోపికలు ముందు చేసిన ఆరోపణరూపమైన విన్నపాలకు ప్రత్యుత్తరంగా యశోద తన బిడ్డను తప్పులేదని చెప్పినట్లు అన్నమయ్య వ్యక్తం చేశాడు.

'కానరటె పెంచరటె కటకటా బిడ్డలను
నేనూ మీవలెనే కంటి నెయ్యమైన బిడ్డని ॥పల్లవి॥

బాయిట బారవేసిన పాలు వెన్నలును
చేయి వెట్టకుందురా చిన్నిబిడ్డలు

---

1. రాగం-మాళవి, సంపు-12, సంకీ-226, రేకు-69, శృం. సం.

మీ ఇండ్లు జతనాలు మీరు చేసికొనక
పాయక దూరేరేమె ప్రతిలేని బిడ్డని ॥కాన॥

మూసిన కాగులు నేయీ ముంగిట పెరుగులూ
ఆసపడకుందురా ఆడేబిడ్డలు
వోసరించి మోసపోక వుండలేక మీరు
సేసేరింతేసి దూరుచెప్పరాని బిడ్డని ॥కాన॥

చొక్కమైన కొప్పెరల జున్నులు జిన్నులును
చిక్కిన నిడుతురా చిన్నిబిడ్డలు
మిక్కిలి పూజలు సేసి మెచ్చించదగదా
యెక్కువైన తిరువేంకటేశుడైన బిడ్డని"[1] ॥కాన॥

యశోద గోపికలతో 'కానరటె పెంచరటె కటకటా బిడ్డలను బయట పారవేసిన పాలు వెన్నలను, చిన్నబిడ్డలు చేయి పెట్టకుందురా' అని ఆమె అంటుంది. 'మీ యిండ్లు జతనాలు మీరు చేసుకోక ప్రతిలేని బిడ్డని పాయక దూరుతారు. కాగులనేయికి, ముంగిట పెరుగులకు ఆడేబిడ్డలు ఆశపడకుందురా' అని అంటుంది. చెప్పరాని బిడ్డని మీరు మోసపోక ఉండలేక ఇంతేసి దూరు చేస్తారని ఆమె వారినే మందలిస్తుంది.

చిన్నిబిడ్డలు జున్నులు చిక్కితే విడుతురా అని అడుగుతుంది. ఈ బిడ్డని పూజసేయ తగదా అని యశోద అంటుంది.

ఇందులో గోపికల నిందారోపణలకు విసిగిన యశోద మాట తీరు, మనస్తత్వం వ్యక్తమౌతుంది. 'నెయ్యమైన బిడ్డ', 'ప్రతిలేని బిడ్డ', 'చెప్పరాని బిడ్డని', 'వేంకటేశుడైన బిడ్డని' యశోద పుత్ర మమకారాన్ని తద్వారా అతడి దివ్యత్వాన్ని నిరూపిస్తాయి.

---

1. రాగం-శుద్ధదేశి, సంపు-12, సంకీ 253, రేకు-74 శృం. సం.

మీ జాగ్రతలో మీరుండాలిగాని, మీ ఇల్లు మీరు చక్కదిద్దుకోవాలి కాని, ఆడేబిడ్డలు అశపడకుందురా; అని యశోద వాళ్ళని మందలించడంలో ఒక సహజత్వం ఉట్టిపడుతుంది.

ఈ కీర్తన శుద్ధదేశి రాగరంజితమైంది.

ఈ ఘట్టాన్ని పోతన భాగవతమునందు రసవత్తరంగా చిత్రించాడు.

ఇంచుమించు ముందు చెప్పిన అన్నమయ్య కీర్తనలోని భావాలే ఇక్కడా ఉన్నప్పటికీ పోతన పద్యాలు చాలా ప్రసిద్ధికి వచ్చాయి. ఈ ఘట్టంలో మొత్తం ఇరవైమూడు పద్యాలున్నాయి. ఒక సీసం, ఒక మత్తకోకిల, రెండు ఆటవెలదులు, పంతొమ్మిది కందాలు ఉన్నాయి.

గోపికల ఆరోపణలు కందంలో అందంగా చిందులేశాయి. ఇందులోని పోతనశైలి చాలా సహజంగా, సరళంగా జాలువారింది. తెలుగు దేశంలో ఈ ఘట్టంలోని పోతన పద్యాలు వినని వారుండరన్న అతిశయోక్తి కాదు.

బాలురకు పాలులేవని, పడతీ నీ బిడ్డడు, పుట్టిపుట్టడు, ఆడంజని, వారిల్లుసొచ్చి వెన్న దినగ, చేబంతి తప్పిపడెనని, కొడుకులు లేరని, వ్రాలగవచ్చిన, నమ్మి నిదురవోవ, తెరవయొకతె నిద్రింపగ మొదలైన పద్యాలు తెలుగుల నోళ్ళల్లో తరతరాలుగ నానుతున్న పద్యాలే![1]

తర్వాత క్రీడా సంకీర్తనల్లో ప్రతిపాదితాలైన అన్నమయ్య భావనా విశేషాల్ని పరిశీలించడం కర్తవ్యం.

---

1. భాగవతము; ద.స్కం; పూ.భా., ప: 306 నుండి 331 వరకు.
—పోతనామాత్యుడు.

## క్రీడా సంకీర్తనలు :

### బలరామకృష్ణుల క్రీడలు :

దీనికి సంబంధించి అన్నమయ్య నాలుగు కీర్తనల్ని రచించాడు. ఈ కీర్తనల్లో పల్లవి నియమం పాటించబడింది.

మొదటి కీర్తనలో అన్నమయ్య బలరామకృష్ణుల సంవాదాత్మక రూపమైన క్రీడల్ని వర్ణించాడు.

వారు అమడలవలెనే ఆడుకున్నారని, వారిని చూచి బ్రహ్మాదులు మ్రొక్కినారని అన్నమయ్య వారి క్రీడలకు ఒక మహత్వాన్ని ఆపాదించాడు. దండిగా తనకు పండ్లు పెట్టమని అడిగిన కృష్ణుడితో రాముడు, నాకూ ఇలాగే ఇస్తావా అని అంటాడు. అందుకు కృష్ణుడు ప్రేమపు తమ్ముణ్ణి కనుక నీకు పిన్ననే అని అంటాడు. 'పిన్న' శబ్దం వినయాన్ని సూచిస్తుంది. దానికి రాముడు నీవు ఈ మాట మరువవద్దని 'ఇందరా కృష్ణుడా' అని అంటాడు. పైనున్న ఉట్టిపైకి తనను ఎక్కించమని హరి అంటాడు. 'పడతావు నీవు రావద్దు' అని రాముడంటాడు. దానికి కృష్ణుడు 'నీ పైడికాళ్ళకు మొక్కేరా' అని అంటాడు. దానికి రాముడు రారా అంటాడు.

"అనుచు నిద్దరు నాడే రమడల వలెనే
మొనసి యివెల్లా జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు ॥పల్లవి॥

రాముడ పండ్లు నాకు రండుపెట్టరా
యేమిరా యిట్లానే నాకు యిత్తువా నీవు
ప్రేమపు తమ్ముడగాన పిన్ననే నీకు
యీ మాట మఱవకు యిందరా కృష్ణుడా ॥అనుచు॥

యెక్కిన వుట్టిపై నన్ను నెక్కించరా వోరి
వుక్కునబడేవు రాను వద్దురా నీవు

పక్కన మొక్కేరా నీ పయిడి కాళ్ళకు వోరి
అక్కతో జెప్పెగాని అందుకొనే రారా"1 ॥అనుచు॥

ఇందులో అన్నమయ్య రామకృష్ణుల అన్యోన్య సౌభ్రాతృ బంధాన్ని, పెద్ద చిన్న తారతమ్యాన్ని వ్యక్తం చేశాడు. చిన్నవాడు మారాము చేస్తే, విధిలేక పెద్దవాడు ఒప్పుకొన్నట్లే. ఇక్కడ రాముణ్ణి చిత్రించాడు. ఇరువురూ చేయబోయేది దుడుకుపనే. అందులో పెద్ద వాడు తన పెద్దతనాన్ని, చిన్నవాడైన కృష్ణుడు తన చిలిపితనాన్ని ప్రదర్శించారు. ఇది ఉట్టిపెక్కేవారి ప్రయత్నాన్ని చిత్రించే కీర్తన.

ఈ కీర్తన రామక్రియ రాగంలో సార్థకమైంది.

మరో కీర్తనలో బలరామకృష్ణుల ఆగడాల్ని సహించని గోపికలు యశోదకు చెప్పాలని అనుకోవడాన్ని అన్నమయ్య క్రీడల రూపంలో భావించాడు.

'ఎక్కడ చూచినా ఏ యింటి ముంగిట వీరే' అని పెక్కు చేతలు చేసేరు బాలుల పిలవండని పిన్నవాడు కృష్ణుడు, పెద్దవాడు రాముడు తేడా లేక అమడల వలె ఉన్నారని, వీడూ వాడూ ఒక్కటై వెన్నలు దొంగిలించేదానికి పన్నుగడతో వచ్చినారని గోపభామలు అనుకుం టారు. నల్లనివాడు కృష్ణుడని, తెల్లనివాడు రాముడని, జోడుకోడెలవలె ఇద్దరూ వేరులేక ఉన్నారని, యశోద వద్ద ఈ బాలురను నిలబెట్టమని ఒకడు, రోటికి చిక్కినవాడని మరొకడు, రోకలి పట్టినాడని సరిచేపికి వీరికి పోలిక ఉందని గోపికలు అనుకొంటారు.

"ఎక్కడ చూచిన వీరే యింటింటి ముంగిటను
పెక్కుచేతలు సేసేరు పిలువరే బాలుల ॥పల్లవి॥

పిన్నవాడు కృష్ణుడు పెద్దవాడు రాముడు
వన్నె నిద్దరమడల వలె నున్నారు

1. రాగం-రామక్రియ, సంపు-6, సంకీ-14, రేకు-103, ఆధ్యా.సం.

వెన్నలు దొంగిలిరదరు వీడు వాడు నొక్కటై
వన్నెగడై వచ్చినారు వట్టరే యీ బాలుల ॥ఎక్కడ॥
నల్లనివాడు కృష్ణుడు తెల్లనివాడు రాముడు
అల్లదిగో జోడుకోడెలై వున్నారు
వెల్ల వీరై తిరిగేరు వేరులేదిద్దరికిని
పెల్లుగ యశోద వద్ద బెట్టరే యీ బాలుల ॥ఎక్కడ॥
రోలజిక్కినాడొకడు రోకలి వట్టినాడొకడు
పోలిక సరిబేసికి బొంచివున్నారు
మేలిమి శ్రీవేంకటాద్రి మించిరి తానే తానై
ఆలించి నెవ్వరి నేమిననకురే బాలుల"1 ॥ఎక్కడ॥

"ఎక్కడ చూచిన వీరే" ప్రయోగంలో అన్నమయ్య అవతార మూర్తులైన బలరామకృష్ణుల అంతర్యామిత్వాన్ని సూచించాడు. 'పెక్కుచేతలు సేసేరు' అన్న ప్రయోగంలో సర్వాంతర్యామి క్రియా కల్పాన్ని సూచించాడు.

అందుకే అన్నమయ్య గోపభామలద్వారా "ఆలించి నెవ్వరి నేమి ననకురే బాలల" అని అనిపిస్తాడు.

ఈ కీర్తన 'దేసాళం' రాగరంజితమైంది.

'దేశాళి' రాగంలో సాగిన ఈ క్రింది సంకీర్తనలో అన్నమయ్య గొల్లభామలతో రామకృష్ణుల విషయాన్ని ఇలా అనిపిస్తాడు.

'ఇటువంటివారి జూచి ఏమనగవచ్చునమ్మ' గోపికలు కామించి కాచుకున్నారు. ఒకడు రోల కట్టువడ్డాడు. మరొకడు రోకలి పట్టుకు న్నాడు. వేళాపాళలేక వెన్నల్ని వెదజల్లుతారు. ఒకడు కొండనెత్తి నాడు. మరొకడు యేరు(నది)ని రెండు సేసినవాడు. వీధిలో బాలుల లాగే పొరాడుతారు.

---

1. రాగం_దేసాళం, సంపు_8, సంకీ 4, రేకు_201, ఆధ్యా. సం.

ఒకడు కాటుకమై చాయవాడు. ఇంకొకడు కప్పురపు వన్నెవాడు. కూటమితో కోడెలైనారు. ఒకడు పైడికోకవాడు. మరొకడు నీలికాశ వాడు. దూడల్ని కాచి తిరుగుతారు. చీరలిచ్చేవాడు, చెలి సంగించిన వాడు. ధీరులై రేపల్లెలో తిరుగుతున్నారు. వీరిద్దరూ కోరిన వరాలు కొల్లలిస్తారు.

“ఏమనగవచ్చునమ్మ యిటువంటివారి జూచి
కామించి గోపికలెల్లా గాచుకున్నారదివో ॥పల్లవి॥

రోల గట్టువడ్డవాడు రోకలి వట్టినవాడు
వేళలేదు వెన్నలెల్ల వెరజాడేరు
వేల గొండెత్తినవాడు, వేరే యేరు సేసేవాడు
బాలలవలెనే వీధి బారాడేరు వారివో ॥ఏమనగ॥

కాటుకమై చాయవాడు కప్పురపు వన్నెవాడు
కూటము గూడుక జోడుకోడెలైనారు
నీటుబైడి కోకవాడు నీలికాశ తోడిమడు
తేటలై దూడలగాచి తిరిగేరు వారివో ॥ఏమనగ॥

చేరి చీరలిచ్చువాడు చెలి సంగించినవాడు
ధీరులై రేపల్లెలోన దిరిగే రదే
యీ రీతి శ్రీవేంకటాద్రి నిద్దరును నేకరూపై
కోరిన వరాలు కొల్లలిచ్చే రదివో”1 ॥ఏమనగ॥

ఇందులో అన్నమయ్య రామకృష్ణుల రూపాల్ని, గుణాల్ని, సామర్థ్యాల్ని, మహిమల్ని గొల్లెతల ద్వారా అభివ్యక్తం చేశాడు.

“ఏమనగవచ్చునమ్మ”, “వేళలేదు”, “దూడలగాచి” మొదలైన ప్రయోగాలు రచనా సౌందర్యానికి మూలకాలు.

---

1. రాగం_దేసాళం, సంపు_8, సంకీ_178, రేకు_231 అధ్యా. సం.

'వేల గొండెత్తినవాడు', 'వేరే యేరు నేసేవాడు', 'పైడికోక వాడు', 'నీలికాళ తోడివాడు', 'జోడు కోడెలైనారు' ప్రయోగాలు పై రచనా సౌందర్యానికి మెరుగులు దిద్దేవి.

ఈ క్రింది కీర్తనలో తల్లి యెదుట బలరామకృష్ణులు పరస్పర దోషారోపణ చేసుకోవడం సహజంగా ముద్దుముద్దుగా భావించబడింది. రామకృష్ణులు తల్లి యశోద ఎదుట 'ముద్దు గునియంగ' కొమ్మలు (గోపికలు) నవ్వారు.

రాముడు కృష్ణుడిపై నిందమోపి, పాలల్లో 'పానిపట్టి ఉమిసి' నాడని అంటాడు. దానికి కృష్ణుడు 'నేనా? రాముడు తానే ఉమిసి' నాడని అంటాడు. అందుకు రాముడు, 'చూస్తుండగానే ఇంతచేసి కల్లలాడే చూడవే' అని అంటాడు. దానికి రాముడు తనది నిజమని 'అనపెట్టమనవే' అంటాడు,

బిల్లదీపులాడి కృష్ణుడే జారిపడ్డాడు. ఊరకే అమ్మా వాడు చెప్పు తున్నాడు. వీని 'ఉద్దండాలు' 'ఊరివారిని అడగవే! ఇలా నాపై మోపి అన్నీ తానే చేశాడు" అని రాముడు అంటాడు.

"ఈరీతి రాముడు కృష్ణుడు యశోద యెదుట నుండి
కోరి ముద్దు గునియంగ కొమ్మలు నవ్వేరు ॥పల్లవి॥

పానిపట్టి వుమిసెనే పాలలోన గృష్ణుడు
నేనా రాముడుమిసె దానే కాక
కానగానె యింతచేసి కల్లలాడే జూడవే
అనవెట్టుమనవే తానది నిజమనుచు ॥ఈరీతి॥

సారెబిల్లదీపులాడి జారిపడి గృష్ణుడు
పూరకే గడించనేల వోయమ్మ తాను

పూరివారి నడుగవే వుద్దండాలు వీనివి
యీ రీతి నాపై గడించి యిన్నియు దాచేసెను"1 ॥ఈరీతి॥

ఇది అన్నమయ్య కీర్తన కాకపోయినా, అన్నమయ్య నోట్లో ఊడిపడ్డట్లే ఉండడం ఒక విశేషం. దీన్ని బట్టి పెదతిరుమలయ్య తండ్రి అంతటివాడే అనిపిస్తుంది. అంతకన్నా తండ్రికి కావల్సిన దేముంది. తండ్రి అంశ అన్నివిధాలా పుత్రుడిలో రూపించడం సహజమే.

'ఆత్మావై పుత్రనామాసి' అనికదా వైదికోక్తి. ఈ విషయంలో ఇది సార్ధకతను సంతరించుకొంది.

బలరామకృష్ణుల క్రీడా సందర్భాన్ని పోతనామాత్యుడు హృద్యంగా, గద్య పద్యాత్మకంగా పద్దెనిమిది పద్యాల్లో అభివర్ణించాడు.2

తర్వాత క్రీడాసంకీర్తనల విభాగంలో అన్నమయ్య ఉట్ల పండుగ పాటల్ని పరిశీలించాలి.

## ఉట్లపండుగ :

ఉట్లపండుగ పాటల్ని పరామర్శించేదానికి ముందు ఉట్ల పండుగను గూర్చిన పరిచయం కొంత చేయడం అవసరం.

కృష్ణ జన్మాష్టమినాడు బాలకృష్ణుడి దుడుకుచేతలకు గుర్తుగా వీధుల్లో ఉట్లుగొట్టి, కోలలతో గొట్టించి చేసుకొనే పండుగ ఉట్లపండుగ. ఇది తాళ్ళపాక అన్నమయ్య కాలంనుంచే ఆరంభమైంది. ఆయనకు ముందు ఇది ఉన్నట్లు శాసన సాహిత్యాదికాల్లో ఎక్కడా కన్పించదు. ఉట్లుగొట్టే ఈ వేడుక కృష్ణాష్టమిగా రూపించింది. తెలుగుదేశంలో

1. 23–372 (పెదతిరుమలాచార్యులు– 23 వ సంపుటము)
2. భాగవతము, ద.స్కం., పూ.భా., పద్యాలు: 208 నుండి 304 వరకు

ఇది ఒక పండుగగా సంక్రమించింది. ఉట్లపండుగ అంటూనే కృష్ణుడే గుర్తుకు వస్తాడు. ఆతడి బాల్యలీలల్ని స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకోవడం తెలుగుల సంప్రదాయం. అందుకే దీన్ని ఉట్లపండుగ అనీ, ఉట్ల ఉత్సవం అనీ, అష్టమి పండుగ అనీ అనడం పరిపాటి.

ఉట్లపండుగలో పాల్గొనే వ్యక్తులు కృష్ణుడి వర్ణాన్ని వేషాన్ని వేసుకొని ఉట్లను కొడ్తారు. దాన్ని చూస్తూ జనులు ఉట్లను కొట్టేవారిలో కృష్ణుణ్ణి భావించుకొంటూ ఆనందిస్తూ ఉంటారు. అన్నమయ్యకు సంకీర్తన స్థానమైన తిరుమలలో, ఏడుకొండలవాడి ఉత్సవ విగ్రహం ముందరి వీధుల్లో అష్టమినాడు ఈ వేడుకను నిర్వహించడం సంప్రదాయం.1

ఈ ఉట్ల ఉత్సవాన్ని పురస్కరించుకొని అన్నమయ్య వ్రాసిన 6 కీర్తనలు పరిశీలనార్హాలు.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య, గోవిందుడు ఉట్లుగొట్టిన విధానాన్ని వర్ణించాడు.

"కొమ్మలు చూడరే గోవిందుడు
కుమ్మరించీ ముద్దు గోవిందుడు ॥పల్లవి॥

దిట్టబాలులతో దిరిగి వీధుల
గొట్టేనుట్లు గోవిందుడు
పట్టిన కోలలు పైపైజూపుచు
కుట్టే దూంట్లుగా గోవిందుడు ॥కొమ్మలు॥
నిలువుగాశతో నిడిగూతలతో
కొలకొలమని గోవిందుడు

1. తాళ్ళపాక అన్నమయ్య పదకవితలు–భాషాప్రయోగ విశేషాలు
–ద్వి.భా., పుట: 513
—శ్రీ వేటూరి ఆనందమూర్తి

వలసినపాలు వారలు వట్టుచు
కులికి నవ్వీ గోవిందుఁడు"1 ॥కొమ్మలు॥

ముద్దుగోవిందుడు ఉట్లుగొట్టే తీరును, కొమ్మల్ని 'చూడరే' అని అన్నమయ్య అంటాడు. దిట్టలైన బాలులతో వీధులలో తిరిగి గోవిందుడు ఉట్లు కొట్టాడనీ, పట్టిన కోలల్ని పైపైకి చూపుతూ ఉట్టిని తూంట్లుగా చేశాడనీ అంటూ, నిలువు కాశతో, కూతలతో కొలకొలమని గోవిందుడు పాలువారలు గట్టగా, కులికి నవ్వుతూ కొట్టాడని వర్ణించాడు.

ఇందులో 'గోవింద' శబ్దం సాభిప్రాయక స్ఫోరకం. పాలు, పెరుగు, వెన్నలకు గోవులకు ఉన్న సంబంధాన్నిబట్టి గోపాలకుడైన కృష్ణుణ్ణి గోవింద శబ్దంతో అన్నమయ్య వర్ణించాడు.

ఇగురగాచిన పాల ఉట్టిని, అటుకుల ఉట్టిని, పానకపు ఉట్టిని, తేనె ఉట్టిని, దేవకీ పట్టెకోలలతో ఎగిరెగిరి కొట్టిన విలాసాన్ని, పెరుగు ఉట్టిని, గడ్డకట్టిన నేతి ఉట్టిని, వెన్న ఉట్టిని, చక్కెర ఉట్టిని బలరాముడు పొంచి పొంచి కొట్టిన తీరును అన్నమయ్య ఈ కీర్తనలో ఆలాపించాడు.

"అక్కలార చూడుడందరును
నిక్కి వారవట్టీ నేడు గృష్ణుండు ॥పల్లవి॥

ఆనవాల వుట్టి అడుకుల వుట్టి
పానకపుటుట్టి బలిమినే
ఆనుక కోలల నందియందికొట్టి
తేనె వుట్టి గొట్టీ దేవకీ సుతుడు ॥అక్క॥

పెరుగు వుట్టి మంచిపేరిన నేతి వుట్టి
సరివెన్న వుట్టి చక్కెర వుట్టి

1. రాగం–సాళంగనాట, సంపు–8, సంకీ–142, రేకు–225, అధ్యా. సం.

వెరపుతో గొట్టి వెస బాలులతో
బొరుగు వుట్టిగొడ్డి పొంచి రాముడు"1 ||అక్క||

పై ఉత్సవాన్ని అన్నమయ్య 'అక్కలారా చూడుడందరును' అని అంటాడు. బలరామకృష్ణులతో ఇతర గొల్లపిల్లలు అందరూ గుంపుగాచేరి ఉట్లు గొట్టడం ఇందులో కన్పిస్తుంది. ఇది ఒక సామూహిక దుడుకులీల.

క్రింది కీర్తనలో అన్నమయ్య, ఉట్లుగొట్టే తీరును శబ్దానుకరణంతో అభివర్ణించి 'దృక్ శ్రవో పర్వం' చేశాడు.

"పలువురు వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను ||పల్లవి||

ఊళ్ళ వీధుల వుట్లు గృష్ణుడు
తాళ్ళు దెగిపడఁ దన్ను చును
పెళ్ళు కరిల్లు పెఠిల్లు చిఠిల్లని
పెళ్ళగ మోసె పెనురవము ||పలు||

బంగరు బిందెల బాలుఁబెరుగులు
ముంగిట నెగయుచు మోదగన్
కంగు కళింగు కరింగు ఖణింగని
రంగుమీరు పెనురవములై"2 ||పలు||

ఉట్లు గొట్టడం ఒకరే కాదని, ఒకడు ప్రధానంగా ఉండి వాణ్ణి అనుసరించే వారెందరైనా ఇందులో ఉంటారనే విషయాన్ని అన్నమయ్య 'పలువురు' అన్న శబ్దంలో సూచించాడు. ఉట్లను పొడిచేటప్పుడు ఉట్లలో పదార్థం 'చిలుకు చిడుక్కని' చిందుతున్నదని,

---

1. రాగం-శంకరాభరణం, సంపు-8, సంకీ-149, రేకు-226, ఆధ్యా.సం.
2. రాగం-ముఖారి, సంపుటి-12, సంకీ-57, రేకు-10, శృం. సం.

ఊళ్ళల్లో, వీధుల్లో ఉన్న ఉట్లను తాళ్ళు తెగి పడేటట్లు కృష్ణుడు తన్ను చున్నాడని, అప్పుడు 'కఠిల్లు పెఠిల్లు చిఠిల్లని' పెనురవం పుట్టిందని, పాలు పెరుగుల్తో ఉన్న బంగారు బిందెల్ని మోదారనీ, అప్పుడు 'ఖంగు ఖంగు ఖళింగు కఠింగు ఖణింగని' రంగుమీరు పెనురవం పుట్టిందని అన్నమయ్య ఆ ఉత్సవ మహోత్సాహాన్ని వివరించాడు.

తరువాతి కీర్తనలో అన్నమయ్య ఉట్ల పండుగరోజు ఉట్లు గొట్టే వాళ్ళు బాలకృష్ణుడిమాదిరే పీతాంబరాలు ధరించి ఉట్లు గొడతారని, వాళ్ళ దుస్తులపై, తలలపై పాలు చారికలు కడతాయని బాలకృష్ణుడి చెక్కిళ్ళమీద, కిరీటంమీద, ఆభరణాలమీద మీగడ పెరుగులు పేరుకు న్నాయని, దొరతనంతో వీధివీధుల్లో అందరి ఉట్లూ గొట్టాడనీ దృశ్య మానం చేశాడు.

"పచ్చిదేరుచు నుట్ల పండుగాయను
గచ్చులకు గొల్లెతలు కౌగిలించి పట్టగా ||పల్లవి||

పీతాంబరము మీద పెద్దకిరీటము మీద
నేతి పాల చాపెల్ల నిండె నదివో
జాతి గొల్లెతల వుట్లు సారె గోలలెత్తి కొట్టి
చేతులు చాచారగించి చిమ్మిరేగగాను ||పచ్చి||

సారిది బొమ్ముల మీద సోయగపు చెక్కులపై
పెరుగులు మీగడలు పేరుకొనెను
అరుదుగ వీధులను అందరి వుట్లుగొట్టి
దొరతనములతోడ దొమ్మిసేయగాను"1 ||పచ్చి||

ఉట్లు గొట్టిన బాలుని రూపాన్ని అన్నమయ్య కన్నులకు గట్టినట్లు వర్ణించాడు. ఇది ఆయన దృశ్య వర్ణనలో ముఖ్యంగా చెప్పుకోదగిన ఘట్టం. 'చేతులు చాచారగించి', 'చిమ్మిరేగగాను',

---

2. రాగం-దేసాళం, సంపుటి-8, సంకీ-150, రేకు-227, అధ్యా. శం.

'పొరిదిపొమ్ములు', 'సోయగపు చెక్కులు', 'కౌగిలించిబట్టగా' ప్రయోగాలు తత్కాలీన వర్ణనకు వన్నెదెచ్చాయి.

గోపికలు బాలుడు ఉట్లుగొట్టేదాన్ని ఆపాలని అనుకొంటారు. ఉట్లుగొట్టే బాలగోపాలుణ్ణి వద్దన్న గోపికల చన్నుల్ని వాడు పట్టుకుంటాడు. పాలు, వెన్న, చక్కిలాలు తింటే తిన్నావుగాని బానలు, జాడీలు పగలగొట్టవద్దని బ్రతిమలాడి గోపికలు బాలుడి పాదాలకు మొక్కగా పైటచెరగు సందులో చేయివేసి వాడు చూడసాగాడు. ఈ రమణీయలీలను ఈ కీర్తన ఇలా తెలుపుతుంది.

"కాగిలించి పట్టుకోరే కల్లరివీడు
మాగిన మోవిజూపి మరగించీ వీడు ||పల్లవి||

కోడెకాండ్లు దాను కోలలెత్తుకొని
వాడవాడల వుట్లు వడిగొట్టేని
వేడుక కాడమ్మ వెస గృష్ణుడిటువంటి
జాడలు వద్దంటేను చన్నులంటేని ||కాగి||

వీధివీధి బాలు వెన్న వెస గొల్లలాడినాడు
ఆ దెస జాడెలు నిండి అట్టెవున్నవి
పాడుకొని చక్కిలాల బాన విడువుమని
పాదాలకు మొక్కితేను పయ్యెద దెరచీని ||కాగి||

వోసరించక యిదివో వుట్లపండుగ సేసి
వేసరక పెక్కండ్ల విందైనాడు
సేసెవెట్టి నిందరిపై శ్రీవేంకటాద్రిమీద
బాసతో నలమేల్మంగ పతియైన కృష్ణుడు"1 ||కాసి||

1. రాగం_ముఖారి, సంపు_24, సంకీ_29, రేకు_805, శృం. సం.

'కౌగిలించి పట్టుకోరే కల్లరివీడు' అని గోపికలు బాలుణ్ణి పట్టుకోవడానికెంతో ప్రయత్నిస్తారు. వారి ప్రయత్నాలన్నీ అభాసుపాలౌతాయి. అయినా వారు బాలుణ్ణి భగవంతుడిగానే భావించారు. అతడు పెక్కిండ్లకు విందైనాడని గోపికలు అనుకుంటారు.

ఈ విధంగా అన్నమయ్య 'ఉట్లపండుగ' కీర్తనల్ని గానం చేశాడు. ఈ ఉత్సవం అన్నమయ్య ఆరంభించిందే కనుక, ఆయన దీన్ని ప్రత్యేకించి వర్ణించాడు. అన్నమయ్యనాటి నుంచీ తరతరాలుగా నేటికీ ఈ మహోత్సవం సాగుతూనే ఉంది. ముందూ సాగుతుంది. దీనికి విఘాతం ఉండదు. పరమ వాగ్గేయకారుడు, మహాభక్తుడు, సిద్ధసంకల్పుడు అయిన అన్నమయ్య దివ్యసంకల్పమే ఇది.

తర్వాత బాలకృష్ణ మహిమాదికాలకు సంబంధించిన అన్నమయ్య సంకీర్తనల్ని ఆలోకించాలి.

## మహిమా సంకీర్తనలు :

అనన్య భక్తిమహిమాన్వితుడు, వాగ్గేయకారుడు అయిన అన్నమయ్య బాలకృష్ణుడి మహిమలకు సంబంధించిన సంకీర్తనల్ని నోరారా గానం చేశాడు.

వాటిలో లభ్యమైన పదహారు కీర్తనల్ని ప్రస్తుతం పరిశీలించడం జరుగుతుంది.

ఇందులో అన్నమయ్య ఉత్సవ, వాత్సల్య, విక్రమ, లీలా, క్రీడా సంకీర్తనల్లో ప్రసారితాలైన విషయాలనే ఇంచుమించు గ్రహించి, వాటికి మహిమాధికాన్ని చేర్చి గానం చేశాడు. సామాన్య మానవులకు అతీతాలు, అసాధ్యాలు, అద్భుతావహాలు అయిన ఘన కార్యాన్ని ఆశ్చర్యకరంగా సాధించడం మహిమలో ప్రధానవిషయం. అదికూడా బాల్యదశలోనే వాటిని నిర్వహించడం బాలకృష్ణుడు ప్రదర్శించిన విధానాన్ని అన్నమయ్య తన మనోహర కీర్తనసాహిత్యంలో శాశ్వతం చేశాడు.

ఇంక అన్నమయ్య బాలకృష్ణ మహిమా సంకీర్తనల్లో ప్రసారిత మైన ఆయన పరమపావనమైన భావనాధార ఏ రకంగా ప్రవహించి, లోకాన్ని పునీతం చేసిందో పరిశీలించాలి.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య, కృష్ణుణ్ణి చూచికూడా అతడి మహిమను ఎరుగనివారని కౌరవ, కంస, జరాసంధుల్ని సూచించాడు. నిజానికి వీరిది వైరభక్తి. శిశుపాలుడూ అలాంటివాడే. వీళ్ళది రాక్షసాంశ. అందుకే అన్నమయ్య అలాంటి రాక్షసుల్ని నిర్మూలించిన కృష్ణుణ్ణి 'శరణము చొరవలదా' అని పల్లవిలో సూచించాడు.

"కనియు గానరు నీ మహిమ కౌరవ కంస జరాసంధాదులు
మనుజులు దనుజుల జంపిరనగ విని మరి నీ శరణము చొరవలదా
॥పల్లవి॥

పుక్కిటనే లోకములు చూపితి, పూతకి చన్నటు దాగితివి
పక్కననే బండిదన్ని విరిచితివి, బాలుల సేసేటి పనులివియా
అక్కరతో తృణావర్తు నణచితివి, ఆబోతుల కీటణచితివి
చిక్కించి యనలము చేతమింగితి, శిశువులు సేసేటిపనులివియా ॥కని॥

తొడిబడ మద్దులు మవిపైగూలగ దొబ్బి యఘాసురు జంపితివి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పడుచులు సేసేటి పనులివియా
అడరి బ్రహ్మమాయకు బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగగొట్టితి పిన్నలు సేసేటి పనులివియా ॥కని॥

కాళింగుని మదమణచి దవ్వుగా కడగడలకు బోజూపితివి
గోలవై యజ్ఞఫలములిచ్చితివి గోవాళు సేసేటి పనులివియా
యీ లీల శ్రీవేంకటాద్రి మీదనే యిందరికి పొడజూపితివి
బేలుదనంబుల నెంచి చూడ పసిబిడ్డలు సేసేటి పనులివియా"1 ॥కని॥

---

1. రాగం-బౌళి, సంపు-8, సంకీ-277, రేకు-248, అధ్యా. సం.

పుక్కిటలోనే బాలకృష్ణుడు లోకాన్ని చూపడం, పూతకి చను బాలు త్రాగడం, బండిదన్ని విరవడం (శకటాసుర మర్దనం), తృణా వర్తుని అణచడం, ఆబోతుల కీటణచడం, అనలాన్ని మింగడం 'సిసువులు సేసేటి పనులివియా' అని అన్నమయ్య అంటాడు.

అలాగే ఆయన బాలుడు మద్దుల్ని కూల్చడం, అఘాసురుణ్ణి చంపడం, గోవర్ధనోద్ధరణం 'పడుచులు సేసేటి పనులివియా' అంటాడు. బ్రహ్మమాయకు ప్రతిమాయ చేయడం, చాణూర మర్దనం 'పిన్నలు సేసేటి పనులివియా' అని అన్నమయ్య అచ్చెరువందాడు.

అలాగే కాళీయమర్దనం, యజ్ఞఫలాన్ని ఇయ్యడంవంటి పను లతో 'వేంకటాద్రిపై పొడసూపినావా' అంటాడు.

'కనియుగానరు నీ మహిమ' అన్న ప్రయోగం తాత్త్వికమైంది. వైదికభావనా మహితమైంది.1

కనియు గానకపోవటానికి కారణం తమోగుణమే. ఇది రాక్ష సాంశ ప్రవృత్తులకు మూలం. అందుకే కౌరవులు, కంసుడు, శిశుపాల జరాసంధులు మొదలైన వారెందరో, ఎదురుగా కృష్ణుణ్ణి చూస్తున్నా చూడలేనివారే. ఆయన మహిమల్ని వింటున్నా వినని చెవిటివాళ్ళే.

అందుకే అన్నమయ్య 'కనియు గానరు నీ మహిమ' అని. అన్నాడు. తమోభూమికలో అహంకర్తృత్వం ప్రధానాంశ అదే. నిండి నిబిడీకృతమైన మనోభావంతో మదించి మత్తెక్కిన కౌరవ కంస జరాసంధాదుల్ని అన్నమయ్య సూచించాడు. అయినా గ్రహించ

---

1 ఉతత్వః పశ్యన్న దదర్శ వాచం
ఉతత్వః శృణ్వన్న శృణో త్యేనామ్ —ఋగ్వేదం
(ఒకడు చూస్తున్నా చూడడంలేదు (వాక్కును) వినుచున్నా వినడం లేదు.)

తేరేమోనని లోకాన్ని ప్రబోధిస్తూ "మనుజులు దనుజుల జంపిరనగ మరి నీ శరణము చొరవలదా" అని వాచ్యంగానే అన్నాడు.

పల్లవిలో మొదటి చరణానికి రెండోచరణం టీక.

పై పల్లవిని వివరిస్తూ బాలకృష్ణుడి అలోకమైన వీరకృత్యాన్ని అన్నమయ్య పది పాదాల్లో వివరించాడు. ఇది పై టీకను విస్తరించిన వ్యాఖ్యానం. ఇది 'బౌళి' రాగంలో సాగింది.

అందుకే మరో కీర్తనలో అన్నమయ్య 'కుందులేని నీ మహిమ కొనియాడగలనా' అంటూ ఈ క్రింది కీర్తనను సాగించాడు.

"ఇందుకే పో వెరగయ్యీ నేమందును
కుందులేని నీ మహిమను కొనియాడగలనా ॥పల్లవి॥

అటు దేవతలకెల్ల నమృతమిచ్చిన నీవు
యిటు వెన్న దొంగిలుట కేమందును
పటుగతి బలీంద్రుని బంధించినట్టి నీవు
నటరోల గట్టువడ్డ చందాన కేమందును ॥ఇందుకే॥

కలిగి యాకరిరాజు గరుణగాచిన నీవు
యిల నావులగాచుట కేమందును
తలప బ్రహ్మాదిదేవతలకు జిక్కని నీవు
చెలుల కౌగిళ్ళకు జిక్కితి వేమందును ॥ఇందుకే॥

భావించ నన్నిటికంటె బరమమూర్తివి నీవు
యీవల బాలుడవైతి వేమందును
కావించి బ్రహ్మాండాలు కడుపున నిడుకొని
శ్రీవేంకటాద్రి నిలిచితి వేమందును"1

ఇందులో ఇందుకే తనకు బాలుడి మహిమలు ఆశ్చర్యాన్ని

1. రాగం-శంకరాభరణం, సంపు-6, సంకీ-31, రేకు-106, అధ్యా.సం.

కొల్పినాయని 'ఏమందును' అని తాను నిర్వాక్కు అయినట్లు సూచించి 'కొనియాడగలనా' అని అన్నమయ్య అంటాడు.

భక్తిపరవశుడైన అన్నమయ్యవంటి మహాకవి, కొనియాడగలనా అని సందేహిస్తూనే భగవన్మాహాత్మ్యాన్ని ఇలా విస్తరించాడు.

దేవతలకందరికీ అమృతాన్నిచ్చినవాడే వెన్నను దొంగిలించుటను ఏమందునని, బలీంద్రుని బంధించినట్టివాడు రోలగట్టువడ్డ చందానికి ఏమందునని, కరిరాజును కాచినవాడే ఆవుల్ని కాచుటకేమందునని, బ్రహ్మాది దేవతలకే చిక్కనివాడు గొల్లచెలుల కౌగిళ్ళకు చిక్కడాన్ని ఏమందునని అంటూ పరమమూర్తి అయిన భగవానుణ్ణి బాలుడివైతి వేమనీ, కడుపులో బ్రహ్మాండాలు పెట్టుకొని వేంకటాద్రిపై నిలిచితి వేమని, బదులు చిక్కని ప్రశ్నల్ని అన్నమయ్య వేశాడు.

ఇందులో విష్ణువు మోహినీరూపుడై దేవతలకు అమృతాన్ని పంచడం, తద్వారా సముద్ర మథన విషయం కీర్తించబడింది. బలీంద్రుడి ప్రసక్తితో వామనావతారం స్మరించబడ్డది. రోల గట్టు వడడంతో ఉలూఖల బంధనం ప్రసక్తి వచ్చింది. కరిరాజు ప్రసక్తితో స్థితికారుడైన విష్ణువు భక్తావనక్రియ సంసూచ్యమైంది. ఆవుల కాచడంలో కృష్ణుడికి గోపాలనామం సార్థకం చేయబడింది. బ్రహ్మ ప్రసక్తితో తదతీతుడని విష్ణు మహిమను తెలుపుతూ, చెలుల కౌగిళ్ళ ప్రసక్తితో బాలకృష్ణుడి లీలావిలాసాన్ని మాయను మహాకవి సూచించాడు.

పై విషయాన్ని సూచిస్తూ 'పరమమూర్తివి నీవు' అని తాత్పర్యప్రాయంగా అంటూ చతుర్దశ భువనభాండాన్ని కడుపులో పెట్టుకున్న ఆ బాలుడి విరాణ్మూర్తిని అన్నమయ్య మనసా దర్శించాడు.

మరో కీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడి మహిమల్ని 'అనరాదు వినరాదు' అనే పల్లవితో ఆరంభించి కీర్తించాడు.

"అనరాదు వినరాదు ఆతని మాయలు నేడు
దినదిన క్రొత్తలాయ ద్రిష్టమిదే మాకు ॥పల్లవి॥

ఆడెడి బాలుల హరి అంగిలి చూపుమని
తోడనే వాండ్ల నోర దుమ్ములు చల్లి
యీడ మాతో జెప్పగాను యిందరము గూడిపోయి
చూడబోతే పంచదారై చోద్యమాయెనమ్మా ॥అన॥

తీటతీగెలు సొమ్మంటా దేహము నిండాగట్టి
తీటకుగాక బాలులు తెగి వాపోగా
పాటించి యీ సుద్ది విని పారి తెంచి చూచితేను
కోటికోటి సొమ్ములాయ క్రొత్తలోయమ్మా"1 ॥అన॥

ఆడుకొనే తన యీడు బాలకుల్ని కృష్ణుడు, అంగిలి చూపమని వాళ్ళ నోళ్ళలో దుమ్ములు చల్లాడు. పెద్దలకు వాళ్ళు చెప్పతోగా పోయి చూడబోతే అది పంచదారైందట. ఇలాంటి మహిమలు చెప్పిన వాళ్ళనే దోషులుగా చిత్రించేవి. అందుకే అన్నమయ్య 'అనరాదు వినరాదు' అని అన్నాడు.

తీటతీగల్ని బాలకులకు కృష్ణుడు చుట్టాడు. అవి తాకితేనే తీట పుడుతుంది. ఆ తీటకు తాళలేక బాలకులు ఇళ్ళలో చెబితే, తీరా చూడబోతే అవి 'కోటికోటి సొమ్ములైయుట'.

తుంటరితనంతో కూడిన బాలకృష్ణుడి ఇలాంటి మహిమల్ని అన్నమయ్య అతి సున్నితమైన హాస్యాన్ని మేళవించి వర్ణించడం గమనించదగ్గ విశేషం.

క్రింది కీర్తనలో అన్నమయ్య, బాలకృష్ణుడి పరబ్రహ్మ తత్వాన్ని భావించాడు.

---

1. రాగం_దేసాక్షి, సంపుటి_6, సంకీ_167, రేకు_139, ఆధ్యా. సం.

"ఎవ్వరు గానని వాడు యశోద గనె నట్టె
తవ్వశించీ బ్రహ్మ తండ్రి బాలుడయ్యె నట్టె ॥పల్లవి॥

ఘన యోగీంద్రుల మతి గట్టువడనట్టి వాడు
పనిలేక రోల గట్టువడినాడట్టె
తని యసురులకు పాదము చూపనట్టి వాడు
మొనసి బండిమీద మోపినాడట్టె ॥ఎవ్వరు॥

అమృతము చేతదెచ్చి అందరికిచ్చిన వాడు
తమితో వెన్న దొంగిలె దాసెయట్టె
గుమురై దేవ దానవకోటికి జిక్కని వాడు
భ్రమసి గోపికల పాల జిక్కినాడట్టె ॥ఎవ్వరు॥

యిందుగల డిందులేడనెంచి చూవరాని వాడు
అందమై రేపల్లెవాడ నాడినట్టె
అంది కృష్ణావతారమైనట్టి దేవుడే
యిందుద శ్రీ వేంకటాద్రి యెక్కి నిలిచెనట్టె"1 ॥ఎవ్వరు॥

బ్రహ్మకు అతీతుడిగా, తండ్రిగా ఉన్న బాలుణ్ణి, ఎవ్వరూ కానని వాణ్ణి యశోద చూచిందని, యోగీంద్రుల మతి కట్టువడనివాడు పని లేక రోల కట్టుబడ్డాడని అంటూ, సురలకు పాదము చూపని వాడు బండి మీద మోపినాడని అన్నమయ్య అన్నాడు.

ఇందులో శకటాసుర సంహరణ సూచితం సంహరణ క్రియ ద్వారా ఆతడికి ముక్తిని ప్రసాదించడం కూడా ఇందులో సంసూచ్యమానమైంది.

అమృతాన్ని తెచ్చి అందరికీ ఇచ్చినవాడు వెన్నను దొంగిలించాడని, దేవదానవకోటికి చిక్కనివాడు గోపికలకు భ్రమిసి చిక్కి

1. రాగం-శంకరాభరణం, సంపు-9, సంకీ-27, రేకు-255, అధ్యా.సం.

నాడని ఆయన అంటాడు. 'అందుగల డిందు లేడనెంచి' చూపరాని వాడని అలాంటివాడు రేపల్లెవాడలో ఆడినాడని కృష్ణావతారమైన దేవుడే వేంకటాద్రి ఎక్కి నిలిచినాడని అన్నమయ్య పరవశభావం.

'ఇందుగల డందులేడని' అన్న పోతన పద్యారంభాన్ని అన్నమయ్య గ్రహించినట్లు తోస్తుంది. ఈ ప్రయోగం బాలకృష్ణుడి సర్వేశ్వరత్వ, సర్వ వ్యాపకత్వం, సర్వాంతర్యామితను వ్యాఖ్యానిస్తున్నది.

కమలనాభుడే కంసుడి మదమణిచేదానికి పుట్టాడని, అమరులకు, మునులకు అభయమిచ్చి దేవకి దేహంలో ప్రవేశించాడని, గొల్లెతలపై కోర్కెలు నిలిపాడని, రేపల్లెలో పెరిగాడని, ఆదికి మూలమైనవాడే ఆవుల కాచినాడని, కడుపులో లోకాలు చూపాడని, మాయచేసి ఇందరిలో మనుజుడై నిలిచాడని బాలలీలల్ని నటించి 'బహుదైవికము మించి'నాడని పరమమూర్తి పాలు, వెన్నల్ని దొంగిలించాడని, భూభారాన్ని అణచి ధర్మాన్ని పాలించాడని, ఆతడే శ్రీ వేంకటాద్రి మీద నిలిచాడని అన్నమయ్య మరోకీర్తనలో బాలకృష్ణుని మహిమను స్మరించాడు.

కాబట్టి 'సంతసములు వెల్లివిరియు' అందర్నీ ఆడిపాడమని ఆయన ఆనందోత్సాహంతో ఇలా అంటాడు.

"ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు
వేడుక సంతసములు వెల్లివిరియాయను ॥పల్లవి॥

కమలనాభుడు పుట్టె కంసుని మదమణచ
తిమిరి దేవకీదేవి దేహమందును
అమరులకు మునులకభయమిచ్చె నితడు
కొమరె(మి:) గొల్లెతలపై గోరికలు నిలిపె ॥ఆడ॥

రేయిబగలుగాజేసి రేపల్లె బెరుగజొచ్చె
ఆయెడ నావుల గాచె నాద్రిది మూలము

యీయెడ లోకాలు చూపెనిట్టె తన కడుపులో
మాయసేసి యిందరిలో మనుజుడై నిలిచె ॥అది॥
బాలలీలలు నటించి బహుదైవికము మించె
పాలు వెన్నలు దొంగిలె బరమమూర్తి
తాళి భూభారమణచె ధర్మము పరిపాలించె
మేలిమి శ్రీ వేంకటాద్రి మీద నిట్టె నిలిచె"[1] ॥అది॥

కృష్ణుడి ఘనకార్యాలు పునరావృతాలుగా కన్పించినా, ఒక్కొక్క కీర్తనలో ఒక్కొక్క ప్రత్యేకత కన్పిస్తుంది. ఆ ప్రత్యేకత అన్నమయ్య ఊహనుబట్టి చోటుచేసుకుంటుంది. కంసవధ, గొల్లెతలపై కోరికలు, అవుల్ని కాయడం, కడుపులో లోకాల్ని చూపడం, పాలు వెన్నల్ని దొంగిలించడం చర్వితచరణాలే. అయినా వాటితోపాటు 'ఆదిమూలము', 'పరమమూర్తి', బహుదైవికము మించె' మొదలైన విశేషాలు విశేషమైన తాత్వికభావాన్ని, బాలుడి మహిమను స్ఫురింప జేస్తాయి. ఇది 'ముఖారి' రాగంలో సాగిన కీర్తన.

మరో కీర్తనలో యశోద బాలుణ్ణి వెరపించబోయి తానే వెరచిన విషయాన్ని అన్నమయ్య, బాలుడి మహిమకు అన్వయించి అభివర్ణించాడు.

మామూలుగా పనిపాటల్లో తల్లులు పిల్లల్ని వెంట రానీయక, అక్కడ దొంగ ఉన్నాడని బెదిరించడం సహజమే. యశోద కూడా తన కొడుకును, మందలో దొంగ ఉన్నాడని, వెంట రాకుమని వెరపిస్తుంది. బాలుడు దొంగ ఎందున్నాడని హేళనగా నోరు తెరుస్తాడు. అందులో ఆమెకు బ్రహ్మాండాలు కనిపించాయి. వాటిని చూచి తల్లి భయపడింది.

---

1. రాగం-ముఖారి, సంపుటి-8, సంకీ-112, రేకు-220, అధ్యా. సం.

అలాగే చందమామ పాటపాడి యశోద 'సరిబొత్తుకు రమ్మంటే' కృష్ణుడు ఆతడికి 'సన్న చేశాడు'. దానికి చంద్రుడు వచ్చి మొక్కితే, అందుకు యశోద తాను అలా ఎందుకు అన్నానని వెరగందింది.

పాలార్చి తొట్టెలో పండబెట్టి ఒకమారు యశోద తొంగి చూస్తే, శంఖ చక్రాలతో, ఉరముపై శ్రీసతితో ఆమెకు కన్పించాడు.

"వెఱపించబోయి తానె వెఱచి తల్లి యశోద
మఱచి యూటాలునెట్టు మానిసెంటా నుండెనో ॥పల్లవి॥

వెలటు రాకుమని కృష్ణు వెరపించి యశోద
వొంటి మంటలో దొంగ ఉన్నాడనె
అంటి దొంగ ఎందునున్నాడని నోరు దెరచితే
పెంటలై బ్రహ్మాండాలు పెక్కు గానవచ్చెను ॥వెఱ॥

చందమామ బాడి తల్లి సరిబొత్తుకు రమ్మంటె
చందుతు జూచి కృష్ణుడు సన్న సేసెను
ముందర జంద్రుడు వచ్చి మొక్కితే యశోద చూచి
ముందేలా యుంటినో యని ముంచి వెరగందెను ॥వెఱ॥

పాలార్చి తొట్టెలలో బండబెట్టి యశోద
నీలవర్ణు దొంగిజూచె నిద్దురోయని
వోలి శంఖ చక్రాలతో నురము శ్రీసతితోడ
యీ లీల శ్రీవేంకటేశుడై యున్నాడు"1 ॥వెఱ॥

'వెరపించబోయి తానె వెరచె తల్లి యశోద
మఱచి యీ బాలునెట్టు మానిశంటా నుండెనో' అన్న పల్లవి ఆమె ఆశ్చర్యాన్ని, ఆందోళనని కృష్ణుడి మహిమను తెలుపుతుంది.

---

1. రాగం–తళపంజరం, సంపుటి–10, సంకీ–258, రేకు–344, ఆధ్యా.సం.

ఇందులో చంద్రుడు వచ్చి బాలుడికి మొక్కడం నూత్న విషయం.

ఈ క్రింది కీర్తనలో ఆశ్చర్యంతో భక్తి భావగర్భితమైన అన్నమయ్య మరోకీర్తన గమనించదగ్గది.

"ఈడనే యిందరికి నేలికై వున్నాడు
వాడల రేపల్లె వాడా వీడు ॥పల్లవి॥
ఖారపు పుట్ల పాలు పెడుగులు
వారలు వట్టిన వాడా వీడు
కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలు దీసిన శిశువా వీడు ॥ఈడ॥
ఆవుల చేయల సందరి యిండ్ల
వావిరి గాచిన వాడా వీడు
నావులొక్కటిగా వనితలతో గూడి
పేవేలు పేర్చిన విటుడా వీడు"1 ॥ఈడ॥

'ఇందరికీ నేలికై' ప్రయోగం బాలకృష్ణుడి జగన్నాధత్వాన్ని 'చీరలు తీసిన' ప్రయోగం మానసంరక్షణాన్ని, తర్వాతి చరణాల్లో గోగోప గోపికా పరిపాలనని అన్నమయ్య భావించాడు.

మరియొక కీర్తనలో అన్నమయ్య బాలుడి ముద్దులుగొలిపే రూపాన్ని, అతడి లీలల్ని దాని ద్వారా మహిమల్ని భావించాడు.

"చూడ చిన్నవాడు గాని జూటుదనాలు తనవి
యేడ జూచిన దానె యేమని చెప్పుదునే ॥పల్లవి॥
దొంగాడు కృష్ణుడు తొయ్యలుల మొగములు
తొంగి చూచీ ముంగురులు దూలాడగా

1. రాగం_శుద్ధవసంతం, సంపు_10, సంకీ_289, రే,కు_349 ఆధ్యా.సం.

ముంగిట ముద్దులు వెట్టి మోవితేనె లానుకొంటూ
తెంగిలిసేసీ నిదె యిందరి నొక్కమాటె ॥చూడ॥

వెన్నముద్ద కృష్ణుడు వేడుకతో జవరాండ్ల
చన్నులంటి సారెసారె సాము సేసీని
చిన్నిచేతులిటు చాచి సిగ్గులు రేచి చెనకి
సన్నలుసేసి పిలిచి సరసము లాడీని"1 ॥చూడ॥

'యేడ జూచినా దానె యేమని చెప్పుదునే' అనే పల్లవిలోని రెండవపాదం బాలకృష్ణుడి సర్వవ్యాపకత్వాన్ని సూచిస్తుంది. ఈ ప్రయోగం పైకి సామాన్యమైన తెలుగు మాటగా తోచినా, దీని వెనుక 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అన్న ఉపనిషదర్థం ఉంది.

'ఏమని చెప్పుదునె' ప్రయోగం అతడి మహిమ లౌకిక వాక్యాలకు అందదని సూచిస్తుంది. అంటే కృష్ణుడు అపౌరుషేయమైన వేదైక గమ్యుడే అని పై కీర్తన భావం.

తమ పాలిట దైవమని బ్రహ్మాదులు పాల దొంగ వద్ద వచ్చి పాడినారట. రోల గట్టువడ్డ వాని ఎదుట వారు పాడారట. ఆలకించి వినమని నాలుగు దిక్కులనుంచీ నారదాదులు వచ్చి అంబరంలో పాడారట. నోటి నిండా జొల్లు కారగా ధూళిధూసరితమైన మేనితో పరుగెత్తే బిడ్డ వద్ద పాడారు. శేషాదులు వెంబడించి వేదాలు చదివారట. మూల మూలల్లో దాగే బాలుడి వద్ద పాడారట. ఇతడే వేంకటాద్రీశుడు అని సనకాదులు వచ్చారట.

"పాల దొంగ వద్ద వచ్చి పాడేరు తమ
పాలిటి దైవమని బ్రహ్మాదులు ॥పల్లవి॥
రోల గట్టించుక పెద్ద రోలలుగా వాపోవు
బాలుని ముందర వచ్చి పాడేరు

1. రాగం-బౌళి, సంపు-24, సంకీ-230, రేకు-839, శృం. సం.

ఆలకించి వినుమని యంబర భాగమునందు
నాలుగు దిక్కుల నుండి నారదాదులు ॥పాల॥

నోరు నిండా జొల్లుగార నూగి ధూళి మేనితో
పారేటి బిడ్డని వద్ద బాడేరు
వేడలేని వేదములు వెంట వెంట జదువుచూ
జేరి చేరి యింతనంత శేషాదులు ॥పాల॥

ముద్దులు మోమునగార మూల మూలల వాగే
బద్దుల బాలుని వద్ద బాడేరు
అద్దివో శ్రీ తిరువేంకటాద్రీశు డితడని
చద్దికి వేడికి వచ్చి సనకాదులు"[1]

ఇందులో పాలదొంగను తమపాలిటి దైవమని బ్రహ్మాదిదేవతలు పాడడం అతడి మహిమే. రోటికి కట్టువడ్డ బాలుడి ముందర వారు పాడారనడం విశేషం. 'ఆలకించి వినుమని' ప్రయోగం భగవంతుడికి విన్నవించుకొనే భక్తుడి భావాన్ని సూచిస్తుంది. ధూళి దూసరితమైన మేనితో, జొల్లు కార్చుకుంటూ పరిగెత్తే బిడ్డడు ఇందులో కన్నులకు కట్టినట్లున్నాడు. శేషాదులు వేదాల్ని చదవడం బాలుడు వేదమయుడని, వైదైక గమ్యుడని తెలుపడానికే.

'మూల మూలల దాగే' ప్రయోగం పరమేశ్వరుడు ఎక్కడైనా మరుగున దాగి ఉంటాడని, వెదికి తెలుసుకోవడం మన కర్తవ్యమనే విషయాన్ని తెలుపుతుంది.

తర్వాత కీర్తనలో అన్నమయ్య కృష్ణుడి లీలల్ని, పరాక్రమాన్ని ఐహికమైన అతడి బాంధవ్యాన్ని తెలుపుతూ, అతడి మహిమను కూడా కల్పనామహితంగా తెలిపాడు.

---

1. రాగం-మలహరి, సంపుటి-1, సంకీ-811, రేకు-61, అధ్యా. సం.

"ఇతడితడా వెన్నలనంతట దొంగిలినాడు
యెటులపు మద్దులు రెండిల దోసినాడు ||పల్లవి||

యితడా దేవకిగన్న యింద్రనీల మాణికము
పూతకి చన్నుదాగి పొడఁగినాడు
యితడా వసుదేవుని యింటిలో నిధానము
చేతనే కంసుని బుట్టచెండు సేసినాడు ||ఇత||

పేటిమైన గొంతిదేవి మేనల్లుడీతడా
కోటికి బడగెగాను గొండయెత్తెను
పాటించి పెంచె యశోదపాలి భాగ్యమీతడా
వాటమై గొల్లెతలను వలపించినాడు"1 ||ఇత||

అంతటా వెన్నల్ని దొంగిలించాడని, మద్దులు రెంటిని కూల్చాడని, దేవకి గన్న ఇంద్రనీల మాణిక్యమని, పూతకి చన్ను త్రాగినాడని, వసుదేవుని ఇంటిలో నిధానమని, కేవలం చేతితోనే కంసుణ్ణి బుట్టచెండు చేసినాడని, కుంతీదేవి మేనల్లుడీతడాయని, కోటికి పడగగా కొండ ఎత్తాడని, యశోదపాలిట భాగ్యం ఈతడాయని గొల్లెతలను వలపించాడని అన్నమయ్య వివరించాడు.

ఇంద్రనీల మాణికము, నిధానం, యశోదపాలి భాగ్యం ప్రయోగాలు సాభిప్రాయ స్ఫోరకాలై, గంభీరార్థదాయకాలైనాయి. 'లలిత' రాగంలో సాగిన ఈ కీర్తన భక్తుడైన అన్నమయ్య ఆనందాన్ని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తుంది.

తర్వాత కీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడి అబురూపాన్ని, మహద్రూపాన్ని వర్ణించాడు.

---

1. రాగం-లలిత, సంపు 10, సంకీ-6, రేకు-301, అధ్యా. సం.

పిల్లవాడి జడను సారెసారెకు అంటవద్దనీ, అతడు ఉన్నతపు దేహియని, పక్షులు పారాడే ప్రొద్దులో బయట పెట్టవద్దనీ, మాయపు పులుగొకటి మచ్చికతో ఈ బాలుణ్ణి చేయిచ్చి ఎక్కించుకొనేదానికి చేరిందని, పాములు పారాడే ప్రొద్దులో పంచలు తిప్పవద్దని, మామూలు బాలుడని అందరూ ఎత్తుకోవద్దని, మించిన పామొకటి దించక ఎక్కించుకొన్నదని, బాలుణ్ణి అదిమి పట్టవద్దనీ యశోద గోపికలను హెచ్చరిస్తుంది.

"సారెకు నంటకురే జడనందరు
ధీరుండాతం డున్నతపు దేహియట ॥పల్లవి॥
బయటం బెట్టకురే పక్షులు పారెడి ప్రొద్దు
వోయమ్మ బాలులకు నొప్పదందురు
మాయపు బులుగొకటి మచ్చిక యీ బాలుని
చేయిచ్చి యెక్కించుకొనం జేరెనట ॥సారెకు॥
పంచలు దిప్పకురే పాములు వెళ్ళేటి ప్రొద్దు
కొంచెపు బాలుల బైకొను నందరు
మించిన పామొకటి మెరసి యీ బాలుని
దించక యెక్కించుకొనం జేరెనట ॥సారెకు॥
అలిమి పట్టకురే అట్లు గాకుండేటివారు
తోలరమ్మ బాలులకు దోసమందురు
కలికి యీ తిరువేంకటపతిం గదిసిన
చెలగి వేగమె చీర చిక్కెనట"[1] ॥సారెకు॥

ఇందులో యశోద వాత్సల్యంతోపాటు బాలకృష్ణుడి మహిమను కూడా అన్నమయ్య జోడించినాడు.

'ధీరుండాతం డున్నతపు దేహియట' ప్రయోగం కృష్ణుడి ధీరత్వాన్ని, అతడి విరాణ్మూర్తిని సూచిస్తుంది.

1. రాగం-శంకరాభరణం, సంపు-12, సంకీ-247, రేకు-73, శృం.సం.

'చిన్ని శిశువూ, చిన్ని శిశువూ, ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువూ' అనే పల్లవితో సాగిన ఈ కీర్తనలో ముద్దులు మూటగట్టే బాల కృష్ణుడి రూపవర్ణనను అన్నమయ్య వర్ణించాడు.

'తోయపు కురులతోదూగే శిరస్సుతో, చింతకాయలవంటి జడలతో, కనకపుమువ్వలతో పాయక యశోద వెంట పారాడే శిశువు, మొరవంక వుంగరాలతో, చేతుల పైడిబొద్దులతో, చెక్కుల్ని మీటితే యశోదను కౌగిలించే శిశువు, పొట్టమీద పాలచారలతో, నులివేడి వెన్న దిన్న నోటితో, వేంకటాద్రిపై నిలిచి లోకాల్ని నిలిపిన శిశువు ఈతడే యని అన్నమయ్య వర్ణించాడు.

"చిన్ని శిశువూ చిన్ని శిశువూ
యెన్నడుం జూడమమ్మ యిటువంటి శిశువూ ॥పల్లవి॥

తోయపుం గురులతోడ దూగేటి శిరసు, చింత
కాయలవంటి జడల గములతోడ
మ్రోయుచున్న కనకంపు మువ్వలపాదాలతోడ
పాయక యశోద వెంట బారాడు శిశువూ ॥చిన్ని॥

ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపుం జేతుల పైడిబొద్దులతోడ
అద్దపుం జెక్కులతోడ నప్పలప్పలనినంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువూ ॥చిన్ని॥

బలుపైన పొట్టమీది పాలచాఱలతోడ
నులివేడి వెన్న దిన్న నోరితోడ
చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్లా నిలిపిన శిశువూ"1 ॥చిన్ని॥

పై కీర్తనలో బాలకృష్ణుని రూపవర్ణన కన్నులకు కట్టినట్లుంది. 'లోకములెల్లా నిలిపిన' ప్రయోగంవల్ల స్థితికారుడైన విష్ణువు పరమ

---

1. రాగం_ఆహిరి, సంపు_4, సంకీ_1, శృం. సం.

ధర్మం సంసూచ్యమానమైంది. 'ఎన్నడుం జూడమమ్మ యిటువంటి శిశువూ' ప్రయోగం బాలుడి అతిలోక మహిమను, ప్రత్యేకతను చాటుతుంది.

తర్వాత కీర్తనలో బ్రహ్మాదులు హరిబాలుడి లీలల్ని యెంచారని, ముందు యుగాల్లో శుకాదులవల్ల విన్నామని, పురుషోత్తముడైన ఈ బాలుడు పొత్తుల్లో పవళించాడని, అది మర్రాకుపై ఉన్నట్లే ఉన్నదని వొత్తిగిలి, బోరగిలి వున్న కృష్ణుడు కూర్మావతారమైనాడని, తప్పటడుగులు పెట్టే కృష్ణుడు త్రివిక్రముడై, గొప్ప పాదాలతో భూమిని కొలిచినట్లుందని, వైకుంఠంలో మెరసినట్లు, రేపల్లెలో ఆడజొచ్చాడని, వేంకటాద్రి నిలయుడై జీవుల్లో ఉన్నాడని అన్నమయ్య బాలుడి మహిమను కీర్తించాడు.

'అని బ్రహ్మాదులెంచేరు హరి బాలలీలలు
వెనక శుకాదులచే వింటిమి నేమిదివో ॥పల్లవి॥

పొత్తులలో బవ్వళించె పురుషోత్తముడు దొల్లి
హత్తి మఱ్ఱాకుపై బడి నటువలెనె
వొత్తగిలి బోరగిలి ఉండజొచ్చె గృష్ణుడు
తత్తరాన గూర్మావతారమైన గతిని ॥అని॥

తప్పటడుగులు వెట్టి తగ ద్రివిక్రముడై
గొప్ప పాదాలను భూమి గొలిచినట్టు
అప్పుడే కొదలు మాటలాడజొచ్చె గృష్ణుడు
తప్ప నసురసుతుల దగఱోధించినట్లు ॥అని॥

అచ్చపు రేపల్లెలోన నాడజొచ్చె గృష్ణుడు
మెచ్చుల వైకుంఠాన మెరసినట్లు
నిచ్చలు శ్రీవేంకటాద్రి నిలయుడై యున్నవాడు
ఉచ్చగ జీవులలోన నాతుమైన యట్లు"1 ॥అని॥

---

1. రాగం–మేఘరంజి, సంపు–10, సంకీ–262, రేకు–345, ఆధ్యా. సం.

పై కీర్తనలో బ్రహ్మాది ప్రయోగం సమస్త దేవతలకు ఉపలక్షకం. అలాగే శుకాది ప్రయోగం సమస్త మౌనిలోకానికి ప్రతీక. పొత్తుల్లో పవ్వళించినవాణ్ణి మర్రాకుపైనున్న పురుషోత్తముడిగా, వొత్తిగిలి, బోరగిలి ఉన్న కృష్ణుణ్ణి కూర్మావతారంగా, తప్పటడుగులు వేసే బాలుణ్ణి భూమిని గొలిచే త్రివిక్రముడిగా, అప్పుడప్పుడే మాటలాడనేర్చిన కృష్ణుడి మాటల్ని అసురసతుల్ని బోధించినట్లు, రేపల్లెలో ఆడేవాడిని వైకుంఠాన మెరసినట్లు వర్ణించడం అన్నమయ్య భావనాసౌందర్యానికీ, ఉత్ప్రేక్షా వైశిష్ట్యానికీ నిదర్శనాలు.

పులుగునెక్కే పెద్ద బొమ్మెలవాడిగా, పామును ఆడించిన బాలజోగిగా, వాముల వెన్నలు దినే వలువకాడిగా, కొండనెత్తే సిద్ధవిద్యలవాడిగా, పొంచిన రాకాసిని చంపి భూతనాథుడైనవానిగా, పింఛంతో వెరపిస్తూ విప్రవినోదిగా, 'గంగ్యావుల్ని' అడవిలో కాచేవాడిగా, చెడని వరాలిచ్చే శ్రీవేంకటాద్రి వాడుగా ఉన్న అతణ్ణి అన్నమయ్య 'కానరటే మీరు' అని అతడి మహిమాధికారాన్ని క్రింది కీర్తనలో వర్ణించాడు.

"పులుగునెక్కేటి పెద్ద బొమ్మెలవాడు
కలికి చేతలనించీ గానరటే మీరు ॥పల్లవి॥

పామునాడించిన యట్టి బాలజోగి పిన్నవాడు
వాముల వెన్నలుదినే వలువకాడు
చేయుంచి కొండలెత్తే సిద్ధ విద్యలవాడు
కామినులాల వచ్చె గానరటె మీరు ॥పులుగు॥

పొంచిన రాకాసి జంపి భూతనాథుడైనాడు
పెంచము గట్టుక వెరపించేవాడు
అంచెల విప్రవినోదై తిరిగేటివాడు
కంచుమి(మిం)చై తిరిగాడే గానరటే మీరు ॥పులుగు॥

విడివిడి చేతులతో విద్యముల యాటవాడు
అడవి గాచేటి గంగ్యావులవాడు

చెడని వరములిచ్చే శ్రీవేంకటాద్రివాడు
కడునెంపు చసె వీని గానరటే మీరు"1 ॥పులుగు॥

బొమ్మెలవాడు, బాలజోగి, సిద్ధ విద్యలవాడు, భూతనాథుడు' విప్రవినోది, మొదలైన ప్రయోగాలు బాలకృష్ణుడి మాయానటనాన్ని, అతని జగన్నాటక సూత్రధారిత్వాన్ని, వైష్ణవవీయమైన మాయాజాల మహేంద్రజాలాన్ని సూచిస్తాయి.

మాయారూపుడైన బాలుణ్ణి అన్నమయ్య పైరీతిగా ఎన్నో విధాల ఉల్లేఖించి ఉత్ప్రేక్షించాడు. ఇన్ని రకాల, ఇన్ని రూపాల్లో దర్శనమిచ్చే బాలుణ్ణి 'కానరటే మీరు' అన్న ప్రయోగంలో అన్నమయ్య, జీవసహజమైన వారి అజ్ఞానాన్ని సూచించాడు. 'కానరటె' ప్రయోగం చాలా అర్థవంతమైంది.

బాలుణ్ణి అందరూ చూస్తున్నారు కదా, మరి అన్నమయ్య 'కానరటే' అని ఎందుకు అన్నట్లు? చర్మచక్షువుతో చూచే చూపు సరి కాదని, దానికి అతీతము, ఆవల సుదూరంగా ఉన్న జ్ఞాననేత్రంతో బాలుణ్ణి చూడాలని, అలా ఎవరైనా బాలుణ్ణి చూశారా అని, అందుకే అందుకే అన్నమయ్య 'కానరటే' అని అనడంలోని పరమార్థం.

మింటిపై బ్రహ్మాదులు పొగుడుతున్నారని, ఆ బాలునికే మొక్కుతామని, ఉన్నతలోకాలు ఉదరంలో ఉన్నవాడే దేవకి గర్భంలో పుట్టాడని, యోగుల మదిలో ఉన్నవాడే పొత్తుల్లో బాలుడైనాడని, పాలకడలిని పాయని గోవిందుడే పైడికోరతో పాలు వెన్నల్ని ఆరగించాడని, తన విష్ణుమాయలో ఓలలాడినవాడే మంత్రసానులచేత జలకమాడాడని, ముగ్గురు వేల్పులకు మూలమైనవాడే బలభద్రునికి తమ్ముడైనాడని, వైకుంఠం నుంచి, రేపల్లె నుంచి, వేంకటాద్రిపై ఉన్నాడని అన్నమయ్య భావన.

---

1. రాగం-సాళంగనాట, సంపు-30, సంకీ-112, రేకు-1419, శృం.సం.

"అనుచు బొగడ జొచ్చేరదే బ్రహ్మాదులు మింట
మొనసి ఈ బాలునికి మొక్కేము నేము ॥పల్లవి॥

వున్నతపు లోకములు వుదరాన నున్నవాడు
అన్నివ దేవకి గర్భమందు పుట్టెను
మన్నించి యోగీంద్రుల మదిలో నుండెడివాడు
వన్నిన పొత్తులలోన బాలుడై వున్నాడు ॥అనుచు॥

పాలజలధిలోన పాయని గోవిందుడు
పాలు వెన్నలారగించె పైడికోరను
వోలి దన విష్ణుమాయ నోలలాడి నట్టివాడు
చాలి మంత్రసానులచే జలకమాడీని ॥అనుచు॥

ముగురు వేలుపులకు మూలమైన యిట్టివాడు
తగు బలభద్రునికి తమ్ముడాయెను
నిగిడి వైకుంఠమున నిలిచి రేపల్లె నుండి
తెగువ శ్రీవేంకటాద్రి నిరవాయ వీడె"1 ॥అనుచు॥

బాలుణ్ణి బ్రహ్మాదులు పొగిడేదాన్ని అన్నమయ్య మనసా దర్శించగలిగిన పరమభక్తుడు. ముందు అలౌకిక విషయాల్ని చెప్పి వాటిని లౌకిక విషయాల్తో సంబంధాన్ని కల్పించి చేసిన ఈ మహిమా సంకీర్తన ప్రత్యేక కృతిసౌందర్యాన్ని ఆపాదిస్తున్నది. బ్రహ్మాండ భాండోదరుడైన విష్ణువు దేవకి గర్భంలో చేరడం, యోగుల మనసుల్లో ఉన్న దేవుడు బాలుడై పొత్తుల్లో ఉండడం విశిష్టాభావన. కృష్ణుడు పాలూ వెన్నల్ని ఆరగించేదానికి హేతువును, పాలజలధి ప్రసక్తిని తెచ్చి అన్నమయ్య దాన్ని అర్థవంతం చేశాడు.

అలాగే త్రిమూర్తులకు మూలమైనవాడే బలభద్రుడికి తమ్ముడైనాడనడం విశేషభావనే. అన్నమయ్య భావనారాజహంస పైలోకాల

1. రాగం_పాడి, సంపు_10, సంకీ_234, రేకు_340, ఆధ్యా. సం.

నుండీ ఈ లోకందాకా విహరించి లౌకికాలౌకిక స్ఫూర్తితో ఈ లోకాలోక సంబంధాన్ని కల్పించింది.

మరొక కీర్తనలో అన్నమయ్య బాలకృష్ణుడి మహిమను 'పర తత్వంబగు బాలుడు, పరిపరివిధముల బాలుడు, చద్దుల మూటలు చంకల వ్రేలాడే ముద్దుల పడుచుల మూకలతో పెద్దరికంతో ఆవు పెయ్యల్ని కాచిన పద్దుల నటనల బాలుణ్ణి, కన్నెలు దూరగ కిలకిల నవ్విన మాయలు పన్నిన బాలుణ్ణి, 'దేసాక్షి' రాగంలో 'ఏకతాళి'తో అభివర్ణించాడు.

'పర తత్వంబగు బాలుడు
పరి పరి విధముల బాలుడు ||పల్లవి||

చద్దుల మూటలు చంకల వ్రేలెడి
ముద్దుల పడుచుల మూకలతో
పెద్దరికంబున బేయుల గాచిన
బద్దుల నటనల బాలుండూ ||పర||

వెన్నలు దాకగ వేట్లాడుచును
సన్నపు బడుచుల సంగడిని
కన్నెలు దూరగ గలకల నవ్విన
పన్నిన మాయల బాలుండు ||పర||

పై కీర్తనలో 'పరతత్వ', పరిపరి విధములు', 'పెద్దరికంబు', 'పద్దుల నటనల', 'మాయల బాలుండు' ప్రయోగాలు బాలుడి మహిమను సూచించేవి.

ఇందులో కృష్ణుడి పరబ్రహ్మ స్వరూపం, అతడి చిత్రవిచిత్ర

---

1. రాగం-దేశాక్షి, ఏకతాళి; సంపు-4, సంకీ-144, రేకు-36, శృం. సం.

కమనీయ సృష్టి విలాసం, ఆతడి సర్వోత్తమత్వం, మాయనటన మొద లైన అంశాలు సూచితాలైనాయి.

ఈ విధంగా అన్నమయ్య, బాలకృష్ణ మహిమాభివర్ణనలను భావనాసౌందర్యంతో, తాత్త్వికమైన దివ్యార్థ స్ఫురణతో అభిగమ్య మానం చేశాడు.

ఇందులో బాలకృష్ణుడికి సంబంధించిన మహిమాధికాన్ని సామాన్యంగా వర్ణించి అన్నమయ్య వివిధక్షేత్రాల్లో ఉన్న బాల కృష్ణుల మహిమాధికాన్ని క్షేత్ర నామాదులతో సహా అభివర్ణించాడు. ఆ విషయం దీని తరువాత ప్రకరణంలో పరామర్శించబడు తున్నది.

# క్షేత్రీయ బాలకృష్ణ సంకీర్తనలు :

పూతాత్ములు, పుణ్యధనులు అయిన మహారాజులు, చక్రవర్తులు యుగయుగాల్లో ఎందరో లోకోపకార బుద్ధితో, మహాత్ముల అనుగ్రహంతో, ఆయాప్రాంతాల ప్రజానీకాన్ని తరింపజేసేదానికి ఎన్నో దేవాలయాలను, విభిన్న మతాలకు సంబంధించినవాటిని నిర్మించడం జరిగింది.

వాటి యంత్రబలాన్ని బట్టి ఆయాదేవతామూర్తుల ఆకర్షణతో అనేక ప్రాంతాలకు చెందిన, అనేక జనానీకం ఆయామూర్తులను సందర్శించి తరించడం ఉంది.

ఈ దివ్యస్థల సందర్శనకు తోడు తీర్థ సందర్శనం కూడా తోడై, క్రమంగా తీర్థ యాత్రలుగా ఇది పరిణమించింది. అన్ని మతాల వారిలో వారి వారి పుణ్యస్థలాల్ని దర్శించే నిమిత్తం యాత్రల్ని చేయడం మానవ జీవితంలో ఒక ప్రధానాంశంగా పరిణమించింది.

తెలుగు వాగ్గేయకారుల్లో అన్నమయ్య ఎన్నో క్షేత్రాలను సందర్శించాడు. అలాగే కవులలో శ్రీనాథుడు ఎక్కువ క్షేత్ర ప్రదేశాల్ని సందర్శించాడు. అన్నమయ్య కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు ప్రాంతాలను, నెల్లూరు, గుంటూరు పరిసరాల్లోని క్షేత్రాలను సందర్శించాడు. అంతేగాక కర్ణాటక రాజ్యంలోని మతంగాద్రి, కలశాపురం, విజయనగరాలతో పాటు అరవ దేశానికి చెందిన కంచి, శ్రీరంగం, చిదంబర పట్టణాలని కూడా సందర్శించాడు. కర్నూలు మండలాంతర్గతమైన అహోబిల నారసింహుని సందర్శించాడు. ఆ జిల్లాలోనివే అయిన వెలుగోడు, చాగలమర్రి గ్రామాల్లో నిలిచిన చెన్నకేశవుణ్ణి చూశాడు. కదిరి నారసింహుణ్ణి, గుత్తి రఘురాముణ్ణి చూచి తరించాడు. ఇవి అనంతపుర మండలానికి చెందినవి. ఒంటిమిట్ట కోదండరాముణ్ణి, ఓబినూతలలో వెలసిన నృసింహుణ్ణి, 'కోన' కేశవ

స్వామిని, దేవుని కడపలో ఉన్న వేంకటేశ్వరుణ్ణి మాత్రమేకాక నంద లూరు సౌమ్యనాథుణ్ణి, నల్లబల్లి చెన్నకేశవుణ్ణి, పొలగిరి కేశవస్వామిని చూచి తరించాడు.

ఇంకా పులివెందలలో నిల్చిన రంగనాయకస్వామిని, పెద్ద చెప్పలి, పెద్దముడియం, మాచినూలు, మాడుపూరు, ప్రొద్దుటూరు, వత్తలూరు, పోట్లదుర్తి, సంబటూరు మొదలైన స్థానాల్లో నిల్చిన చెన్న కేశవ స్వామిని అన్నమయ్య తనివితీరా చూచి మొక్కులందించాడు. తాళ్ళపాకను చుట్టిన గద్దెరాతి, సోమశిల, ఎఱ్ఱశిల, దొంగలసాని, గుబ్బలకొండ కనుమల్ని కూడా ఆయన కీర్తనల్లో స్మరించాడు. తాళ్ళ పాకను చుట్టూ ఆవరించి షట్చక్రాల ఆకారంలో ఉన్న ఈ కొండల్లో ప్రతిదాని దగ్గరా ఒక్కొక్క చెన్నకేశ్వర ఆలయం ఉన్నట్లు తెలు స్తుంది.1

తిరుపతిలో గోవిందరాజులును, శ్రీరాముణ్ణి, హనుమంతుణ్ణి, ఏడుకొండలవాణ్ణి మాత్రమేగాక చిత్తూరుజిల్లా వాయల్పాడులోని శ్రీరామచంద్రుణ్ణి కూడా దర్శించాడు. తిరుమల చుట్టుప్రక్కలలోని అంజనాద్రి, శేషాద్రి, వేంకటాద్రి, గరుడ వేదాద్రుల్ని ప్రత్యేకంగా దర్శించాడు. అలాగే తరిగొండ నారసింహుణ్ణి కూడా చూచాడు.

నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయగిరి(ఉద్దగిరి) కృష్ణుణ్ణి, గండ వరంలో ఉన్న గోపాలకృష్ణుణ్ణి చూచి కీర్తించాడు.

కురుసూతల (గుంటూరు జిల్లా) చెన్నయ్యను చూశాడు. కన్నడ రాజ్యంలో ఉండే ఆంజనేయుణ్ణి, హంపి విజయనగర విఠలస్వామిని, శ్రీరామ, శ్రీకృష్ణ, నారసింహుల్ని దర్శనం చేసుకున్నాడు.

---

1. చూ : అన్నమయ్య శృంగార సంకీర్తనలు పీఠిక, సంపు-12,
శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ

అన్నమయ్య ఎన్ని క్షేత్రాలు తిరిగినా, ఎందరు దేవతల్ని దర్శించినా తిరుపతి వేంకటేశ్వరుణ్ణి దర్శించిన సంతృప్తి ఆయనకు కలిగినట్లులేదు. కారణం ఆ యా దేవతామూర్తుల్ని వేంకటేశ్వరుడితో అభేదాన్ని పాటిస్తూ ఆయన కీర్తనల్ని పాడాడు.

కీర్తనల ఆరంభంలో ఉండే పల్లవిలోనే ఆ యా క్షేత్రాధి దేవతలైన ఆ మూర్తుల్ని కీర్తిస్తూ కొన్నిటిలో బాలకృష్ణుణ్ణి భావించి, ఆయన బాల్యచేష్టల్ని అన్నమయ్య గానం చేశాడు.

అలాంటి వాటిలో ఉద్దగిరి కృష్ణుడిపై అన్నమయ్య పాడిన కీర్తనలు ప్రత్యేకమైనవి. తర్వాత మాడుపూరు, విజయనగరం చెప్ప దగినవి. మాడుపూరు కడప జిల్లాలో ఉంది. విజయనగరం కర్నాటక రాజ్యానికి రాజధాని.

## ఉద్దగిరి కృష్ణుడు :

ఉద్దగిరి నెల్లూరు జిల్లాలో తాలూకా కేంద్రమైన ఉదయగిరి. దీనికి అతి ప్రాచీనకాలంలో 'కొండాయ పాళెం' అనే పేరుంది. ఇది గజపతిరాజుల పాలనలో ఉండేది. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచీ ఇది విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. దీనికి ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఇక్కడ ఎన్నో దేవాలయాలున్నాయి. అందులో కృష్ణదేవాలయం ఒకటి. దీని విషయాన్ని ఈ క్రింది వాక్యాలు వివరిస్తున్నాయి.

"The temple of Lord Krishna situated on the southern part of the village belongs to the Pallava type with the stupa on the top of the Garbhagudi (Sanctum sanctorum) and with the Prakaarams enclosed by high walls a hundred years from it are ruined compound walls with entrance gate, tower and an unfinished Kalyanamantapam is a peculiar feature of the

Vijayanagar type of temple architecture. But the temple proper is an old construction which is the standing evidence of the face that is greatness dates back to the eleventh century. The frame work of the stupa is still in good condition through the images all disappeared. The remains of the compound wall and the entrance gate which are of the chola type indicated apparently the existance of another temple on whose site the Kalyanamantapam was built. The mantapam is splendid type of archtecture with finely carved pillars".1

ఉద్దగిరిలో శ్రీకృష్ణుడి ఆలయం ప్రాచీముఖంగా ఉంది. ప్రధాన ఆలయంలో గర్భగుడిలో కృష్ణ విగ్రహం లేదు. అది రాయల కాలంలో విజయనగరం చేరిందని ముందే చెప్పబడింది. రాయల దండయాత్రకు ముందే అన్నమయ్య ఈ కృష్ణుణ్ణి దర్శించాడు. అతణ్ణి కీర్తించాడు.

ఈ దేవుడి మీద అన్నమయ్య అయిదు కీర్తనల్ని రూపించాడు.

పల్లవిలో మాత్రం 'ఉద్దగిరి కృష్ణుడు' అన్నాడు. కీర్తనలో మరెక్కడా ఈ కృష్ణుడి పేరుగానీ, ఆ క్షేత్ర మహిమగానీ చెప్పబడ లేదు. ఉవిదలాల చూడరే ఉద్దగిరి కృష్ణుడు' నవుకపు సెలవుల నవ్వు చున్నాడు అన్నది దీని పల్లవి.

ఇందులో శకటాసుర మర్దనం, గొల్లెతలతో కౌగిళ్ళు, మద్దులు విరవడం, పూతకి హరణ, ధేనుకాసుర భంజనం, గోవర్ధనోద్ధరణతే కాక కంసవధ, అజగర సంహారం కూడా వర్ణితాలైనాయి.

---

1. Fairs and festivals—Nellore Dist., Page: 93.
(బాలకృష్ణ విగ్రహాన్ని రాయలవారు ఉదయగిరినుంచీ విజయ నగరానికి తరలించి అక్కడ ప్రత్యేక మందిరనిర్మాణం చేయించి, అందులో దాన్ని ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది).

"ఉవిదలాల చూడరే వుద్దగిరి కృష్ణుడు
నవకపు సెలవుల నవ్వుచున్నాడు ॥పల్లవి॥

అచ్చపు బాలుడై శకటాసురు మర్దించినాడు
కుచ్చి కాగిళ్ళ నింతుల గూడినాడు
మచ్చిక దోగెడు తాను మద్దులు విరిచినాడు
పిచ్చిల బూతకి చన్ను పీఁచినాడు ॥ఉవిద॥

పిన్ననాడె కోడెలతో బెనగి గెలిచినాడు
యెన్నికగా వేల గొండ యెత్తినాడు
వెన్నడిని కొండపాము వెస రెండు సేసినాడు
వన్ని కంసుని మదగుబ భంజించినాడు"1 ॥ఉవిద॥

ఏ కీర్తనలో కూడా స్మరించని అజగర సంహరణాన్ని 'కొండ పాము వెస రెండు సేసినాడు అన్న ప్రయోగంలో సూచించాడు.

మరో ఉద్దగిరి కృష్ణ కీర్తనలో 'బాలుడి చేతలెల్లాను చెప్ప సిగ్గయ్యానే' అంటూ, పైకి బాలుడిలా కనిపిస్తాడేగానీ సుదతులు కౌగిలించుకుంటే ప్రాయపు కుమారుడుగానే కన్పిస్తాడనీ, దూడలు గాచేవేళ గొల్లడై యుంటాడే కాని పక్కన పడుకోబెట్టుకొంటే ఇంటి మగడౌతాడని, పీటికి మాటికి చిన్ని చేతల్ని చేస్తాడేగానీ ముద్దాడబోతే 'పచ్చి సేతలే' చేస్తాడని, పలకరించి మాట్లాడితే సరిగ్గా మాట్లాడడు. లోపల మాటాడించి చూస్తే అవి మాటలుగా కాక, 'మదన తంత్రాలు' గానే ఉంటాయని, చెక్కులు మీటితే పాలు దాగుతాయి కానీ మోవితేనెలకు వేడుకకాడని, మట్టులేని మహిమల్తో మానిసిగా ఉన్నాడేకానీ దిట్టయైన వేంకటాద్రిదేవరై యున్నాడని అన్నమయ్య ఈ కీర్తనలో భావించాడు.

---

1. రాగం_ముఖారి, సంపు_8, సంకీ_235, రేకు_241, ఆధ్యా.సం.

"ఓయమ్మ చూడగదరె వుద్దగిరి కృష్ణుడు
సేయు చేతలెల్లాను చెప్ప సిగ్గయ్యీనే ॥పల్లవి॥
చూడ బాలుడు గానీ సుదతుల కాగిళ్ళ
గూడేవేళ ప్రాయపు కొమారుడే
దూడల గాచేవేళ వాడ గొల్లడై యుండు గాని
యేడ బక్కబెట్టుకొంటే యింటి మగడౌనే ॥ఓయమ్మ॥
చీటికి మాటికి చిన్ని చేతలెల్లా జేసుగాని
పాటించి ముద్దాడబోతే పచ్చి సేతలే
చాటి చాటి నేరిపిన చక్క మాటాడడు, లోన
మాటలాడించి చూచితే మదన తంత్రాలే ॥ఓయమ్మ॥
పట్టి చెక్కులు మీటితే బాలుదాగీ గాని
వెట్టి మోవితేనెలకు వేడుక కాడె
మట్టులేని మహిమల మానిసై వున్నాడుగాని
దిట్ట శ్రీవేంకటాద్రిపై దేవరై వున్నాడె"1

చెప్ప సిగ్గయ్యీనే, చూడ బాలుడు గాని, ప్రాయపు కొమరుడే, పక్క బెట్టుకొంటే, ఇంటి మగడౌనే, పచ్చి సేతలే, మదన తంత్రాలే, మోవి తేనెలకు వేడుక కాడే, మట్టులేని మహిమల మానిసి ప్రయోగాలు మదన జనకుడైన బాలకృష్ణుడి శృంగారలీలా మహిమాభివర్ణనా రమణీయకాలైనట్టివి.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య ఉద్దగిరి బాలకృష్ణుడి క్రీడా విశేషాల్ని వర్ణిస్తూ, తన నాడు తెలుగునాట ప్రచారంలో ఉన్న బాల క్రీడల్ని సూచించాడు.

'వొచ్చము లేనివాడు వుద్దగిరి కృష్ణుడు, గజ్జెలు, అందెలతో పిల్లగోట్లు, పుట్టచెండు, సముద్రబిల్లలు, చెమటలు గారేదాకా, సిరి సింగనవత్తి, ఉడ్డ గచ్చకాయలు', 'విచ్చన విడినెయాడి' అని వివరించాడు.

---

1. రాగం–మేఘరంజి, సంపు–22, సంకీ–433, రేకు–774, శృం.సం.

"విచ్చన విడిసె యాడీ వీడె కృష్ణుడు
వొచ్చము లేనివాడు వుద్దగిరి కృష్ణుడు ||పల్లవి||

గల్లుగల్లుమనగాను గజ్జలు నందెలతోడ
బిల్లగోట్లాడీని పిన్నకృష్ణుడు
కెల్లురేగి వీధులనుగేరి పుట్టచెండులాడీ
బల్లిదుడు గదవమ్మ బాలకృష్ణుడు ||విచ్చన||

తమితోడ గోపాలులు దాను గూడి ముంగిటను
సముద్ర బిల్లలాడీ సాధుకృష్ణుడు
చెమటలుగార సిరిసింగన వత్తియాడీ
గుమితాన వీడేయమ్మా గోపాలకృష్ణుడు ||విచ్చన||

పుదుటునబారి పారి వుడ్డ గచ్చకాయలాడీ
ముదము దొలకగాను ముద్దుకృష్ణుడు
అదివో శ్రీవేంకటేశు డాటలెల్లా దానె యాడీ
పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుడు"1 ||విచ్చన||

ఇందులో 'శ్రీవేంకటేశు డాటలెల్లా దానె యాడీ', 'పదివేలు చందాల శ్రీపతియైన కృష్ణుడు' అని చివరి చరణాల్లో బాలకృష్ణ వేంకటేశ్వరులకు అభేదాన్ని పాటించాడు.

అన్నమయ్య కాలంనాటికి ఉన్న బాలక్రీడలు పై కీర్తనలో సూచించబడ్డాయి.

అలాగే ధూర్జటి మహాకవి కూడా తిన్నని బాల్యక్రీడా వర్ణనా సందర్భంలో ఆ నాటి క్రీడావిశేషాల్ని అభివర్ణించాడు.

---

1. రాగం_దేవక్రియ, సంపు_10, సంకీ_172, రేకు_330 అధ్యా.సం.

అన్నమయ్య చెప్పిన సిరిసింగనావత్తి, గచ్చకాయలు, పుట్ట చెండు, బిళ్ళగోటు మొదలైనవాటినే గాక ధూర్జటి ఇంకా కొన్ని బాల్య క్రీడల్ని వివరించాడు.1

ధూర్జటి కేవలం తిన్నడాడిన ఆటల్నే వర్ణించాడు. కనుక అన్న మయ్యకన్నా కొన్ని ఎక్కువ చెప్పినాడు. అన్నమయ్య అలాగాక ఆటలాడే బాలకృష్ణుడి రూపాన్ని కూడా వర్ణించడం వల్ల ఆటల్నే ప్రధా నంగా వర్ణించలేదు.

నేడి గ్రామ ప్రాంతాల్లో పామర బాలకులు ఆడే ఆటలకు వీటికి పేర్లలో తేడా ఉందిగాని ప్రక్రియల్లో తేడాలేదు. అప్పటి పుట్టచెండు ఆటే నేటి క్రికెట్‌గా మారిందని అనుకోవచ్చు. కాలాన్ని బట్టి పై క్రీడలు ఇంచుమించు నేడు వాడుకలో లోపించినట్లే కన్పిస్తుంది.

ఉద్దగిరి కృష్ణుడు 'పుబ్బరి కాడు' అని ముద్దులు చూపుతానే ముసుగులు తీస్తాడని, చెంగట నిదురించే గొల్లెతల్ని దొంగగా తొడ అంటుతాడని, ముంగిట్లో కూర్చుంటే ముడిచిన కోకముడిని కొంగులు విడిచి గొల్లున నవ్వుతాడని, వెన్నముద్దలు చేసే గోపికల్ని సందుగా వచ్చి చన్నులంటుతాడని అన్నమయ్య, బాలుడి చమత్కారలీలల్ని వర్ణించాడు.

"ఉద్దగిరి కృష్ణుడు పుబ్బరికాడు వీడు
ముద్దులు చూపుతానే ముసుగులు దీసేనే ॥పల్లవి॥

చెంగాట నిద్దిరించేటి చెలువంపు గొల్లెతల
దొంగిడుచు వచ్చి వచ్చి తొడలంటేనే

ముంగిట గూచుండగాను ముడిచిన కోకముడి
కొంగులు విడిచియట్టె కొల్లున నవ్వీని ॥ఉద్ద॥

---

1. శ్రీకాళహస్తి మహాత్మ్యము, తృ. ఆ; పద్యము–౪౩.

వేడుకతో గొల్లెతలు వెన్నముద్దలు సేయగ
చాడె సంది వచ్చి తాను చన్నులంటేను
జోడై యొకరొకరు సుద్దులు చెప్పేటివేళ
కోడెకాడై యండనుండి కొప్పులు వట్టినే" ‖ఉద్ద‖

ఇందులో భావితమైన సరససూక్ష్మ శృంగార భావనావిధానం అన్నమయ్య కల్పనా విశేషం. అన్నమయ్య శృంగార, ఆధ్యాత్మిక భావాల్ని వేలాది తన కీర్తనల్లో ఎంతో సున్నితంగా ప్రసరింప జేసినాడు. సహజంగా అన్నమయ్య పోతనలాగే గొప్ప భావుకుడు, భక్తుడు, కవి, విశేషించి సంగీతజ్ఞుడు–వెరసి భక్తుడైన మహా వాగ్గేయకారుడు.

ఇంకా అన్నమయ్య ఉద్దగిరి కృష్ణుడు బాల్యలీలల్ని "ఉద్దగిరి కృష్ణుడు వొడి వట్టి మానినులు"[1] అనే కీర్తనలో కూడా వర్ణించాడు.

దీని రూపం స్పష్టంగా లభించనందువల్ల, దీన్ని ప్రస్తుత పరిశీలనకు గ్రహించలేదు.

తర్వాత మాడుపూరు చెన్నకేశవుణ్ని అన్నమయ్య బాలకృష్ణుడుగా భావించి చేసిన వర్ణనావిధానాన్ని పరిశీలించాలి.

## మాడుపూరు చెన్నకేశవుడు :

మాడుపూరు కడపజిల్లాలో అట్లూరు మండలంలో ఉంది. ఇది సిద్ధవటం తాలూకాకు చెందింది. మాడుపూరికి మాడుకూరు అన్న పేరుకూడా ఉంది. తాళ్ళపాకకు చెందినఅన్నమయ్యకు మాడుపూరుకు మాతృత్వ సంబంధమైన ఒక అనుబంధం ఉంది. అది అన్నమయ్య తల్లి పుట్టిల్లు. అంటే మేనమామగారి ఊరు. ఇక్కడ కేశవస్వామి

---

1. రాగం–బౌళి, సంపు–24, సంకీ–230, రేకు–839, శృం.సం.

వెలశాడు. మాడుపూరికి పశ్చిమదిశలో, ఎత్తైన ప్రదేశంలో ఈ చెన్న కేశవాలయం నిలిచింది. ఇది ప్రాచీనమైన చెన్నకేశవాలయాల్లో తెలుగునాట ప్రసిద్ధమే. ఎన్నో ప్రాచీన దేవాలయాలకు పట్టిన శైథిల్యస్థితి నేడు దీనికి పట్టింది.

పలుమార్లు ఈ స్వామిని దర్శించిన అన్నమయ్యకు ఆతడిలో బాలకృష్ణుడు వేంకటేశ్వరుడే అభేదంగా దర్శనమిచ్చారు. ఆ స్వామి మీద అన్నమయ్య ఎన్నో కీర్తనల్ని వ్రాసినట్లు వింటాము. కానీ లభించింది ఒకే ఒక్కకీర్తన.

అన్నమయ్య తన మామూలు పద్ధతిలో పల్లవి రెండోచరణం లోనే మాడుపూరి చెన్నకేశవుణ్ణి పలకరించాడు.

'చేరి యందెల మోతలతో చెన్నకేశవా, యీ రీతి మాడుపూరిలో నిట్లాడేవా' అనే పల్లవితో అన్నమయ్య నోట ఈ కీర్తన ప్రసరింప బడింది.

"చేరి యండెల మోతతో చెన్నకేశవా
యీ రీతి మాడుపూరిలో నిట్లాడేవా ॥పల్లవి॥

మున్ను యశోదవద్దను ముద్దుగునిశాడితివి
వన్ని రేపల్లె వీధుల బారాడితివి
పిన్నవై గోపాలులతో బిల్లదీప్పులాడితివి
యెన్నిక మాడుపూరిలో నిట్లాడేవా ॥చేరి॥

కాళింగు పడగలపై కడు నాట్యమాడితివి
కేలి యమునలో రాసక్రీడలాడితి(వి?)
చేలవంటి గోపికల చెట్టావట్టాలాడితివి
యీ లీల మాడుపూరిలో యిట్లాడేవా ॥చేరి॥

తగు విభాండకునితో దాగిలి ముచ్చలాడితి(వి?)
అగడుగా బండివిరిచాట లాడితి

వొగి శ్రీవేంకటగిరి నుండి వచ్చి మాడుపూర
వెగసెగసి గతుల కిటులాడేవా"1

పై కీర్తనలో అన్నమయ్య, కృష్ణుణ్ణి యశోదవద్ద ముద్దుగా మున్ను గునిశాడితివని, రేపల్లె వీధుల్లో పారాడితివని, గోపాలురతో బిల్లదీపులాడితివని, అలాంటి నీవు ఇప్పుడు మాడుపూరిలో 'ఇట్లాడేవా' అని అంటాడు.

కాళింగు పడగలపై నాట్యమాడితివని, యమునలో రాసక్రీడ లాడితివని, గోపికల్తో చెట్టాపట్టా లాడేవని, ఇప్పుడు మాడుపూరితో ఇలా ఉన్నావా అని, విభాండకుడితో దాగిలి ముచ్చులాడితివా అని, 'బండివిరిచాట' లాడావని, వేంకటగిరి నుండి వచ్చి మాడుపూరిలో ఆడుతున్నావా అని భావిస్తాడు.

ఇందులో అన్నమయ్య చెప్పిన విషయాలు పునరావృతాలైనా, భక్తుడైన ఆ మహానుభావుడికి అవి పునరావృతాలుగా కాక బహువారం స్మర్త్వ్యమానాలైన భగవత్కథా లీలావిశేషాలుగానే స్ఫురించాయి.

భగవత్కథల్ని, లీలల్ని పలివిధాలుగా ఎన్నోమార్లు స్మరించడమే భక్తుడి లక్షణంగా అన్నమయ్య భావించి కీర్తించడం జరిగింది. సామాన్యులకు ఇవి చర్విత చర్వణాలుగా కన్పించినా, భక్తులకు అవి అలా అనిపించక పైపెచ్చు పారవశ్యాన్ని కల్గిస్తాయి.

మామూలు విషయాల్లో చెప్పిన విషయం మరలా వస్తే విసుగును పుట్టిస్తుంది. కాని భగవద్విషయంలో ఇవి అనన్యమైన నిశ్చల భక్తినే పెంపొందిస్తాయి. అందుకే అన్నమయ్య ఈ పద్ధతిని అవలంబించినట్లు తెలుస్తుంది.

అతి ప్రాచీనమైన సహస్రనామ ప్రక్రియ భగవల్లీలల్ని, తద్విక్రమాదుల్ని అనేకానేకరీతుల్లో వర్ణించినట్లే, అన్నమయ్య కీర్తన విధానం కూడా ఉంది.

---

1. రాగం-పాడి, సంపు-8, సంకీ-179, రేకు-231, ఆధ్యా. సం.

తర్వాత అన్నమయ్య కీర్తించిన విజయనగర బాలకృష్ణుడి వర్ణనను చూడాలి.

## విజయనగర కృష్ణుడు :

విజయనగరం ఒక ధర్మసామ్రాజ్యం. ఇదే హంపీ క్షేత్రం. పంపానది దీనికి జీవధార. విరూపాక్షస్వామి ఇక్కడ వెలసినందువల్ల ఇది హంపీ క్షేత్రమైంది. దీనికే విద్యానగరం అన్న పేరూ ఉంది.

విద్యారణ్య మహర్షి సంస్థాపితమైన ఈ మహాసామ్రాజ్యం మూడువందల సంవత్సరాలు అవిచ్ఛిన్నప్రవృత్తంగా సాగి క్రమంగా అంతరించింది.[1]

విజయనగరం బళ్ళారిజిల్లా హొస్పేట తాలూకాకు చెందింది.[2]

విజయ విద్యానగరంలో ఆలయాలకు లెక్కలేదు. వాటిలో బాల కృష్ణుడి ఆలయం ఒకటి. ఈ స్వామిని దర్శించిన అన్నమయ్య, తన భక్తిపారవశ్యాన్ని ఈ శృంగార కీర్తనాముఖంగా 'సామంతరాగం'లో ప్రసరింపజేశాడు.

"వేడుక కాదు గదమ్మ విజ నగరములోన
వేడె వెట్టీ సతులను వెన్నముద్దకృష్ణుడు ॥పల్లవి॥
ఇంటిలో నా మొగడు నేనిద్దరమున్న వేళ
వొంటినే తాజొచ్చి వచ్చెనో యమ్మలాల
దంట తనమున నేను తన కన్నులు మూసితే
చంటికి చేతులు చాచీ జాణడే యీ కృష్ణుడు ॥వేడుక॥

1. విజయనగర సామ్రాజ్యం క్రీ. శ. 1336 లో అవతరించింది. క్రీ. శ. 1565 లో తళ్లికోట యుద్ధంలో ఇది రూపుమాసింది.
2. హుబ్లీ, గుంతకల్లు రైలు మార్గంలో హొస్పేట రైలు స్టేషనుకు సుమారు 7 మైళ్ళ దూరంలో విజయనగరం ఉంది.

కమ్మర మాయాతడు నే గాగిలించుకుండగాను
వుమ్మడి దామోవి యిచ్చినో యమ్మలాల
చిమ్ముచు నేనంతలోన సిగ్గుపడితే నా పక్క
నిమ్ము సేసుకొని పండీ నిదివో యీ కృష్ణుడు ॥వేడుక॥

పేరుకొని నావిభుని బిలిచితే నూకొని
వూరకె తావొచ్చి కూడె నో యమ్మలాల
యీ రీతి శ్రీవేంకటాద్రి నిరవై యీడా నాడ
కూరిములు వెదచల్లీ గోపాలకృష్ణుడు"1 ॥వేడుక॥

ఒక గొల్లభామ బాలకృష్ణుడు తనని అల్లరిచేసిన చిల్లరితనాన్ని వర్ణించినట్లు అన్నమయ్య ఇలా వర్ణించాడు.

ఇంటిలో తన మొగుడితో ఉన్న వేళ ఒంటిగా దాను వచ్చినా డని, దంటతనంతో తాను బాలుడి కన్నులు మూసితే, చంటికి చేతులు చాచాడని, భర్తను కౌగిలించుకోనీకుండా ఉమ్మడిమోవి ఇచ్చాడని, సిగ్గుపడ్డ తన ప్రక్కలో పండుకొన్నాడని, పేరుతో తన మగణ్ణి పిలిస్తే ఊకొని తాను వచ్చి కూడినాడని, వేంకటాద్రిపై నిలిచి ఈడా అడా గోపాలకృష్ణుడు కూర్మలు వెదజల్లాడని అంటుందని భావించాడు.

'ఈడా నాడా', 'కూర్మలు వెదజల్లి' అన్న ప్రయోగం గొల్ల భామమీద ప్రేమను చల్లడాన్నే వివరించినా, ఆ యా ప్రదేశాల్లో అవతరించిన బాలుడు లోకానుగ్రహం కోసం కూర్మలు వెదజల్లినాడు అన్న అంతరమైన తాత్త్విక భావనని కూడా సూచిస్తుందని గ్రహించ డానికి అవకాశం ఉంది.

ఈ విధంగా అన్నమాచార్యులు ఉద్దగిరి, మాడుపూరు, విజయ నగరం మొదలైన ఎన్నో క్షేత్రాల్లో వెలసిన వైష్ణవ దేవాలయాలు

1. రాగం-సామంతం, సంపు-20, సంకీ-294, రేకు-649, శృం.సం.

అన్నింటిలో బాలకృష్ణుణ్ణి భావించి, ఆతణ్ణి వేంకటేశ్వరుడుగా రూపించి, అద్వైత భావంతో తల్లీలావిక్రమ, క్రీడామహత్మ్యాదికాన్ని కీర్తనల ద్వారా, భక్తి భావనామయమైన సాహితీ సంగీత సుధా స్రవంతుల్ని విభిన్న ప్రాంతాల్లో, రాష్ట్రాంతరాల్లో ప్రసరింపజేసి పునీతంచేశాడు.

తర్వాత రామ కథాత్మకాలైన అన్నమయ్య సంకీర్తనల్ని పరామర్శించాలి.

## శ్రీరామ కథాత్మకాలు :

ఆధ్యాత్మ సంకీర్తనల్లో అన్నమయ్య, రామబాల్యలీలా ప్రసక్తిని మొత్తం తొమ్మిదిమార్లు తీసుకువచ్చాడు. పదవ సంపుటంలోనే అన్నమయ్య తొమ్మిదిసార్లు చేసిన శ్రీరాముని బాల్యలీలా ప్రసక్తి కన్పిస్తుంది.

అన్నమయ్య రామ కథాత్మకాలైన విషయాన్ని కేవలం రాముడి బాల్యానికి చెందిన వాటినే కాక, ఆ దేవుడి జీవితంలో మిగిలిన విషయాల్నికూడా కలిపి సంకీర్తించడంవల్ల రామ సంబంధాలైన సంకీర్తనలన్నింటిని అర్థదృష్ట్యా పూర్తిగా గ్రహించాల్సిన అవసరం ఏర్పడింది. పూర్తి కీర్తన స్వరూపం ఇస్తూ, అందులో రాముడి వివాహత్పూర్వం జరిగిన సన్నివేశాలకే ఈ పరిశీలన పరిమితం చేయబడింది.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య, రాముణ్ణి దశరథ నందనుడిగా, యాగ భాగకర్తగా, కాకుత్థ్సల రామునిగా, కౌసల్యా సుతుడిగా, శ్రీకర గుణోన్నతుడిగా, కాకాసుర వైరిగా, కౌశిక వత్సలుడిగా, తాటకాంత బిరుదాభిరాముడిగా అభివర్ణించాడు.

తరువాత వారధి బంధన, వాలి హరణ, దశకంఠ హరణం, విభీషణ అభిసేచన మొదలైన అంశాలున్నాయి.

"నమో నమో దశరథ నందన రామ
కమనియ్య యాగ భాగ కర్త రామ ॥పల్లవి॥

కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకర గుణోన్నత శ్రీరామ
కాకాసుర వైరి రామ కౌశికవత్సల రామ
భీకర తాటకాంతక బిరుద రామ ॥నమో॥

వారధి బంధన రామ వాలిహరణ రామ
చారుహర కోదండ భంజన రామ
ధారుణిజపతి రామ దశకంఠ హర రామ
సార విభీషణాభిషేచన రామ ॥నమో॥

అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ స్వర్వజ్ఞ రామ
విమలరామ శ్రీవేంకటగిరి రామ
రమణ శరణాగత రక్షక రామ"[1] ॥నమో॥

రాముణ్ని వేంకటగిరి రాముడుగా, శరణాగత రక్షకుడిగా అన్నమయ్య భావించాడు.

రామ సంబంధమైన కీర్తనల్లో అన్నమయ్య భాష, శైలి మారింది. బాలకృష్ణుడి కీర్తనల్లోవలె కాక ఇందులో తత్సమపదాధిక్యం కన్పిస్తుంది. యతులు, ప్రాసలు కూడా ఇందులో కన్పిస్తాయి. (కాకాసుర వైరి రామ, కౌశికవత్సల రామ ఇత్యాదులు).

రామా దశరథ రామా అన్న క్రింది కీర్తనతో అన్నమయ్య రాముణ్ణి దశరథ రాముడిగా, కాకుత్స్థ రామునిగా, కౌసల్యానందన రామునిగా, సవనరక్షకుడిగా, మనుజావతార రామునిగా అభివర్ణించి రామావతార మహిమను సూచించాడు.

"రామా దశరథరామా నిజసత్య
కామా నమోనమో కాకుత్స్థ రామ ॥పల్లవి॥
కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమపురుష సీతాపతి రామ
శరధి బంధన రామ సవన రక్షక రామ
గురుతర రవివంశ కోదండరామ ॥రామ॥

1. రాగం_బౌళి, సంపు_10, సంకీ_144, రేకు_325, ఆధ్యా. సం.

దనుజహరణరామ దశరథసుత రామ
విను(న?) తామరస్తోత్ర విజయనరామ
మనుజావతార రామ మహనియ్యగణ రామ
అనిలజప్రియ రామ అయోధ్యరామ ॥రామా॥
సులలిత యశ రామ సుగ్రీవ వరదరామ
కలుష రావణ భయంకర రామ
విలసిత రఘురామ వేదగోచర రామ
కవితప్రతాప శ్రీవేంకటగిరి రామ"1 ॥రామా॥

ఇందులో 'సవన రక్షక రామ' ప్రయోగం, బాలరాముడి విక్రమానికి సంకేతం. ఆయన బాల్యవిక్రమ క్రియావిశేషాన్ని అన్నమయ్య ఈ ప్రయోగంలో సూచించాడు.

అలాగే 'పరమపురుష', 'గురుతరరఘువంశ', 'మనుజావతార' ప్రయోగాలుకూడా పై విషయాన్నే తెలుపుతున్నాయి.

'ఇతడు తారకబ్రహ్మ మితడు సర్వేశ్వరుడు' అన్న మరో కీర్తనలో అన్నమయ్య, 'తరుణి వంశజుడైన' రాముడు తాటకను బాల్యదశలో సంహరించి, విశ్వామిత్రమహర్షి యాగాన్ని కాచిన కథాంశాన్ని, హరుడి విల్లువిరిచి సీతను పెండ్లాడి, పరశురాముణ్ణి జయించిన విషయాన్ని అభివర్ణించాడు.

"ఇతడు తారకబ్రహ్మ మీతడు సర్వేశ్వరుడు
రతికెక్కి గొలిచిన రక్షించు నితడు ॥పల్లవి॥
తరుణి వంశజుడై తాటకను హరియించి
అరుదుగ విశ్వామిత్ర యాగము గాచి
హరుని విల్లువిరిచి యట్టె సీత బెండ్లియాడి
పరశురాముని నిజబలిమి చేకొనెను. ॥ఇతడు॥

1. రాగం-పాడి, సంపు-10, సంకీ-156, రేకు-3, అధ్యా. సం.

మునుల కభయమిచ్చి మొగినసురల ద్రుంచి
ఘనమైన మాయామృగము జంపి
కినిసి వాలిగొట్టి సుగ్రీవుని బట్టము గట్టి
వనధి బంధించి లంక వతి జుట్టుముట్టెను ॥ఇతడు॥

బలు రావణుని జంపి పుష్పకముపై దాజేకొని
అలి విభీషణునకు లంక యిచ్చి
చెలగి యయోధ్య యేలి శ్రీ వేంకటాద్రి మీద
వెలయ రాముడు దానై విశ్వమెల్లా జేలెను"[1] ॥ఇతడు॥

ఇందులో రాముడి జననం మొదలు సీతాకల్యాణం, మాయామృగవధ, సీతాపహరణం, సుగ్రీవ పట్టాభిషేకం, వనధి బంధనం, రావణవధ, విభీషణ పట్టాభిషేకం, అయోధ్య చేరడం మొదలైన అంశాల్ని వర్ణించి, దీన్ని ఒక సంగ్రహ సంకీర్తనరూప రామాయణంగా రూపించాడు.

మరో కీర్తనలో అన్నమయ్య, రాముడ్ని పుత్రకామేష్టిలో పరమాన్న రూపమున జనించిన పరబ్రహ్మమని, సురకోటిని రక్షించే దానికి, అసురుల్ని శిక్షించేదానికి ఉదయించిన దివ్యతేజమని, రాముడి అవతార కార్యసంబంధమైన ప్రపత్తిని తెచ్చాడు.

అందులోనే తర్వాత చింతించే యోగీంద్రుల చిత్త సరోజాల్లో నిలిచిన సాకారమని, మునులు వెదికే కైవల్యపదమని, వేదవేదాంత విజ్ఞానశాస్త్రాల్లో పొదుకొని పలికే పరమార్థమని ఆయన వర్ణించాడు.

"రాముడు రాఘవుడు రవికులుడితడు
భూమిజకు బతియైన పురుష నిధానము ॥పల్లవి॥

అరయ బుత్రకామేష్టియందు బరమాన్నమున
పరగ జనించిన పరబ్రహ్మము

---

1. రాగల రేకు, సంపు-10, సంకీ-159, రేకు-327, ఆధ్యా. సం.

సురల రక్షింపగ నసురల శిక్షింపగ
తిరమై యుదయించిన దివ్యతేజము ॥రాముడు॥

చింతించే యోగీంద్రుల చిత్తసరోజములలో
సంతతము నిలిచిన సాకారము
వింతలుగా మునులెల్ల వెదకి కనేయట్టి
కాంతుల జెన్ను మీరిన కైవల్య పదము ॥రాముడు॥

వేదవేదాంతములందు విజ్ఞాన శాస్త్రములందు
పొదుకొన బతికేటి పరమార్థము
పోదితో శ్రీ వేంకటాద్రి జొంచి విజనగరాన
ఆదికి ననాదియైన అర్చావతారము"1 ॥రాముడు॥

'అరయ పుత్రకామేష్టియందు పరమాన్నమున పరగ జనించిన పరబ్రహ్మము' అన్న ప్రయోగం రామావతారంలోని, అతడి జననం అతిలోకమైన పవిత్రతను, మహత్తును ఆయన సూచించాడు.

ఈ క్రింది కీర్తనలో అన్నమయ్య రాముడు చేసిన మారీచ సుబాహు బల మర్దనాన్ని, మౌని సవన రక్షకత్వాన్ని, శివ ధనుర్భంగాన్ని, అహల్యా శాపవిమోచనాన్ని రామబాల్య విశేష కార్యాలుగా వర్ణించాడు.

శరణు శరణుదేవ సత్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యానందన ॥పల్లవి॥

వారిధి బంధన రావణ శిరచ్ఛేదక
మారీచ సుబాహు బల మర్దన
దారుణ కుంభకర్ణ దనుజ సంహారక
వీరప్రతాప రామ విజయాభిరామ ॥శరణు॥

---

1. రాగం-పాడి, సంపు-10, సంకీ-169, రేకు-329, ఆధ్యా. సం.

సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంద్య కపిసేనా నాయక
వివిధ సప్తతాల విధ్వంసన చతుర
భువనేశ సాకేతపురవాస రామ ॥శరణు॥

హర చాప హర అహల్యా శాప విమోచక
ఖర శర వాలి నిగ్రహ బిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్త రక్షక
ధరణిజా సమేత దశరథరామా"[1] ॥శరణు॥

ఇందులో 'అహల్య శాప విమోచక' ప్రయోగం శిలారూపిణి యైన అహల్య విముక్తిని కవి భావించాడు. గురుడైన విశ్వామిత్రుడితో సవన రక్షణార్థం బయలుదేరిన రాముడు, దారిలో ఈ ఘన కార్యాన్ని సాధించాడు.

ఈ కీర్తనలో అన్నమయ్య, రాముడి రాక్షస సంహారాన్ని కూడా చెప్పాడు. సవన రక్షక, మునిజనకుల నిర్వాహక ప్రయోగంలో, కౌశికుడి యాగరక్షణ ద్వారా మునిజనుల కార్యాల్ని నిర్వహించిన, శ్రీరాముడి బాల్యదశలో జరిగిన విక్రమ కార్యాన్ని ఆయన భావించాడు.

ఇంచుమించు అన్నమయ్య రామసంబంధమైన ప్రతి కీర్తనలో అతని మహిమల్నే తిరిగి తిరిగి సంకీర్తించాడు.

'యేడకేడ నీ చరితలేమని పొగడవచ్చు, యీడులేని మహిమల యినవంశ రామా' అన్న పల్లవితో ఉన్న క్రింది కీర్తనలో, రాముడు పుట్టినప్పటి నుంచి, రావణసంహారానంతరం అతడు సీతతో అయోధ్యకు చేరేదాకా ఉన్న కథాంశాల్ని అన్నమయ్య వరుసగా స్మరించాడు.

---

1. రాగం_కన్నడగౌళ, సంపు_10, సంకీ-170, రేకు_329, ఆధ్యా.సం

"ఏడకేడ నీ చరితలేమని పొగడవచ్చు
యీడులేని మహిమల యినవంశ రామా ||పల్లవి||

పరమాన్నములో బుట్టి పక్కన దాటకి జంపి
సరుస విశ్వామిత్రు యజ్ఞము గాచి
హరునివిల్లు విరిచి యట్టె సీత బెండ్లాడి
పరశురామునిచేత బలము చేకొంటివి ||ఏడ||

వైపుగా సుగ్రీవు గూడి వాలినొక్క కోలనేసి
యేపున జలధి గట్టి యెసగితివి
కోపించు రావణుని జంపి దివిజులను మన్నించి
యేపుగా విభీషణుని రాజ్యమేలించితివి ||ఏడ||

సీతతో బుష్పకమెక్కి జిగి నయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టము గట్టుకొంటివి
యీతల శ్రీవెంకటాద్రి విటు విజనగరాన
నీతితో నెలవుకొని నెగడితివి"1 ||ఏడ||

ఇందులో రామ బాల్యానికి సంబంధించిన విషయాల్ని ఆయన కొన్నింటిని ప్రస్తావించాడు.

పరమాన్నంతో పుట్టడం, తాటకిని చంపడం, విశ్వామిత్ర యజ్ఞ రక్షణ, హర కోదండ విదండన, సీతాకల్యాణం, పరశురాముడి విషయం స్మరించబడ్డాయి.

ఇందులో సమస్త కార్యాలు పరబ్రహ్మ మూర్తియైన రాముడే నిర్వహించినట్లు అన్నమయ్య భక్తితో భావించాడు.

'శరణు శరణు' అనే కీర్తనలో కౌసల్యానందనుడైన రాముడు

1. రాగం-శ్రీరాగం, సంపు-10, సంకీ-274, రేకు-347, ఆధ్యా. సం.

విలువిద్య నేర్చుకొంటుంటేనే, అసురులు భయపడి పాతాళాన్ని చొచ్చినారని కవి భావించాడు. ఆయన జననానికి మునులు, ఋషులు ముదమునొందినారని జానకీ రమణుడైన రాముణ్ణి అన్నమయ్య స్మరించాడు.

"శరణు శరణు నీకు జగదేక వందిత
కరుణతో మమ్ము నేలు కౌసల్యానందన ॥పల్లవి॥

ఘన రణరంగ విక్రమ దశరథపుత్ర
వినుతామన (ర?) స్తోమ వీరరాఘవ
మునులును, ఋషులును ముదమునొందిరి నీవు
జననమందినందుకు జానకీ రమణ ॥శరణు॥

సులభ లక్ష్మణాగ్రజ సూర్యవంశ తిలక
జలధి బంధన విభీషణ వరద
తలకి యసురులు పాతాళము చొచ్చిరి నీవు
విలువిద్య నేర్చితేనే విజయరామ ॥శరణు॥

రావణాంతక సర్వరక్షక నిర్మలభక్త
పావన దివ్య సాకేత పట్టణవాస
వేవేలుగ నుతించిరి వెస హనుమంతాదులు
సేవించిరి నిను జూచి శ్రీవేంకటేశ"1 ॥శరణు॥

ఇందులో అన్నమయ్య శరణాగతి రూపమైన సన్నుతిని చేసినాడు. వైష్ణవంలో శరణాగతి ప్రపత్తుల ప్రాముఖ్యం అత్యంత ప్రధానం. వైష్ణవ భక్తాగ్రేసరుడైన అన్నమయ్య ఈ కీర్తనకు భజన సంప్రదాయానికి అనుగుణంగా 'శరణు శరణు' అన్న ఎత్తుగడతో ఆరంభించి నిర్మించాడు.

'రాముడు లోకాభిరాముడందరికి రక్షకుడితని కొలువరో' అనే

---

1. రాగం-సాయా, సంపు-10, సంకీ-276, రేకు-347, ఆధ్యా. సం.

పల్లవితో ఉన్న ఈ కీర్తనలో తారకబ్రహ్మ స్వరూపుడై మానుష వేషాన్ని ధరించిన బాలరాముడు హరుడి విల్లును విరవడం, పాదాన అహల్య శాపాన్ని మాన్పడం వర్ణిస్తూ అన్నమయ్య, రాముడి దైవిక మానుషలీలలు చూపుచూ మెరసీ చూడరో' అంటూ రామ కథాంశాన్ని భక్తి భావనాబంధురంగా అభివర్ణించాడు. ఆతడు వేంకటగిరి నివాసుడని, భువనాల్ని ఉదరాన ధరించాడని, 'సూక్ష్మాధికాల్ని' తనతో చూపుతున్నాడని చూడరో అని అంటాడు.

"రాముడు లోకాభిరాముడందరికి రక్షకుడీతని దెలిసి కొలువరో
కామితఫలదుడు చరాచరములకు గర్తయైన సర్వేశ్వరుడితడు ॥పల్లవి॥

తలప దశరథుని తనయుడట తానె తారకబ్రహ్మమట
వెలయ మానుషపు వేషమట వెగటు హరివిల్లు విరిచెనట
అలరగ తానొక రాజట పాదాన నహల్యాశాపము మాన్పెనట
పొలవక దైవిక మానుషలీలలు చూపుచు మెరసీ జూడరో యితడు
॥రాముడు॥

జగతి వసిష్ఠుని శిష్యుడట జటాయువుకు మోక్షమిచ్చెనట
అగచరులే తన సేనలట అంబుధి కొండల గట్టెనట
మగువ కొరకు గానట కమలాసను మనుమని రావణు జంపెనట
తగ లౌకిక వైదికములు నొక్కట తానొనరించీ జూడరో యితడు
॥రాముడు॥

వెస నమరుల వరమడిగెనట విభీషణ పట్టము గట్టెనట
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకు గొలువిచ్చెనట
పొసగ శ్రీ వేంకటగిరి నివాసమట భువనము లుదరంబున ధరించెనట
సుసరపు సూక్ష్మాధికములు తనందు జూపుచునున్నాడు చూడరో
యితడు"1 ॥రాముడు॥

1. రాగం-నాట, సంపు-10, సంకీ-277, రేకు-347, ఆధ్యా. సం.

'నాట' రాగంలో సాగిన ఈ కీర్తన భజన సంప్రదాయానికి చెందినట్లుగా అన్నమయ్య రూపించాడు. వైష్ణవంలో భజన విధానానికి ప్రాముఖ్యం ఎక్కువ.

అన్నమయ్య ఇంచుమించు తన కీర్తనలన్నింటిని ఆడేదానికి పాడేదానికి, ఆడుతూ పాడేదానికి అనుకూలంగా రచించాడు. ఇది అన్నమయ్య కీర్తనల్లో దాగిన పరమరహస్యం.

'ఓహో రాకాసులాల వద్దుసుండీ వైరము' అనే పల్లవితో ఉన్న ఈ క్రింది కీర్తనలో రాముని అవతార విశేషాన్ని, సీతా మహత్వాన్ని, లక్ష్మణ భరత శత్రుఘ్నుల జన్మరహస్యాన్ని, వానరులను తన్నాయకుడైన సుగ్రీవుణ్ణి, విశేషించి హనుమంతుణ్ణి, జాంబవంతుణ్ణి వర్ణిస్తూ, వారి అవతరణ వెనుక ఉన్న రహస్య విషయాన్ని అన్నమయ్య వివరించాడు.

"ఓహో రాకాసులాల వొద్దు సుండీ వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో ॥పల్లవి॥

జగములో రాముడై జనియించె విష్ణుడదె
అగపడీ లక్ష్మి సీతయై పుట్టెను
తగు శేష చక్ర శంఖ దైవసాధనము లెల్ల
జిగి లక్ష్మణ భరతాంచిత శత్రుఘ్నులైరి ॥ఓహో॥

సురలు వానరులైరి సూర్యుడు సుగ్రీవుడు
మరిగి రుద్రుడె హనుమంతుడాయను
పరుస బ్రహ్మదేవుడు జాంబవంతుడైనాడు
వెరవరి నలుడే విశ్వకర్మ సుండీ ॥ఓహో॥

కట్టిరి సేతువపుడె ఘనులెల్ల దాటిరి
ముట్టిరి లంకానగరము నీరశము

యిట్టె శ్రీవెంకటేశు డితడై రాఘవుఁ డింపె
వొట్టుక వరములిచ్చీ నొనర దాసులకు"1

ఇందులో అన్నమయ్య రాకాసుల్ని ప్రబోధిస్తూ విష్ణువే రాముడై పుట్టాడనీ, కనుక 'శరణనరో' అని అంటున్నాడు. లక్ష్మి సీతగా, శేషుడు లక్ష్మణుడిగా, చక్రం భరతుడిగా, శంఖం శత్రుఘ్నుడిగా, సురలు వానరులుగా, సూర్యుడే సుగ్రీవుడుగా, రుద్రుడే హనుమంతుడుగా, బ్రహ్మదేవుడే జాంబవంతుడిగా, విశ్వకర్మ నలుడిగా అవతరించారని రామకథా సంబంధులైన మహాపురుషుల అవతార విశేషాల్ని భక్తి నిర్భరమైన భావంతో అభివర్ణించాడు.

ఈ విధంగా అన్నమయ్య బాలరాముడి ప్రసక్తితో పాటు తక్కిన రామకథాంశాల్ని ఎన్నిటినో స్మరిస్తూ తన ప్రతి కీర్తనను ఒక రామాయణ కథాసంగ్రహంగా రూపించి తిరిగి తిరిగీ గానం చేసి రామభక్తి రసామృతాన్ని గ్రామ గ్రామంలో ప్రవహింప జేశాడు. తద్వారా తాను తరించి లోకాన్ని తరింపజేశాడు.

తర్వాత అనన్య భక్తిసంపన్నుడు, శ్రీరామ మానసపుత్రుడు, రుద్రాంశ సంభూతుడూ, రాముని బంటు అయిన హనుమంతుణ్ణి పరమ వాగ్గేయకారుడైన అన్నమయ్య తన కీర్తనల్లో ఎలా స్తుతించాడో పరామర్శించాలి.

---

1. రాగం_శోక వరాళి, సంపు_10, సంకీ_295, రేకు_350, అధ్యా. సం.
(ఇదే కీర్తన రెండో సంపుటంలో 148 కీర్తనగా 'గౌళ' రాగంలో ముద్రితమైంది. ఇది పునరుక్తి. ఇది రేకులోనే ఉన్నది. అయితే ఈ వరికీర్తనకు రాగంలో భేదముంది. పైకీర్తన 'శోక వరాళి' రాగంలో కీర్తించబడింది.)

## హనుమద్విషయకాలు :

పరబ్రహ్మ స్వరూపుడుగా రాముడు ఎంత ప్రసిద్ధుడో, పరమ భక్తుడుగా ఆంజనేయుడు అంత ప్రసిద్ధుడు. అతడు కపి రూపధారుడు. ఆతడి విషయాన్ని కొంత పరిశీలించాలి. కపి వృషా కపిగా 'ఋగ్వేదం'లో కన్పిస్తుంది.[1]

యాస్కనిరుక్తం ప్రకారం 'వృషాకపి' శబ్దం ఆదిత్యపరంగా అన్వయించబడింది. 'బృహద్దేవత'లో వృషాకపి హంతవర్ణమైన మృగమని వుంది.[2]

అలాగే 'బ్రహ్మపురాణం'లో వృషాకపి ప్రస్తావన కన్పిస్తుంది.[3]

అన్నిటికన్నా 'వాల్మీకిరామాయణం'లో హనుమంతుని జన్మాదికం వర్ణించబడింది.[4]

'తత్వసంగ్రహ రామాయణం' కూడా హనుమంతుని పుట్టుకను ప్రస్తావించింది. ఇది రామాయణాన్ని వేదాంతపరంగా అన్వయించింది.

మహారాష్ట్రలో ప్రసిద్ధమైన 'ఆనంద రామాయణం'లో హనుమజ్జననం ఉంది.

తమిళ, కన్నడ వాఙ్మయాల్లో కూడా హనుమత్ ప్రశస్తి విశిష్టంగానే ఉంది.

---

1. 10.86
2. బృహద్దేవత, 2-10
3. 77-176 అధ్యాయాలు
4. వాల్మీకి రామాయణం-కిష్కింధాకాండ, 66-8-18

తెలుగుదేశంలో బడిలేని ఊరు ఉందేమో కాని, రాముడు గుడి లేని ఊరు కన్పించదు. రాముడుంటే హనుమంతుడూ ఉన్నట్లే.

ఎంతోమంది తెలుగు కవులు తమ కృత్యావతారికల్లో హనుమంతుణ్ణి స్తుతించినవారే. కావ్య సాహిత్యంలోనే కాక జానపద సాహిత్యంలో కూడా హనుమత్ గాథా విశేషాలు ఎన్నో ఉన్నాయి.

అన్ని జయంతులలాగే హనుమజ్జయంతి కూడా ఆరాధన దినంగా అన్నిరాష్ట్రాల్లో కన్పిస్తుంది. చైత్ర శుద్ధ పూర్ణిమ మంగళం వారంనాడు ఆయన జన్మదినమని, వైశాఖ బహుళదశమి మందవారమని, కార్తిక బహుళచతుర్దశి భానువారమని, అలాగే మార్గశిర శుద్ధ త్రయోదశి శనివారం అని ఆయన జననకాల విషయంలో మతభేదాలున్నాయి.

'పరాశర సంహిత'ను అనుసరించి చైత్ర శుద్ధ పూర్ణిమ అంగారక వారమే హనుమజ్జయంతిగా జరుపుకోవడం సంప్రదాయం.1

రామ తారకమంత్ర నిత్య పారాయణుడైన అన్నమయ్యకు రాముడు ఎంత ప్రియుడో, హనుమంతుడూ అంతే ప్రియం. ఆ వాగ్గేయకారుడు వైష్ణవ దేవతామూర్తుల్ని సంకీర్తిస్తూ, వారి సరసనే భక్తుడైన ఆ హనుమంతుణ్ణి కూడా కీర్తించాడు.

అన్నమయ్య దృష్టిలో భక్తుడికీ భగవంతుడికీ భేదం లేదు, మీదుమిక్కిలి భగవంతుడికన్నా భక్తుడే అధికుడనికూడా భావించాడు. రాముడికంటె రామ నామం గొప్పది. ఆ రామ నామాన్ని జీవనాడిగా చేసుకొన్న హనుమంతుడూ అంతే గొప్పవాడు.

అన్నమయ్య హనుమత్సంకీర్తనల్ని గీర్వాణాంధ్ర భాషల్లో కూర్చినాడు. ఇంతవరకు హనుమంతునివి రెండే సంస్కృత కీర్తనలు

---

1. చూ. అన్నమయ్య హనుమత్సంకీర్తనలు;
ఆచార్య కె. సర్వోత్తమన్, పుట-27

వెలుగు చూచాయి . అన్నమయ్య ఎన్నో దివ్యదేశాల్ని తిరిగి తిరిగి గానం చేసిన షణ్యాత్ముడు. ఆ యా ప్రదేశాల భేదాల్ని బట్టి తిరుపతి తిరుమలకు సంబంధించిన హనుమత్పరమైన సంకీర్తనలు 'మంగాంబుధి' హనుమంతుడికి సంబంధించిన హనుమత్కీర్తనలు అలాగే 'కలశాపుర' హనుమంతుడికి చెందిన సంకీర్తనలు, 'మతంగాది' హనుమత్కీర్తనలు ఇలా నాలుగు రకాలుగా ఇవి కన్పిస్తాయి.

తిరుమలలో వేంకటేశ్వరుడి ఆలయానికి ఎదుట ఉన్న అంజనేయుడికి బేడి ఆంజనేయుడని పేరు.1

'మంగాంబుధి' అంటే అలమేల్మంగాపురమని, శ్రీనివాసమంగాపురమని అభిప్రాయ భేదాలున్నాయి.

తాళ్ళపాక వంశీయులు మంగాపుర ఆలయాన్ని బాగుచేశారు దీన్ని బట్టి శ్రీనివాసమంగాపురమనే భావించాలి.2

'కలశాపురం' నిర్ణయం సరిగ్గా చేయటానికి వీలుకాదు. రాళ్ళపల్లివారి దృష్టిలో హంపిలో ఉన్న మాల్యవంత గిరికి నేరుగా ఉన్న కొండలో కన్పించేవాడే కలశాపుర అంజనేయుడు.

గుంతకల్లుకు అనుకొని ఉన్న కశాపురమే కలశాపురమని ఒక వాదం.

బళ్ళారిజిల్లా హొస్పేటకు సంబంధించింది మతంగాద్రి. ఈ అంజనేయుడు విజయనగరంలో ఉండే పెద్దహనుమంతుడు ఒకడే అని డా॥ వేటూరి అనందమూర్తిగారు ఒక చోట అన్నారు.

పై నాలుగు రకాలైన హనుమత్సంకీర్తనల్లో ఆకారవర్ణనమే ప్రధానంగా కన్పిస్తుంది.

---

1. దీని వివరణ 'అన్నమయ్య హనుమత్సంకీర్తనలు' అన్న గ్రంథంలో పుట 29 లో ఉంది. రచయిత : ఆచార్య కె. సర్వోత్తమ రావు.

2. పైది. పుట : 31.

పురాణ ప్రసిద్ధాలైన ఆ యా చోట్లలో జరిగిన విషయాల్ని బట్టి హనుమంతుణ్ణి కీర్తించడం అన్నమయ్య పాటించిన ఒక పద్ధతి.

కిష్కింధలో అతడి విద్యాభ్యాసం ఇలాంటిదే.

అంజనాద్రికి ఆధారంగా తిరుమల సంకీర్తనల్లో అంజనాదేవి హనుమంతుణ్ణి ప్రసవించిన విషయాన్ని అన్నమయ్య కీర్తించాడు.

మంగాంబుధి హనుమంతుడి కీర్తనల్లో హనుమంతుడి మహిమను ఆయన ఎక్కువగా వర్ణించాడు.

సర్వదేవతా స్వరూపుడైన హనుమంతుడు ఎంతో గొప్పవాడని ఆయన భావించాడు.

హనుమంతుడు భూలోకంలో కాబోయే బ్రహ్మ అన్న విషయాన్ని అన్నమయ్య తన కీర్తనల్లో వివరించాడు.

హనుమంతుణ్ణి ఆధారంగా చేసుకొని అన్నమయ్య నమ్మిన బంటు లక్షణాల్ని కొన్ని కీర్తనల్లో వివరించాడు. అలాగే హనుమంతుడి లోకోత్తర కార్యనిర్వహణా సామర్థ్యాన్ని అన్నమయ్య ఉల్లేఖించాడు.

అన్నమయ్య ఒక్క వాల్మీకి రామాయణాన్నే అనుసరించకుండా, భారతాది గ్రంథాల్లో ఉన్న హనుమంతుడి విషయాన్ని కూడా గ్రహించి సమన్వయ రూపంగా ఆయన వైభవాన్ని కీర్తించాడు.

కొన్ని ఐతిహ్యాలను బట్టి అన్నమయ్య మైరావణ విషయాన్ని హనుమంతుడు చేసిన గరుడ గర్వభంగాన్ని వర్ణించాడు. పారాయణ శ్లోకాలుగా మిక్కిలి ప్రచారంలో ఉన్న వాక్యాలు ఆధారంగా హనుమంతుడి మహిమను వ్రాయడం అన్నమయ్య అవలంబించిన మరో పద్ధతి.

హనుమంతుణ్ణి పరప్రతాపకగా అన్నమయ్య చిత్రించాడు.

ఇవన్నీ హనుమత్సంకీర్తన విధానంలో అన్నమయ్య పాటించిన విభిన్న పద్ధతులు. ఈ కీర్తనల్లో నాట, గౌళ, రామక్రియ, శంకరాభరణ, గుండక్రియ, లలిత, బౌళి, శ్రీరాగం, బౌళిరామక్రియ, మాళవి, మాళవగౌళ, ప్రతాప నాట రాగాదులు ప్రధానంగా కన్పిస్తాయి.

అన్నమయ్య హనుమత్కీర్తనల స్థూల పరిశీలనల తర్వాత, ఆ కీర్తనల్లో ఏకదేశమైన ఆయన బాల హనుమత్కీర్తనల్ని తరువాత చూడాలి.

హనుమంతుని వంటి మహాభక్తుడే అన్నమయ్య వాగ్గేయకార సంకీర్తన సాహిత్యాలకి వస్తువైనాడు. ఇరువురూ భక్తులే. అన్నమయ్య చేసిన హనుమత్కీర్తన లన్నిటినీ కాక అతని బాల్యానికి సంబంధించినంత వరకే ప్రస్తుతం పరిశీలించడం కర్తవ్యం.

'శరణు కపీశ్వర' అన్న పల్లవితో కూడిన కీర్తనలో పుట్టిన వెంటనే ఆంజనేయుడు సకల భువనాలు ఆశ్చర్యంతో మ్రొక్కగా, సూర్యుణ్ణి పండుగా భావించి, పట్టుకోవడానికి పైకెగిరిన ఆయన మహత్తరలీలను అన్నమయ్య ఈ కీర్తనలో స్మరించాడు.

"శరణు కపీశ్వర శరణం బనిలజ
సురవి సెంచ నీ సరి యిక లేరే ॥పల్లవి॥

పుట్టిన నాడే భువనము లెరగగ
పట్టితి సూర్యుని బలడనుచు
ముట్టిన చుక్కలు మోవగ బెరిగితి
విట్టి ప్రతాపివి యెదురేదయ్యా ॥శరణు॥

చెదరక నేడే శ్రీ వేంకటగిరి
గదిసి రాముకృప గైకొంటి

వదలక నీ కృప బాదనైతి నిదె
యెదుటనే కాచితి వికగడమేమీ"1 ॥శరణు॥

'చెదరక నేడే శ్రీ వేంకటగిరి గదిసి' అని ప్రయోగించుటలో అన్నమయ్య తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరుడి రూపంలో బాముడి ఎదుటనున్న హనుమంతుణ్ణి భావించాడు.

రుద్రాంశ సంభూతుడైన హనుమంతుణ్ణి 'శంకరాభరణం' రాగంలో కీర్తించడంలో వాగ్గేయకారుడు ఎంతో ఔచిత్యాన్ని పాటించినట్లు తెలుస్తుంది.

'సటవి నెంచ నీ సరి యిక లేరీ' అన్న చరణం హనుమంతుడి అనేవ్యమానమైన శక్తి మహత్తును ప్రకటిస్తుంది. అటువంటి శక్తి సమావిష్టుడైన అనుజుడుకి అన్నమయ్య శరణుఘోష చేశాడు.

అలాగే మరో కీర్తనలో ఇదే విషయాన్ని మరలా కీర్తించాడు.

'అంజనీదేవి కుమార హనుమంతుడ
కంజాప్త ఫలహస్త ఘన హనుమంతుడ'2

ఇందులో అంజనీ గర్భ సంజాతుడిగ హనుమంతుణ్ణి దర్శించాడు.

'కంజాప్తుడు' అనే ఫలాన్ని హస్తంతో పట్టిన ఘనుడిగా ఆయన భావించాడు. సర్వదేవతా స్వరూపుడైన ఆ స్వామికి ఉదయించే సూర్యుడు రాగవర్ణ రంజితమైన పండుగా ద్యోతకంలో కావడం ఎంతో మహిమ ఉంది.

అలాగే ఇదే సన్నివేశాన్ని 'మొక్కరయ్యా అన్నిటికి మూల మితడు' అన్న కీర్తనలో అన్నమయ్య భావించాడు.

---

1. రాగం_శంకరాభరణం, సంపు_9, సంకీ_12, రేకు_272, ఆధ్యా.సం.

2. రాగం_రామక్రియ, సంపు_9, సంకీ_233, రేకు_290, ఆధ్యా. సం.

చుక్కలు మొలపూసలుగా పెరిగిన కలశాపుర హనుమంతుడు ఉదయార్క ఫలగ్రహణకు ఎలా ఒగ్గుచున్నాడో ఇందులో అన్నమయ్య వర్ణించాడు.

"మొక్కరయ్య అన్నిటికి మూలమితడు
చుక్కలు మొలపూసలై సొంపుమీరి నితడు ॥పల్లవి॥

అదె కలశాపుర హనుమంతుడు
ఉదయార్క ఫలమని వొగ్గుచున్నాడు
పుడుట బాలక్రీడ నుబ్బుచున్నాడు
మదించి రాముని బంటై మలయుచున్నాడు"[1] ॥మొక్క॥

'బాలక్రీడ నుబ్బుచున్నాడు' అన్న ప్రయోగంలో ఉన్న 'ఉబ్బ' పదం హనుమంతుడి పెరుగుదలను సూచిస్తుంది.

అలాగే 'వొగ్గుచున్నాడు' పదం వాలుచున్నాడు అనే అర్థాన్ని తెలుపుతుంది.

ఇది కలశాపుర హనుమత్సంకీర్తన. ఇతడే అన్నిటికి మూలమని తన్మహిమను అన్నమయ్య పల్లవిలోనే సూచించాడు.

అలాగే అన్నమయ్య 'మంగాంబుధి' హనుమంతుణ్ణి వర్ణిస్తూ పై విషయాన్నే మరలా స్మరించాడు. అయితే సూర్యుణ్ణి పండు అని పట్టుకోవడానికెగిరి, సూర్యతాపానికి తూలిన హనుమంతుణ్ణి బ్రహ్మాది దేవతలు వరాల వర్షంతో ముంచడాన్ని కూడా అన్నమయ్య ఇందులో భావించాడు.

"మంగాంబుధి హనుమంతుని శరణ
మంగవించితిమి హనుమంతా ॥పల్లవి॥

1. రాగం-రామక్రి, సంపు-౪, సంకీ-౧౪౭, రేకు-౨౨౯, అధ్యా. ౫౦.

బాలార్క బింబము ఫలమని పట్టిన
అలరి చేతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలి జేకొనిన వో హనుమంతా"1 ॥మంగా॥

'బాలార్క బింబము ఫలమని పట్టిన అలరి చేతల హనుమంతా' అని అన్నమయ్య సంబోధన.

ఇందులో ఫలమని ప్రయోగం అతడు సూర్యుణ్ణి ఫలమని భావించే భ్రమ సూచితమైంది.

'అలరి చేతల' ప్రయోగంహనుమంతుడికి విశేషణం. అతడి విశేష క్రియను పై విశేషణంతో అన్నమయ్య విశేష్యగుణాన్ని విస్తరించేదిగా ప్రయోగించాడు.

ఇందులో 'మంగాంబుధి హనుమంతుడు' స్మరించబడ్డాడు.

అలాగే 'అందరికీ నెక్కుడైన హనుమంతుడు, అందుకొనే సూర్య ఫలమని హనుమంతుడు' అన్న కీర్తన చరణాల్లో అన్నమయ్య హనుమంతుడికి కల్గిన సూర్యఫల భ్రాంతిని తిరిగి స్మరించాడు.2

'వీడిగో నిలుచున్నాడు విజనగరములోన' అని 'పెద్దహనుమంతుణ్ణి' అన్నమయ్య వర్ణించాడు.

అందులో హనుమంతుడు పుట్టుకొపీనంతో, హైమకుండలాలతో ఉదయించినట్లు కీర్తించాడు. ఉదయిస్తూనే (ఆకలితో) బాలార్కుణ్ణి పండుగా భావించి పట్టబోయినాడు. దాన్ని చూచి ఆశ్చర్యచకితులైన దేవతలు వరాలు కురిపించారు.

"వీడిగో నిలుచున్నాడు విజనగరములోన
పేడుకొన్న ప్రతాపాన పెద్దహనుమంతుడు ॥పల్లవి॥

---

1. రాగం–సామంత, సంపు–11, సంకీ–149, రేకు–376, ఆధ్యా. సం.
2. రాగం–మాళవి, సంపు–10, సంకీ–155, రేకు–327, ఆధ్యా. సం.

యిదె పుట్టు కౌపీనము హేమకుండలములతో
నుదయించినాడిత డుర్వీమీదను
పదరి బాలార్కుని పండనుచు బట్టినాడు
వదలక దేవతల వరమంటినాడు"1 ॥విడిగో॥

ఇందులో అన్నమయ్య విజయనగరంలో వెలసిన పెద్దహనుమంతుణ్ణి సంకీర్తించాడు.

ఆజన్మ సిద్ధాలైన హనుమంతుడి కౌపీన కనకకుండలాల్ని అన్నమయ్య ఇంకొక కీర్తనలో కూడా భావించాడు. అతడు అందరికంటే 'ఎక్కుడు' అని కూడా ఆయన అన్నాడు. ఇతడు మతంగగిరి హనుమంతుడు. అన్నమయ్య కీర్తన భాగం ఇలా ఉంది.

"అందరికంటె నెక్కుడు హనుమంతుడు
కందువ మతంగగిరి కాడీ హనుమంతుడు ॥పల్లవి॥
కనక కుండలాలతో కౌపీనముతో
జనియించినాడు ఈ హనుమంతుడు"2 ॥అందరి॥

ఇందులో 'మతంగగిరికాడీ' (దగ్గర) ప్రయోగం అన్నమయ్య భావసారళ్యాన్నే కాక భాషాసారళ్యాన్ని కూడా సూచిస్తున్నది. జన్మతః సిద్ధించిన కౌపీనం ఆతడి యావజ్జీవిత బ్రహ్మచర్యానికి భావిసూచకం కాగా, కనకకుండలాలు హనుమంతుడి బాహ్యతేజాన్నే కాక అంతరమైన అతడి బ్రహ్మవర్చస్సును కూడా ద్యోతమానం చేస్తుంది.

అంతేగాక సకలదేవతల తేజస్సంపన్నతకూడా ఇందులో భావ్యమానమే, 'దీవ్యంతీతి దేవాః' అన్న వ్యుత్పత్తితో దేవతలు ప్రకాశించేవారని అన్వయం.

జన్మించిన వెంటనే హనుమంతుడు చూపిన పరాక్రమం తర్వాత హనుమంతుడి విద్యాభ్యాసాన్ని అన్నమయ్య అభివర్ణించాడు.

1 రాగం-బౌళి, సంపు-3, సంకీ-230, రేకు-280, అధ్యా. సం.
2. రాగం-నాట, సంపు-2, సంకీ-207, రేకు-146, అధ్యా. సం.

బాలహనుమంతుడి విద్యాభ్యాసం విచిత్రమైన విషయం. సకల దేవతలే హనుమంతుడికి సూర్యుణ్ణి ప్రథమాచార్యుడుగా సమ్మతించారు. తర్వాత పరమేశ్వరుడు హనుమంతుడికి ఆచార్యుడైనాడు. ఇది పురాణ ప్రసిద్ధం.

నిత్య నిరంతర నిర్విరామ చైతన్య యాత్రాశీలుడైన సూర్య రథ గమనాన్ని అనుసరిస్తూ, హనుమంతుడు విద్య నేర్చినాడు. కాల స్వరూపుడైన సూర్యుణ్ణి అనుసరించడం హనుమంతుడికొక్కడికే సాధ్య పడింది. సూర్యరథం బయలుదేరింది. బాల ఆంజనేయుడు విద్యాభ్యాసానికి సిద్ధమైనాడు.

'ఉదయాస్త నగముల కొకజంగ జాచినాడు, 'సకల శాస్త్రాల్ని అభ్యసించాడు.

ఈ విషయాన్ని అన్నమయ్య ఇలా అంటాడు.

"ఉదయాస్తనగములకొక జంగ జాచినాడు
చదివె రవితో సర్వ శాస్త్రములు"1

'ఈతనిది ఎంత ప్రతాపము, ఈతనిది ఎంత ఉదుటు' రాముని బంటు అయిన ఈతణ్ణి సేవించమని అన్నమయ్య 'సాళంగ' రాగంలో ఆలపిస్తాడు.

'అదె చూడరయ్య పెద్దహనుమంతుని' అన్న కీర్తనలో దేవతలు హనుమంతుణ్ణి కొనియాడారని, అతడు ఉదయాస్త శైలాలకు ఒక జంగగా చాచాడని, శిరసు ధ్రువమండలాన్ని తాకిందని, సూర్యుని వెంటనే మొగము త్రిప్పుతూ చదివాడని, ఆతడి మహిమను ఏమనాలని, బ్రహ్మాండము తాకేట్లు తోకను మీదికి ఎత్తాడని అన్నమయ్య వర్ణించాడు.

"అదె చూడరయ్య పెద్ద హనుమంతుని
గుదిగొని దేవతలు గొనియాడేరయ్య ॥పల్లవి॥

---

1. రాగం-సాళంగనాట, సంపు-11, సంకీ 199, రేకు-38౮, అధ్యా. సం.

ఉదయాస్త శైలములు ఒక జంగగా జాచె
అదివో ధ్రువమండలమందె శిరసు
చదివె సూర్యుని వెంట సారెమొగము త్రిప్పుచు
యెదుట సీతని మహిమేమని చెప్పేమయ్యా"1 ॥అదె॥

ఇందులో అన్నమయ్య ఆంజనేయుడి అతిలోకమైన విరాణ్మూర్తిని విద్యాభ్యాస కాలంలోనే భావించాడు.

కుడిగొని దేవతలు ఆతడి మహిమను అగ్గించారు. కాలస్వరూపుడైన సూర్యభగవానుణ్ణి ఒక్క అంగలో ఉదయాస్తశైలాలే ఆధారంగా విద్యాభ్యాసం నేర్చిన హనుమంతుడి మహిమాపూర్వకమైన పరాక్రమాన్ని అన్నమయ్య వర్ణించాడు.

ప్రాక్పశ్చిమ దిగంతాల్ని ఒక్క అంగలో ఏకం చేసిన హనుమంతుడి భావికార్యమైన సముద్ర లంఘనను పై సన్నివేశంవల్ల ఊహించేదానికి అవకాశంలేదు.

ప్రజ్ఞామూర్తి అయిన అంజనాసుతుడు బ్రహ్మపట్టానికి కాచుకున్నాడని అన్నమయ్య పెద్దహనుమంతుణ్ణి వర్ణిస్తాడు.

తూరుపు పడమర జంగజాచి అర్కునివద్ద చదివిన హనుమంతుడి పెరిగిన దేహాన్ని అన్నమయ్య భావించాడు.

"ఎక్కడు బ్రహ్మపట్టాన కిదె కాచుకున్నాడు
పిక్కటిల్లి సంతోసాన బెద్దహనుమంతుడు ॥పల్లవి॥
తూరుపు బడమరాను దొడ్డగా జంగచాచి
సారెకు నర్కుని వద్ద జదివీ వాడె
ధీరతతో దనమేను దిక్కులెల్లా బిక్కటిల్ల
తీరముచూపి వాడే పెద్దహనుమంతుడు"2 ॥ఎక్కడు॥

---

1. రాగం–బౌళి, సంపు-11, 1వ భాగము, సంకీ-214, రేకు-287, ఆధ్యా. సం.
2. రాగం–నాట, సంపు-10, సంకీ-158, రేకు-327, ఆధ్యా. సం.

మింటినీ, మంటినీ వాలంతో ఏకంచేసిన ఆంజనేయుణ్ణి ఒక విరాణ్మూర్తిగా అన్నమయ్య సంకీర్తించినాడు.

ఇందులో ఆయన పిక్కటిల్లే సంతోసాన ఉన్న పెద్దహనుమంతుణ్ణి వర్ణించాడు. 'పిక్కటిల్లి' ప్రయోగం ఆతడి పెరిగిన శరీరానికి 'సంతోసాన' ప్రయోగం ఆతడి ఆత్మానందానికి సూచన.

ఈ విధంగా హనుమద్భక్తుడైన అన్నమయ్య సర్వదేవతా స్వరూపుడైన ఆ స్వామి జన్మాదికాన్ని, తద్రహస్యాన్ని, బాల్యాదికాది విద్యాభ్యాస విధానాన్ని, తద్వారా ఆతడి సకలశాస్త్ర పారంగత్వాన్ని విభిన్నరాగాల్లో సంకీర్తించి తనదైన ప్రజావాణిలో అదే బాణిలో, అందరికీ దగ్గరివాడైన ఆంజనేయుణ్ణి సంకీర్తించి, తరించు లోకాన్ని తరింప చేశాడు.

ఇంతవరకు అన్నమయ్య బాలకృష్ణుణ్ణి, ఆతడి విభిన్న రూపాలను విశేషించి హనుమంతుణ్ణి మనసారా కీర్తించిన సంకీర్తనలు వాటి విశేషాలు పరామర్శితాలైనాయి. తరువాత అన్నమయ్య బాలకృష్ణ సాహిత్యంలో ఆయన వాడిన భాష తననాడు వాడుకలో ఉన్న శిష్ట వ్యావహారికమే. భాషా భావాలకు అనుగుణమైన ఒక శైలీ లాలిత్యం తద్వారా ఏర్పడింది. ఆయన పలుకుబడులు, క్రియా ప్రయోగాలు, పదబంధాలు, సామెతలు, జాతీయాలు ఎన్నిరూపాలుగా కన్పిస్తాయో వాటిని పరిశీలించడం అనంతర ప్రకరణానికి ఆధార విషయం కనుక అన్నమయ్య భాషాశైలులను ప్రత్యేకించి పరిశీలించాలి.

# మూడవ విభాగం

# అన్నమయ్య బాలసాహిత్యంలో భాష - శైలి

## అన్నమయ్య బాలసాహిత్యంలో భాష - శైలి :

అన్నమయ్య భాషను, శైలిని ఆ యా సంకీర్తనల పరిశీలనా సహాయంలో సూచనగా చెప్పినప్పటికీ, ఈ ప్రకరణంతో ప్రత్యేకించి వాటినిగూర్చి పరామర్శించబడుతుంది.

అన్నమయ్య ప్రజాకవి. ఆయన కీర్తనలు జనాదరణ పొందడానికి వాటిలో ఉన్న భావం, భాష, ప్రక్రియ ప్రధానకారణాలుగా తెలుస్తాయి.1

అన్నమయ్య, తననాటి శిష్ట వ్యవహారంలో ఉన్న భాషనే తన కృతుల్లో ప్రయోగించాడు. ఆ నాటి సామాన్యజనులకు ఆ కీర్తనలో ఉన్న భాష బాగా అర్థమయ్యేదే. మారుమూల పదాన్ని అయన వాడ లేదు. తన సాహిత్యానికి మూలవస్తువైన ఏడుకొండలవాని మహిమను ప్రజలలో చాటి ఆ దేవుడిపై అందరికీ భక్తిని కల్గించాలన్నదే ఆయన సాహిత్యజీవిత పరమలక్ష్యం.

అందుకే ఆయన సరళసుందరాలైన భావాలతో తేటమాటలతో పాటల్ని (పాశురాన్ని) అలాపించిన ఆళ్వార్లను ఆదర్శంగా తీసుకున్నాడు.

ఆయన చేపట్టిన ప్రక్రియ సంకీర్తన. అదే పదం. ఇందులో శబ్దం, అర్థంతోపాటు గీతంకూడా కలిసి ఉంటుంది. ఈయన సంకీర్తన, సంగీత సాహిత్యాల మధురసమ్మేళనం. పల్లవితో, రాగ తాళ సాంగత్యంతో, మధురమైన భావంతో, సరసమైన భాషతో ఆయన సంగీత సరస్వతికి సేవచేశాడు. తత్త్వాన్నిబట్టి శృంగార, ఆధ్యాత్మిక కీర్తనలుగా వీటిని ఆయనే విభజించాడు.

---

1. తెలుగు వైతాళికులు 'అన్నమాచార్య'—కామిశెట్టి శ్రీనివాసులు (తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ–1990)

అన్నమయ్య కీర్తనల్లో వాడిన మాటలు, అతిసామాన్యులుకూడా నిత్యకృత్యం వాడుకొనేవే. జానపదరీతితో, ఆ నాటి వాడుకభాషలో ప్రచుర ప్రచారంలో ఉన్న ఛందోరీతుల్ని ఆయన ప్రసరింప జేశాడు.

దోబూచిపాటలు, చందమామపాటలు, ఉగ్గుపాటలు, ఉయ్యాల లాలి జోల పాటలు, హారతి పాటలు, నీరాజనాలు, పెండ్లివేడుకలు, గొబ్బిళ్ళు, దంపుళ్ళ పాటలు, శోభనాలు, ధవళశోభనాలు, సువ్వి సువ్వాల పాటలు, పవళింపుసేవ పాటలు, మజ్జనాలు, ఏలలు లాంటి గేయరీతుల్ని అన్నమయ్య వాటికి తగిన భాషలో గానం చేశాడు.

అలాగే తత్త్వాలు, తందాన పాటలు, మానసబోధలు, మేలుకొలుపు పాటలు, కొలువు పాటలు, తుమ్మెదపదాలు, జాజర పదాలు, యశోదా కృష్ణుడు, యశోదా గోపికలు, గోపికా కృష్ణుడు, బావలూ మఱదళ్ళు మొదలైన ఎన్నో సంవాదాత్మక గేయఫణితుల్ని ఆయన ఆదరించాడు.

అన్నమయ్య ఏ రకం పదం పాడినా వస్తువు ఒక్కటే. అదే పరబ్రహ్మమూర్తియైన ఏడుకొండలవాని కథ.

అన్నమయ్య అవసరాన్ని బట్టి తత్సమపద బహుళమైన రచన కూడా చేశాడు. అంతేగాక సంస్కృతంలోనే వందలాది కీర్తనల్ని కూడా పలికాడు. ఈయన కృతుల్లో కన్నడ, తమిళ పదజాలంకూడా కన్పిస్తుంది. కారణం పరమ వాగ్గేయకారుడైన ఆయన ఆ యా ప్రాంతాల్ని దర్శించడంవల్ల కలిగిన అనుభవమే.

అన్నమయ్య పదాలు ముక్తకగేయరీతిలో ఉన్నా సాహిత్యానికే దగ్గరగా ఉన్నట్లు తోచుతుంది. ఆయన గ్రహించిన శిష్టవ్యావహారిక భాష వర్ణ్యవిషయాన్ని బట్టి, పాత్రాదుల ఔచిత్యాన్ని బట్టి శైలీభేదాన్ని ప్రకటించింది. ఇంతకూ ఆయనిది దేశీయమైన శైలి. భాష దేశీయం, శైలి దేశీయం, భావమూ దేశీయమే వెరసి ఈయన దేశీయ పద

కవితా పితామహుడుగా ప్రసిద్ధికెక్కినాడు. ప్రయత్నపూర్వకంగా వాడిన తత్సమపద బాహుళ్యం, దీర్ఘసమాస ఘటన కన్పించవనే చెప్పాలి. లోకంలో వాడుకలో ఉండే తద్భవ, దేశ్య శబ్దాలు ఒక రకమైన వ్యవహారోచితమైన శైలిలో రూపొందాయి.

అన్నమయ్య సంస్కృత పదాల్లో ఉన్న భాషకూడా వ్యవహారానికి దూరంగా పోలేదు. ఈయనది సంకీర్తన మార్గం. సంగీత సాహిత్యాలు తెరలు తెరలుగా, తత్త్వాన్ని అలంకరిస్తూ భక్తిని పురికొల్పాయి. వర్ణాల స్వరూపాన్ని మార్చి ఉచ్చారణా సౌలభ్యాన్ని కల్పించడం విసంధులు, విడదీసిన పదాలు, అనునాశికాలతో కూడిన పదాల్ని ఎక్కువగా ప్రయోగించడం లక్షణవిరుద్ధమైనా, పదాల్ని అలవోకగా వాడడం, జంటపదాలు, ధ్వన్యనుకరణాలు, అనుకరణాత్మకాలు ఉన్న పదాల్ని వాడడం, తద్వారా అర్థపుష్టిని కల్గించడం, ఎప్పుడో అవసరమనిపిస్తే అలతి అలతి తత్సమపదాల్ని గ్రహించడం; సామెతల్ని, పదబంధాల్ని, జాతీయాల్ని, నానుడుల్ని, నుడుల్ని విలక్షణంగా ప్రయోగించడం అన్నమయ్య ప్రయోగించిన భాషా పద్ధతులు. అంటె ఇప్పటికి అయిదారువందల యేండ్లనాటి వ్యావహారిక రూపాలని తాత్పర్యం. అందుకే అన్నమయ్య వాడిన చాలాపదాలకు ఇప్పుడు అర్థాలు చిక్కవు. తెలుగు జాతీయాలకు, సామెతలకు, నుడులకు, నానుడులకు ఆయన సంకీర్తన సాహిత్యం ఒక మహాకోశం. ఒకే పాటలో ఆయన అప్రయత్నంగా ఎన్నో జాతీయాలను (పదిహేను దాకా)కూర్చడంకూడా కన్పిస్తుంది. పల్లవిలోని సామెతకు జతగా ప్రతి చరణంలో సజాతీయాలైన సామెతల్ని ఆవృత్తిమార్గంతో ఆయన ప్రయోగిస్తూ ఉంటాడు.1

పదకవిత ముక్తకప్రాయం. కీర్తన భావం పల్లవిలో సూచిత

---

1. 'అన్నమయ్య'—డా॥ ముఖ్నారి సంగమేశం, యువభారతి ప్రచురణలు-94, పుట : 48

మౌతుంది. ఇందులో పల్లవికి ప్రాముఖ్యం ఎక్కువ. యతిప్రాసల్లో విన్యాసాలు, పదాల వాక్యాలకల్పన ఇందులో ప్రత్యేకత. ప్రాయకంగా అన్నమయ్య పదాలన్నీ నిబంధన పదాలే. తనకు ముందున్న సూత్రాచందాలను ఆయన ఆదరించి వైవిధ్యంలో నిర్వహించాడు. రగడలు, మంజరులు, ద్విపదలు, విషమ సమసీసాలు, కళికోత్కళికలు మొదలైన ఛందోరీతుల్ని తన కీర్తనలకనువుగా మలచుకొని ఆయన ప్రయోగించాడు. తన సంవాదాత్మక కీర్తనల్లో నాటకీయ శైలిని రూపించాడు. అమ్మలాల, అక్కలాల, వినరో, శరణనరో, చూడరో లాంటి ప్రయోగాల్తో ఆయన తన సంవాదాత్మక శైలికి ఊపిరి పోసినాడు.

అన్నమయ్య కేవలం తన యుగానికి సంబంధించిన వాడేకాడు. వేదకాలంనుంచీ వస్తున్న ఆర్షరీతులు మొదలు ఆళ్వార్లదాకా జాలువారిన భావధార ఆయన కీర్తనల్లో జాలువారింది.

తరువాత అన్నమయ్య ప్రయోగించిన భాషా స్వరూపాన్ని ఇతోధిక ప్రామాణ్యదృష్ట్యా పరిశీలించడం అవసరం.

అన్నమయ్య ప్రయోగించిన భాష సమకాలిక శిష్టవ్యావహారికానికి సమీపంలో ఉండేది.

వ్యవహారంలో రూఢాలైన ఆయన చాలా ప్రయోగాలు కోశాదుల్లో కెక్కలేదు. నేటి వ్యాకరణ విరుద్ధాలైన ప్రయోగాలు ఎన్నో ఆయనలో కన్పిస్తాయి. క్రియలు, క్రియాజన్య విశేషణాలు ఇందులో ప్రత్యేకంగా ఉంటాయి. అందులో 'ఎ' చివరలో వున్న క్రియాజన్య విశేషణాలు చాలా వున్నాయి. చేసే, తిరిగే మొదలైనవి ఉదాహృతులు. 'ఎ' కారం చివరలో ఉన్న ఈ క్రియాజన్య విశేషణాలపై 'టి' వర్ణించేది తిరిగేటి, చేసేటి, చూసేటి రూపాలు ఆయన కీర్తనల్లో ఉన్నాయి. హ్రస్వ 'ఎ' కారాంత రూపాలూ ఉన్నాయి. 'వేటాడె' మొదలైనవి. దీనిపై 'టి' చేరతే, 'వేటాడెటి' రూపాలూ

ఉన్నాయి. 'ఎ' చేరిన పదాలు విశేషణాలుగా రూపించాయి. కనుక 'ఎ' అన్నది క్రియాజన్య విశేషణ నిష్పాదకం (Formative).1

'ఏ'కారాంతాలైన పదాలు అన్నమయ్య సాహిత్యంలో ఎక్కువగా కన్పిస్తాయి. ఈ రూపాలు అన్నమయ్య తననాటికి వాడుకలో ఉన్నవే.

ఉత్తమ పురుషైకవచన సర్వనామంలో ఉన్న 'ను' చేరడం వల్ల 'ఉండేను' క్రియారూపం వస్తుంది.

ఇలాంటి రూపాలు అన్నమయ్యలో చాలా ఉన్నాయి.2 అన్నమయ్య ఉత్తమైక వచన రూపాన్ని ప్రథమ ఏకవచనంగాకూడా వాడినాడు. ఈ ప్రయోగ విధానానికి సమాన ప్రత్యయమే కారణమని అనుకోవచ్చు. వ్యావహారిక భాషలో తద్ధర్మార్థక బోధకమైన ప్రయోగం భూత భవిష్యద్ వర్తమాన కాలాల్ని మూటినీ బోధిస్తుంది. గ్రాంథికంలో అలా కన్పించదు.౩

అన్నమయ్య భాషలో కన్పించే తద్ధర్మకాలన్నీ కాల సామాన్య బోధకాలు.

అన్నమయ్య వాడిన భాషలో అజంత ధాతువుల మీద 'త' ప్రత్యయం చేరిన రూపాలు కన్పిస్తాయి. ఉదా॥ చెల్లుత (౩–186),

1. తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనల్లో భాషావిశేషాలు
—ఆచార్య జాస్తి సూర్యనారాయణ, పుట: 37

2. దోసము గట్టకురా నీ తొత్తునయ్యేను–ఉత్తమైక వచనము (౩_౫౨౮).
సుద్దులు దలంచి మేను చురుకనేనమ్మా–ఉత్తమైకవచనము(౩_48).

౩. (పతింబాసె - కలుషించె) (పతింబాసె ౩_౨4౫, కలుషించె -౩4౫) అంటే పాసె, పాసిన అనీ, కలుషించె అంటే కలుషించిన అని భావం. తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలతో భాషా విశేషాలు, పుట: 42.
—ఆచార్య జాస్తి సూర్యనారాయణ.

అన్నమయ్య భాషలో తద్ధర్మార్థక క్రియలకు, వాటినుంచి పుట్టిన విశేషణాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఉన్నట్లు తెలుస్తుంది. ఇది ఇతర కాలాల్నికూడా తెలుపుతుంది. ఉదా॥ పలికె, పలికేటి మొదలైనవి.

గ్రాంథికంలో భావార్థకానికి చేరే 'ట' వర్ణానికి బదులు అన్నమయ్య 'త' వర్ణాన్ని వాడినాడు. ఉదా॥ ఉండుత (18-123), చెల్లుత (3-136).

అంతేగాక 'ట' వర్ణసహితాలైన రూపాలూ అన్నమయ్యలో ఉన్నాయి. ఉదా॥ మూసుట (3-14).

'పరమాతుమ', 'జీవాతుమ' ప్రయోగాలు అన్నమయ్యలో ఎన్నో తావుల్లో ఉన్నాయి.

'ఆత్మన్' అన్నది సంస్కృత ప్రాతిపదిక అనీ, 'అతుమ' ప్రాకృత రూపమని సంయోగాలు ప్రాకృతంలో ఉండవు కాబట్టి, మధ్యలో ఏదైనా స్వరం చేరుతుందని, 'త్' కారం పై 'ఉ' చేరితే ఈ రూపం సిద్ధించిందని ఆచార్య జాస్తి సూర్యనారాయణగారి అభిప్రాయం. దాని తుది స్వరాన్ని హ్రస్వం చేసి 'అతుమ' అనే రూపాన్ని అన్నమయ్య వాడినట్లు వారి అభిప్రాయం.1

'లక్ష్మి' శబ్దాన్ని అన్నమయ్య 'లకిమమ్మ' అని వాడినాడు. ఉదా॥ 4-129.

అన్నమయ్య వాడిన క్రింది రూపాలు, సంస్కృత ఆదాన పదాలుగా కన్పిస్తాయి.

| | |
|---|---|
| అడ్డవించు - అదితించు | అప్పణించు - అనుమతించు |
| అమళము - యమళం | అల్లిరము - విందు |
| ఆకోదము - గాఢమైన భావన | ఆలవట్టాలు - విసనకర్ర |
| ఉచవరు - వాడిపోవు | ఊహి - ప్రయత్నము |

1. తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలలో భాషావిశేషాలు
—ఆచార్య జాస్తి సూర్యనారాయణ.

ఊతగిటి - కపటము

ఊరుటు - తోటు

ఏటవాళి - చీకటి

ఎబ్బెడి - తక్కువదనం

కత్తరాలు - చీకటి

కామిడి - చెడ్డ

కూచిండు - కూచుండు

గతివడేటి - వ్యర్థము

గౌళము - సిగ్గుమాలు

చాడె, చాడెలు - ద్రవము

చుల్లరము - అల్లరి

చేసచెల్లి - జంకు

జుంజు - జుట్టు

దాపిరము - దాచడం

డోమటె - కపటము, మాయ

నుసుగు - చెరిపివేయు

పొంగెము - వైరం

పరుసలు - భక్తులమూకలు

పండ్లగొల - పలుచరుస

పల్లదనము - పిరగబాటు

బడకరము - బ్రదుకుతెరువు

బొసెమె - భోజించే

మరగాళ్ళు - కొయ్యకాలు

ముసువు - ముసుగు

మొకదాకిరి - మొగమాటము

తంట - తీవ్రము

తోకతోటి - పైమాట

ఊచ్చిళ్ళు - ఊచ్చీలు

ఎటికలు - వెంట్రుకలు

ఏతులు - ఎగతాళి, నింద

ఒరటు - అపద్దము

కాడు - మొగమాటకాడు

కూకులు - ఆపదలో చేసే ధ్వని

గంతి - ముడి

గొండె - లెక్కలేనంత

గొల్లు - మలినము

చిగులు - ఎగురు

చెలుప చెమట - అందాన్నిచ్చే చెమట

జలపక్షము - పక్షపాతము

జూటరి - దొంగ

దారకత్తి - పదునైనకత్తి

నల్లెడ - చిన్నది అనే అర్థంలో

పంగెము - స్పర్థ

పసుతు - సమానుడు

పసురు - బాధ

పల్లటీడు - విలాసవంతుడు

బచ్చెన - గుట్టుగా చేయు

బెంబాడి - విశేషణము, వ్యర్థము

భౌష్యములు - భవితవ్యం

మానావతి - ముగ్ధ

మేపుగొను - తిను

మొటుగు - మాటాశః

లాచి - కోరుకొను

పత్తులు - కృశించు

సంబె - కన్నులు కన్నులుగా తాడుతో అల్లిన ఉట్టి
సదరము - స్నేహము
సరితెలు - గాథలు
సుసరము - వెంటనే
సొలగిలు - సోలిపోవు
సందకాడ - సంధ్యాసమయం
సనగులు - అయిష్టంతోకూడిన మాటలు
సలిగె - చనువు
సూళ్ళు - తడిసిన గుడ్డ

ఇలాంటి పదాలు ఎన్నో ఉన్నాయి.

మోనంబు (13-290), మోనములు (18-65), మోనాన (18-34) లాంటి పదాలు అన్నమయ్యనాడు సామాన్య వ్యవహారంలో ఉన్నట్లు తెలుస్తుంది.

అలాగే వెంగెము, వెంగేలు, వెంగేన (వెంగములాడించనేలే 15-194) లాంటి పదాలు దేశీయతా ముద్రతో ఆయన భాషాశైలులకు, వాక్యనిర్మాణానికి సహజాతమైన ఒక అందాన్ని చేకూర్చాయి.

అలాగే అన్నమయ్య వాక్యరచన సహజత్వాన్ని ఈ క్రింది వాక్యాలు రేఖామాత్రంగా వివరిస్తాయి. ఇందులో కొన్ని సామెతల్లాగా కూడా ఉండడం విశేషం.

తల్లి కడ వాడా, ఇల్లాలి కడ వాడా (2-25)
మాకును బసులకును సర్వసమము (2-54)
మింటికిని బడపు (2-78)
కన్నపు గత్తుల చూపులు (2-197)
కొండల పొండవులు కోలిక కుప్పలు (2-413)
సవరము నీ కొప్పు సరివచ్చునా (3-2)
మ్రింగిన రత్నము (2-157)
ప్రాణములెల్లా జట్టిగొనే వచ్చిగా నన్నింతచేసి (3-32)
తెలుసునో తెలియదో తెల్లమిగా మీకు నివి (3-138)
కాంత నీకు సన్నచేసె కన్నుల కాటుక చూపి (3-138)
మొగముననె గోపలంబు మొలవకేవిటయును (3-384)

మొదలైన వాక్యాలు సహస్రాధికంగా ఆయన భాషా స్వభావాన్ని, తద్వారా వాక్యనిర్మాణ సౌలభ్యాన్ని సూచిస్తున్నాయి.

అన్నమయ్య ప్రతిపాదించిన భాష ఎలాంటిదో పై పరిశీలన వల్ల కొంత అవగతమౌతుంది. ఆ భాష ఆధారంగా రూపించిన శైలి, విన్యాసం కూడా స్పష్టం కాకపోదు. శీలధాతు నిష్పన్నమైన శైలీ, శబ్దం అన్నమయ్య శీలాన్ని బట్టి అవతరించిందే. ఆయన భావానికీ, భాషకూ, ప్రక్రియకూ అనువైన శైలిని ఎన్నుకొని, అందులో ఎంతో వైవిధ్యంతో తన సంకీర్తన సాహిత్యాన్ని సరస శృంగార ఆధ్యాత్మిక వస్తు విశేషకంగా రూపొందించాడు.

వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వ వాణీ వీణా
నాదంబులు కృత సుజనా
హ్లాదంబులు తాళ్ళపాక యన్నయ పదముల్.

అన్న పండితోక్తి అక్షరశః అన్నమయ్య భాషా సాహిత్యాల్లో సార్థకమైంది.

# ఉపసంహారము

ప్రస్తుత సిద్ధాంత వ్యాసం మొదటి విభాగం ప్రథమ ప్రకరణంలో అన్నమయ్య జీవిత విశేషాలకు సంబంధించిన ఆధారాలు, పితామహ ప్రపితామహ జననీ జనకుల విషయాలు, ఆయన అవతార నేపథ్యం, అవతరణ నామకరణాదికాలు, బాల్యాదికం, తిరుమలలో అన్నమయ్య, పంచ సంస్కార దీక్ష, వైవాహిక జీవితం, అహోబిలంలో ఆయన గడిపిన సంగతి, రాజాశ్రయం, తన్నిరాకరణ, అన్నమయ్య పురందరదాసుల సంగతి, ఆయన హరిపదయాత్ర పరిశీలించబడ్డాయి.

ద్వితీయ ప్రకరణలో అన్నమయ్య రచనల పరిచయం, ముద్రితాముద్రిత, లభ్యాలభ్య విభాగాలుగా చూడడం జరిగింది.

తృతీయ ప్రకరణంలో సంకీర్తన లక్షణం, పదస్వరూపం, పద కవితా పరిచయ నైఘంటికాది లక్షణ గ్రంథాల ఆధారంగా అనుశీలించబడ్డాయి. అలాగే విమర్శకుల దృష్టిలో పదం, కృతి, కీర్తన అన్న అంశాలు అందులోనే ఉన్నాయి.

చతుర్థ ప్రకరణంలో తెలుగులో విస్తరించిన బాలసాహిత్య పరిచయం ఉంది. అలాగే ఇతర భాషల్లో ఉన్న బాలసాహిత్య పరిచయాల కూడా చేయబడింది.

పంచమ ప్రకరణంలో భక్తి సామాన్య పరిచయంతో పాటు అన్నమయ్య భక్తి పరిశీలన చేయబడింది. అందులో భక్తి నిర్వచనాన్ని నైఘంటిక, వేదోపనిషత్ పురాణేతిహాస సూత్ర శాస్త్ర భాషాది గ్రంథాలు ఆధారంగా నిర్వచించబడింది. అలాగే నవీనుల దృష్టిలో భక్తి ఎలా ఉందో తెల్పుతూ తత్స్వరూప తత్వవైశిష్ట్యాన్ని ప్రదర్శించడం జరిగింది. అందులోనే శైవ వైష్ణవ భేదాలతోపాటు, విశిష్టాద్వైత సిద్ధాంత తత్వం ప్రధానంగా చెప్పబడింది. తన్మతానుయాయు

డైన అన్నమయ్య భక్తి విశేషం ఎలాంటిదో ఆ ప్రకరణాంతంలో సంభావితమైంది

కాగా మొదటి విభాగంలో ఐదు ప్రకరణాలున్నాయి.

రెండో విభాగంలో అన్నమయ్య బాలసాహిత్య వర్గీకరణకు సంబంధించిన పరిశీలన ఉంది. అందులో మొదటి ప్రకరణంలో బాలక్రిష్ణ కథాత్మకాలైన సంకీర్తనల్ని, ఉత్సవ, వాత్సల్య, విక్రమ, లీలా సంకీర్తనలుగా విభాగింపబడ్డాయి.

రెండవ ప్రకరణంలో క్రీడ, మహిమ, క్షేత్రీయ బాలక్రిష్ణ సంకీర్తనలుగా అన్నమయ్య బాలసాహిత్యం అనుశీలితమైంది.

మూడవ ప్రకరణంలో ప్రత్యేకించి శ్రీరామ కథాత్మకాలు, హనుమద్విషయకాలు అయిన కీర్తనల్ని, కీర్తన భాగాల్ని, అందులోని భాషాశైలుల్ని పరామర్శించడం జరిగింది. ఇందులోనే శ్రీరాము, హనుమంతుల ప్రాశస్త్య కథనం కూడా ఉంది. హనుమంతుడి అవతార విశేషాల్ని, తన్మహిమను ప్రస్తావించడం జరిగింది. తద్వారా భగవంతుడికంటే భక్తుడే అధికుడు అన్న అన్నమయ్య అభిప్రాయం కూడా సూచించడం జరిగింది. ఇలా రెండో విభాగంలో మూడు ప్రకరణాలున్నాయి.

తర్వాత మూడో విభాగంలో ఒక ప్రకరణ ఉంది. అందులో అన్నమయ్య బాలసంకీర్తనా సాహిత్యంలో వాడిన భాష, శైలులు పరామృష్టాలైనాయి అన్నమయ్య తననాడు శిష్టజన వ్యవహారంలో ఉన్న వాడుక భాషను కీర్తనల్లో ప్రయోగించినట్లు క్రియా పదాల్ని బట్టి, తజ్జన్య విశేషణాల్ని బట్టి, పదాలను, సామెతలను, జాతీయాలను బట్టి, వాక్యనిర్మాణ విధానాన్ని బట్టి సప్రమాణంగా నిరూపించే ప్రయత్నం ఇందులో కనిపిస్తుంది.

ఇది ఈ సిద్ధాంతవ్యాస ఉపసంహార సంగ్రహరూపం.

# ఉపయుక్త గ్రంథసూచి


అన్నమయ్య : డా॥ ముట్నూరి సంగమేశం

అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తన సంపుటములు : 5, 6, 7, 8, 9, 10 11 1st edition
1, 2, 3 IInd edition

అన్నమయ్య బాలకృష్ణ సంకీర్తనలు : మల్లెల శ్రీహరి

అన్నమయ్య శృంగార కీర్తనలు : 4, 12, 13, 14, 15, 16, 17 18, 19, 20, 24, 25, 26, 27, 28, 29, 30, 31

అన్నమయ్య సంకీర్తనలు : ఉదయగిరి శ్రీనివాసాచార్యులు

అన్నమయ్య సంకీర్తనలు- దశావతారాలు : డా॥ జి. డి. నాయుడు

అన్నమయ్య సంకీర్తనలలో జానపదగేయ ఫణితులు : డా॥ పొన్నా లీలావతమ్మ

అన్నమయ్య హనుమత్సంకీర్తనలు : ఆచార్య కె. సర్వోత్తమన్

అన్నమయ్య జీవిత చరిత్ర (ద్విపద) : పరిష్కర్త - వేటూరి ప్రభాకర శాస్త్రి

అన్నమాచార్యుల జయంత్యుత్సవ ప్రత్యేక సంచిక : తి. తి. దే. ప్రచురణ

ఆంధ్రయక్షగాన వాఙ్మయ చరిత్ర : ఆచార్య యస్వీ. జోగారావు

ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర : బాలాంత్రపు రజనీకాంతరావు

ఆంధ్ర వాగ్గేయకారుల నృత్యసంగీత వ్యాస రత్నావళి : విస్సా అప్పారావు

ఋగ్వేదము :

కావ్యాలంకార చూడామణి : విన్నకోట పెద్దన

కుమార సంభవము : నన్నెచోడుడు

క్షేత్రయ్య పదములు : విస్సా అప్పారావు

గురుబాల ప్రబోధిక :

చంపూ రామాయణం : భోజుడు

జానపద బాలగేయ సాహిత్యం : డా॥ దేవకి

తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలలో భాషావిశేషాలు : ఆచార్య జాస్తి సూర్యనారాయణ

తాళ్ళపాక కవులు – భాషాప్రయోగ విశేషాలు : డా॥ వేటూరి ఆనందమూర్తి

తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల శృంగార కీర్తనలు : 21 సంపుటం

తెలుగు జానపదగేయ సాహిత్యము : ఆచార్య బిరుదరాజు రామరాజు

తెలుగులో పదకవిత : ఆచార్య ఎస్. గంగప్ప

తెలుగు వైతాళికులు 'అన్నమాచార్య' : కామిశెట్టి శ్రీనివాసులు

నాట్యశాస్త్రము : భరతముని

పురందర దాసర సాహిత్యము : పురందరదాసు

సిల్లల పాటలు : డా॥ వెలగా వెంకటప్పయ్య

బసవ పురాణము : పాల్కురికి సోమనాథుడు

బృహద్దేవత :

భగవద్గీత : శుక బ్రహ్మాశ్రమ ప్రచురణ

భాగవతము (ద.స్కం.) : బమ్మెరపోతన

మనుస్మృతి :

యాగంటి పదాలు : శ్రీ కె. జనార్దనం

వాల్మీకి రామాయణము (కి.కాం.) :

శబ్దరత్నాకరము : బహుజనపల్లె సీతారామయ్య

శబ్దార్థచంద్రిక : మహాకాళి సుబ్బారాయుడు


శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం : ధూర్జటి (కాళహస్తి తమ్మారావు ప్రచురణ)

సంగీత శబ్దార్థ చంద్రిక : అరిపిరాల సత్యనారాయణమూర్తి

సూర్యరాయాంధ్ర నిఘంటువు :

హరి వంశము (పూ.భా.) : ఎఱ్ఱనామాత్యుడు

NKATESWARA CENTRAL LIBRARY & RESEARCH C
TIRUPATI.
53574



# శాఖమూరి రవిచంద్రబాబు

| | | |
|---|---|---|
| జననం | : | 01-7-1964 |
| ప్రాథమిక పాఠశాల | : | చీళ్ళవారి పల్లె, గంగవరం మండలం, చిత్తూరు జిల్లా |
| ఉన్నతపాఠశాల | : | జయంపు గ్రామం, బాలయ్యపల్లి మండలం, నెల్లూరు జిల్లా. |
| ఇంటర్మీడియట్ | : | ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గూడూరు, నెల్లూరు జిల్లా. |
| బి.ఎ. | : | శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుపతి. |
| ఎం.ఎ. | : | శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. |
| పిహెచ్.డి. | : | కర్నూలు పి.జి. కేంద్రం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి |
| ఇతర రచనలు | : | 1. అన్నమయ్య బాలసాహిత్యంలో జానపద గేయరీతులు-సప్తగిరి-మాసపత్రిక - మే'92<br>2. అన్నమయ్య సంకీర్తనలలో కృష్ణ జయంతి, ఆదర్శిని - వారపత్రిక జూలై '93<br>3. 'మధుర కవి - అన్నమయ్య నిత్యనూతన - మాసపత్రిక ఆగస్టు '93 |
| రేడియో ప్రసంగం | : | 'అన్నమయ్య సంకీర్తనలలో కృష్ణ జయంతి', 20-5-92 |